భగవద్రామానుజులు రచించిన

గద్యత్రయం

(శరణాగతి గద్యం, శ్రీరంగ గద్యం, వైకుంఠ గద్యం)

వివరణంతో

వివరణకర్త - డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు



ప్రచురణ

ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి - 2015

గద్యత్రయం

(శరణాగతి గద్యం, శ్రీరంగ గద్యం, వైకుంఠగద్యం)

వివరణంతో

వివరణకర్త - డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు

ప్రచురణ : ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్, తి.తి.దే., తిరుపతి

ముఖచిత్రం : శ్రీరంగనాయకి, శ్రీరంగనాథుడు,
భగవద్రామానుజులు - శ్రీరంగం

వెల :

మొదటి ముద్రణ : 2015

ప్రతులు : 500

ప్రకాశకులు :

శ్రీ డి. సాంబశివరావు, ఐ.ఏ.ఎస్.
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి - 517 507

ముద్రణ :
తి.తి.దే. ముద్రణాలయం
తిరుపతి-517 507

నివేదన

అనాదిగా మానవుడు జీవితగమ్యాన్నిగూర్చిన అన్వేషణను చేస్తూనే ఉన్నాడు. **"కస్త్వం కోహం, కుతో జాతా ఇయం సృష్టిః"** (నీవెవరు? నేనెవడను? ఈ సృష్టి ఎక్కడ నుండి వచ్చింది?) మొదలైన ప్రశ్నలు అతన మనస్సులో మెదులుతూనే ఉన్నాయి. కంటికి కన్పించే భౌతికప్రపంచం నశ్వరమనే విషయాన్ని, ఈ సమస్తజగత్తును, ఏకతాటిపై నడిపించే అద్భుతశక్తి ఒకటి తప్పక ఉండి ఉండాలనే వాస్తవాన్ని మహర్షులు ముందుగానే గుర్తించారు. అయితే, **"ఏకం సత్ విప్రాः బహుధా వదంతి"** అని, **"మహామతీనాం మతయశ్చ భిన్నాः"** అనే రీతిలో ఈ అద్భుతమైన జగత్తును పాలించే అదృశ్యదైవాన్ని గూర్చిన స్వరూపస్వభావాల విషయంలోమాత్రం భిన్నభిన్న భావాలు వారి వారి దృక్కోణాలకు అనుగుణంగా ప్రతిపాదింపబడ్డాయి. అటువంటి వైదిక సిద్ధాంతాలలో ఒకటి – వేదాలను అన్నిటిని సమగ్రంగా, సయుక్తికంగా సమన్వయించే విశిష్టాద్వైతసిద్ధాంతం. ఈ సిద్ధాంతంలో చిదచిదీశ్వర తత్త్వాలు మూడు అంగీకరింప బడ్డాయి. ఈశ్వరతత్త్వం – సగుణుడు, సాకారుడు, విభూతిద్వయ, యుక్తుడు, దివ్య లీలాశోభితుడు, పరవ్యూహాది పంచప్రకారాలను కలవాడైన, లక్ష్మీసహితుడైన నారాయణుడే. వైకుంఠంలోని నిత్యసూరిపరిషన్నిషేవ్యమాణుడైన శ్రీమన్నారాయణుని సాన్నిధ్యాన్ని చేరి, ఆ స్వామికి సర్వకాల సర్వావస్థోచిత సకలకైంకర్యాలను చేయడమే పరమపురుషార్థం. ఇటువంటి పురుషార్థాన్ని పొందడానికి కర్మ – జ్ఞాన – భక్తి యోగాలనే ఉపాయాంతరాలు చెప్పబడినా, వీటి అన్నిటికంటే పరమాత్మకు అభిమతమైనది, జీవుని స్వరూపానికి తగినది శరణాగతియే. "స్వామీ! వేఱు ఏ గతి లేనివాడనై నేను నిన్ను ఉపాయంగా పొందుతున్నాను. నా రక్షణభారం నాదే, నాది కాదు" అనే మానసికమైన, అచంచలమైన విశ్వాసంతో కూడిన, ప్రార్థనయే శరణాగతి. దీనిని వేదంకూడా **"తస్మాన్యాసమేషాం తపసామతిరిక్తమాహుः"** అని ఉత్తమమోక్షోపాయంగా నిశ్చయించి పల్కింది. ఈ శరణాగతియొక్క స్వరూపస్వభావాలను అందంగా వివరించి చెప్పే మధురస్తుతులలో ఒకటి ఈ శరణాగద్యం.

విశిష్టాద్వైతసిద్ధాంతప్రచారకాగ్రేసరులైన భగవద్రామానుజులు రచించిన తొమ్మిది గ్రంథాలలో శరణాగతి గద్యం, శ్రీరంగ గద్యం, వైకుంఠ గద్యం అనేమూడు గద్యత్రయమనే పేరుతో ప్రసిద్ధిచెందాయి. శ్రీరామానుజులు, శ్రీరంగనాయకి శ్రీరంగనాథుల సమక్షంలో ఒక పంగునిమాసం ఉత్తరానక్షత్రంనాడు (లక్ష్మీజయంతి

నాడు) ఆ దివ్యదంపతులను శరణాగతి చేసి, తాము చేసిన ఆ శరణాగతిప్రకారాన్ని అస్తికులంతా తెలిసి, ఆచరించి, భగవదనుగ్రహాన్ని పొంది ఉత్తమపురుషార్థాన్ని పొందాలనే ఔదార్యంతో ఈ శరణాగతి గద్యను మనోహరమైన శైలిలో రచించి, లోకానికి ఇచ్చారు. ఈ స్తుతుల శైలి ఎటువంటివారి హృదయాన్ని అయినా కదిలించగల్గినది, కఱిగించగల్గినది. ఇవి స్తోత్రవాఙ్మయంలోనే తలమానికమైనవి. వీనిని శ్రుతప్రకాశికా భట్టర్, పెరియవాచ్చాన్‌పిళ్ళై, వేదాంతదేశికులు మొదలైన పూర్వాచార్యులు పలువురు వ్యాఖ్యానించారు.

తి.తి. దేవస్థానంవారిద్వారా నిర్వహింపబడే ధర్మప్రచారసంస్థలలో ఒకటి అయిన ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు తన ప్రచారకార్యక్రమంలో భాగంగా ధార్మిక గ్రంథాలను, ఆళ్వారుల, ఆచార్యుల సాహిత్యాన్ని వ్యావహారికభాషలో చిన్న చిన్న గ్రంథాల రూపంలో ప్రచురించి సహృదయపాఠకులకు అందించాలని ప్రయత్నిస్తున్నది. ఆ ప్రయత్నంలో భాగమే ఈ గద్యత్రయ ప్రచురణం. కాంచీ ప్రతివాది భయంకరం అణ్ణంగరాచార్య స్వామివారి ద్రావిడవ్యాఖ్యను అనుసరించి సరళమైన భాషలో చేయబడిన టీకతో ఇపుడీ గద్యత్రయ ముద్రింపబడి సహృదయపాఠకులకు సమర్పించబడుతున్నది. టీకను చక్కగా అందించిన శ్రీమాన్ ఈ.ఏ. శింగరాచార్యులు గారిని (Ex. స్పెషల్ ఆఫీసర్, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్), ఈ గ్రంథప్రచురణలో తగిన ప్రయత్నాన్ని చేసిన ప్రాజెక్టు స్పెషల్‌ఆఫీసర్ వి.జి. చొక్కలింగంగారిని అభినందిస్తూ, ఈ గ్రంథప్రచురణను ఆదరించి ఆనందింపజేయవలసినదిగా ఆస్తిక లోకాన్ని అభ్యర్థిస్తున్నాను.

సాంబశివరావు, ఐ.ఏ.ఎస్.
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి-517 507

నివేదిక

తిరుమల తిరుపతి దేవస్థానాల యాజమాన్యం పలు ధార్మిక ప్రచార విభాగాలను ఏర్పాటుచేసి, వాటిద్వారా సనాతనధర్మ ప్రచార పరిరక్షణలను నిర్వహిస్తున్నది. ఈవిధంగా తి.తి.దేవస్థానం నిర్వహించే ధార్మిక ప్రచార శాఖలలో ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ఒకటి. క్రీ.శ.1991 సంవత్సరంలో ఈ ప్రాజెక్ట్ ఆవిర్భవించింది.

వైదిక సిద్ధాంతాలను, తత్త్వాలను, సందేశాలను, ప్రత్యేకించి, మధురభక్తిని ద్రావిడప్రబంధాల రూపంలో లోకానికి అందించి జాగృతంచేసిన మహానుభావులు ఆళ్వార్లు. వీరు శ్రీమన్నారాయణుడే పరదైవమని నమ్మి, ఆ సిద్ధాంతాన్ని తమ ప్రబంధాలలో చాటిచెప్పారు. వీరికి దివ్యసూరులని, వీరి ప్రబంధాలకు దివ్య ప్రబంధాలని, వీరు కీర్తించిన విష్ణు క్షేత్రాలకు దివ్యదేశాలని ప్రసిద్ధమైన వ్యవహారం ఏర్పడింది. దివ్యమంటే అలౌకికమైన అర్థం. సరోయోగి (పొయ్‌గై ఆళ్వార్లు), భూతయోగి (పూదత్తాళ్వార్లు), మహాయోగి (పేయాళ్వార్లు), భక్తిసారయోగి (తిరుమళిశైప్పిరాన్), శఠకోపయోగి (నమ్మాళ్వార్లు), కులశేఖరయోగి (కులశేఖర పెరుమాళ్), భట్టనాథయోగి (పెరియాళ్వార్లు), భక్తాంఘ్రిరేణుయోగి (తొండరడిప్పొడిఆళ్వార్లు), మునివాహనసూరి (తిరుప్పాణ్ పెరుమాళ్), పరకాలయోగి (తిరుమంగై మన్నన్) అని ఆళ్వార్లు పదిమంది. వీరితోపాటు నమ్మాళ్వార్ల సమకాలీనులు అయిన మధుర కవులు, భట్టనాథుల ప్రియపుత్రిక అయిన గోదాదేవి - అనే ఇద్దరిని కలిపి మొత్తం 12 మంది ఆళ్వార్లు అనే లెక్క కూడా ఉన్నది. వీరందరూ లోకానికి అందించిన ప్రబంధాల సంఖ్య 24. ఈ దివ్యప్రబంధాల లోని పాశురాల సంఖ్య సుమారు 4000 అయినందున, ఈ భక్తి సాహిత్యానికి నాలాయిర దివ్యప్రబంధమనే ప్రసిద్ధికల్గింది. నాలాయిరమంటే నాలుగు వేలు. మహర్షుల వైదిక భాషలో దర్శించిన విజ్ఞానం సంస్కృతవేదమని, ఆళ్వార్లు ద్రావిడభాషలో వెలయించిన ప్రబంధాలు ద్రావిడవేదమని వ్యవహరింపబడుతున్నవి. ఈ రెండూ కలిపి శ్రీవైష్ణవసంప్రదాయంలో ఉభయవేదాలుగా (ఉభయవేదాంతాలుగా) ప్రసిద్ధి చెందాయి. మహర్షులు

వేదాలలో వ్యక్తం చేసిన తత్త్వాలనే ఆళ్వార్లు తమ ప్రబంధాలలో ద్రావిడభాషలో వ్యక్తం చేసినందున ఈ రెండు వేదాలు ఒకే విధమైన సిద్ధాంతాలను, తత్త్వాలను తెలియజేస్తున్నవి. ఈ ఉభయవేదాంత సంప్రదాయాన్ని నాథమునులు, యామునులు, భగవద్రామానుజులు మొదలగువారు ప్రోదుచేసి అభివృద్ధి చేశారు.

వీరి తర్వాత ఆళ్వార్ల దివ్యప్రబంధాలలోని వైదిక తత్త్వాలను, సందేశాలను లోకానికి వివరిస్తూ భట్టర్, నంజీయర్, నంబిళ్ళై, శ్రీకృష్ణసూరి, పిళ్ళై లోకాచార్యులవారు, వేదాంత దేశికులు, శ్రీవరవర మునులు మొదలైన పలువురు పూర్వాచార్యులు మణిప్రవాళశైలిలో అద్భుతాలైన, రస్యరహస్యార్థ పూర్ణాలైన వ్యాఖ్యానాలను వెలయించారు. మణిప్రవాళశైలి అంటే- సంస్కృత ద్రావిడ భాషాపదాల కలయికతో కూడిన శైలి. ఈశైలి ఆవిర్భావం కూడా అద్భుతమైనది. నాన్యతో దర్శనీయమైనది.

ఆళ్వారుల దివ్యప్రబంధాలను వ్యాఖ్యానించిన పూర్వాచార్యులు, ఆళ్వార్ల ప్రబంధాలలోని తత్త్వాలను సంస్కృతవేదాంతంలోని, పురాణేతి హాసాగమాదుల లోని తత్త్వాలతో సమన్వయం చేసి వ్యాఖ్యానించడమే కాక, స్వయంగా ఎన్నో స్వతంత్ర గ్రంథాలను మణిప్రవాళశైలిలో, సంస్కృతభాషలో, ద్రావిడభాషలో రచించారు. ఆళ్వార్ల దివ్యప్రబంధాలకు పూర్వాచార్యులు రచించిన వ్యాఖ్యలకు టిప్పణులు (అరుబందాలు) వెలిశాయి. ఈవిధంగా ఉభయవేదాంత సంప్రదాయ వాఙ్మయం విశాలంగా విస్తరించింది ఈనాటికీ విస్తరిస్తూ ఉన్నది కూడా. ఇంతటి అపూర్వమైన, అపారమైన జ్ఞానసంపదను పరిరక్షించి, పరిశోధన జరిపి దాని ఫలాలను లోకానికి అందించాలనే మహదాశయంతో ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్‌ను టి.టి. దేవస్థానం ప్రారంభించింది.

ఇంతకాలంగా ప్రాజెక్ట్ దేశంలో పలుచోట్ల ఆళ్వార్ల, పూర్వాచార్యుల జన్మదినోత్సవాలను జరిపి, ఆ సందర్భాలలో ప్రసిద్ధపండితుల ఉపన్యాస కార్యక్రమా లను ఏర్పాటుచేయడం ద్వారా ప్రచార కార్యక్రమాన్ని కొంతవరకు సాగించింది. తర్వాత గత మూడేళ్ళుగా ప్రాజెక్ట్ ఆళ్వార్ల, పూర్వాచార్యుల

సాహిత్యాన్ని చిన్న చిన్న గ్రంథాల రూపంలో ప్రచురించి, ఉచితంగా భక్తులకు, ఆస్తికులకు అందజేయడం ద్వారా ప్రచారాన్ని మరింత విస్తృతం చేసింది.

ప్రస్తుతం ఆళ్వార్ల, పూర్వాచార్యుల ప్రబంధాలకు సులభమైన తెలుగులో టీకా వివరణలను ముద్రించి, ప్రచారం చేసే వేఱొక బృహత్ ప్రయత్నాన్ని ప్రాజెక్ట్ ప్రారంభించింది. అందులో భాగంగా ఇపుడు భగద్రామానుజులు రచించిన గద్యత్రయం ఆంధ్రటీకా సహితంగా ముద్రింప బడుతున్నది. ప్రాజెక్టు కార్యకలాపాలకు అన్నివిధాలుగా చేయూతనిస్తున్న తి.తి. దేవస్థానాల కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం.జి. గోపాల్ గారికి, సహాయ కార్య నిర్వహణాధికారి శ్రీ వెంకట్రామిరెడ్డి గారికి, తదితర ఉన్నతాధి కారులకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలను తెలియజేసుకొంటున్నాను. అడిగిన వెంటనే కాదనకుండా గద్యత్రయానికి టీకను వ్యావహారిక ఆంధ్రభాషలో అందించిన మిత్రులు శ్రీమాన్ డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు గారికి ధన్యవాదాలను తెలుపు కుంటున్నాను. ఈ గ్రంథ ముద్రణ విషయంలో సహృదయతతో సహకరించిన టిటిడి ప్రెస్ మేనేజరుకు, వారి సిబ్బందికి నా హార్దిక కృతజ్ఞతలు. ఆస్తికులైన పాఠకులు ఈ ప్రచురణను ఆదరించి ఆమోదిస్తారని నమ్ముతున్నాను.

ఇట్లు

వి.జి. చొక్కలింగం

స్పెషల్ ఆఫీసర్, ఆళ్వార్‌దివ్యప్రబంధ ప్రాజెక్ట్

తి.తి.దే, తిరుపతి

ఉపోద్ఘాతం

కాలత్రయేఽపి కరణత్రయనిర్మితాతి-
పాపక్రియస్య శరణం భగవత్ క్షమైవ ।
సా చ త్వయైవ కమలారమణేఽర్థితా యత్
క్షేమస్స ఏవ హి యతీంద్ర! భవచ్ఛ్రితానామ్ ॥

(ఓ యతిరాజా! భూతభవిష్యద్వర్తమానాలనే మూడు కాలాలలోను వాక్కు, మనస్సు, శరీరాలనే మూడు కరణాలద్వారా మిక్కిలిగా పాపాలను చేసినవానికి భగవానుని నిర్హేతుక కృప ఒక్కటే శరణం. ఆ కృపను దేవరవారు శ్రీరంగనాథుని సన్నిధిలో ప్రార్థించారు- అనే సంగతి ఏది ఉన్నదో, అదే మిమ్ములను ఆశ్రయించిన మాకందఱకు క్షేమాన్ని కల్గిస్తున్నది కదా.)

విశిష్టాద్వైతసిద్ధాంతప్రవర్తక సార్వభౌములైన భగవద్రామానుజులు **"నిధియై ప్పొழிయుమ్ ముకిల్"** (నిధులను వర్షించే మేఘం) అనే రీతిలో ఉదారంగా వర్షించిన, నిధులు అనదగిన గ్రంథాలు తొమ్మిది. అవి- (1)శరణాగతి గద్యం, (2) శ్రీరంగగద్యం, (3) వైకుంఠగద్యమ్- అనే మూడు గద్యల రూపంలోని గద్యత్రయం, (4) వేదాంతసారం, (5) వేదాంతదీపం- అనే, బాదరాయణ బ్రహ్మ సూత్రాలకు సంగ్రహవివరణ రూపాలైన గ్రంథాలు రెండు, శ్రుతివాక్య సమన్వయరూపమైన (6) వేదార్థసంగ్రహం, (7) భగవద్గీతా భాష్యం, (8) బ్రహ్మ సూత్రాలపై విస్తృతమైన, గంభీరమైన, విశిష్టాద్వైత సిద్ధాంతప్రతిపాదకమైన వ్యాఖ్యానం శ్రీభాష్యం, (9) ప్రపన్ననిత్యానుష్ఠాన ప్రక్రియా ప్రకాశకమైన నిత్యం గ్రంథం - అనేవి ఈ తొమ్మిది. వీటిలో భగవద్రామానుజులు, ఒకానొక పంగుని మాసం ఉత్తరానక్షత్రం నాడు, శ్రీరంగనాయకీ శ్రీరంగనాథులు కలసి ఏకాసనంలో వేంచేసి ఉండే సమయంలో లోకోజ్జీవనంకోసం పరమకృపతో చేసిన విజ్ఞాపనమే -శరణాగతిగద్యం. దీనినే శ్రీవరవరమునులు పూర్వం ప్రస్తావించిన **"కాలత్రయేఽపి"** అనే యతిరాజ వింశతి శ్లోకంలో ప్రస్తుతించారు.

ఈ తొమ్మిది దివ్య గ్రంథాలలోను, గద్యత్రయం ప్రత్యేకమైన స్థానాన్ని అలంకరిస్తున్నది. ప్రపత్తి వైభవాన్ని సమగ్రంగా తెల్పుతున్నందువల్ల, అష్టాక్షరి, ద్వయం, చరమశ్లోకానే రహస్యత్రయాన్ని- ముఖ్యంగా ప్రపన్నుడనే శిశువునకు మాతృస్తన్యంవలె ధారకపోషక భోగ్యరూపమై ఉండే ద్వయాన్ని- వివరించడంవల్ల, భగవత్ స్వరూపరూపగుణ విభూతులను విశదంగా తెల్పుతున్నందువల్ల మన పూర్వాచార్యులు గద్యత్రయమనే సముదాయనామంతో వ్యవహరింపబడే మూడు గ్రంథాలను మిక్కిలిగా ఆదరించారు. ఇందువల్లనే మిగిలిన గ్రంథాల పట్ల అభినివేశం కల్గిఉన్నా, అధ్యయనప్రయత్నాన్ని చేయడానికి తగిన జ్ఞానశక్త్యాదులను, అవకాశాన్ని లేనివారుకూడా ఈ గద్యప్రబంధాలను నిత్యాను సంధేయ స్తోత్రాలుగా ఆదరించి అనుసంధించి, వాటి అర్థాన్ని సదాచార్య సన్నిధిలో గ్రహించే సత్సంప్రదాయాన్ని అనుసరించారు.

ఈ గద్యత్రయం కేవలం స్తుతిప్రబంధం మాత్రమే కాదు. **"విశిష్టాద్వైత సిద్ధాంత సర్వస్వం"**- అని చెప్పదగినది. ఈశ్వరస్వరూపాన్ని **"అఖిలహేయ ప్రత్యనీక"** ఇత్యాది అయిదవ చూర్ణిక సమగ్రంగా తెలుపగా, చిత్- అచిత్తుల స్వరూపం **"స్వసంకల్పానువిధాయి"**, **"మదీయానాదికర్మప్రవాహ"** ఇత్యాది సూక్తులు తెల్పుతున్నాయి. ఇదే విధంగా, గద్యత్రయం తత్త్వహిత పురుషార్థ ప్రకాశకమనే విషయాన్ని శ్రీదేశికులు **"సంబోధనైః పరం తత్త్వం న్యాసోక్త్యా పరమం హితమ్, పార్థనాభిశ్చ పరమః పుమర్థ ఇహ దర్శితః"** - (సంబోధనల ద్వారా తత్త్వత్రయ స్వరూపం, **"త్వత్పాదారవింద యుగళం శరణమహం ప్రపద్యే"** అనే న్యాసోక్తిద్వారా ప్రపత్తి అనే పరమోపాయం, కైంకర్యప్రార్థనా వాక్యాలద్వారా పరమపురుషార్థం ప్రదర్శింప బడింది.) అని అంటూ తమ గద్యభాష్యంలో తెలిపారు.

భగవద్రామానుజులు, శ్రీభాష్యంలో **"తత్త్వజ్ఞానాన్మోక్షః"** అనే వేదాంత సిద్ధాంతానుసారంగా కర్మయోగాన్ని అంగంగా కల్గిన, భక్తిరూపంగా పరిణమించిన, ఉపాసనరూపమైన జ్ఞానమే మోక్షసాధనమనే సిద్ధాంతాన్ని తెలిపినపుడు, ఈగద్యత్రంలో ప్రపత్తి మోక్షసాధనమని ఉపదేశించడం ఏవిధంగా తగినది? అనే ప్రశ్నకు పెరియవాచ్చాన్ పిళ్ళై శరణాగతిగద్య వ్యాఖ్యానావ తారికారంభంలో **"శ్రీభాష్యత్తిల్"** అని ఆరంభించి తగిన సమాధానాన్ని సువిశదం చేశారు. పునరుక్తి భీతితో ఆ విషయాన్ని ఇక్కడ ప్రస్తావించడంలేదు.

తిరువాయ్‌మొழி ప్రబంధం ఈడు వ్యాఖ్యలో **"వీడుమిన్ ముற்றవుమ్"** (1-2) అనే దశకప్రవేశంలో నమ్బిళ్ళై **"ఇత్తిరువాయ్‌మొழிతన్నై ఆళవన్దార్**

అరుళిచ్చెయ్‌దారాక త్తిరుమాలై యాణ్డాన్ ప్రపత్తి విషయమాక్కి నిర్వహిత్తు క్కొణ్డు పోన్దు, ఎమ్బెరుమానారుమ్ అప్పడియే అరుళిచ్చెయ్‌దుకొణ్డు పోన్దు, భాష్యమ్ తలైక్కట్టిన పిన్బు భక్తివిషయమాక అరుళిచ్చెయ్‌దుకొణ్డు పోరువర్. పిన్బు ఎమ్బారుమ్ అప్పడియే అరుళిచ్చెయ్‌దార్" (ఈ దశకాన్ని, ఆళవందార్ తెల్పినట్లుగా, తిరుమాలై యాణ్డాన్ ప్రపత్తిపరంగా నిర్వహించారు. శ్రీరామానుజులు కూడా ఆవిధంగానే నిర్వహిస్తూ, శ్రీభాష్యం రచించిన తరువాత (సాధ్య) భక్తి విషయంగా నిర్వహించేవారు. తరువాత ఎమ్బార్‌కూడా ఆవిధంగానే అనుగ్రహించారు) అని అనడం, దీనిని అరుంబదకారులు - **(భాష్యమ్ తలైక్కట్టిన పిన్బు- ఇత్యాది)** ప్రపత్తి, వేదగుహ్యమైన రహస్యోపాయం కనుక, దానిని అనర్హులకు వ్యక్తం చేయరాదని తలచి, ప్రపత్తికి ఇంకొకనామమైన సాధ్యభక్తిద్వారా దానిని మఱుగుపరచారు) అని వివరించడం ఇక్కడ ప్రస్తావనార్హం. శ్రీభాష్యంలో వివేకాదిసాధనసప్తకాన్ని, శమదమాదులను అంగంగా కల్గిన ఉపాసనరూపమైన సాధన భక్తిద్వారా ప్రతిపక్షనిరసనాన్ని భగవద్రామానుజులు చేసినప్పటికీ, "వేదశాస్త్రతాత్పర్యం ప్రపత్తిరూపమైన సాధ్యభక్తిలోనే పర్యవసిస్తున్నది - అనే రహస్యాన్ని సాత్త్వికులు కోల్పోరాదని తలచి, దానిని ఈ గద్యత్రయంద్వారా ఉపదేశించారు. త్రైవిద్య వృద్ధజన మూర్ధన్యులైన ఆళ్వార్లు అందఱు అనుష్ఠించిన ఉపాయం ప్రపత్తియే కదా! సాధనభక్తి (సాధన సప్తకాద్యంగకమైనది కనుక) ప్రవృత్తి రూపమైనది కాగా, సాధ్యభక్తి (స్వప్రవృత్తి)నివృత్తి రూపమైనది.

గద్యత్రయాన్ని శ్రీరామానుజులు శ్రీభాష్యానికి పిమ్మట అనుగ్రహించారనే విషయం పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానం ద్వారా దేశికవ్యాఖ్యానం ద్వారా స్పష్టమవు తున్నది. శ్రీరామానుజుల అంతరంగశిష్యులలో ఒకరు, చరమపర్వనిష్ఠాగరిష్ఠులైన వడుగనంబికూడా యతిరాజవైభవమనే శ్రీరామానుజుల చరిత్రను వర్ణించే కృతిలోని 72వ శ్లోకంలో **"అబాధితార్థై రనపాయవాచామ్"** అని అంటూ శ్రీభాష్యరచనను గూర్చి ప్రస్తావించి, తరువాత 73వ శ్లోకంలో **"తతః కదాచిత్ స హి రంగనాయికా శ్రీరంగనాథాపి ఫల్గునోత్తరే, ముదాఽభిషిక్తా స తదా ప్రపద్య గద్యత్రయం చాప్యవదద్యతీశ్వరః"** (తరువాత, ఒక పంగునిమాసం ఉత్తరా నక్షత్రంలో, శ్రీరంగనాయకి

శ్రీరంగనాథుడు కలసి వేంచేసి ఉండే సన్నివేశం సేవించి, అభిషేకా నంతరం వారిని శరణు పొంది, గద్యత్రయాన్ని అనుగ్రహించారు) అని గద్యత్రయ రచనను గూర్చి పల్కినందున, ఆ తరువాత 74వ శ్లోకంలో **"గద్యైః శ్రీశం ప్రపన్నస్య తదేకవృత్తేః కైంకర్య మాప్రాపణకార్య మాహ నిత్యాభిధ గ్రంథముఖాత్ యతీశః"** (గద్యలద్వారా శ్రియఃపతిని శరణు పొందినవాడు తనకు మోక్షం ప్రాప్తించే పర్యంతం చేయదగిన నిత్యకైంకర్యాన్నిగూర్చి నిత్యమనే గ్రంథంలో తెలిపారు) అని ప్రస్తావించినందున ఈవిషయం దృఢపడుతున్నది. ఈ విషయంలో ఆఱూయిరప్పడి గురుపరంపరా ప్రభావాది గ్రంథాలలో కొంత వ్యత్యాసం కన్పిస్తున్నా, బహుగ్రంథసూక్తి స్వారస్యాన్నిబట్టి, సమకాలీనులైన వడుగనంబి సూక్తికిగల ప్రామాణ్యాతిశయాన్ని బట్టి శ్రీభాష్యనిర్మాణానికి పిమ్మట, నిత్యగ్రంథనిర్మాణానికి ముందు గద్యత్రయావతరణం జరిగిందని అనడం యుక్తం. నిత్యగ్రంథంలో **"తమేవ శరణ మనుగచ్ఛేత్"- "అఖిల...." ఇత్యాదినాఽథ శరణాగతిప్రకారశ్చ పూర్వోక్తః"** అని అంటూ శరణాగతిగద్య ప్రస్తావన చోటు చేసికోవడంవల్లకూడా నిత్యగ్రంథానికి ముందే గద్యత్రయరచన చేయబడినదని తెలుస్తున్నది.

గద్యత్రయాన్ని నిత్యం అనుసంధించే స్తోత్రాలలో ఒకటిగా మన పూర్వాచార్యులు నిర్ణయించి అనుష్ఠించారు. శ్రీదేశికులు పాంచరాత్రరక్ష అనే గ్రంథంలో **"ద్వయవ్యాఖ్యానరూపే గద్యత్రయే నిర్వేదభూయస్త్వయా కైంకర్యత్వరాతిశయాచ్చ ప్రాభాతికేఽనుగమనే మిథగద్యానుసంధాన ముచితమ్. బృహద్గద్యం తు సమారాధనకాలే.... భాష్యకారైరేవ వినియుక్తమ్. శ్రీవైకుంఠగద్యం తు... యోగార్థకల్పితే కాలే విశేషతోఽనుసంధేయమితి భాష్యకారాశయః ప్రతీయతే"** (ద్వయమంత్రానికి వ్యాఖ్యానరూపమైన గద్యత్రయంలో, నిర్వేదాన్ని మిక్కిలిగా కల్గినందున, కైంకర్యత్వరను మిక్కిలిగా ప్రదర్శిస్తున్నందున ప్రభాత సమయంలోని అనుగమనంలో శ్రీరంగగద్యను అనుసంధించడం తగినది. శరణాగతి గద్య ఆరాధన కాలంలో భాష్యకారుల చేతనే అనుసంధింపబడినది. వైకుంఠగద్యను యోగాన్ని చేసేసమయంలో అనుసంధించడం భాష్యకారుల ఆశయంగా తెలుస్తున్నది) ఇత్యాదిగా పల్కినందున ఈ విషయం సుస్పష్టం.

గద్యత్రయంలో, విశేషించి, శరణాగతిగద్యలో కొన్ని స్వల్పమైన పాఠభేదాలు గోచరిస్తున్నాయి. లక్ష్మీదేవిని పురుషకారంకోసం ప్రార్థించే **"భగవన్నారాయణాభిమతానురూప"** ఇత్యాది మొదటి చూర్ణికను వ్యాఖ్యానిస్తూ శ్రీదేశికులు తమ గద్యత్రయభాష్యంలో - **"అత్ర - అస్మత్స్వామిన్ ! ఇతివత్ అస్మన్మాతరమిత్యపి శ్రీవిష్ణుచిత్తాదయః పఠంతి"** అని అనడం దీనికొక ఉదాహరణం. విశేషమేమంటే- భగవద్రామానుజుల సమకాలీకులలో ఒకరైన ఎఱ్ఱాఱ్ఱాన్ ఆదరించిన పాఠానికి, తరువాత కన్పించే పాఠానికి మధ్య పాఠభేదం గోచరించడమే. ఇటువంటి చిన్న చిన్న పాఠభేదాలు **"శంఖచక్రగదాశార్ఙ్గాసి" -"శంఖచక్రగదాశార్ఙ్గ", "అనంత కల్యాణగుణగణశేషశేషాశన"- "అనంత శేషశేషాశన"** ఇత్యాది సందర్భాలలో కన్పిస్తున్నాయి. కాలక్రమేణ ఇటువంటి చిన్న చిన్న పాఠభేదాలు లేఖక ప్రమాదాదులవల్ల ఏర్పడడం సహజం కదా!

గద్యత్రయరచనలో భగవద్రామానుజులపై పూర్వుల ప్రభావం స్పష్టంగా గోచరిస్తుంది. శ్రీరంగగద్యప్రారంభంలోని **"స్వాధీనత్రివిధచేతనాచేతన స్వరూపస్థితి ప్రవృత్తిభేదమ్"** అనే ప్రయోగం తిరువాయ్‌మొఴి దివ్యప్రబంధంలోని **"ఉయర్వఱ" (1-1)** దశకంలోని 4వ, 5వ, 6వ, పాశురాల ప్రమేయాన్ని అనుసంధిస్తున్నది. శరణాగతిగద్యలో భగవానుని దివ్యభూషణవర్గాన్ని వర్ణించే సంబోధనలో- **"కిరీట మకుటచూడావతంస"** అని మూడు విధాలైన శీర్షాభరణాల ప్రస్తావన **"పారళన్ద పేరరశే! ఎమ్ విశుమ్బరశే! ఎమ్మై నీత్తు వళ్ళిత్తోరరశే!"** అనే తిరువిరుత్త పాశురసూక్తిని బట్టి చేయబడింది. అదే విధంగా గుణాలలో వాత్సల్యగుణాన్నిగూర్చి మాత్రం అసకృత్ ప్రస్తావన చేయడం **"నికరిల్ పుకఴాయ్"** అనే నమ్మాఴ్వార్ల శ్రీసూక్తినిబట్టి. ఇక, శ్రీవైకుంఠగద్యలో **"అచింత్యదివ్యాద్భుత...", "ప్రబుద్ధ ముగ్ధాంబుజ చారులోచనమ్", "ప్రియావతం సోత్పలకర్ణభూషణ..."** ఇత్యాది ప్రయోగాలు భగవద్యామునుల స్తోత్రరత్నంలోని శ్లోకాలలో చేసిన ప్రయోగాలను యథాతథంగా అనువదిస్తూ చేయబడ్డాయి- అనే విషయం సుస్పష్టం. ఇటువంటి శబ్దార్థసాదృశ్యాలు ఆఴ్వార్ల శ్రీసూక్తులకు, గద్యత్రయ ప్రయోగాలకు మధ్య ఎన్నో ఉన్నా, విస్తభీతిచేత ఏతావన్మాత్రంతో విరమింపబడింది. దీనివల్ల తేలిన విషయమేమంటే- గద్యత్రయం ఆఴ్వార్ల దివ్యప్రబంధసూక్తుల, భగవద్యామునా చార్యాది పూర్వాచార్యసూక్తుల అనుభవపరీవాహరూపమే- అని.

ఇక, గద్యత్రయప్రభావం తరువాతి ఆచార్యులపై ఎంతగానో పడింది. శ్రీపిళ్ళైలోకాచార్యులవారి అర్చిరాది గ్రంథం శ్రీవైకుంఠగద్యను ఆధారంగా చేసికొని రచింపబడింది. పలువురు పూర్వాచార్యులు తమ వ్యాఖ్యాగ్రంథాలలో గద్యత్రయాన్ని పరమప్రమాణంగా గ్రహించారు. ఎంతోమంది ఆచార్యులు గద్యత్రయాన్ని వ్యాఖ్యానించారు. శ్రీ పిళ్ళైలోకాచార్యులవారు శ్రీవచనభూషణాది రహస్యగ్రంథాలలో పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యాన సూక్తులను సూత్రాలుగా మలిచారు.

శరణాగతిగద్యలో ప్రధానంగా ద్వయమంత్రార్థం అనుసంధింపబడినప్పటికీ, అక్కడక్కడ అష్టాక్షరి, చరమశ్లోకార్థాల అనుసంధానంకూడా ఉన్నదని పూర్వా చార్యుల అభిప్రాయం. శరణాగతిగద్యలోని **"అనంతతద్విరోధిపాపాక్రాంతోఽపి"** అనే ప్రయోగాన్ని శ్రీసుదర్శనభట్టర్ **"పరిశబ్దార్థమభిప్రయన్నాహ- (అనంతేతి)"**. అని వ్యాఖ్యానించడం దీనికొక ఉదాహరణం. **"మన్నియామ్యతా మద్దాస్యైకస్వభావ"** అనే ప్రయోగంలోని **"మద్దాస్యైక"** అనే చోట గల **"ఏక"** శబ్దంచేత సూచింపబడిన అవధారణార్థం **"మద్దాస్యైక - ఎన్గిఱ అవధారణమ్ ప్రథమపదత్తిల్ చతుర్థిక్కుమేలే అవధారణమ్బోలే యిరుక్కిఱదు"** అని అంటూ అష్టాక్షరిఆరంభంలోని ప్రణవంలో గల అకారంపై వచ్చి లోపించిన చతుర్థీవిభక్తియొక్క అర్థాన్ని ఇది పరామర్శిస్తున్నదని పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానించడం ఇంకొక ఉదాహరణం.

శరణాగతిగద్యకు **"పృథుగద్య"** అని, శ్రీరంగగద్యకు **"మితగద్య"** అనే వ్యవహారంకూడా ఉన్నది. ఈ నామాల ప్రస్తావన పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానంలో, శ్రీదేశికభాష్యంలో కన్పిస్తుంది. ఈ మూడు ద్వయమంత్రార్థ ప్రతిపాదకాలు. ఒక సందర్భవిశేషంలో రామానుజులు దివ్యదంపతుల సమక్షంలో విన్నపించినది శరణాగతిగద్య. ఇది సామాన్య భగవద్విషయం. ఈ గద్యలోని సంబోధనలు ఈ విషయాన్ని సూచిస్తాయి. శ్రీరామానుజులు సౌలభ్యానికి పరమావధి అయిన శ్రీరంగనాథుని విషయంలో తమ ప్రార్థనా రూపంగా శ్రీరంగగద్యాన్ని పలికారు. ఇక, చివరలో శ్రీరామానుజులు శ్రీవైకుంఠగద్యలో పరోపదేశరూపంగా శ్రీవైకుంఠ నాథుని విషయంగా అనుగ్రహిస్తూ ప్రపన్నునకు కర్తవ్యోపదేశాన్ని చేశారు. శ్రీరామానుజులు,

శ్రీరంగగద్యంలో ఆత్మోపదేశాన్ని, శ్రీవైకుంఠగద్యంలో పరోపదేశాన్ని చేయడం - నమ్మాళ్వార్లు తిరువాయ్‌మొళిలోని మొదటి దశకంలో **"తొళుదెళు ఎన్ మనమే!"** అని ఆత్మోపదేశాన్ని, వెంటనే, రెండవ దశకంలో **"వణ్‌పుకళ్ నారణన్ తిణ్‌కళల్ శేరే!"** అని పరోపదేశాన్ని చేయడంవంటిదే.

శ్రీ దేశికులు శరణాగతిగద్య భాష్యావతారికలో శరణాగతిగద్యం ద్వయ మంత్రాన్ని వివరించిన వైనాన్ని సువిశదంగా వివరించారు. శ్రీసుదర్శనభట్టర్, పెరియవాచ్చాన్‌పిళ్ళైకూడా తమ వ్యాఖ్యానాలలో ద్వయమంత్రార్థం అనుసంధింప బడిన క్రమాన్ని విశదం చేశారు.

"గద్యం కవీనాం నికషం వదంతి" అనే ఆభాణకం గద్యరచన కవితాశక్తికి నికషోపలం (ఒరపిడిరాయి) వంటిది అని తెల్పుతున్నది. గద్యత్రయంలోని కవితాశైలి ఉత్తమోత్తమ గద్యరచనకు ఉత్కృష్టోదాహరణం. ఛందోబద్ధమైన వృత్తాల క్రమంలోని రచనను తలపించే **"వృత్తగంధి"** అనే గద్యప్రక్రియాభేదాన్ని వైకుంఠగద్యలోని పరమపదంలో వేంచేసి ఉండే భగవానుని వర్ణించే **"అచింత్య దివ్యాద్భుత"** ఇత్యాది ప్రయోగాలలో గమనించవచ్చు. దీర్ఘదీర్ఘ సమాస బాహుళ్యాన్ని కల్గిన ఉత్కలికాప్రాయమనబడే గద్యప్రకారభేదాన్ని శరణాగతి గద్యలోని **"స్వాభిమతానురూప"**, **"స్వోచితవివిధవిచిత్రానంతాశ్చర్య"** ఇత్యాది పలు సంబోధనలలో దర్శింవచ్చు. ఇక, చిన్న చిన్న పదాలతో కూడిన చూర్ణమనే గద్యప్రక్రియను శ్రీరంగగద్యలోని **"అపారకరుణాంబుధే! అనాలోచితవిశేషా శేషలోకశరణ్య!"** ఇత్యాది సంబోధనలలో సేవించవచ్చు. ఈవిధంగా గద్యత్రయం పలు విధాలైన మధురగద్యప్రక్రియాభేదాలకు ఉత్తమోదాహరణం.

ఇంతటి శబ్దార్థవైలక్షణ్యాన్ని కల్గిన గద్యత్రయానికి పలువురు పూర్వా చార్యులు **"అవశాః ప్రతిపేదిరే"** అనే రీతిలో ఆదరించి, తమ వ్యాఖ్యానాలతో భూషించినట్లుగా తెలుస్తున్నది. కాని, ఆ వ్యాఖ్యలన్నీ ఇపుడు లభించకపోవడం మన అదృష్టలోపమేనని చెప్పాలి. శ్రీరామానుజులకు అంతరంగశిష్యులలో ప్రథములనదగిన కూరేశులు గద్యత్రయానికి వ్యాఖ్యానాన్ని సంతరించినట్లు పెరియతిరుముడి యడైవు అనే సాంప్రదాయిక చరిత్ర గ్రంథం పేర్కొన్నది. దీనిని గూర్చిన ప్రస్తావన యమకరత్నా కర గ్రంథానికి గల ఉపోద్ఘాతంలో కూడా చేయబడిందని శ్రీమాన్ చేట్టలూర్ శ్రీవత్సాంకాచార్యస్వామివారు

గద్యత్రయగ్రంథానికి తాము రచించిన ఉపోద్ఘాతంలో తెలిపారు. ఇందువల్ల శ్రీరామానుజులు ఈ విభూతిలో వేంచేసి ఉండగానే గద్యత్రయానికి ఒక వ్యాఖ్యానం అవతరించిందని తెలుస్తున్నది. శఠమర్షణ గోత్రోద్భవులు, శ్రీరామానుజుల సమకాలీనులు, వారిచే కూరేశులతో సమానులని అంటూ **"ఎఱుళ్ ఆళ్వానో!"** అని ప్రశంసింపబడినవారు, శ్రీవిష్ణుపురాణ వ్యాఖ్యాతలు, **"ఎఱుళాళ్వాన్"** అనే పేరుతో సంప్రదాయంలో సుప్రసిద్ధులైన శ్రీవిష్ణుచిత్తార్యులు కూడా గద్యత్రయానికి ఒక వ్యాఖ్యను రచించినట్లు తెలుస్తున్నది. శ్రీదేశికులు రహస్యత్రయసారం చరమశ్లోకాధికారంలో **"అధికారం పురస్కృత్య"** అనే ప్రకరణంలో త్యాగం అంగమా? కాదా? అనే విచారంలో, **"అజ్ఞాత పూర్వ వృత్తాంతైః యత్తత్తారోపితం పరైః, తత్తు శ్రీవిష్ణుచిత్తాద్యైః నిర్మూలమితి దర్శితమ్"** అని పల్కడం - **"స్వస్వవర్ణాశ్రమాధీనం కర్మ న త్యాజ్య మే వ తత్, యావద్దేహం ప్రపన్నైశ్చ త్యాగహేతో రదర్శనాత్"** అని గద్యత్రయ వ్యాఖ్యలో శ్రీవిష్ణుచిత్తార్యులు పల్కిన శ్లోకాన్ని పురస్కరించుకొనియే- అని సారాస్వాదినీ అనబడే రహస్యత్రయ సారవ్యాఖ్యలో తెలుపబడింది. ఇంతేకాక, దేశికులు చతుఃశ్లోకీ వ్యాఖ్యలో రెండవ శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ - **"ఉక్తం చ శ్రీవిష్ణుచిత్తైః గద్య వ్యాఖ్యానారంభే - 'మాతృత్వైకరూపాం శ్రియం ప్రపద్యతే మాతా హి హితా దపి పుత్రస్య ప్రియమేవ పశ్యతి, పితా ఉభయం పశ్యతి, అతో దండధరత్వహీన తైవాలంబన మస్యాం దశాయా మాసీత్- ఇతి"**- అని అనడంకూడా ఇంకొక ఆధారం. కాని, ఇపుడు ఈ వ్యాఖ్యకూడా లభించడం లేదు. ఎఱుళాళ్వాన్ ప్రశిష్యులైన శ్రుతప్రకాశికాచార్యులవారు శరణాగతిగద్యకు మాత్రం సంస్కృతంలో క్లుప్తమైన, సారవంతమైన వ్యాఖ్యానాన్ని అనుగ్రహించారు. ఇపుడు లభించే గద్యత్రయ వ్యాఖ్యలలో ఇది ప్రాచీనం.

శ్రీమణవాళమహాములులు తత్త్వత్రయవ్యాఖ్యానంలో, ఈశ్వర ప్రకరణంలోని రెండవ చూర్ణికను వ్యాఖ్యానిస్తూ **"హేయప్రత్యనీకత్వ మావదు- ఆశ్రితరుడైయ హేయనిరాసకత్వత్తుక్కు అడియాన హేయప్రతిభటత్వ మెన్నవు మామ్- ఎన్ఱు మొరు యోజనైయు ముణ్డిఱే- గద్యవ్యాఖ్యానజ్ఞళిలే నంజీయర్, ఆచ్చాన్‌పిళ్ళై ముదలాన ఆచార్యర్‌కళ్ అరుళిచ్చెయ్‌దదు"** అని పల్కడంవల్ల నంజీయర్‌కూడా గద్యత్రయాన్ని వ్యాఖ్యానించినట్లు, శ్రీవరవరమునుల

కాలంవరకు అది లభ్యమైనట్లు తెలుస్తున్నది. కాని, అది ఇపుడు అలభ్యం. తరువాత కాలంలో పెరియవాచ్చాన్‌పిళ్ళై అనుగ్రహించిన గద్యత్రయవ్యాఖ్యానం ఇపుడు లభిస్తున్నది. ఇది, రహస్యనివేకం, శ్రీవైష్ణవసమయాచారనిష్కర్ష మొదలైన పలు పూర్వాచార్య గ్రంథాలలో ప్రస్తావింపబడింది.

తత్త్వత్రయవ్యాఖ్యానంలోనే శ్రీవరవరమునులు ఈశ్వరప్రకరణంలోని ఆఱువ చూర్ణికలో - **"అనుకూలజ్ఞానమే స్వరూపమాయిరుక్క, జ్ఞానానందజ్ఞళెన్ఱు పిరిత్తు చ్చొల్లుకిఱదు- ఇరణ్డు ముణ్డాగైక్కాక- ఎన్ఱిత్తే ఇవర్‌తామ్ ఇట్టరుళిన గద్యవ్యాఖ్యా నత్తిలే అరుళిచ్చెయ్‌దదు"** అని అనడం వల్ల శ్రీపిళ్ళైలోకాచార్యులవారు సైతం గద్యత్రయానికి ఒక వ్యాఖ్యానం అనుగ్రహించినట్లు తెలుస్తున్నా, అది ప్రకృతంలో దుర్లభం.

అనంతరకాలంలో శ్రీదేశికుల విస్తృతమైన, శాస్త్రీయమైన గద్యత్రయ భాష్యం అవతరించింది. అది మన అదృష్టం విశేషంచేత లుప్తం కాకుండా లభ్యమవుతున్నది. శ్రీవత్సగోత్రులు, **"పంచకాలపద్ధతి"** గ్రంథనిర్మాతలైన మంత్రసాలఘట్ట శ్రీమద్వేదాంతాచార్యులవారుకూడా గద్యత్రయానికి వ్యాఖ్యానాన్ని రచించినట్లు తెలుస్తున్నదని శ్రీవత్సాంకాచార్యులవారు తెలిపారు. ఇవి మాత్రమేకాక, ఇంకా ఎంతమంది పూర్వాచార్యులు గద్యత్రయానికి వ్యాఖ్యలను వెలయించారో, ఎన్ని కాలగర్భంలో లీనమయ్యాయో- తెలియదు.

శ్రీవేదాంతదేశికులు శరణాగతిగద్యను విస్తృతంగా వ్యాఖ్యానించినా, మిగిలిన రెండు గద్యలను చాలా క్లుప్తంగా వ్యాఖ్యానించారు. కాని, వీటి వివరణాన్ని అక్కడక్కడ పాంచరాత్రరక్ష మొదలైన అన్యగ్రంథాలలో ప్రకరణాను సారంగా వివరించడం గమనించవచ్చు. నిత్యానుష్ఠాన స్థాపనాధికారంలో **"శ్రీవైకుంఠగద్యే తు"**- అని ప్రస్తావించి కొంత విశదీకరింపబడింది. అదేవిధంగా, తత్త్వసందేశమనే గ్రంథంలో **"స్వాధీనత్రివిధచేతనాచేతన"** అనే శ్రీరంగగద్యలోని చూర్ణిక వివరింప బడింది.

ఇక, పరమకారుణికులైన పెరియవాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించిన గద్యత్రయ వ్యాఖ్యానంలో మూడు గద్యలు పూర్ణంగా, మనోహరంగా వ్యాఖ్యానింపబడ్డాయి. గద్యత్రయానికి ఇపుడు సమగ్రంగా లభించే పూర్వాచార్య

వ్యాఖ్యానం ఇది ఒక్కటే. **"నా మూలం లిఖ్యతే కించిత్ నానపేక్షిత ముచ్యతే"**- అనే మల్లినాథసూరిసూక్తికి పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానం ప్రథమోదాహరణం. దురవగాహాలైన శాస్త్రీయ విచారణలను చేయకుండా, ఆవశ్యకమైన సందర్భాలలో వక్తవ్యాలైన విషయాలను కొంచెంకూడా వదలిపెట్టకుండా సాంప్రదాయిక, శాస్త్రీయాలైన విషయాలను మధురంగా, సుబోధకంగా అనుగ్రహించే వీరి శైలి అనితరసాధారణం. భగవద్రామానుజుల గద్యత్రయానికి పెరివాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానించి ఉండకపోతే- అందులోని గంభీరాలైన అర్థాలు ఎవరికీ అంది ఉండేవి కావు- అనేది నిస్సందేహం. శ్రీవరవరమునులు ఉపదేశరత్తినమాలై ప్రబంధంలో **"పెరియవాచ్చాన్‌పిళ్ళై పిన్బుళ్ళవైక్కుమ్ తెరియ వియాక్కియైగళ్ శెయ్‌వాల్ అరియ అరుళిచ్చెయల్ పొరుళై ఆరియర్ కట్కిప్పోదు అరుళిచ్చెయల్ ఆయ్‌త్తఱిన్ఱు"** అని అంటూ దివ్యప్రబంధవ్యాఖ్యల విషయంగా పల్కిన సూక్ష్మార్థం గద్యత్రయవిషయంలో కూడా పూర్ణంగా అన్వయిస్తుంది.

పెరియవాచ్చాన్‌పిళ్ళై స్తోత్రరత్న వ్యాఖ్యానాన్ని రచించిన తరువాత గద్యత్రయవ్యాఖ్యరచనను చేశారు. శ్రీవైకుంఠగద్యలో భగవానుని దివ్యాయవ వర్ణనను తెలిపే విశేషణాలను వ్యాఖ్యానించే సందర్భంలో **"ప్రబుద్ధ"-తొడఙ్గి విరాజిత మఱుతియాక ఉళ్ళపదఙ్గళుక్కు ప్పొరుళ్ స్తోత్రభాష్యత్తిలే కణ్డుకొళ్వదు"** అని అనడంవల్ల ఈ విషయం వ్యక్తమవుతున్నది.

ఇపుడు లభించే పెరియవాచ్చాన్‌పిళ్ళై గద్యత్రయవ్యాఖ్యానంలో పలు పాఠభేదాలు గోచరిస్తున్నాయి. విశేషించి, శరణాగతిగద్యలో 12వ చూర్ణిక వ్యాఖ్యానంనుండి చివరి వరకుగల భాగంలో ద్రావిడలిపిలో ముద్రింపబడిన ప్రతులకు, తెలుగు లిపిలో ముద్రింపబడిన ప్రతులకు చాలా పాఠభేదాలు కన్పిస్తున్నాయి. శ్రీకాంచీ అణ్ణంగరాచార్య స్వామి వారు తమ శరణాగతిగద్య వివరణలో - "ఆచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానంలో **"అఖిలశబ్దత్తిల్ తాముమ్ అంతర్భూతరా కైయాలై తమ్మైయుమ్ కూట్టిక్కొళ్ళు కిఱార్"** అని ఉన్నది. కాని, కోయిల్ పత్తరావిస్వామి తిరుమాళిగలోని తాళపత్ర గ్రంథాలను పరిశీలించినపుడు- **"అఖిలపదత్తిల్ తాముమ్ అంతర్భూతరాయిరుక్కచ్చెయ్‌దేయుమ్, అఖిలజగత్తుమ్ ఒరు తట్టుమ్ తామ్ ఒరు తట్టుమాక తమ్ పక్కల్ వాత్సల్యాతిశయమ్ కణ్డారా కైయాలే విశేషిత్తు అరుళిచ్చెయ్‌కిఱార్ -**

అస్మన్మాతరమ్ ఎన్ఱు" (అఖిలపదంలో తాముకూడా ఒకరు అయినా, అఖిల జగత్తు ఒక ఎత్తు, తాము ఇంకొక ఎత్తు - అనే రీతిలో తమపట్ల లక్ష్మీదేవి చూపిన గొప్ప వాత్సల్యాతిశయాన్ని చూచినవారు కనుక, విశేషించి **"అస్మన్మాతరమ్"** అని అంటున్నారు)- అనే సంస్కరింపబడిన పాఠం కన్పించింది - అని పేర్కొనడం ఒక ఉదాహరణ. ఇటువంటి పాఠభేదాలు శరణాగతిగద్య వ్యాఖ్యలో తెలుగు తమిళ లిపులలో ప్రచురించిన కోశాలలో చాలా కన్పిస్తున్నాయి. ప్రస్తుత గ్రంథంలో ముద్రింపబడిన పెరియవాచ్చాన్‌పిళ్ళై గద్యత్రయవ్యాఖ్యానం శ్రీవైష్ణవ గ్రంథముద్రాపకసభ ద్వారా నళనామ సంవత్సరంలో **(1916** సం॥లో**)** కాంచీపురంలో శ్రీనివాస ముద్రాక్షరశాలలో తెలుగులిపిలో ముద్రింపబడిన ప్రతిని అనుసరించి ముద్రింపబడింది.

పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానంలోని ఒకటి రెండు మధురమైన అంశాలు మాత్రం ప్రస్తుతింపబడుతున్నాయి. భగవద్రామానుజులు శరణాగతిగద్యలో అయిదవ చూర్ణికలో సూక్తిద్వారా ముందుగా శరణాగతి చేసిన తరువాత, **6**వ, **7**వ, **8**వ చూర్ణికలలో పూర్వుల ప్రక్రియలో పౌరాణిక సూక్తులను అనుసంధించి మళ్ళీ శరణాగతిని చేశారు. తరువాత తొమ్మిదవ చూర్ణికలో **"తస్మాత్ ప్రణమ్య"** ఇత్యాది గీతాసూక్తిని అనుసంధించారు. ఈ సూక్తిని శ్రీరామానుజులు ప్రస్తావించి అనుసంధించడంలోని తాత్పర్యాన్ని శ్రీసుదర్శన సూరి **"ప్రపత్తిం వివృణోతి - తస్మాదితి"** అని వివరించగా, శ్రీదేశికులు ఈ శ్లోకం ద్వయమంత్రం పూర్వవాక్యం లోని **"ప్రపద్యే"** అనే పదాన్ని వివరిస్తున్నదని అన్నారు. పెరియవాచ్చాన్‌పిళ్ళైమాత్రం ఈ సందర్భంలో చేసిన విలక్షణమైన వ్యాఖ్యానం అత్యంతం మధురం. సహృదయైకవేద్యం. దానినిగూర్చి సంగ్రహంగా విన్నపింపబడుతున్నది.

శరణాగతిగద్యలో ఇంతకుముందు చూర్ణికలలో శ్రీరామానుజులు శరణు వేడినందులకు అనుతపించి ఈ గీతాసూక్తిద్వారా క్షమను అర్థిస్తున్నారు. ఎవరి అభిప్రాయాను సారం ఈ విధంగా మన్నించమని అడుగుతున్నారు? అని అంటే, తమ అభిప్రాయానుసారమే. ఎందుకు? అంటే, అనాదికాలంగా ఎన్నో అపరాధాలను చేసి అపమార్గంలో చరించిన ఒక స్త్రీ, తన తప్పును గుర్తించి, భర్త నిందకు భయపడే వాడనే కారణంగా, అతని ముందుకు వచ్చి రక్షించమని

అనడంకూడా అపరాధమే కాగలదు. నిజానికి భర్త ముందుకు వచ్చి నిలిచే యోగ్యతనే కోల్పోయినపుడు రక్షించమని అనడంకూడా అపరాధమే కదా! ఆవిధంగానే, **"ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మా"** అని, **"స్త్రీప్రాయ మితరత్ సర్వమ్"** అనే రీతిలో పురుషోత్తముడైన పరమాత్మకు పత్నీస్థానీయుడైన జీవుడు, అపమార్గంలో చరించి, కొంతకాలానికి తాను అనాదిగా చేసిన పలు దోషాలను గ్రహించి, భగవానుని ముందుకు వచ్చి శరణు వేడడం కూడా అపరాధకోటి లోనికే చేరుతుంది. అందువల్ల తాము చేసిన శరణాగతికి క్షమను శ్రీరామానుజులు ఈ సూక్తిద్వారా అర్థిస్తున్నారు.

అయితే, మఱి శరణు వేడడం ఎందుకు? దానికి వగచి క్షమను అర్థించడం ఎందుకు? అంటే, భగవానుడు తప్ప వేఱొకడు తనకు రక్షకుడు కానందువల్ల ఆ స్వామి పాదాలపై పడి రక్షించమని శరణు వేడాలి. శరణు వేడినందుకు క్షమను అర్థించాలి. ఇవి రెండు కర్తవ్యాలే - అనేది ఈ సందర్భంలో పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానసారం.

ఈ రీతిలో పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానించడంలో ఒక విశేషం ఉన్నది. భగవద్రామానుజులు అనుసంధించిన **"తస్మాత్ ప్రణమ్య"** అనే గీతాశ్లోకాన్ని పరిశీలిస్తే, అందులో, ప్రపత్తి చేసిన జీవుని భగవానుడు క్షమించడానికి హేతువులైన మూడు సంబంధాలు ప్రస్తావింపబడ్డాయి. అవి ఏవి? అంటే, **"పితేవ పుత్రస్య"** అనే పితృపుత్రసంబంధం, **"సఖేవ సఖ్యుః"** అనే సఖిసఖా సంబంధం, **"ప్రియుః ప్రియాయాః"** అనే ప్రియప్రియా సంబంధం. ఈ మూడిటిలో- జీవుని అనన్యార్హశేషత్వ, పారతంత్ర్యాలకు అంతరంగమైనది **ప్రియ-ప్రియా** సంబంధమే. ఇదే పతిపత్నీ సంబంధం. ప్రణవంలోని ఉకారం చేత తెలుపబడే సంబంధమే ఇది. ఈ సంబంధవిశేషాన్ని దృష్టిలోపెట్టుకొని పెరియవాచ్చాన్‌పిళ్ళై ఈ చూర్ణికకు అవతారికను అనుగ్రహించారనే విషయం గమనార్హం. **"కణ్ణనుక్కే ఆమదు కామమ్"** అనే రీతిలో ఆళ్వార్లు భగవానుని విషయంలో నాయకీభావాన్ని పొంది పల్కిన అమలినప్రణయ రసాత్మకాలైన మధురోక్తుల స్వారస్యాన్ని, మర్మాన్ని గ్రహించిన భగవద్రామానుజులు గద్యత్రయంలో ఎన్నో సందర్భాలలో ఆళ్వార్ల శ్రీసూక్తుల భావాలను అనువదించారనే విషయాన్ని గ్రహించిన పెరియవాచ్చాన్‌పిళ్ళై, ప్రకృతంలో

శ్రీరామానుజులు ఈ గీతాశ్లోకాన్ని ప్రస్తావించడంలోని ఆంతర్యాన్ని గమనించి, వారి హృదయానికి అనుగుణంగా "ప్రియః ప్రియాయార్హసి" అనే గీతాప్రయోగాన్ని "**ప్రియైయినుడైయ కుఱ్ఱత్తై ప్రియనానవన్ పొఱుక్కుమాపోలవుమ్**" (ప్రేయసి దోషాన్ని ప్రియుడు సహించినట్లుగా) అని వ్యాఖ్యానించడం, ఇక్కడ సంధిని ఆర్షంగా పల్కడం పరమరమణీయం. అయితే, శ్రీరామానుజులు గీతాభాష్యాన్ని అనుగ్రహిస్తూ, "**ప్రియః ప్రియాయ మే**" అని ఈ ప్రయోగానికి విడదీసి, సంధిని ఆర్షంగా గ్రహించకుండా వ్యాఖ్యానించారు కదా!- అని కొందరు సందేహపడవచ్చు. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమంటే, వ్యాఖ్యాత, వక్తృహృదయగత భావాన్ని కదా వివరించాలి. అర్జునుడు ఈ మాటను పలికేటపుడు, భగవానునిపట్ల మనస్సులో నాయకీభావం కల్గినవాడు కాదు కనుక, శ్రీరామానుజులు అతని అభిప్రాయానుసారంగా వ్యాఖ్యానించారు. కాని, శ్రీరామానుజులు, ఆళ్వార్ల క్రమాన్ని ఆదరించి, అనుసరించే హృదయం కలవారు కనుక, వారు ఈ సూక్తిని ప్రకృతంలో అనుసంధించేటపుడు ఈవిధమైన నాయకీనాయకభావం వారి హృదయగమై ఉంటుంది- అని అనడంలో ఏవిధమైన సందేహం లేదు కనుక, శ్రీరామానుజుల ఆశయాన్ని గమనించిన పెరియ వాచ్చాన్‌పిళ్ళై ఈవిధంగా వ్యాఖ్యానాన్ని అనుగ్రహించడం సముచితం, స్పృహణీయంకూడా.

ఈవిధంగా పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానించిన క్రమాన్ని పలువురు తదనంతర ఆచార్యులు ఆదరించి, అనుసరించారు. శ్రీపిళ్ళైలోకాచార్యులవారు శ్రీవచన భూషణంలోని సిద్ధోపాయనిష్ఠాప్రభావంలో "**సర్వాపరాధజ్ఞనుక్కుమ్ ప్రాయశ్చిత్తమాన ప్రపత్తితానుమ్ అపరాధకోటియిలేయాయ్, క్షామణమ్ పణ్ణవేణ్డుమ్బడి నిల్లానిన్ఱదితే**" (146) అని, "**నెడునాళ్ అన్యపరైయాయ్ ప్పోన్ద భార్యై లజ్జాభయజ్ఞళ్ ఇట్టిక్కే భర్తృసకాశత్తిలే నిన్ఱు, "ఎన్నై అఙ్గీకరిక్కవేణుమ్" ఎన్ఱు అపేక్షిక్కుమాపోలే యిరుప్పదొన్ఱితే ఇవన్ పణ్ణుమ్ ప్రపత్తి**" (147) అని సూత్రీకరించడం, ఈ సూత్రాలను "**పొయ్యిలాద**" మణవాళమహాముని "**త్వత్పాదారవిందయుగళం శరణమహం ప్రపద్యే- ఎన్ఱు పణ్ణియరుళిన భాష్య కారరుక్కు, స్వపూర్వవృత్తత్తై అనుసంధిత్తవాతే అతుతానుమ్ అపరాధకోటి యిలేయాయ్, "త్వమేవ మాతా చ" ఎన్ఱు తొడఙ్గి ఇత్తలైయిల్ అపరాధత్తై

ప్పొఱుక్కైక్కుఱుప్పాన బంధవిశేషఙ్గళై ఎల్లామ్ విణ్ణప్పమ్ శెయ్దుకొణ్డు, "**తస్మాత్ ప్రణమ్య**" ఇత్యాదియాలే ఇప్పడి తిరుమున్బే కూశామల్ వన్ద నిన్ఱ ప్రపత్తి పణ్ణిన ఇవ్వపరాధత్తై ప్పొఱుక్కవేణుమ్ - ఎన్ఱ క్షామణమ్ పణ్ణవేణ్డుమ్బడి నిల్లానిన్ఱతితే -ఎన్ఱె" (నీ పాదారవింద యుగళాన్ని శరణు పొందుతున్నాను- అని ప్రపత్తిని చేసిన శ్రీభాష్యకారులకు తమ పూర్వవర్తనను స్మరించగానే తాము చేసిన ప్రపత్తికూడా అపరాధంగా తోచింది. అపుడు "**త్వమేవ మాతా చ**" అని ఆరంభించి, జీవుడు (తాము) చేసిన అపరాధాలను సహించడానికి తగిన సంబంధవిశేషాలను అన్నిటిని విన్నపిస్తూ, "**తస్మాత్ ప్రణమ్య**" ఇత్యాది సూక్తిద్వారా, "ఈ విధంగా సమక్షంలో ఏమాత్రం జంకకుండా వచ్చి నిలచి ప్రపత్తి చేయడమనే ఈ అపరాధాన్ని సహించాలి''- అని క్షమను అర్థించ వలసినట్లుగా ఉంటుంది కదా- అని భావం. అందువల్ల, ఈ రీతిలోకూడా, ఇది- అంటే- ప్రపత్తి చేయడం అపరాధకోటిలోనికి చేరుతుంది- అని భావం. అనాదికాలంగా అపరాధాలను చేసి, తరువాత, ఒకనాడు ఆభిముఖ్యాన్ని ప్రదర్శించినవాడైనా, "**రిపూణామపి వత్సలః**" (శత్రువులపట్ల కూడా వాత్సల్యాన్ని కలవాడు), "**యది వా రావణః స్వయమ్**" (సాక్షాత్తురావణుడు వచ్చినా క్షమిస్తాను) అనే రీతిలో ఉండే భగవానుని మనస్సును చూస్తే, అతడు గ్రహించడంలో ఏ కొఅతలేదు. ఆవిధంగా ఉన్నా, తను పూర్వవృత్తాంతాన్ని గమనిస్తే, ఇతడు (శరణాగతుడు) తాను చేసిన ప్రపత్తిని అపరాధంగానే తలచి క్షమను అర్థించవలసినట్లుగా కదా ఉంటుంది) అని, "**ఇవన్ పణ్ణుమ్ ప్రపత్తి స్వపూర్వ వృత్తాంతత్తై అనుసంధిత్తాల్ అపరాధకోటియిలేయాయిరుక్కుమెన్నుమత్తై దృష్టాంతముఖేన దర్శిప్పిక్కిఱార్మేల్ (నెడునాళ్) ఎన్ఱు తొడఙ్గి. అతావతు- నెడుమ్ కాలమ్ భర్తావోడు అట్టఱ్ఱు, పరపురుషగామినియాయ్, తన్నిగ్రహ పాత్రమాయ్ ప్పోన్దాళొరు భార్యై, "ఇప్పడిపట్ట నామ్ శెయ్దు తిరిన్దతెల్లామ్ కణ్డిరుక్కిఱవన్, ఇప్పోదు నమ్మై వన్ద ఇప్పడి అపేక్షిప్పదే!" ఎన్ఱు దండిక్కిల్ శెయ్యవదెన్? ఎన్నుమ్ భయముమిన్ఱిక్కే, అవన్ మున్బే శెన్ఱు నిన్ఱు "ఎన్నై యఙ్గీకరిక్కవేణుమ్" ఎన్ఱు అపేక్షిక్కుమళవిల్ ఎత్తనై అపరాధముణ్డు- అప్పడియే యిరుప్పదొన్ఱితే, భగవదనన్యార్హనాయ్వైత్తు, అనాదికాలమ్ అవనుడన్ పఱ్ఱిన్ఱిక్కే అన్యపరనాయ్ ప్పోన్ద ఇవన్, స్వపూర్వ వృత్తాంతానుసంధానత్తాల్ వరుమ్ లజ్జైయుమ్, "స్వతంత్ర నాన అవన్ దండిక్కిల్ శెయ్వదెన్?" ఎన్నుమ్

భయముమిట్టిక్కే, తత్సన్నిధియిలే శెన్ఱు నిన్ఱు తన్నై యఱిక్కవేణుమ్ ఎన్ఱు పణ్ణుకిఱ శరణవరణమ్- ఎన్ఱె" (ప్రపన్నుడు చేసే ప్రపత్తి, తన పూర్వవర్తనను స్మరిస్తే, అపరాధంగా తోస్తుంది - అనే విషయాన్ని దృష్టాంతం ద్వారా తెలుపుతున్నారు ఇకపై- **("నెడునాళ్)** - అని ఆరంభించి, అంటే - చిరకాలం భర్తతో సంబంధం లేకుండా, ఇతర పురుషులతో సంచరించిన స్త్రీ, భర్తనిగ్రహానికి ఏమాత్రం జంకకుండా పోయి నిలుపడం ఏమి సబబు?'' అనే లజ్జను, "ఇంతకాలంగా నేను చేసిన పనులను, వర్తనను అంతటినీ గమనించినవాడు'' ఇపుడు నా దగ్గరకు ఈ విధంగా వచ్చి అపేక్షిస్తున్నదే!'' అని నిగ్రహించి దండిస్తే ఏమి చేయాలి?'' అనే భయం లేకుండా, అతని ముందుకు వచ్చి నిలచి, "నన్ను స్వీకరించాలి'' అని అపేక్షిస్తే, ఎంత అపరాధమో, అటువంటిదే కదా, భగవానునిపట్ల అనన్యార్హశేషత్వాన్ని కల్గి, అనాది కాలంగా అతనితో సంబంధం లేకుండా అన్యపరుడై సంచరించిన జీవుడు, తన పూర్వవృత్తాంతాన్ని అనుసంధించినందువల్ల కలిగే సిగ్గును, స్వతంత్రుడైన భగవానుడు దండిస్తే ఏం చేయాలి? అనే భయాన్ని లేకుండా, అతని సమక్షానికి పోయి నిలచి, తనను అంగీకరించాలని చేసే ప్రపత్తికూడా - అని భావం) అని వ్యాఖ్యానించడం స్మరణీయం. ఈ సూత్రవ్యాఖ్యానాలు రెండు పెరియవాచ్చాన్‌పిళ్ళై గద్యత్రయ వ్యాఖ్యాన సూక్తులను శబ్దతః, అర్థతః అనువదిస్తున్నవి - అనే విషయం సుస్పష్టం.

ఈ సందర్భంలో శ్రీవరవరమునులవ్యాఖ్యాన శ్రీసూక్తిద్వారా వ్యక్తమయే ఒక అర్థవిశేషాన్ని కూడా గమనించాలి. శ్రీవరవరముని వ్యాఖ్యలోని- **"భాష్యకారర్‌క్కు స్వపూర్వవృత్తాంతత్తై అనుసంధిత్తవాత్తే, అతుతానుమ్ అపరాధకోటియిలేయాయ్, "త్వమేవ మాతా చ" ఎన్ఱు తొడఙ్గి 'ఇత్తలైయిల్ అపరాధత్తై ప్పాఱుక్కైక్కు ఉఱుప్పాన అర్థవిశేషఙ్గళెల్లామ్ విణ్ణప్పమ్ శెయ్తుకొణ్డు"** అనే శ్రీసూక్తినిబట్టి ఈ క్షామణం **"త్వమేవ మాతా చ"** అనే 7వ చూర్ణికనుండే చేయబడినదని తెలుస్తున్నది.

అణ్ణావప్పంగార్ (వాధూల వీరరాఘవాచార్యస్వామివారి) అరుంబదంలో- **"దేవాపి (దేవాఃఅపి) మార్గే ముహ్యంతి", "దేవాపి (దేవాఃఅపి) యం న పశ్యంతి"** అనే ఆర్షప్రయోగాలలో వలె ప్రకృతంలో కూడా **"ప్రియాయాఃఅర్హసి-ప్రియాయార్హసి"** అనే రూపం సిద్ధించడం ఆర్షంగా ఉపపన్నమేనని అంటూ పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యాన క్రమం సమర్థింపబడింది.

ప్రకృతంలో ఇంకొక సూక్ష్మమైన, అత్యంతం మధురమైన, సాంప్రదాయిక మైన అర్థవిశేషం కూడా గమనించాలి. వేదపురుషుడు **"నాయమాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా న బహునా శ్రుతేన, యమేవైష వృణుతే తేన లభ్యః"** అని అంటూ జీవుడు భగవానుని వరించడమనే స్వగతస్వీకారం ఉపాయం కాదని, భగవానుడు జీవుని వరించడమనే పరగతస్వీకారమే ఉపాయమని తెలిపాడనేది తెన్నాచార్య సంప్రదాయసిద్ధమైన అంశం. **"చితః పరమచిల్లాభే ప్రపత్తిరపి నోపధిః, విపర్యయే తు నైవాస్య ప్రతిషేధాయ పాతకమ్"** (జీవుడు పరమాత్మను పొందడంలో ప్రపత్తి కూడా ఉపాయం కాబోదు. ఆ పరమాత్మ జీవుని అనుగ్రహించదలచినపుడు మాత్రం జీవుని పాపం కూడా అడ్డు కాబోదు) అనే ప్రమాణం దీనిని దృఢీకరిస్తున్నది. భరతుడు శ్రీరామునివద్ద చేసిన శరణాగతి ఫలించకపోవడం, **"ఏళ్తై ఏదలన్ కీళ్ మకన్"** అనే రీతిలో జన్మవృత్తాలలో చాలా తక్కువవాడైన గుహుని శ్రీరాముడు అనుగ్రహించడం- అనే రెండు దీనికి ఉదాహరణాలని పూర్వాచార్యాభిప్రాయం. అందువల్ల జీవుడు చేసిన ప్రపత్తి శరణ్యుడైన భగవానుని హృదయానుగుణం కాకపోతే అది ఉపాయం కాకపోవడమే కాదు, అది అపరాధంగానే పర్యవసిస్తుంది. ఇంతేకాదు, జీవుని పూర్వవృత్తాన్ని గమనిస్తే కూడా, అతడు చేసిన ప్రపత్తి ఉపాయం కాబోదు, అపరాధంగానే లెక్కింపబడే అవకాశం ఉన్నది. దీనిని సూచించడంకోసమే శ్రీరామానుజులు తాము ప్రపత్తి చేసిన వెంటనే, అపరాధ క్షామణాన్ని ప్రార్థించారు. అందువల్ల శ్రీరామానుజులు ఈవిధంగా క్షమను అర్థించడం ప్రపత్తియొక్క అనుపాయత్వసూచకం, పరగతస్వీకారమే ఉపాయమనే విషయానికి సూచకమని గ్రహించాలి. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొనియే పెరియవాచ్చాన్‌పిళ్ళై శ్రీభాష్యకారులు చేసిన క్షామణాన్ని వివరించారు. దానిని శ్రీవచనభూషణ వ్యాఖ్యలో శ్రీవరవరమునులు ప్రమాణంగా ఉదాహరించారు. శ్రీవరవరమునుల కంటే ఇంకొకరు యతిపరుల మనోగతాన్ని గుర్తించ గల్గినవారెవరుంటారు?

భగవద్భాష్యకారులు చేసిన ఈ క్షామణాన్నిగూర్చిన విచారణ శ్రీవచన భూషణమీమాంసాభాష్యంలో ఈ క్రింది రీతిలో చాలా విస్తృతంగా చేయబడింది. స్వగతస్వీకారాన్ని అపరాధంగా పల్కడం తగదు. ఎందుకంటే, స్వగతస్వీకారం (ప్రపత్తి) ఎక్కడా నిషేధింపబడలేదు కనుక, ప్రపత్తి చేసిన తరువాత ప్రాయశ్చిత్తాన్ని అనుష్ఠించాలని ఎక్కడా చెప్పబడలేదు; సరికదా; **"తస్మాన్న్యాసమేషాం తపసా మతిరిక్త మాహుః"** అని అంటూ ప్రపత్తి సర్వాపరాధాలకు ప్రాయశ్చిత్తంగా విధింపబడింది కనుక. శ్రీరామానుజులు ప్రపత్తి చేసిన తరువాత క్షమను అర్థించినంతమాత్రంలో, ఆ క్షామణ ప్రార్థనవల్ల, ప్రపత్తి- అపచారంలోకి అన్వయిస్తుందనే అర్థం ఏర్పడడంలేదు అందువల్ల, వారు ఆవిధంగా క్షమను అర్థించడం వేఱొక అభిప్రాయంతో చేసి ఉండవచ్చు. కాబట్టి- స్వగత స్వీకారమనబడే ప్రపత్తి అపరాధం కాబోదు - అనేది పూర్వపక్షవాదం. ఇక, దీనికి సిద్ధాంతపక్షంలో సమాధానం ఏమంటే- స్వగత స్వీకారం అపచారమే. ఎందుకంటే ప్రపత్తిని అనుష్ఠించినవెంటనే భాష్యకారులు క్షమను అర్థించారు కనుక. ఆ క్షమాప్రార్థనను ప్రాయశ్చిత్తరూపంగా అన్వయించుకోవడంలో ఏ అర్థబాధ లేదు కాబట్టి అది అన్యాభిప్రాయం కాదు. అంతేకాక, **"ప్రియః ప్రియాయార్హసి"** అని లౌకికమైన వ్యభిచారిప్రార్థనా దృష్టాంతాన్ని పల్కడంకూడా ప్రపత్తి అపరాధకోటి లోనికి అన్వయిస్తుందని తెల్పుతుంది. ప్రపత్తి నిషేధింప బడలేదు కదా! -అని అనడం కూడా తగదు. ఎందుకంటే, **"సర్వధర్మాన్ పరిత్యజ్య"** అనే సూక్తిలోని ధర్మశబ్దంయొక్క అర్థంలో స్వగతస్వీకారం కూడా అంతర్భవిస్తుంది కనుక, అదికూడా నిషేధింపబడినదే అయినది. అంతేకాదు, **"సర్వధర్మాన్"** అనే చరమశ్లోకానికి అవ్యవహితంగా ముందున్న శ్లోకంలో **"మన్మనా భవ"** అని అంటూ స్వగతస్వీకారం విధింపబడినందున, తదనంతరశ్లోకమైన చరమశ్లోకంలోని ధర్మశబ్దంచేత అసంకోచాత్ స్వగతస్వీకారరూపమైన ఉపాయంకూడా తెలుపబడి, **"పరిత్యజ్య"** అని అనడం ద్వారా నిషేధింపబడింది. "స్వగతస్వీకారం ఉపాయంగా విధింపబడినది కనుక అది నిషేధింపబడినదని చెప్పడం వీలు కాదు''- అనికూడా అనలేము. పూర్వం విహితాలైన కర్మయోగాదుల వలె ప్రపత్తికూడా అనిష్టఫలాన్ని ఇస్తుందని చెప్పే అవకాశం ఉన్నది. కనుక నిషేధింపబడింది. వాస్తవానికి, విధివాక్యాలలో వినబడే ఫలంకంటే మించిన

వేఱొక తాత్పర్యం శాస్త్రవాక్యాలకు ఉన్నది. అది ఏమంటే - జీవుని అత్యంత పారతంత్ర్యాన్ని స్థాపించడంలోనే శాస్త్రతాత్పర్యం. అందువల్ల స్వగతస్వీకారం, ఉపాయాంతరాల వంటిదే కనుక, దానివల్ల అపాయం కలుగదు- అని అనడం కూడా సాధ్యం కాదు - అని ఈవిధంగా చాలా విశదంగా శ్రీవచనభూషణ మీమాంసాభాష్యంలో ఈ అంశం విచారింప బడింది. చివరలో ఈ విషయాలను అన్నిటినీ క్రోడీకరించే కారికాశ్లోకాలుకూడా ఈరీతిలో తెలుపబడ్డాయి. **"గోప్తృత్వవరణం గోప్తృహృదయాననుసారి చేత్, అపరాధస్య కోటౌ స్యాత్, తద్ద్వారా ప్రార్థనావిధిః, యదా అతదనుసారి స్యాత్ ఆత్మనాశః ఫలం భవేత్, ప్రాపకాంతరతుల్యత్వం షడంగస్య హి విద్యతే"** అనేవి ఆ కారికలు. అణ్ణప్పంగార్ అరుంబదంలో కూడా ఈ విషయాన్ని గూర్చి చాలా వివరంగా పూర్వపక్షసిద్ధాంత వాదరూపంగా విచారింపబడింది. విస్తరభయం వల్ల అది ప్రస్తావింపబడలేదు.

అయితే ప్రపత్తిని చేయడం ఎందుకు? వెంటనే క్షమను అర్థించడం ఎందుకు? అంటే ప్రపత్తిని అనుష్ఠించడం ఉపాయకోటిలోనికి అంతర్భవించక పోయినా, అధికారివిశేషణంగా అన్వయిస్తుంది కనుక ప్రపత్తిని అనుష్ఠించాలి. తన పూర్వవృత్తాంతాన్ని స్మరించినా క్షమను అర్థించవలసి ఉంటుంది. ఇది దివ్యసూరిసూక్తి సిద్ధం. పూర్వాచార్యానుష్ఠాన సమ్మతంకూడా. నమ్మాళ్వార్లు తిరువాయ్‌మొళి ప్రబంధం రెండవ శతకంలోని మూడవ దశకంలో **"ఎనదావి తన్నొళిన్దేన్ ఇని మీళ్వదెన్బదుణ్డే"** అని శరణాగతిని చేసి, వెంటనే **"ఎనదావి యావియుమ్ నీ, పొళిలేళుముణ్డ ఎన్దాయ్! ఎనదావియార్? యానార్? తన్నై నీ కొణ్డాక్కినైయే"** అని అంటూ తాము చేసిన ప్రపత్తికి అనుతాపాన్ని ప్రదర్శించారు. ఆళవందార్‌కూడా **"అహ మద్యైవ మయా సమర్పితః"** అని పల్కి **"అథవా కిం ను సమర్పయామి తే"** అని అన్నారు. మఱుశ్లోకంలో **"మమ నాథ! యదస్తి యోఽస్మహం సకలం తద్ధి తవైవ,... అథవా కిం ను సమర్పయామి తే"** అని పశ్చాత్తాపాన్ని తెలిపారు - అనే విషయాన్ని శ్రీదేశికులు రహస్యత్రసారంలోని సాంగప్రపదనాధికారంలో పలికారు. అందువల్ల, సంసారభీతితో ఆత్మసమర్పణాన్ని చేయడం, తన స్వరూపాన్ని గమనించి దానికి అనుతాపాన్ని పొందడం రసికకృత్యం, స్వరూపానురూపంకూడా.

ప్రపన్నుడు చేసిన ప్రపత్తి, అతని స్వరూపాన్ని గమనిస్తే, అపరాధకోటిలోనికి చేరుతుంది- అనే విషయాన్ని తెలిపే వేదోపబృంహణ వాక్యాలను కూడా **"యస్యాస్మి", "స్వత్మమాత్మని సంజాతం స్వామిత్వం బ్రహ్మణి స్థితమ్"** ఇత్యాది ప్రమాణాల ద్వారా ఆత్మలన్నీ భగవానుని సొత్తు అని, వాటిని సొత్తుగా కల్గిన స్వామి భగవానుడని తెలుస్తున్నది. అందువల్ల శరణవరణరూపమైన ప్రపత్తిని చేయడం తన సొత్తు కాని ఆత్మను తనదిగా భావించినపుడే సంభవం కనుక అది ఆత్మాపహారదోషంగా పర్యవసించే అవకాశం ఉన్నందున, ప్రపత్తి చేసిన వెంటనే అనుతపించి, క్షామణాన్ని అర్థించడం కూడా తగినదే. దీనిని శ్రీరామాయణంలోని సీతారామ కల్యాణ సందర్భంలోగల **"ఇయం సీతా"** ఇత్యాది శ్లోకం సూచిస్తున్నదని అభిజ్ఞుల సూక్తి. ఆచార్య స్థానీయుడైన జనకుడు ఆత్మస్థానీయురాలైన సీతాదేవిని సమర్పిస్తూ **"ప్రతీచ్ఛ చైనామ్"** అని శ్రీరామునితో అనడం శరణ వరణ రూపమైన ప్రపత్తియే. ఆ విధంగా తన కూతురుకాని సీతను తన కూతురుగా భావించి జనకుడు అర్పించడం, ఆర్తులైన ఆళ్వార్లు తన సొత్తుకాని ఆత్మను తనసొత్తుగా భావించి అర్పించడంవంటిదే- అని, వెనువెంటనే జనకుడు **"భద్రం తే"** అని అంటూ క్షామణాన్ని ప్రార్థించి, **"పాణిం గృహ్ణీష్వ పాణినా"** అని అంటూ అభయ ప్రదానాన్ని అర్థించడం - ప్రపత్తి చేసిన తర్వాత ఆళ్వార్లు అనుతాపాన్ని పొంది **"ఎనదావి యార్? యాన్ ఆర్?"** అని అంటూ క్షామణాన్ని అర్థించడంవంటిదే అని కాంచీమహావిద్వాన్ శ్రీమాన్ అణ్ణంగరాచార్య స్వామివారు **"ఆళ్వార్ పెణ్మైయిన్ తత్తువమ్"** అనే వ్యాసంలో తెలియజేశారు. ఇదేవిధంగా శ్రీకృష్ణ చరమ శ్లోకంలో కూడా, పూర్వార్ధం స్వగతస్వీకారపరంగా, ఉత్తరార్ధం పరగతస్వీకారపరంగా అన్వయించి అర్థాన్ని చెప్పడంలో గల స్వారస్యం గమనించదగినది.

ఈ సందర్భంలో, శ్రీవాధూల వీరరాఘవాచార్య స్వామివారు (అణ్ణవప్పం గార్) తమ శ్రీవచనభూషణ అరుంబదంలో ప్రస్తావించి, పరిహరించిన ఒక సందేహం ప్రస్తావింపబడుతున్నది.

భగవద్భాష్యకారులు శేషావతారసంభూతులు కదా! వీరికికూడా పూర్వవృత్తం ఒకటి ఉన్నదని, దానిని వారు పర్యాలోచించి "ప్రపత్తికూడా అపరాధకోటిలో అంతర్భవించింది" అని భావించారని అనడం ఉచితమా?

అనేది ఆ సందేహం. దీనిని, తమకు తరువాతివారుకూడా ఈరీతిలో అనుష్ఠించడం కోసంగా తమ అవతార సత్యత్వంకోసం శ్రీభాష్యకారులు ప్రపత్త్యనుష్ఠానాన్ని ఈవిధంగా భావించారు అంతే - అని చెప్పాలి - అని సమాధానించవచ్చు. ఈవిధంగా శ్రీభాష్యకారుల ప్రపత్తి భావనామాత్రమే అయితే, వారికి శ్రీరంగనాథుడు వరప్రదానాన్ని చేయడంకూడా భావనామాత్రమే కావలసి వస్తుంది. అపుడు **"ఉక్త్వా ధనంజయవిభీషణలక్ష్యయా తే ప్రత్యాయ్య లక్ష్మణమునేఃభవతా వితీర్ణామ్, శ్రుత్వా పరం తదనుబంధిమదావలిప్తే నిత్యం ప్రసీద భగవన్! మయి రంగనాథ !"** అని శ్రీవేదాంతదేశికులు న్యాసతిలకంలో పల్కడం, **"ఇన్ద అరజ్గత్తినితిరు నీ ఎన్దరజ్గరెన్ద యెతిరాశర్ క్కిన్ద వరమ్ శిన్దైశెయ్యిల్ నమ్మదన్దో!"** అని **"సా చ త్వయైవ కమలారమణేఽర్థితా యత్ క్షేమ స్య ఏవ హి యతీంద్ర! భవచ్ఛ్రితానామ్"** అని మణవాళమహామునుల శ్రీసూక్తి విరుద్ధార్థకాలే కాగలవు. అవి ఆవిధంగా కాకుండా ఉండాలంటే, శ్రీభాష్యకారులు చేసిన ప్రపత్తి పారమార్థికం (వాస్తవం) అయిఉండాలి. మఱి అది ఏవిధంగా? అంటే- తమ సంతానం చేసిన అపరాధాలను, వారితో తమకు ఉండే సంబంధం కారణంగా తల్లిదండ్రులు తాము యజమానిని ప్రార్థించి క్షమింపజేసినట్లుగా, శ్రీభాష్యకారులుకూడా అస్మదాదులతో తమకు ఉండే సంబంధాన్ని అనుసంధించినందువల్ల, మన దోషాలను అన్నిటినీ, తమ తలపై ఆరోపించుకొని భగవానుని సన్నిధిలో ప్రార్థించి క్షమను అర్థించారు కనుక, వారు చేసిన ప్రపత్తి వాస్తవమేనని చెప్పాలి.

ఆవిధంగా అయితే, **"మాయాం దాసభూతఃశరణాగతోఽస్మి తవాఽస్మి దాస ఇతి వక్తారం మాం తారయ"** అని అనవచ్చునా? **"తవాస్మి దాసఃఇతి వక్తారం మాం ప్రతి మదీయాన్ మాయాం తారయ"** (నాకు చెందినవారిని తరింపజేయాలి) అని కదా పలకాలి -అని అంటే, భాష్యకారులు పల్కిన **"మామ్"** అనే పదంలో అస్మదాదులుకూడా అంతర్భవిస్తారు కనుక, ఏవిరోధం లేదు. అది ఏవిధంగా? అంటే, ఒక గృహస్థుని ఒకడు, "నీకు ఒక దినానికి ఎంత ధాన్యం వ్యయమవు తుంది?" అని అడిగితే, తన పోషణలో ఉండే అందఱిని కలుపుకొని అతడు "నాకు ఒకనాటికి ఒక కుంచం ధాన్యం వ్యయమవుతుంది" అని పలికే వ్యవహారం ఉన్నది కదా! అదే రీతిలో ఇక్కడకూడ

"మామ్" అనే పదంలోనే తమ అభిమానంలో ఒదిగి ఉండే మనలను అందజేని చేర్చుకొని పలికారు, కనుక ఏవిధమైన అర్థవిరోధం లేదని గమనించాలి.

ఇటువంటి పలురస్యరహస్యార్థ రత్నాలు ఎన్నో గూఢంగా పెరియ వాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానంలో గోచరిస్తాయి.

శరణాగతిగద్యలో శ్రీరామానుజులు **"పరభక్తియుక్తం మాం కురుష్వ"** మొదలైన వాక్యాలద్వారా భక్తినే ప్రార్థించినందున గద్యత్రయంలో భక్తిమోక్షోపాయంగా ప్రతిపాదింపబడిందని కొందఱు అభిప్రాయపడతారని, అది సరి కాదని అంటూ **మహావిద్వాన్ కిడాంబిగోపాలకృష్ణమాచార్యస్వామివారు "శ్రీగద్యత్రయస్య ప్రపత్త్యుపాయ పరత్వమ్"** అనే సంస్కృతవ్యాసంలో ఆ వాదాన్ని సహేతుకంగా సోదాహరణంగా నిరసించారు. శ్రీభాష్యకారులు గద్య ప్రబంధంలో ప్రార్థించిన భక్తి, శ్రీభాష్యంలో ఆ ఆచార్యవర్యులు మోక్షోపాయంగా నిర్ణయించిన సాధనభక్తి కాదు. ఎందుకు? అంటే శ్రీరామానుజులు గద్యప్రారంభంలో ప్రపత్తినే తమకు అభిమతమైన మోక్షానికి ఉపాయంగా అనుష్ఠించారు కదా! వారిచే ప్రార్థింపబడిన భక్తిని ఉపాయంగా పల్కడం స్వానుష్ఠానవిరుద్ధం. గద్యలలో వారిచే అర్థింపబడిన భక్తి, భోజనానికి ఉపయోగించే ఆకలివలె, కైంకర్యరుచిరూపమైనది. తప్ప ఉపాయరూపమైన భక్తికాదు. ప్రపత్తి నిష్ఠలు కూడా అష్టాక్షరిలోని **"నారాయణాయ"** అనే పదంలోని వ్యక్తచతుర్థిద్వారా, ద్వయం ఉత్తరవాక్యంలోని చతుర్థిద్వారా ప్రార్థింపబడేది, కైంకర్యోపకరణ రూపమైనది, రుచిరూపమైనది అయిన భక్తిని అర్థిస్తారు. ఈ భక్తి ప్రపన్నుని స్వరూపంలో అంతర్భవిస్తుంది. భక్తి **"స్వరూపత్తిలే పుకుమ్"** అనికదా శ్రీవచనభూషణసూక్తి. అందువల్లనే, ప్రపన్నాగ్రేసరులు, శ్రీభాష్యకారులకు పరమాచార్యులైన యామునదేశికులు కూడా **"భగవన్ ! భక్తిమపి ప్రయచ్ఛ మే"** అని అర్థించారు. కనుక ఆ భక్తి కైంకర్యరుచిరూపమైనది అనే విషయం నిర్వివాదం.

ఇంతేకాక, గద్యత్రయంద్వారా ద్వయమంత్రాన్ని వివరించడానికి ప్రయత్నించిన శ్రీభాష్యకారులు **"అఖిలహేయ ప్రత్యనీక"** అని ఆరంభించి **"దేవ! సోఢుమ్"** అనే పర్యంతం పూర్వవాక్యాన్ని వివరించి, తరువాత ఉత్తర వాక్యవివరణాన్ని ఆరంభించి, **"అగ్నిహోత్రం జుహోతి యవాగూన్ పచతి"** అనే

శ్రుతివాక్యాలలో వలె, పాఠక్రమంకంటే అర్థక్రమం బలీయమైనది కనుక, ద్వయం ఉత్తరవాక్యంలో **"శ్రీమతే నారాయణాయ"** అని కైంకర్య ప్రార్థనముందుగా తెలుపబడినా, ఆ కైంకర్యానికి సంభవించే విరోధుల నివృత్తిని ప్రతిపాదించేది, వాక్యంలో కైంకర్యప్రార్థనకు తరువాత ఉపాత్తమైనది అయిన నమఃశబ్దం యొక్క అర్థాన్ని ముందుగా **"మనోవాక్కాయైః"** అని ఆరంభించి, **"మాం తారయ"** అనే పర్యంతం గల వాక్యాలలో విశదీకరించారు. తరువాత, పరమపురుషార్థ రూపమైన కైంకర్యానికి ఉపయోగించే పరభక్తి - పరజ్ఞాన పరమభక్తులను కూడా **"పురుష స్స పరః"** ఇత్యాది రెండు వాక్యాలద్వారా ప్రార్థించినవారై, వాటికి పూర్వభావి అయిన అనన్యప్రయోజనమైనది **"తేషాం జ్ఞానీ నిత్యయుక్తః"** ఇత్యాది గీతా వచనాలు మూడిటిలో తెలుపబడినది అయిన జ్ఞానం తమకు కలగాలని **"తేషాం జ్ఞానీ నిత్యయుక్తః"** ఇత్యాదిగా అర్థించారు. ఈవిధమైన, అనన్యప్రయోజనమైన జ్ఞానం కల్గినవారికి సిద్ధించేవి, **"పురుష స్సపరః పార్థ! భక్త్యా లభ్య స్త్వనన్యయా"**, **"భక్త్యా త్వనన్యయా లభ్యః"**, **"మద్భక్తిం లభతే పరామ్"** అనే మూడుచోట్ల తెలుపబడినవి అయిన పరభక్తి పరజ్ఞాన పరమభక్తులను ప్రార్థించారు. తరువాత, ఆ పరభక్త్యాదులు కల్గిన పిమ్మట ప్రీతికారితమైన, పరమపురుషార్థ రూపమైన కైంకర్యాన్ని **"పరభక్తి పరజ్ఞాన"** ఇత్యాదిగా **"నిత్యకింకరో భవాని"** అనే పర్యంతంగల వాక్యంలో అర్థించారు. ఇందువల్ల శ్రీభాష్యకారులు **"పరభక్తి యుక్తం మాం కురుష్వ"** అని భక్తిని ప్రార్థించినా, అది కైంకర్యరుచిరూపమైనది, స్వరూపంలో అంతర్భవించేది కనుక, అది ఉపాయభక్తి కాదు. కనుక శరణాగతిగద్యకు భక్త్యుపాయపరత్వం లేదు. రెండవది అయిన శ్రీరంగగద్యం శరణాగతిగద్యతో సమానార్థకమైనది కనుక అందులో కూడా భక్తి ఉపాయంగా తెలుపబడలేదు. ఇంతేకాక, అందులో **"శ్రీమన్! నారాయణ! తవ చరణారవిందయుగళం శరణమహం ప్రపద్యే"**- అని అంటూ ప్రపత్తియే అనుష్ఠింపబడింది. చివరలో కూడా **"అపార కరుణాంబుధే!"** అని ఆరంభించి **"మమ నాథ! నమోఽస్తు తే"** అనే పర్యంతం కైంకర్యప్రార్థనా పూర్వకంగా ప్రపత్తియే అనుష్ఠింపబడింది. మూడవది అయిన శ్రీవైకుంఠగద్యలో కూడా మిగిలిన రెండు గద్యలవంటిదే. అందులో కూడా **"తత్పాదాంబుజ ద్వయప్రపత్తేః అన్యన్న మే కల్పకోటిసహస్రేణాపి సాధన మస్తీతి**

మన్వానః" అని అంటూ ప్రపత్తియే భగవత్ప్రాప్తికి సాధనమని అనుసంధింప బడింది. అందువల్ల గద్యత్రయం భక్త్యు పాయపరం కాదు - అనేది శ్రీమాన్ గోపాలకృష్ణమాచార్యస్వామివారి వ్యాస సారాంశం.

ఇక, శ్రీవైకుంఠస్తవం ఆరంభంలో గల **"యామునార్యసుధాంబోధి మవగాహ్య యథామతి, ఆదాయ భక్తియోగాఖ్యం రత్నం సందర్శయామ్యహమ్"** అనే శ్లోకాన్ని గూర్చి విచారిస్తూ, శ్రీమాన్ గోపాలకృష్ణమాచార్యస్వామివారి ఈవిధంగా అన్నారు- "ఈ శ్లోకంలోని భక్తియోగశబ్దం స్వయంప్రయోజన రూపమైన భగవదనుసంధాన పరమని శ్రీవేదాంతదేశికులచేత వ్యాఖ్యానింపబడి నందున, ఈపదం ఉపాయభక్తిని తెలుపదు. కనుక దీనివల్ల కూడా గద్యత్రయం ఉపాయభక్తిపరం కాదని తెలుస్తున్నది. అంతేకాక, ఈ శ్లోకం శ్రీభాష్యకారులచే రచింపబడినది కాదు- అనే ఒక సంప్రదాయం ఉన్నది, మిగిలిన రెండు గద్యల ఆరంభంలోని **"వందే వేదాంతకర్పూర"** ఇత్యాది శ్లోకం, **"చిదచిత్ పరతత్త్వానామ్"** అనే శ్లోకంకూడా శ్రీభాష్యకారులచే అనుగ్రహింపబడలేదు. అందువల్ల ఈ శ్లోకాలు రెండు కొంతమంది అనుసంధానంలో లేవు కనుక, మూడవ గద్య ఆరంభంలోని **"యామునార్యే"**తి శ్లోకంకూడా ఇటువంటిదే. మఱి, ఈ శ్లోకాలు ఆయా గద్యల ముందు ఎందుకు నిబంధింపబడ్డాయి? అంటే, వక్తృవైలక్షణ్యాన్ని ఆలోచించి, భాగవతులచే అందఱు ఆ శ్లోకాలను అనుసంధిస్తారనే భావంతో, అన్యకృతాలైన ఈ శ్లోకాలు ఆయా గద్యల ఆరంభంలో కూర్పబడ్డాయి- అనేది శిష్టసంప్రదాయం. అందువల్లనే సర్వజ్ఞులైన శ్రీకృష్ణసూరి మిగిలిన రెండు శ్లోకాలనువలె, **"యామున ార్యే"**త్యాది శ్లోకాన్నికూడా వ్యాఖ్యానించలేదు''.

శ్రీ మద్వేదాంత దేశికులు తమ గద్యభాష్యంలోని అవతారికలో, శరణాగతి గద్యలో శ్రీరామానుజులు ద్వయమంత్రార్థాన్ని అనుశీలనం చేసిన క్రమాన్ని వివరించారు. ఈ శరణాగతి గద్యలో, **"సంపత్స్యతే"** అనే పర్యంతం (4వ చూర్ణిక చివరి వరకు) ద్వయమంత్రంలోని **"శ్రీమత్"** అనే పదంయొక్క తాత్పర్యం నిరూపింపబడింది. **"అఖిల"** అని ఆరంభించి **"అశరణ్యశరణ్యామ్"** అనే పర్యంతం ద్వయంలోని **"నారాయణ"** అనే పదంయొక్క అర్థం వివరింపబడింది. దాని మధ్యలో రెండుమార్లు **"శ్రీమన్ నారాయణ!"** అని

పల్కడం వల్ల ద్వయంలోని ఉపాయాన్ని, ఉపేయాన్ని తెలిపే పూర్వోత్తర వాక్యాలలోని సిద్ధమైన, ప్రధానమైన వస్తువు (లక్ష్మీసహితుడైన నారాయణుడు) ప్రకాశింపజేయబడింది. **"అన్యశరణోఽహమ్"** అనే ప్రయోగంలోని ఉత్తమ పురుషద్వారా విశిష్టాధికారి (ప్రపన్నుడు) చెప్పబడ్డాడు. **"త్వత్పాదారవింద యుగళమ్"** ఇత్యాది ప్రయోగం అర్థంద్వారా, స్వరూపంద్వారా ద్వయ మంత్రంలో (పూర్వవాక్యంలో) గల మూడు పదాలను (**శ్రీమన్నారాయణ చరణౌ, శరణం, ప్రపద్యే**- అనే మూడు పదాలను) జ్ఞాపకం చేస్తున్నది. ఈవిధంగా, ముఖ్యమైన సిద్ధోపాయంతోను, సిద్ధమైన ప్రాప్యం (ప్రయోజనం)తోను ద్వయాన్ని ఒకే మహావాక్యంగా చెప్పేటపుడు, శబ్దంద్వారా ప్రధానంగా స్ఫురించే సాధ్యోపాయాంశం వ్యక్తం చేయబడింది. సాధ్యమైన ప్రయోజనంకూడా **"పారమార్థిక"** ఇత్యాది (రెండవ చూర్ణిక) వాక్యంద్వారా సంగ్రహంగా తెలుప బడింది - అనే విషయాన్ని తెలుపడం కోసంగా శరణాగతి గద్యలో మధ్యలో **"ద్వయమ్"** అనే పదాన్ని ప్రయోగించి, తద్ద్వారా వ్యాఖ్యానింపబడే మంత్రం యొక్క సమాఖ్య (పేరు) నిర్దేశింపబడడం జరిగింది. **"పితరమ్"** అని మొదలిడి, జితంతా స్తోత్రంలోను, భగవద్గీత మొదలైనవానిలోను చెప్పబడిన, పూర్వం తెలుపబడిన అర్థాన్ని దృఢీకరించే ఉపబృంహణ గ్రంథాలను అనుసంధించడం ద్వారా, పూర్వం ప్రస్తావింపబడిన ఉపాయవిశేషాన్ని తాము పరిగ్రహించిన విషయం, శరణ్యుడైన భగవానుని స్వభావాలను అనుసంధిస్తూ, ప్రాప్యమైన ప్రయోజనాన్ని పొందడంలో ఎదురయ్యే విరోధులు నివర్తింపబడాలనే ప్రార్థనాంశం కూడా వివరింపబడే ద్వయార్థమని సంగ్రహంగా తెలుపబడింది, **"మనోవాక్కాయైః"** ఇత్యాది వాక్యాల ద్వారా, అర్థక్రమాన్ని అనుసరించి ముందుగా **"నమః"** అనే శబ్దం యొక్క అర్థం వివరింపబడింది, తరువాత, **"నారాయణాయ"** అనే పదంలోని చతుర్థీవిభక్తియొక్క అర్థమైన పరమ పురుషార్థాన్నిగూర్చి ప్రార్థన ప్రకాశింపచేయబడింది. శ్రీరంగనాథుడు బదులిచ్చే వాక్యాలద్వారా అంతకు ముందు ప్రస్తావింపబడినది. ప్రపన్నాధికారి నిర్భయంగా ఉండడంకోసం అతని రక్షణభారాన్ని ఒప్పుకొన్న శరణ్యుడైన భగవానుని సహజస్వభావంచేత ఉద్భవించిన దయవల్ల చల్లనిది, ఉత్తరవాక్యంలో చెప్పబడిన పరమప్రయోజనానికి అంకురం (ఆరంభం) వంటిది అయిన

(భగవానుని) అభిప్రాయం తెలుపబడింది. ఈ రీతిలో, ఈగద్య పూర్తిగా ద్వయమంత్రానికి వివరణమనే సంప్రదాయం చాలా సాధువైనది.

ఇన్న అరజ్గత్తినిదిరు నీ ఎన్టరజ్గర్
ఎన్టై ఎతిరాశర్క్కొన్ద వరమ్ - శిన్టై శెయ్యిల్
నమ్మదన్టో! నెఞ్జమే! నన్ఱ్ఱాదై శొమ్పుదల్వన్
తమ్మదన్టో! దాయ ముత్తైదాన్

(ఆర్తి ప్రబంధమ్)

(ఓ మనసా! శ్రీరంగనాథుడు మనకు తండ్రి అయిన భగవద్రామానుజులుతో "ఈ శ్రీరంగంలో మీరు సుఖంగా ఉండండి - అత్తైవ శ్రీరంగే సుఖమాస్వ" అని ఇచ్చిన వరం, ఆలోచిస్తే, మనదే కదా. ఏవిధంగా? అంటే, నిరుపాధికు డైన తండ్రి సొత్తు దాయాదిక్రమంలో పుత్రులకు చెందుతుంది కదా!)

గద్యత్రయానికి వ్రాయబడిన ఈ వివరణం కాంచీ మహావిద్వాన్ ప్రతివాది భయంకరమ్ అణ్ణంగరాచార్య స్వామివారి ద్రావిడ వ్యాఖ్యానాన్ని కృతజ్ఞతా పూర్వకంగా అనుసరిస్తూ వ్రాయబడింది. ఇందుకు సహకరించి, అనుమతిని ఉదారంగా ఇచ్చిన శ్రీమాన్ స్వామివారి పౌత్రులు ఉ.వే. శ్రీమాన్ పి.బి. రాజహంసం స్వామివారికి, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలను సమర్పించుకొంటున్నాను. నాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్ శ్రీమాన్ జి. చొక్కలింగం గారికి, తి.తి.దేవస్థానాల ఉన్నతాధికారులకు కృతజ్ఞతలను తెలుపుకుంటున్నాను. ఈ వివరణలోని స్ఖలిత్యాలను సహృదయ పాఠకులు క్షమిస్తారని నమ్ముతున్నాను.

ఇట్లు

నివేదించు సహృదయ విధేయుడు

ఈ.ఏ. శింగరాచార్యులు

శ్రీ భగవద్రామానుజవిరచితమ్

శరణాగతిగద్యమ్

యో నిత్యమచ్యుత పదామ్బుజయుగ్మరుక్మ
వ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే ।
అస్మద్గురో ర్భగవతోఽస్య దయైకసింధోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే ॥

వన్దే వేదాన్తకర్పూర చామీకర కరణ్డకమ్ ।
రామానుజార్య మార్యాణాం చూడామణి మహర్నిశమ్ ॥

1. ఓమ్. భగవన్నారాయణాభిమతానురూప స్వరూపరూపగుణ విభవైశ్వర్య శీలాద్యనవధికాతిశయా ఽసఙ్ఖ్యేయ కల్యాణగుణగణాం, పద్మవనాలయాం, భగవతీం, శ్రియం, దేవీం, నిత్యానపాయినీం, నిరవద్యాం, దేవదేవ దివ్య మహిషీమ్, అఖిలజగన్మాతరమ్, అస్మన్మాతరమ్, అశరణ్యశరణ్యామ్, అనన్యశరణ శ్శరణమహం ప్రపద్యే ॥

2. పారమార్థిక భగవచ్చరణారవిన్దయుగళైకాన్తికాత్యన్తిక పరభక్తి పరజ్ఞాన పరమభక్తికృత పరిపూర్ణానవరత నిత్యవిశదతమానన్యప్రయోజనానవధికాతిశయ ప్రియభగవదనుభవ జనితానవధికాతిశయ ప్రీతికారితాశేషావస్థోచితాశేష శేషతైకరతి రూప నిత్యకైఙ్కర్యప్రాప్త్యపేక్షయా పారమార్థికీ భగవచ్చరణారవిన్ద శరణాగతిర్యథావస్థితా అవిరతాఽస్తు మే ॥

3. అస్తు తే ॥

4. తయైవ సర్వం సమ్పత్స్యతే ॥

5. అఖిలహేయప్రత్యనీక కల్యాణైకతా స్వేతర సమస్త వస్తువిలక్షణానన్త జ్ఞానానన్దైక స్వరూప !

స్వాభిమతానురూపైకరూపాచిన్త్య దివ్యాద్భుత నిత్య నిరవద్య నిరతి శయౌజ్జ్వల్య సౌన్దర్య సౌగన్ధ్య సౌకుమార్య లావణ్యయౌవనాద్యనన్త గుణనిధి దివ్యరూప !

స్వాభావికానవధికాతిశయ జ్ఞానబలైశ్వర్య వీర్యశక్తి తేజస్సౌశీల్యవాత్సల్య మార్ద వార్జవ సౌహార్దసామ్యకారుణ్య మాధుర్యగామ్భీర్యౌదార్య చాతుర్యస్థైర్య ధైర్యశౌర్యపరాక్రమ సత్యకామ సత్యసఙ్కల్ప కృతిత్వ కృతజ్ఞతాద్యసఙ్ఖ్యేయ కల్యాణ గుణగణౌఘమహార్ణవ !

స్వోచితవివిధ విచిత్రానన్తాశ్చర్య నిత్యనిరవద్య నిరతిశయ సుగన్ధ నిరతి శయసుఖ స్పర్శ నిరతిశయౌజ్జ్వల్య కిరీటమకుట చూడావతంస మకరకుణ్డల గ్రైవేయకహార కేయూరకటక శ్రీవత్సకౌస్తుభ ముక్తాదామోదరబన్ధన పీతామ్బర కాఞ్చీగుణ నూపురాద్యపరిమిత దివ్యభూషణ.

స్వానురూపాచిన్త్యశక్తి శఙ్ఖచక్రగదాశార్ఙ్గాద్యసఙ్ఖ్యేయ నిత్యనిరవద్య నిరతిశయ కల్యాణదివ్యాయుధ !

స్వాభిమత నిత్యనిరవద్యానురూప స్వరూపరూప గుణవిభవైశ్వర్య శీలాద్య నవధికాతిశయాసఙ్ఖ్యేయ కల్యాణగుణగణశ్రీవల్లభ !

ఏవంభూత భూమినీళానాయక !

స్వచ్ఛన్దానువర్తి స్వరూప స్థితిప్రవృత్తిశ భేదాశేషశేషతైకరతిరూప నిత్య నిరవద్య నిరతిశయ జ్ఞానక్రియైశ్వర్యాద్యనన్త కల్యాణగుణగణశేషశేషాశన గరుడప్రముఖనానా విధానన్తపరిజన పరిచారికా పరిచరిత చరణయుగళ !

పరమయోగి వాఙ్మనసాపరిచ్ఛేద్య స్వరూపస్వభావ స్వాభిమత వివిధ విచిత్రానన్త భోగ్యభోగోపకరణ భోగస్థాన సమృద్ధానన్తాశ్చర్యానన్త మహావిభవానన్త పరిమాణనిత్య నిరవద్య నిరతిశయ శ్రీవైకుణ్ఠనాథ !

స్వసఙ్కల్పానువిధాయి స్వరూపస్థితిప్రవృత్తి స్వశేషతైకస్వభావ ప్రకృతిపురుష కాలాత్మక వివిధవిచిత్రానన్త భోగ్యభోక్తృవర్గ భోగోపకరణ భోగస్థానరూప నిఖిల జగదుదయ విభవలయలీల !

సత్యకామ! సత్యసఙ్కల్ప! పరబ్రహ్మభూత ! పురుషోత్తమ ! మహావిభూతే! శ్రీమన్నారాయణ ! శ్రీవైకుణ్ఠనాథ !

అపార కారుణ్య సౌశీల్య వాత్సల్యౌదార్యైశ్వర్య సౌన్దర్యమహోదధే !
అనాలోచిత విశేషాశేషలోకశరణ్య ! ప్రణతార్తిహర !
ఆశ్రితవాత్సల్యైకజలధే ! అనవరతవిదితనిఖిల భూతజాతయాథాత్మ్య!
అశేషచరాచరభూత నిఖిలనియమననిరత ! అశేష చిదచిద్వస్తుశేషిభూత!
నిఖిలజగదాధార ! అఖిలజగత్స్వామిన్ ! అస్మత్స్వామిన్ !
సత్యకామ ! సత్యసఙ్కల్ప ! సకలేతరవిలక్షణ ! అర్థికల్పక ! ఆపత్సఖ !
శ్రీమన్! నారాయణ ! అశరణ్యశరణ్య !
అనన్యశరణ స్త్వత్పాదారవిన్దయుగళం శరణమహం ప్రపద్యే ॥

అత్ర ద్వయమ్ ॥

6. పితరం మాతరం దారాన్ పుత్రాన్ బన్ధూన్ సఖీన్ గురూన్
రత్నాని ధనధాన్యాని క్షేత్రాణి చ గృహాణి చ ।

7. సర్వధర్మాంశ్చ సన్త్యజ్య సర్వకామాంశ్చ సాక్షరాన్
లోకవిక్రాన్తచరణౌ శరణం తేఽ వ్రజం విభో ॥

8. త్వ మేవ మాతా చ పితా త్వమేవ త్వమేవ బన్ధుశ్చ గురు స్త్వమేవ ।
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవదేవ ! ॥

9. పితాఽ సి లోకస్య చరాచరస్య త్వమస్య పూజ్యశ్చ గురు ర్గరీయాన్
న త్వత్సమోఽ స్త్యభ్యధికః కుతోఽ న్యో లోకత్రయేఽ ప్యప్రతిమప్రభావ! ॥

10. తస్మాత్ప్రణమ్య ప్రణిధాయ కాయం ప్రసాదయేత్వా మహ మీశ మీడ్యమ్।
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః ప్రియః ప్రియాయార్హసి దేవ ! సోఢుమ్ ॥

11. మనోవాక్కాయై రనాదికాలంప్రవృత్తానన్తాకృత్యకరణ కృత్యాకరణ భగవదపచార భాగవతాపచారాసహ్యాపచారరూప నానావిధానన్తాపచారాన్ ఆరబ్ధకార్యాన్ అనారబ్ధకార్యాన్ కృతాన్క్రియమాణాన్ కరిష్యమాణాంశ్చ సర్వానశేషతః క్షమస్వ ॥

12. అనాదికాలప్రవృత్తం విపరీతజ్ఞాన మాత్మవిషయం, కృత్స్నజగద్విషయఞ్చ విపరీతవృత్తఞ్చాశేషవిషయ మద్యాపి వర్తమానం వర్తిష్యమాణం చ సర్వం క్షమస్వ॥

13. మదీయానాది కర్మప్రవాహప్రవృత్తాం, భగవత్స్వరూప తిరోధానకరీం, విపరీత జ్ఞానజననీం, స్వవిషయాయాశ్చ భోగ్యబుద్ధేర్జననీం, దేహేన్ద్రియత్వేన భోగ్యత్వేన సూక్ష్మరూపేణ చావస్థితాం, దైవీం గుణమయీం మాయాం, దాసభూతం "శరణా గతోఽస్మి తవాస్మి దాసః" ఇతి వక్తారం మాం తారయ॥

14. తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః ।
ఉదారా స్సర్వ ఏవైతే జ్ఞానీత్వాత్మైవ మే మతమ్
అస్థిత స్స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్
బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే
వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥

ఇతి శ్లోకత్రయోదితజ్ఞానినం మాం కురుష్వ ॥

15. పురుష స్స పరః పార్థ ! భక్త్యా లభ్యస్త్వనన్యయా ।
భక్త్యా త్వనన్యయా శక్యః మద్భక్తిం లభతే పరామ్ ॥

ఇతి స్థానత్రయోదిత పరభక్తియుక్తం మాం కురుష్వ ॥

16. పరభక్తి పరజ్ఞాన పరమభక్త్యైకస్వభావం మాం కురుష్వ ॥

17. పరభక్తి పరజ్ఞాన పరమభక్తికృత పరిపూర్ణానవరత నిత్యవిశదతమానన్య ప్రయోజనానవధికాతిశయప్రియ భగవదనుభవోఽహం, తథావిధ భగవదనుభవ జనితానవధికాతిశయ ప్రీతికారితాశేషావస్థోచితాశేషశేషతైక రతిరూప నిత్యకింకరో భవాని॥

18. ఏవమ్భూత మాత్మైశ్వర్యప్రాప్త్యుపాయతయాఽవక్లృప్త సమస్తవస్తువిహీనోఽపి, అనన్తతద్విరోధి పాపాక్రాంతోఽపి, అనన్తమదపచార యుక్తోఽపి, అనన్తమదీయాపచారయుక్తోప్యనన్తాసహ్యోప చార యుక్తోఽపి, ఏతత్కార్య

కారణభూతానాది విపరీతాహఙ్కార విమూఢాత్మస్వభావోఽపి, ఏతదుభయకార్య కారణభూతానాది విపరీతవాసనాసమ్బద్ధోఽపి, ఏతదనుగుణ ప్రకృతి విశేషసమ్బద్ధోఽపి, ఏతన్మూలాధ్యాత్మికాధిభౌతికాధిదైవిక సుఖదుఃఖతద్ధేతు తదితరోపేక్షణీయ విషయానుభవజ్ఞాన సఙ్కోచరూప మచ్చరణారవిన్ద యుగళైకాన్తిక పరభక్తి పరజ్ఞాన పరమభక్తి విఘ్నప్రతిహతోఽపి, యేన కేనాపి ప్రకారేణ ద్వయవక్తా త్వం కేవలం మదీయయైవ దయయా నిశ్శేషవినష్ట సహేతు కమచ్చరణారవిన్ద యుగళైకాన్తికాత్యన్తిక పరభక్తి పరజ్ఞాన పరమభక్తిః, మత్ప్రసాదలబ్ధ మచ్చరణారవిన్ద-యుగళైకాత్యన్తిక పరభక్తి పరజ్ఞాన పరమభక్తిః, మత్ప్రసాదాదేవ సాక్షాత్కృతయథావస్థిత మత్స్వరూపరూప గుణవిభూతిలీలోప కరణవిస్తారః అపరోక్షసిద్ధమన్నియామ్యతా మద్దాస్యైకస్వభావాత్మస్వరూపః, మదేకానుభవః, మద్దాస్యైకప్రియః, పరిపూర్ణానవరత నిత్య విశదత మానన్యప్రయోజనానవధికాతిశయప్రియ మదనుభవస్త్వమ్ తథావిధ మదనుభవజనితానవధికాతిశయ ప్రీతికారితాశేషావస్థోచితాశేష శేషతైకరతిరూప నిత్యకిఙ్కరో భవ ॥

19. ఏవమ్భూతోఽసి ॥

20. ఆధ్యాత్మికాధిభౌతికాధిదైవిక దుఃఖవిఘ్నగన్ధరహితస్త్వం ద్వయమర్థాను సన్ధానేన సహ సదైవం వక్తా యావచ్ఛరీరీపాతమ్ అత్రైవ శ్రీరఙ్గే సుఖమాస్వ ॥

21. శరీరపాతసమయే తు కేవలం మదీయయైవ దయయాఽతిప్రబుద్ధో మామేవావలోకయన్ అప్రచ్యుతపూర్వసంస్కార మనోరథః, జీర్ణమివ వస్త్రం సుఖేనేమాం ప్రకృతిం స్థూలసూక్ష్మరూపాం విసృజ్య, తదానీమేవ మత్ప్రసాదలబ్ధ మచ్చరణారవిన్ద యుగళైకాన్తికాత్యన్తిక పరభక్తి పరజ్ఞాన పరమభక్తికృత పరిపూర్ణానవరత నిత్యవిశదత మానన్య ప్రయోజనానవధికాతిశయ ప్రియ మదనుభవస్త్వం తథావిధమదనుభవ జనితావధికాతిశయ ప్రీతికారితా శేషావస్థోచితాశేషశేషతైకరతిరూప నిత్యకిఙ్కరో భవిష్యసి॥

22. మా తే భూదత్ర సంశయః ॥

23. అనృతం నోక్తపూర్వం మే న చ వక్ష్యే కదాచన ॥
రామో ద్విర్నాభిభాషతే ।

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ ।
సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశు చః ॥

ఇతి మయైవ హ్యుక్తమ్ ॥

24. అత స్త్వం తవ తత్త్వతో మద్జ్ఞానదర్శనప్రాప్తిషు నిస్సంశయ స్సుఖమాస్వ ॥

అన్యకాలే స్మృతి ర్యాతు తవ కైఙ్కర్యకారితా ।
తామేనాం భగవన్నద్య క్రియమాణాం కురుష్వ మే ॥

ఇతి శ్రీభగవద్రామానుజవిరచితం శరణాగద్యమ్

సమాప్తమ్

భగవద్రామానుజ ప్రణీతమైన

శరణాగతి గద్యమ్

(ఆంధ్ర టీకతో)

యతినాథవైద్యదత్తం శరణాగతిగద్యరూపజీవాతుమ్ ।
సంసారరోగభీతాः! సంసేవధ్వం సభక్తికం నిత్యమ్ ॥

వన్దే వేదాన్తకర్పూర చామీకరకరణ్డకమ్ ।
రామానుజార్య మార్యాణాం చూడామణి మహర్నిశమ్ ॥

వేదాంత శాస్త్రమనే పచ్చకర్పూరాన్ని సురక్షితంగా, పరిమళం మాఱని విధంగా కాపాడే బంగారుబరిణె - అనే రీతిలో వేదాంత మార్గప్రతిష్ఠాపనాచార్యులై, ఆశ్రితులకు అందఱికి శిరోరత్నమై వెలిగే శ్రీరామానుజులను నిత్యం నమస్కరిస్తున్నాను.

"చామీకర"మంటే బంగారం. **"కరండక"**మంటే బరిణెవంటి ఒక పాత్ర. శ్రీ రామానుజులు **వేదాంతవిద్యానిధి** - అనేది శ్లోకంలోని పరమతాత్పర్యం. **"సర్వ గంధః"** అని శ్రుతులలో కీర్తింపబడే భగవానుని వేదాంతాలు వహిస్తున్నందున (తెలుపుతున్నందున) అవి ఇక్కడ పచ్చకర్పూరంగా రూపింపబడ్డాయి. (ఈ శ్లోకాన్ని వేదాంత దేశికులుగాని, శ్రీకృష్ణసూరి గాని వ్యాఖ్యానించలేదు).

ఉపోద్ఘాతం

శాస్త్రాలలో కర్మయోగమని, జ్ఞానయోగమని, భక్తియోగమని, ప్రపత్తి యోగమని- ఈ రీతిలో మోక్షోపాయాలు అనేకంగా విధింపబడ్డాయి. భగవద్రామా నుజులు అన్యమతాలను నిరసించడంకోసం శ్రీభాష్యాన్ని రచించారు కనుక, ఆచార్యపరంపరారుచిపరిగృహీతమైన, పరమ రహస్యమైన

గమనిక : ద్రావిడ వర్ణమాలలోని '*ழ*' అనే అక్షరాన్ని తెలుగులోని 'ళ' అక్షరంతో సమానంగా, '*ற்ற*' అనే సంయుక్తాక్షరాన్ని 'ట్ర' అనే సంయుక్తాక్షరంతో సమానంగా, '*ற*' అనే అక్షరాన్ని 'ఱ' అనే అక్షరంతో సమానంగా ఉచ్చరించవచ్చును.

ప్రపత్తిని శ్రీభాష్యంలో మఱుగుపఱచి, భక్తిని మోక్షోపాయంగా వ్యక్తం చేశారు. **"తత్త్వమసి"** ఇత్యాది వాక్యజన్యజ్ఞానమే మోక్షసాధనమని, కర్మజ్ఞానసముచ్చయమే మోక్షసాధనమని చెప్పే అన్యవాదులను నిరసించడంకోసం కర్మాంగమై, వేదన-ధ్యాన- ఉపాసనాదిశబ్దాలతో వ్యవహరింప బడేదై, భక్తిరూపాపన్నమైన జ్ఞానవిశేషమే వేదాంతాభిమతమైన మోక్షసాధనమని అందులో తెలుపవలసివచ్చింది.

అయినా, శ్రీరామానుజులు, తమకు అభిమతమైన, తమచే పరిగృహీతమైన అర్థాన్ని విశ్వసించే సాత్త్వికులకు తమ అభిప్రాయాన్ని విశదతమంగా వ్యక్తం చేయాలని తలచి, ఆచార్యరుచిపరిగృహీతం, తమకు రక్షకంగా తాము నిశ్చయించు కొనిన మోక్షోపాయం ప్రపత్తియే- అనే విషయాన్ని ఈ శరణాగతిగద్యం ద్వారా వెల్లడిచేశారు.

శ్రీభాష్యంలో ప్రపత్తిని వ్యక్తం చేయడంద్వారా అన్యవాదులను నిరసించ కూడదా? అని అంటే, ఈ ప్రస్నకు ఆచ్చాన్‌పిళ్ళై అనే ఆచార్యులు అనుగ్రహించిన సమాధానం ఏమంటే- వేదాన్ని అధ్యయనం చేయదగిన అర్హతను లేనివారికి దానిని ఉపదేశించడం తగనిది అయినట్లే, యోగ్యత లేనివారికి పరమరహస్యమైన ఈ అర్థాన్ని వ్యక్తం చేయకూడదు- అని తలచి వారికి తెలిసిన శాస్త్రంద్వారానే వారిని నిరసించి, శాస్త్రతాత్పర్యమైన తమ సిద్ధాంతాన్ని ఈ శరణాగతిగద్యద్వారా వ్యక్తం చేశారు అని.

భక్తికంటే ప్రపత్తి చాలా గొప్పది. ఏవిధంగా? అంటే, భక్తి అనేది అధికృతాధికారం. (అంటే- ఒక నిర్దిష్టమైన యోగ్యతను కలవారికి మాత్రమే అది ఆచరణ సాధ్యం.) కాని, ప్రపత్తి సర్వాధికారం. (దీనిని అందఱు అనుష్ఠింపవచ్చు.) భక్తి దుష్కరం. ఇది సుకరం. భక్తి ఆలస్యంగా ఫలాన్ని ఇస్తుంది. ఇది శీఘ్రంగా ఫలాన్ని కల్గిస్తుంది. భక్తిలో **"శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే"** (భక్తియోగభ్రష్టుడు పవిత్రులైన, సంపన్నులైనవారి ఇంటిలో అతడు పూర్వం చేసిన యోగసాధన ఫలంగా జన్మిస్తాడు) అనే రీతిలో ప్రమాదసంభావన ఉన్నది. ప్రపత్తిలో అటువంటి ప్రమాదానికి అవకాశం లేదు. భక్తి సాధ్యోపాయం. ప్రపత్తి సిద్ధోపాయం. అది (స్వరక్షణే స్వాన్వయ రూపమైనది, తన రక్షణ కోసం తాను

ప్రయత్నించడం కనుక) స్వరూపవిరుద్ధం. ప్రపత్తి, స్వప్రపత్తి నివృత్తి రూపమైనది కనుక, స్వరూపానికి తగినది. అది ప్రాప్యానికి అనురూప మైనది కాదు. ఇది (ప్రపత్తి) ప్రాప్యానికి తగినది. ఈ రీతిలోని వైలక్షణ్యాలను దృష్టిలో ఉంచుకొనే శ్రీవేదాంతదేశికులు న్యాసతిలకంలో- **"ఆర్తేష్వాశుఫలా తదన్య విషయేఽప్యుచ్చిన్నదేహాంతరా, వహ్యోదే రనపేక్షణాత్ తనుభృతాం సత్యాదివత్ స్వామినీ, శ్రీరంగేశయ! యావదాత్మనియత త్వత్పారతంత్ర్యోదితా త్వయ్యేవ త్వదుపాయధీరభిహితస్సోపాయభావాఽస్తు మే"** (శ్రీరంగనాథా! సంసారంనుండి త్వరగా విముక్తి పొందాలనే తహతహను కలవారి విషయంలో వేగంగా ఫలాన్ని ఇచ్చేది, మిగిలిన దృష్టప్రపన్నుల విషయంలోకూడా దేహావసానంలో ఫలాన్ని ఇచ్చి ఇంకొక జన్మను లేకుండా చేసేది, అగ్నికార్యాదివైదిక కర్మానుష్ఠానాన్ని అపేక్షించ నందువల్ల, "సత్యాన్ని పలకాలి" ఇత్యాది ధర్మాలు అందఱికి వర్తించే టట్లే, జీవులకు అందఱికీ వర్తించేది, ఆత్మ ఉన్నంతవరకు నియతంగా నీకు పరతంత్రమై ఉండదగిన ఆత్మస్వభావానికి తగినది, నీ విషయంలోనే, ప్రాప్యుడవైన నీవే ఉపాయం కావాలి - అనే రూపంలోని ప్రవృత్తి, అదే ముఖ్యోపాయమనే భావాన్ని కల్గించనిదై నాకు కలగాలి) అని అన్నారు. ఈ శ్లోకంలో ప్రపత్తికి ప్రయోగించిన విశేషణాలు అన్నీ భక్తినుండి దానిని వ్యావర్తింపజేసేవిగాకదా ఉన్నవి.

అయితే, ఈ ప్రపత్తి వేదాంతసిద్ధమేనా? - అని అంటే, ఇది వేదాంతప్రోక్తమే. ఉపనిషత్తులలో ఒకదానికంటే ఇంకొకటి మేలైనదిగా చెప్పే సందర్భంలో అన్నిటి కంటే గొప్పదిగా **"తస్మాన్న్యాస మేషాం తపసా మతిరిక్తమాహుః"** అని అంటూ తపస్సులన్నిటిలో గొప్ప తపస్సు ప్రపత్తి - అని నిర్ణయింపబడింది.

ఈ విధంగా వేదాంతసిద్ధమే కాకుండా, ధర్మజ్ఞులలో శ్రేష్ఠులైన దివ్యసూరుల, పూర్వాచార్యుల అనుష్ఠానంలోకూడా ఇదే పరిగృహీతమైనది. అందువల్ల వేదాంతసిద్ధం; స్వరూపప్రాప్తం; ఆచార్యరుచిపరిగృహీతం, శరణ్యుడైన భగవానుని హృదయానికి అభిమతమైన ప్రపత్తిని తమకు

సంబంధించినవారు (స్వకీయులు) కోల్పోరాదు - అని శ్రీ రామానుజులు తలచి, తమకు, శ్రీరంగనాథునకు మాత్రమే తెలిసేటట్లుగా ప్రపత్తిని తాము ఆచరిస్తే సరిపోయినా, ఆ విధంగా కాకుండా, తమ పరమకృపతో తమ అనంతరం ఉండేవారికి అందటికి ఉపజీవ్యం కావాలని భావించి ఈ ప్రబంధరూపంలో శ్రీరామానుజులు వ్యక్తం చేశారు.

శరణాగతిగద్యం అనే ఈ దివ్యగ్రంథం ఏవిధంగా అవతరించింది? అని అంటే, శ్రీరంగదివ్యాలయంలో ఒక పంగునిమాసం ఉత్తరానక్షత్రంనాడు శ్రీరంగనాథుడు, పెరియ పిరాట్టియార్ (శ్రీరంగనాయకి) బయలు దేరి **"శీరియ శిఙ్గాశనమ్"** పై ఇద్దఱు కలసి వేంచేసి ఉండే సమయంలో భగవద్రామానుజులు అక్కడకు వేంచేసి, వారికి దండం సమర్పించి, నిలచారు. అపుడు మనవంటి సంసారుల భాగ్యవిశేషంచేత వారి మనస్సులో సంసారభీతి కల్గింది. అపుడు వారు శ్రీరంగనాయకీ శ్రీరంగనాయక దివ్యదంపతుల శ్రీచరణాలలో వాలి, శరణు పొంది, తాము చేసిన ఆ శరణాగతిప్రకారాన్ని ఈ ప్రబంధరూపంగా వెలయించారు.

గద్యత్రయంలోని మొదటిది అయిన ఈ శరణాగతిగద్యం మంత్ర రత్నమనే ద్వయానికి వ్యాఖ్యానరూపమని మన పూర్వాచార్యుల అభిప్రాయం. ఈ విషయం ప్రారంభంలోనే సుస్పష్టంగా కన్పిస్తున్నది. ఇందులో, పిరాట్టి, శ్రీరంగనాథుడు శ్రీరామానుజులకు సమాధానం పల్కినట్లు కన్పిస్తున్నదికదా! అది ఏమి? అర్చాసమాధిని దాటి, **"అస్తు తే, తయైవ సర్వం సంపత్స్యతే"**, **"నిత్యకింకరో భవ"**, **"ఏవం భూతోఽసి"**, **"అత్రైవ శ్రీరంగే సుఖమాస్వ"** అని నోరు తెఱచి దివ్యదంపతులు పలికారా? అని అంటే, **"అహేః పాద మహిరేవ జానాతి"** (పాము కాళ్ళనుగూర్చి పాముకే తెలుసు) అనే రీతిలో ఆ దివ్యదంపతుల మనస్సులోని అభిప్రాయాన్ని, వారి తిరుముఖమండలాన్ని గమనించి గ్రహించి శ్రీరామానుజులు ఆ రీతిలో పలికారు - అని కొందరు అంటారు. దివ్యదంపతులు నోరు తెరచి సంగ్రహంగా పల్కిన మాటలను, శ్రీరామానుజులు తరువాత ప్రబంధరూపంగా వివరించి పలికారు - అని

మఱి కొందఱు అంటారు. సాక్షాత్ సంవాదమే సంభవించినట్లు శ్రీవేదాంత దేశికుల అభిప్రాయమని వారి గద్యభాష్యంలో కన్పిస్తున్నది.

మన పూర్వాచార్యుల గ్రంథాలన్నీ తత్త్వ-హిత-పురుషార్థాలను వ్యక్తం చేయడంకోసమే అవతరించినవి కనుక, ఈ దివ్యగ్రంథంకూడా అటువంటిదే. ఇందులోని సంబోధనపదాలన్నీ తత్త్వపరాలని, శరణవరణప్రతిపాదకవాక్యం హితపరమని, ప్రార్థనాప్రకాశకవాక్యాలు పురుషార్థపరాలని గ్రహించాలి.

శరణాగతిగద్యం, శ్రీరంగగద్యం, వైకుంఠగద్యం - అనే మూడు ఒకే ప్రబం ధంగా వ్యవహరింపబడినా, ఒక్కొక్క గద్యం ఒక్కొక్క ప్రబంధమని మన పూర్వాచార్యుల అభిప్రాయం. అందువల్లనే శ్రీరామానుజులు అనుగ్ర హించిన గ్రంథాలు తొమ్మిది - అని గురుపరంపరాసారంలో శ్రీదేశికులు లెక్కించారు.

---

1. ఓమ్. భగవన్నారాయణాభిమతానురూప స్వరూపరూపగుణ విభవైశ్వర్య శీలాద్యనవధికాతిశయా ఽసఙ్ఖ్యేయ కల్యాణగుణగణాం, పద్మవనాలయాం, భగవతీం, శ్రియం, దేవీం, నిత్యానపాయినీం, నిరవద్యాం, దేవదేవ దివ్యమహిషీమ్, అఖిలజగన్మాతరమ్, అస్మన్మాతరమ్, అశరణ్యశరణ్యామ్, అనన్యశరణ శ్శరణ మహం ప్రపద్యే ॥

భగవన్నారాయణ = జ్ఞానశక్తిబలైశ్వర్యాది సకలకల్యాణగుణ పరిపూర్ణుడైన నారాయణునకు, **అభిమత+అనురూప** = ఇష్టంగాను, తగినవిగాను ఉండే, **స్వరూప రూపగుణవిభవ** = స్వరూపం, విగ్రహం, విగ్రహ గుణాలు, విభూతులు - అనే వీటిని, **ఐశ్వర్య శీల+ఆది** = ఐశ్వర్యం, సౌశీల్యంమొదలైన, **అనవధిక+అతిశయ**= ఎల్ల లేని గొప్పతనాన్ని కల, **అసంఖ్యేయ** = లెక్కలేనన్ని, **కల్యాణగుణగణామ్** = కల్యాణగుణసమూహాలను కల్గినది, **పద్మవన + ఆలయామ్** = కమలవనాన్ని వాసస్థానంగా కల్గినది, **దేవీం** = గొప్ప కాంతితో నిండిన రూపాన్ని కల్గినది, **నిత్య+అనపాయినీం** = (భగవానుని) ఏనాడూ విడిచిపెట్టి ఉండనిది, **నిరవద్యాం**= పరిశుద్ధిని కల్గినది, **దేవదేవదివ్యమహిషీం** =

దేవాధిదేవుడైన భగవానుని దివ్యమహిషి, **అఖిలజగత్+మాతరం** = అన్ని లోకాలకు తల్లి, **అస్మత్+మాతరం=**(విశేషించి) మాకు తల్లి, **అశరణ్యశరణ్యాం=** ఏ దిక్కు లేనివారి గొప్ప దిక్కు అయిన, శ్రియం = లక్ష్మిని, **అనన్యశరణః అహం** = వేఱు గతి లేనివాడనైన నేను, **శరణం ప్రపద్యే** = శరణు పొందు తున్నాను.

ఈ చూర్ణికద్వారా శ్రీరామానుజులు మొట్టమొదటగా లక్ష్మీదేవిని ఆమె పురుషకారకోసం శరణు పొందుతున్నారు. ముందు తాము శ్రీరంగనాథుని శ్రీచరణసన్నిధిలో వ్యక్తం చేయబోయే శరణాగతినిష్ఠకు ఉపేయరుచి, ఉపాయాధ్య వసాయం పరిపక్వమై ఉండాలి కనుక, అవి ఏకొఱత లేకుండా సిద్ధించాలని పిరాట్టిశ్రీచరణాలలో శరణు వేడుతున్నారు. లోకంలో ఏది సిద్ధించవలసి ఉన్నా, లక్ష్మీదేవి అనుగ్రహంవల్లనే సిద్ధించాలనే నమ్మకం కలవారికి ఇది ప్రాప్యమే. ఇరామానుశ నూ**ఱ్ఱ**న్దాది ప్రబంధంలోని చివరి పాశురం ఇక్కడ తగిన ఉదాహరణంగా అనుసంధేయం. ఆ పాశురంలో - **"పఙ్కయమామలర్ ప్పావైయై ప్పో**ఱ్ఱ**దుమ్"** (పంకజపుష్పవాసిని అయిన లక్ష్మిని కీర్తించడం) అని అంటూ లక్ష్మీదేవిని ప్రార్థించాలని పల్కడం భగవద్రామానుజుల శ్రీచరణ పద్మాలు తమ శిరస్సుపై పొందికగా నిలచి ఉండడం కోసమేకదా. **"పొఙ్గియ కీర్త్తి ఇరామానుశనడిప్పూ నమ్ తలైమిశైయే మన్నవే"** (పొంగే కీర్తిని కల శ్రీరామానుజుల పాదపద్మాలు మన శిరస్సుపై మన్నికగా ఉండడం కోసమే) అని అముదనార్ అన్నారు కదా!

"భగవన్నారాయణాభిమత" ఇత్యాదివిశేషణంతో లక్ష్మీదేవియొక్క స్వరూపరూప విభవగుణాదులు అన్నీ భగవానుని మనస్సుకు చాలా అభిమతం గాను (ఇష్టంగాను), తగినవిగాను ఉన్నాయి- అని తెలుపబడింది. లోకంలో కొందఱి స్త్రీల రూపగుణాదులు వారి పురుషులకు క్రమాన్నిబట్టి (భర్త భార్యా క్రమాన్నిబట్టి) ప్రాప్తాలు అయినా, వారి భర్తల మనస్సుకు అభిమతాలు కాకుండా ఉండవచ్చు. మఱి కొందఱి స్త్రీల రూపగుణాదులు వారి భర్తల మనస్సుకు ఇష్టంగా ఉండవచ్చు. కాని వాటికి ప్రాప్తి ఉండదు. అందువల్ల

అభిమతమైనది అనురూపం కాకుండా, అనురూపమైనది అభిమతం కాకుండా ఉండే స్వభావం లోకంలో కన్పిస్తున్నందువల్ల, ఈ దివ్యదంపతుల విషయంలో ఆ విధంగా లేదు- అని తెలుపబడింది. అభి మతత్వం, అనురూపత్వం కలసి లోకంలో ఎక్కడో ఒకచోట కలసి ఉన్నా, అన్ని అంశాలలోను అనురూపంగా, అభిమతంగా కలసి ఉండడం సుతరాం అరుదు. దేహగుణాలు మంచివి అయితే, ఆత్మగుణాలు మంచివిగా ఉండవు. ఆత్మగుణాలు మంచివి అయితే దేహగుణాలు మంచివి కావు- అని ఈ విధంగా వైరూప్యం కన్పిస్తుంది. ఈ విధంగా కాకుండా దివ్యదంపతులకు స్వరూపరూప గుణవిభవైశ్వ ర్యాదులనే అన్ని అంశాలలోను అభిమతత్వం, అనురూపత్వం - అనే రెండు కలసి ఉన్నాయని తెలుపబడింది.

ఈ మొదటి విశేషణంలో గుణశబ్దం రెండు సార్లు ప్రయోగింపబడింది. మొదట ఉండే గుణశబ్దం దేహగుణాలైన సౌందర్యలావణ్యాదులను తెల్పు తున్నది. తరువాత ప్రయోగింపబడిన గుణశబ్దం వాత్సల్యసౌశీల్యాదులైన ఆత్మగుణాలను తెల్పుతున్నది.

(విభవ) - విభవమంటే -భోగానికి ఉపకరణాలై, పొగడదగినవిగా ఉండే వస్తుసమూహాలు. అటువంటి సకలవస్తువులు భగవానునకు చెందినవై ఉండగా, లక్ష్మీదేవికి చెందినది- అని ప్రత్యేకంగా విభవమనేది ఒకటి ఉన్నదా? అని అంటే, లోకంలో దంపతులవద్ద కన్పించే పద్ధతిని అనుసరించి పత్నికి చెందినవిగా చెప్పబడే మాల్యభూషణవస్త్రాదులు అనేకం ఉన్నాయి కదా! విభవావతార - అర్చావ తారాలలో దీనిని గమనించవచ్చు.

(ఐశ్వర్య) - ఐశ్వర్యమంటే నియామకత్వం. సర్వనియామకుడు భగవాను డైనపుడు, ఈమెకుకూడా నియామకత్వం ఉన్నదా? అని అంటే, భగవదిచ్ఛా ప్రయుక్తమైన నియామకత్వం ఈమెకు ఉండవచ్చుకదా! **"శేషశేషాశనాది పరిజనం భగవతః తత్తదవస్థోచితపరిచర్యాయా మాజ్ఞాప యంత్యా"** (ఆదిశేషుడు, విష్వక్సేనుడు మొదలైన పరిజనాన్ని భగవానునియొక్క ఆయా స్థితులకు తగిన పరిచర్యలలో ఆజ్ఞాపిస్తున్నది) అని శ్రీవైకుంఠగద్యంలో పల్కిన

విషయంకూడా గమనించదగినది. **"చేతనర్‌కళై కర్మానుగుణమాక నియమిప్పళ్; ఈశ్వరనై రక్షణానుగుణమాక నియమిప్పళ్"** (చేతనులను వారి వారి కర్మలకు అనుగుణంగా నియమిస్తుంది; ఈశ్వరుని జీవుల రక్షణకు అనుగుణంగా నియమిస్తుంది) అని ఆచ్చాన్‌పిళ్ళై అనుగ్రహించారు.

(శీల+ఆది) - తక్కువవారితో సైతం ఏభేదం, సంకోచం లేకుండా కలసి వ్యవహరించడమే శీలం. సౌశీల్యం అనేదికూడా ఇదే. భగవానుని శీలం గుహ పెరుమాళ్ మొదలైనవారిపట్ల వ్యక్తమైనట్లుగా, లక్ష్మీదేవి శీలం త్రిజటాదులపట్ల పూర్ణంగా ప్రకాశించిన విషయాన్ని గమనించాలి. **"ఆది"** అనే పదంచేత వాత్సల్య-సౌలభ్యాది గుణాలు గ్రాహ్యాలు.

(అనవధికాతిశయ) - ఇది గుణాలకు ప్రయోగింపబడిన విశేషణం. దీని భావం ఏమి? అంటే, ఇక్కడ చెప్పబడ్డ గుణాలలో కొన్ని గుణాలు గాని, అన్ని గుణాలు గాని, లోకంలోని వారిలో కొందఱిలో కన్పించినా, అవి కొంచెం కొంచెంగా కన్పిస్తాయి తప్ప, ఒక్కొక్క గుణం అంతు లేని ఉత్కర్షను కల్గి ఉండవు. లక్ష్మీ విషయంలో అయితే, ఆ విధంగా కాదు; ఒక్కొక్క గుణంయొక్క గొప్పతనం అవధి లేనిదై ఉంటుంది- అని తాత్పర్యం.

(అసంఖ్యేయకల్యాణగుణగణామ్) - లక్ష్మీదేవి గుణాలు ప్రత్యేకంగా ఇన్ని అని లెక్కకట్టడానికి సాధ్యం కాకపోవడమే కాక, వాటి సమూహాలుకూడా లెక్కలేనివై ఉంటాయి. లోకంలో అపరిమితంగా ఉండే కొన్ని వస్తువులను వేఱ్వేరుగా లెక్కించలేకపోయినా, **"నూఱు కుంచాల ధాన్యం, వేయి కుంచాల నువ్వులు"** అనే రీతిలో రాశుల సంఖ్యలో లెక్కించవచ్చు. లక్ష్మియొక్క గుణాలను చూస్తే, భగవద్గుణాలవలెనే అవికూడా ఏరీతిలోను లెక్కించడానికి సాధ్యం కానివిగా ఉన్నాయి- అని తాత్పర్యం.

(పద్మవనాలయామ్) - "పద్మే స్థితామ్ పద్మవర్ణామ్" (పద్మంలో ఉన్నది, పద్మవర్ణాన్ని కల్గినది) అని శ్రుతి అన్నది. ఇక్కడ **"పద్మ"** శబ్దంచేత లోకంలోని మంగళకరాలైన సకలవస్తువులు చెప్పబడ్డాయి. అందుచేత ఈమె సర్వమంగళ నివాసిని- అని భావం. **"యచ్చ హి మంగళం కిమపి యల్లోకే సదిత్యుచ్యతే,**

తత్సర్వం త్వదధీనమేవ" (లోకంలో ఏది మంగళమో, ఏది **'సత్'** అనే పదంచేత చెప్పబడుతున్నదో, అది అంత నీ అధీనమే) అని అంటూ కూరేశులుకూడా శ్రీస్తవంలో ఈ సంగతిని పలికారు. పరిమళమే మూర్తీభవించినవాడైన భగవానునకు కూడా పరిమళాన్ని కల్గించగల్గిన పరిమళప్రచురమైన పద్మవనాన్ని నివాసంగా కల్గినది - అని భావం.

(భగవతీమ్) - "తత్ర పూజ్యపదార్థోక్తిపరిభాషా సమన్వితః, శబ్దోఽయం నోపచారేణ" అని శ్రీవిష్ణుపురాణంలో చెప్పబడిన రీతిలో పూజ్యవాచకంగా ఈ పదాన్ని గ్రహించాలి.

(శ్రియమ్) - 1. సకలచేతనాలచేత పురుషకారంకోసం ఆశ్రయింపబడేది. 2. ఆశ్రితుల కార్యాలను నెఱవేర్చడంకోసం భగవానుని సదా ఆశ్రయించి ఉండేది. 3. ఆశ్రితుల విన్నపాలను చెవి ఒగ్గి వినేది, 4. వాటిని భగవానునకు వినిపించేది, 5. ఆశ్రితుల అపరాధాలను హింసించేది- నశింపజేసేది, 6. తన కల్యాణగుణాలతో లోకాలను ఆనందింపజేసేది- అని ఈ విధంగా ఆఱు అర్థాలను ఇచ్చే ఆఱు విధాలైన వ్యుత్పత్తులతో **(1. శ్రీయతే, 2. శ్రయతే 3. శ్రుణోతి, 4. శ్రావయతి, 5. శృణాతి, 6. శ్రీణాతి)**-నిష్పన్నమయిన శబ్దంకదా శ్రీశబ్దం. ఈ నామంలోని సాటి లేని గొప్పతనాన్ని **"శ్రీరిత్యేవ చ నామ తే భగవతి ! బ్రూమః కథం త్వాం వయమ్"** (పూజ్యులారా! నీ పేరు శ్రీ అనియే. ఇటువంటి నీ గొప్పతనాన్ని గూర్చి ఏవిధంగా పలుకగలం!) అని ఆళవన్దార్, **"శ్రీరసి యతః"** అని భట్టర్ వ్యక్తం చేశారు.

(దేవీమ్) -ఇది **"దివు-క్రీడా-విజిగీషా-వ్యవహార-ద్యుతి-స్తుతి-మోద-మద-స్వప్న-కాంతి-గతిషు"** అని పది అర్థాలను కల్గిన **"దివు"** ధాతువులోనుండి **"దీవ్యతీతి దేవీ"** అని నిష్పన్నమైనశబ్దం కనుక, యథోచితంగా ఆ యా అర్థాలను గ్రహించ వచ్చు. **"ఇన్బుఱు మివ్విళైయాట్టుడైయవళ్"** (ఆనందాన్ని కల్గించే ఈ లీలలను కల్గినది) అని చెప్పవచ్చు. భగవానునితో కలయికవల్ల ప్రకాశించేది - అని కూడా అర్థం.

(నిత్యానపాయినీమ్) - ఈ పదంద్వారా **"విష్ణోః శ్రీరనపాయినీ"** (విష్ణువును ఏనాడూ విడచి ఉండనిది) అని శ్రీవిష్ణుపురాణంలో (1-8-1) చెప్పబడిన అంశం ప్రత్యభిజ్ఞాపనం చేయబడింది. సూర్యుని ప్రభ, పుష్పాన్ని పరిమళం విడచి ఉండనట్లు భగవానుని విడచి ఉండనిది- అని అర్థం. అవతారాలలో భగవానుని ఈమె కొన్నాళ్ళు విశ్లేషించినప్పటికి దానివల్ల ఈమె నిత్యానపాయినీత్వానికి ఏభంగం లేదని -అంటారు, మన పూర్వాచార్యులు. **"అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా"** (సూర్యునికంటే కాంతి వేఱు కానట్లు, శ్రీరాముని కంటే నేను వేఱు కాదు) అని ఒక మాఱు సీతాదేవి, **"అనన్యా హి మయా సీతా భాస్కరేణ ప్రభా యథా"** (సూర్యునికంటే కాంతి వేఱు కానట్లు, సీత నాకంటే వేఱుకాదు) అని వేఱొక మాఱు శ్రీరాముడు పల్కడాన్ని గమనించవచ్చు. **"ప్రభావాన్ సీతయా దేవ్యా పరమవ్యోమభాస్కరః"** (పరమాకాశమనబడే పరమపదంలో సూర్యునివంటి వాడు, ప్రకాశించే సీతాదేవిరూపంలోని ప్రభను కలవాడు) అని అన్నారు వేదాంతదేశికులు కూడా.

(నిరవద్యామ్) - అవద్యాలను (దోషాలను) లేనిది. పూర్వం పల్కిన ఉత్కర్ష అంతా తన గొప్పతనంగా భావించడం అవద్యం. అటువంటి అవద్యాన్ని లేనిది- అని భావం. వెన్నెల, చందనం, పుష్పం, మారుతం- మొదలైనవానిలోని గుణాలు ఏవిధంగా ఇతరుల అతిశయాధానానికే ఉపయోగపడతాయో, ఆ విధంగానే ఆమె గుణాలు అన్నీ భగవానునకు ఆనందాన్ని కల్గించడంకోసమే ఉపయోగపడతాయి- అని సారం.

(దేవదేవదివ్యమహిషీమ్) - ఈ విశేషణతాత్పర్యాన్ని శ్రుతప్రకాశికాచార్యుల వారు **"అప్రతిహతచికీర్షితామ్"** అని వ్యక్తం చేశారు తాను దేనిని చేయాలని భావించినా ఏవిధమైన ఆటంకం లేకుండా చేసి పూర్తి చేయడానికి తగిన సామర్థ్యాన్ని ఈమె కల్గినదని భావం. ఏలోటు లేని పురుషకారాన్ని చేయగల్గిన దని సారం. బ్రహ్మ మొదలైన దేవతలందఱికంటే భగవానుడు ఉత్తమపురుషుడు అయినట్లు, ఆ బ్రహ్మాదుల పత్నులకంటే మహనీయురాండ్రైన భగవత్పత్నులు అందఱి కంటే ఈమె ప్రధానతమ- అనే అర్థం ఇక్కడ వివక్షితం.

(అఖిలజగన్మాతరమ్) - **"దేవదేవదివ్యమహిషీమ్"** అని అనగానే ఒకవిధమైన భయం కల్గుతుందికదా! ఆ భయాన్ని పోగొట్టడంకోసం ఈ విశేషణం ప్రయోగింప బడింది. తన సంతానం అయిన జీవులపట్ల వాత్సల్యాన్ని మిక్కిలిగా కల్గినదని భావం.

(అస్మన్మాతరమ్) - వేదాంతదేశికుల పాఠంలో ఈ విశేషణం లేదని తెలుస్తున్నది. **"అత్ర అస్మత్స్వామిన్" ఇతివత్ అస్మన్మాతరమితి శ్రీవిష్ణుచిత్తా దయః పఠంతి వ్యాచక్షతే చ"** అని గద్యభాష్యంలో ఉన్నది. పలువురి పాఠంలో **"అస్మన్మా తరమ్"** అనే పాఠం ఉన్నది. కన్పడుతున్నది. ఇక్కడ ఆచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానంలో **"అఖిలశబ్దత్తిల్ తాముమ్ అంతర్భూతరాకైయాలై తమ్మైయుమ్ కూట్టిక్కొళ్ళు కిఱార్"** అని ఉన్నది. కాని, కోయిల్ పత్తరావిస్వామి తిరుమాళిగ లోని తాళపత్ర గ్రంథాలను పరిశీలించినపుడు - **"అఖిలపదత్తిల్ తాముమ్ అంతర్భూతరాయిరుక్క చ్చెయ్‌దేయుమ్ అఖిలజగత్తుమ్ ఒరు తట్టుమ్ తామ్ ఒరు తట్టుమాక తమ్ పక్కల్ వాత్సల్యాతిశయమ్ కణ్డారాకైయాలే విశేషిత్తు అరుళిచ్చెయ్‌కిఱార్ -"అస్మన్మాతరమ్ ఎన్ఱు"** (అఖిలపదంలో తాముకూడా ఒకరు అయినా, అఖిలజగత్తు ఒక ఎత్తు, తాము ఇంకొక ఎత్తు - అనే రీతిలో తమపట్ల లక్ష్మీదేవి చూపిన గొప్ప వాత్సల్యాతిశయాన్ని చూచినవారు కనుక, విశేషించి **"అస్మన్మాతరమ్"** అని అంటున్నారు)- అనేది సంస్కరింపబడిన పాఠం కన్పించింది - అని శ్రీకాంచీ అణ్ణంగరాచార్య స్వామి వారు తమ వివరణలో పేర్కొన్నారు.

(అశరణ్యశరణ్యామ్) - సర్వలోకశరణ్యుడైన భగవానునిచేత పరిత్యజింప బడినవారికి కూడ తాను శరణమై ఉన్నది - అని భావం. **"తిరువడియై ప్పాఱుప్పిక్కుమవళ్ తన్ శొల్‌వ‌ழி వరుమవనై ప్పాఱుప్పిక్క చ్చొల్లవేణ్డావిఱే"** (హనుమానుని అంగీకరింప జేయగల్గినది తన మాట దారిలో వచ్చేవానిని అంగీకరింప జేస్తుందని చెప్పనక్కరలేదు కదా) అనే రీతిలో అపరాధానికి తగిన దండనను ఇచ్చే భగవానునిచేత క్షమింపజేసి రక్షించేది - అని భావం. ఈ విధంగా ఉండే ఇటువంటి లక్ష్మీదేవిని,

(అనన్యశరణః అహం శరణం ప్రపద్యే) - "పుకలొట్టిల్లా అడియేన్ ఉన్ అడిక్కీళ్ అమర్న్దు పుకున్దేన్" (ఏ శరణం లేని నేను నీ చరణాల కింద చేరి ఉండి శరణాగతిని చేశాను) అని భావం. ఇక్కడ **"ప్రపద్యే"** అనే ఉత్తమ పురుషక్రియ ఉన్నందువల్ల నేను అనే కర్త స్ఫురించవలసి ఉన్నప్పటికీ, **"అహమ్"** అని అనడం విశేషించి తమను నిర్దేశించుకొంటున్నారని భావం. అశక్తివల్ల, స్వరూప విరోధ నిశ్చయంవల్ల ఉపాయాంతరాలలో ఆసక్తిని లేనివాడను నేను- అని తమ స్వభావాన్ని స్పష్టం చేసినట్లయినది. ఈవిధం శ్రీరామానుజులు మొదటి చూర్ణికలో పురుషకార ప్రపత్తిని చేశారు.

ఇక రెండవ చూర్ణికలో, పురుషకారస్వరూపిణి అయిన లక్ష్మీదేవివద్ద ప్రార్థించదగిన విషయం విన్నపింపబడుతున్నది.

2. పారమార్థిక భగవచ్చరణారవిన్దయుగళైకాన్తికాత్యన్తిక పరభక్తి పరజ్ఞాన పరమభక్తికృత పరిపూర్ణానవరత నిత్యవిశదతమానన్యప్రయోజనానవధికాతిశయ ప్రియభగవదనుభవజనితానవధికాతిశయ ప్రీతికారితాశేషావస్థోచితాశేష శేషతైకరతి రూప నిత్యకైఙ్కర్యప్రాప్త్యపేక్షయా పారమార్థికీ భగవచ్చరణారవిన్ద శరణాగతిర్యథా వస్థితా అవిరతాఽస్తు మే ॥

పారమార్థిక = పరమపురుషార్థరూపమైన (ఇది భక్తికి విశేషణం), **భగవచ్చరణారవింద యుగళైకాంతిక** = భగవానుని శ్రీచరణాలనే విషయంగా కల్గిన, **ఆత్యంతిక** = ఏనాటికి అయినా నిలచి స్థిరంగా ఉండే, **పరభక్తి పరజ్ఞాన పరమభక్తి** = పరభక్తి - పరజ్ఞానం - పరమభక్తి అనే వీటిచే, **కృత** = చేయబడిన (పుట్టిన) (దీనిని భగవదనుభవంలో అన్వయించాలి), **పరిపూర్ణ=** నిండైన, **అనవరత=** నిరంతరమైన, **నిత్య** =నిత్యమైన, **విశదతమ** = చాలా విశదమైన, **అనన్యప్రయోజన=** స్వయంప్రయోజనమైన, **అనవధిక+అతిశయప్రియ** = దీనికి మించిన ప్రియమైనది ఇంకొకటి లేదు - అనే రీతిలోని, **భగవదనుభవ** = భగవానుని అనుభవంవల్ల, **జనిత** = పుట్టిన, **అనవధిక+అతిశయ ప్రీతి** = చాలా గొప్పదైన ప్రీతి కారణంగా, **కారిత** = చేయబడిన, (ఇది నిత్యకైంకర్యంలో అన్వయిస్తుంది), **అశేష+అవస్థా+ ఉచిత** = (భగవానునకు అతడు) ఆస్థానంలో

ఉన్నప్పుడు, అంతఃపురంలో ఉన్నపుడు, ఆయా సకలసన్నివేశాలకు తగినవి అయిన, **అశేషశేషతైకరతిరూప** = సకలవిధకైంకర్యాలను చేయడంలో ఆశను కల్గి ఉండడమే రూపంగా గల, **నిత్యకైంకర్య ప్రాప్తి+అపేక్షా** = నిత్యకైంక ర్యాన్ని పొందడంలోని ఆశకు తగినట్లుగా, **పారమార్థికీ** = యథార్థమైన, **భగవచ్చరణార విన్ద శరణాగతిః=** భగవానుని శ్రీచరణపద్మాలలో చేయదగిన శరణాగతి, **యథావస్థితా అవిరతా మే అస్తు** = అది సిద్ధించవలసిన రీతిలో సిద్ధించినదై, అడ్డగింపబడనిది కాకుండా నిరంతరంగా నాకు సిద్ధించాలి.

3. అస్తు తే ॥

4. తయైవ సర్వం సమ్పత్స్యతే ॥

ఈ వాక్యాలు లక్ష్మీదేవియొక్క ప్రతివచనం.

తే అస్తు = ఆ విధంగానే నీకు సిద్ధించాలి. **తయా ఏవ** = ఆ శరణాగతి వల్లనే, **సర్వం సంపత్స్యతే** = మీ అభిమతం అంతా చక్కగా సిద్ధించగలదు.

ఈ సమాధానానికి ముందు **"అస్తు మే"** అని కోరినవారి కోరికకు తగినట్లు **"అస్తు తే"** అని మాత్రం సమాధానం అనుగ్రహిస్తే సరిపోతూ ఉండగా, దానికి మించి **"తయైవ సర్వం సంపత్స్యతే"** అని పల్కిన లక్ష్మీదేవి హృదయాన్ని శ్రుత ప్రకాశికాచార్యులవారు **"స్వసంబంధిసంబంధి విస్తరణ మపి సర్వశబ్దాభి ప్రేతమ్"** (తమతో సంబంధాన్ని కలవారియొక్క ఉజ్జీవనం, వారితో సంబంధాన్ని కలవారియొక్క ఈ విధంగా సంబంధిసంబంధులవరకు చేయదగిన ఉజ్జీవనంకూడా **"సర్వ"** శబ్దంచేత వివక్షితం) - అని వివరించారు.

ఇటువంటి వరం భగవానుని నోటి నుండి వచ్చినదని సంప్రదాయం. దానిని వేదాంతదేశికులు న్యాసతిలకంలో **"ఉక్త్వా ధనంజయవిభీషణలక్ష్యయా తే ప్రత్యాయ్య లక్ష్మణమునే! భవతా వితీర్ణమ్, శ్రుత్వా వరం తదను బంధమదావలిప్తే సత్యం ప్రసీద భగవన్! మయి రంగనాథ!"** అనే శ్లోకరత్నాన్ని అనుగ్రహించారు. ఈ శ్లోకంలో **"శ్రుత్వా వరమ్"** అని ఉన్నందువల్ల శ్రీరంగ నాథుడు ఒక వరాన్ని శ్రీరామానుజులకు ఇచ్చినట్లు తెలుస్తున్నది. అది ఏ వరం?

అనే విషయాన్ని వ్యాఖ్యాతలు **"వరప్రదానప్రకారశ్చేత్థమ్"** అని ప్రారంభించి వివరించారు. కాని, ఇతరులు వ్యాఖ్యానించవలసిన అక్కఱ లేనట్లుగా వేదాంతదేశికులవారు తామే మూలంలో **"తదనుబంధమదావలిస్తే"** అని కంఠతః పలికారు. శ్రీరామానుజుల కాలానికి శ్రీదేశికుల కాలానికి మధ్య చాలా కాలవ్యవధి ఉన్నా, "శ్రీరామానుజులతో సాక్షాత్ సంబంధం నాకు లేకపోయినా, పరంపరా సంబంధం ఉన్నది, కనుక దానిని బట్టి నాకు ఫలం తప్పక లభిస్తుందని గర్వపడుతున్నాను. నేను ఈవిధంగా గర్వించడానికి కారణం శ్రీరంగనాథా! నీవు మా కులమూలమైన శ్రీరామానుజులకు ఇచ్చిన వరమే సుమా'' - అని స్పష్టం చేశారు. కనుక, అటువంటి వరప్రదానాన్ని శ్రీరంగనాథుడు చేయడానికి ముందు లక్ష్మీదేవికూడా తన నోటిని తెఱచి ఒక వరాన్ని అనుగ్రహించినట్లుగా శ్రుతప్రకాశికాచార్యులవారు చేసిన వాఖ్య సత్సంప్రదాయ సిద్ధార్థమని అనడంలో ఏ సందేహం లేదు.

5. అఖిలహేయప్రత్యనీక కల్యాణైకతాన స్వేతరసమస్తవస్తువిలక్షణానన్త జ్ఞానానన్దైకస్వరూప!

ఇక, ఈ చూర్ణికనుండి **"శ్రీమన్నారాయణ! అశరణ్య శరణ్య!"** అనే ప్రయోగం (చూర్ణిక) వరకు శ్రీరామానుజులు శ్రీరంగనాథుని అనేకవిధాలుగా సంబోధించి, **"అనన్య శరణః త్వత్పాదారవిందయుగళం శరణమహం ప్రపద్యే"** అని స్వకీయ శరణాగతిని గూర్చి శ్రీరామానుజులు పల్కి ముగిస్తున్నారు. ఇందులో **"అఖిలహేయ"** అనే పదంనుండి, **"జ్ఞానానందస్వరూప"** అనే పర్యంతం మొదటి సంబోధన.

అఖిలహేయ ప్రత్యనీక = ఎటువంటి దోషాలకు అయినా ప్రతిభటమై, **కల్యాణ+ఏకతాన** = మంచికి మంగళానికి ముఖ్యస్థానమై, **స్వేతర సమస్తవస్తు** = తనకన్న వేఱయిన, సమస్త వస్తువులకంటే, **విలక్షణ** = విలక్షణమై, **అనన్త** = సర్వవ్యాపి కనుక దేశపరిచ్ఛేదరహితమై, సర్వకాలవర్తి కనుక కాలపరిచ్ఛేద రహితమై, సర్వ వస్తువులు తానే అయినందువల్ల వస్తుపరిచ్ఛేద రహితమై (ఈవిధంగా మూడు విధాలైన పరిచ్ఛేదాలు లేనందువల్ల అనంతశబ్దవాచ్యమైన),

జ్ఞాన+ఆనంద+ ఏకస్వరూప = స్వయంప్రకాశకం కనుక జ్ఞానమే స్వరూపంగా, సుఖరూపమైనందువల్ల ఆనందమే స్వరూపంగా కలవాడా!

స్వాభిమతానురూపైకరూపాచిన్త్య దివ్యాద్భుత నిత్యనిరవద్య నిరతి శయౌజ్జ్వల్య సౌన్దర్యసౌగన్ధ్య సౌకుమార్యలావణ్యయౌవనాద్యనన్త గుణనిధి దివ్యరూప!

(ఇంతవరకు భగవానుని దివ్యాత్మస్వరూపాన్నిగూర్చి చెప్పబడింది) **స్వరూప- రూప** - గుణవిభూతులు - అనే క్రమంలో ఇంతవరకు స్వరూపాన్ని గూర్చి వర్ణింప బడింది. ఇకపై రూపం వర్ణింపబడుతున్నది) - రూపం అంటే - దివ్యమంగళ విగ్రహం. అది ఏవిధంగా ఉన్నది? అని అంటే,

స్వాభిమత = దివ్యాత్మస్వరూపం కంటే ఇష్టమైనది, **అనురూప** = తగినది, **ఏకరూప** = షడ్భావవికారాలను వేనినీ లేనిది, **అచింత్య** = ప్రాకృతవస్తువులతో సాటి అని భావించడానికి వీలు లేనిది, **దివ్య** = అప్రాకృతమైనది, **అద్భుత** = ప్రతిక్షణం అపూర్వంగా భాసిస్తున్నది, **నిత్య** = స్వరూపగుణాలవలె అనాది నిధన మైనది, **నిరవద్య** = దుర్లభత్వం మొదలైన దోషాలను వేటిని లేనిది, (లేక, **"నిత్యనిరవద్య"** అనే ప్రయోగాన్ని ఒకే పదంగా గ్రహించి, ఎల్లప్పుడు నిరవద్యంగా ఉన్నది- అనే అర్థాన్ని గ్రహించవచ్చు. అంటే- ఎల్లప్పుడు స్వార్థంగా ఉండనిది- అని భావం. **"అడియోముక్కే ఎమ్బెరుమానల్లిరో నీర్!"** అనే రీతిలో ఎల్లప్పుడు భక్తుల కోసమే వినియోగపడేది- అని దీని భావం) **నిరతిశయ+ ఔజ్జ్వల్య** = దీనికి మించిన కాంతి లేదు అనే రీతిలోని గొప్పకాంతిని కల్గినది, **సౌందర్య సౌగంధ్య సౌకుమార్య లావణ్యయౌవనాది + అనంతగుణనిధి** = అవయవ శోభ అనే సౌందర్యం, దివ్యపరిమళం, దివ్యదేవేరులు సైతం నిశితంగా చూడడానికి జంకే రీతిలోని సౌకుమార్యం, సముదాయశోభ - అనే లావణ్యం, ఎల్లప్పుడు ప్రాయం మాఱకుండా ఉండడం - అనే యౌవనం - మొదలైన అపరిమితగుణాలకు నిధివంటిది అయిన, **దివ్యరూప** = దివ్యమంగళవిగ్రహాన్ని కలవాడా!

స్వాభావికానవధికాతిశయ జ్ఞానబలైశ్వర్య వీర్యశక్తి తేజస్సౌశీల్యవాత్సల్య మార్దవార్జవ సౌహార్దసామ్యకారుణ్య మాధుర్యగామ్భీర్యౌదార్య చాతుర్యస్థైర్య ధైర్యశౌర్యపరాక్రమ సత్యకామ సత్యసఙ్కల్ప కృతిత్వ కృతజ్ఞతాద్యసఙ్ఖ్యేయ కల్యాణ గుణగణౌఘమహార్ణవ !

స్వాభావిక = సహజమైన, **అనవధిక+అతిశయ** =తనతో సాటి, మించినది లేని గొప్పతనాన్ని కల్గినవి అయిన, **జ్ఞాన** = అన్నిటినీ ఒకేసారి యథాతథంగా తెలియగల్గడం అనే జ్ఞానం, **బల** = సంకల్పమాత్రంతో అన్నిటిని ధరించగల్గడం అనే బలం, **ఐశ్వర్య** = అన్ని వస్తువులను నియమించడం అనే ఐశ్వర్యం, **వీర్య** = జగత్తుకు ఉపాదానమై ఉన్నా, స్వరూపవికారాన్ని కల్గి ఉండకపోవడం- అనే వీర్యం, **శక్తి** = అఘటిత ఘటనా సామర్థ్యం, **తేజః** = దేనికీ ఏ సహాయాన్ని అపేక్షించక పోవడం- అనే తేజస్సు, **సౌశీల్య** = తనకంటే తక్కువవారితో ఏ భేదం లేకుండా వర్తించడమనే సౌశీల్యం, **వాత్సల్య** = దోషభోగ్యత్వం అనే వాత్సల్యం, **మార్దవ**= ఆశ్రితుల విశ్లేషాన్ని సహించలేకపోవడం అనే మార్దవం, **ఆర్జవ** = మనస్సు, వాక్కు, శరీరం - అనే మూడు కరణాలలోను సారూప్యాన్ని కల్గి ఉండడం అనే ఆర్జవం, **సౌహార్ద** = ఎల్లప్పుడు మంచిని భావించే హృదయాన్ని కల్గి ఉండడం అనే సౌహార్దం, **సామ్య** = జాతిగుణ వృత్తాలలోని తారతమ్యాలను గమనించకుండా, అందఱిపట్ల సమానంగా ప్రవర్తించడం అనే సామ్యం, **కారుణ్య** = దయ, **మాధుర్య** = తనను చంపాలని వచ్చిన శత్రువుకు కూడా భోగ్యమై ఉండడం అనే మాధుర్యం, **గాంభీర్య** = లోతైన మనస్సును కల్గి ఉండడం అనే గాంభీర్యం, **ఔదార్య** = ప్రతిఫలాన్ని ఆశించకుండా, కోరిన వానిని అన్నిటిని సమృద్ధిగా ఇవ్వడం అనే ఔదార్యం, **చాతుర్య** = ప్రతికూలురను కూడా వశీకరించుకోగల్గిన సామర్థ్యం అనే చాతుర్యం, **స్థైర్య** = భక్తులను ఏ దశలోను విడువక పోవడం అనే స్థైర్యం, **ధైర్య** = ప్రతిపక్షం బలమైనది అయినా లెక్కించకపోవడం ధైర్యం, **శౌర్య** = శత్రువులలో ఏజంకు లేకుండా ప్రవేశించడం అనే శౌర్యం, **పరాక్రమ** = ఒంటరిగా అవలీలగా శత్రువులను సంహరించడం అనే పరాక్రమం, **సత్యకామ** = కోరినవానిని అన్నిటిని ఏ కొఱత లేకుండా పొందడం అనే సత్యకామత్వం, **సత్యసంకల్ప** = దేనిని చేయాలని తలచినా, వానిని ఏ ఆటంకం లేకుండా పూర్తి చేయగల్గడం అనే సత్యసంకల్పత్వం, **కృతిత్వ** = భక్తుల రక్షణ కార్యాలను చేస్తూ ఉండడం అనే కృతిత్వం, **కృతజ్ఞతా** = భక్తులు చేసిన కొద్దిపాటి మంచినికూడా మఱువకపోవడం అనే కృతజ్ఞత, **ఆది** = మొదలైన,

అసంఖ్యేయ = లెక్కలేనన్ని, **కల్యాణగుణ** = కల్యాణగుణాలయొక్క, **గణ** = సమూహాలు - అనే, **ఓఘ** = ప్రవాహాలకు, **మహార్ణవ**= గొప్పసముద్రం వంటివాడా.

ఇంతవరకు భగవానుని విగ్రహవైలక్షణ్యాన్నిగూర్చి పల్కి, ఇక దివ్యాత్మ స్వరూపాన్ని గూర్చి పల్కుతున్నారు.

"స్వాభావిక, అనవధికాతిశయ" అనే రెండు విశేషణాలు తరువాత చెప్పబడే గుణాలు అన్నిటిలోను అన్వయిస్తాయి. స్వాభావికాలు, నిస్సమాభ్యధికాలు (సాటి అయినవి, మించినవి లేనివి) అయిన షాడ్గుణ్యం మొదలైన కల్యాణగుణాలకు సముద్రంవంటివాడా! అని భావం. ఈ గుణాలు స్వాభావికాలై ఉండడం అంటే- నీటికి చల్లదనంవలె, నిప్పుకు వేడిమివలె, నిరుపాధికంగా ధర్మి ఉన్నప్పుడు అంతా ఉండడం. ఒకనాడు ఉన్నవిగాను, వేఱొకనాడు లేనివిగాను కాకుండా, యావదాత్మ భావిగా ఉండడం. ఇందువల్ల నిత్యముక్తుల గుణాలకంటే వీటికి గల వైలక్షణ్యం తెలుపబడింది. వారి గుణాలు భగవానుని ఇచ్ఛను అనుసరించి ఉంటాయి కనుక, అనన్యాధీనత్వమనబడే స్వాభావికత్వం వాటికి లేదు. అనవధికాతిశయత్వమంటే- ప్రతిగుణం అంతు లేని మహిమను కల్గి ఉండడం. పైన పేర్కొనబడే గుణాలలో కొన్ని ఇతరవ్యక్తులలో ఉన్నా, అవి పరిమిత మహిమను కల్గి ఉంటాయి. ఆవిధంగా కాకుండా ఇవి భగవానునిలో ఇంతకుమించి గొప్పతనం ఇంకొకటి లేదు -అనే రీతిలోని గొప్పతనాన్ని కల్గి ఉంటాయి. శ్రీభాష్యంలోని **"స్వభావతో నిరస్తనిఖిల దోషానవధికాతిశయాసంఖ్యేయకల్యాణగుణగణః పురుషోత్తమోఽభిధీయతే"** (సహజంగానే ఏ దోషాలు లేనివాడు, అంతులేని గొప్పతనాన్ని కల్గిన లెక్కలేనని కల్యాణగుణాలను కలవాడైన పురుషోత్తముడు చెప్పబడుతున్నాడు) అనే సూక్తిని వ్యాఖ్యానిస్తూ శ్రీశ్రుతప్రకాశికాచార్యులవారు **"అనవధికాతిశయ"** అనే పదం నిత్యసిద్ధులనుండి భగవానుని వేఱు చేస్తున్నదనే ఒక నిర్వాహాన్ని చూపి, **"అనుషక్తేన స్వభావత ఇతి పదేన వా నిత్యసిద్ధవ్యావృత్తిః. తేషాం తాదృశగుణకత్వం హి భగవన్నిత్యేచ్ఛాధీనమ్"** (స్వభావతః - అనే విశేషణవల్ల, నిత్యులకంటే, ముక్తుల కంటే, భగవానునకు కల గొప్పతనం చెప్పబడిందని

కూడా చెప్పవచ్చు. ఎందుకంటే, వారికి ఉండే అతిశయం భగవానుని సంకల్పాధీనం కదా) అని తరువాత యోజనను పేర్కొనడం అనుసంధేయం.

ఇక, ఈ చూర్ణికలో ప్రస్తావింపబడ్డ దివ్యగుణాలు వివరింపబడు తున్నాయి. జ్ఞానశక్తిబలైశ్వర్య- వీర్యశక్తి తేజస్సులు ఆఱు కలిపి షాడ్గుణ్యమనబడతాయి. ఇవియే మిగిలిన అన్ని గుణాలకు ఆకరాలు. వీటిలో, **జ్ఞానం అంటే** - అన్నిటినీ ఒకేసారి ఎల్లప్పుడు యథాతథంగా తెలియగల్గడం. బలం అంటే- సంకల్పమాత్రంతో సకలపదార్థాలను ఏశ్రమ లేకుండా ధరించే శక్తి. **ఐశ్వర్యం అంటే** - సమస్తవస్తువులను నియమించే సామర్థ్యం. వీర్యమంటే -జగత్తుక్కు ఉపాదానకారణమై ఉన్నా స్వరూపవికారాన్ని ఏమాత్రం కల్గి ఉండకపోవడం. **శక్తి అంటే**- అఘటిత ఘటనాసామర్థ్యం. **తేజస్సు అంటే**- దేనికీ ఏ సహకారిని అపేక్షించకుండా ఉండడం. ఈ విధంగా ఇటువంటి షాడ్గుణ్యాన్ని ప్రస్తావించిన తరువాత, వీటినుండి ఉద్భవించే కల్యాణగుణాలను కొన్నిటిని ఇకపై ప్రస్తావిస్తున్నారు; **"సౌశీల్య"** అనే పదంనుండి ప్రారంభించి

సౌశీల్యమంటే - గొప్పవాడు తనకంటే తక్కువవారితో ఏభేదం లేకుండా కలసి వర్తించే స్వభావం. దీనికే శీలగుణమని పేరు. **వాత్సల్యమంటే**- అపుడే ఈనిన దూడ ఒంటిలో ఉండే మలినాన్ని ఆదరించే తల్లి ఆవువలె, ఆశ్రితుల దోషాలను భోగ్యంగా గ్రహించే గుణం. **మార్దవమంటే**- ఆశ్రితుల విశ్లేషాన్ని సహించలేకపోవడం, **ఆర్జవమంటే** - కరణత్రయంలో ఋజువుగా ఉండడం. దీనికి సాక్షాత్తు వ్యతిరేకమైన దుర్గుణం కౌటిల్యం. **సౌహార్దమంటే** - ఎల్లప్పుడు మంచిని గూర్చి చింతించే గుణం. **సామ్యమంటే**- జాతిగుణవృత్తాలలో హెచ్చు తగ్గులను గణించకుండా అందఱికి సమానంగా ఆశ్రయించదగినవాడై ఉండడం. **కారుణ్య మంటే**- దుఃఖించేవారిని చూచి అయ్యో! అని భావించడం. **మాధుర్యమంటే**- తనను చంపాలని తలచే శత్రువులకుసైతం భోగ్యమై ఉండడం. **గాంభీర్యమంటే** - ఆశ్రితు లకు తాను చేయదలచినవానిని గూర్చి ఏనాటికీ ఎవరూ తెలిసికోవడానికి వీలు కాని రీతిలో లోతైన హృదయాన్ని కల్గి ఉండడం. **ఔదార్యమంటే**- ప్రతిఫలం ఆశించకుండా చాలా సమృద్ధిగా కోరినవానిని

అన్నిటిని కోరినవారికి ఇవ్వడం. **చాతుర్య మంటే**- ప్రతికూలురనుకూడ అనుకూలురుగా చేసికోగల్గిన చతురత, **స్థైర్యమంటే**- ఆశ్రితులను ఏనాడూ విడువని గుణం, **ధైర్యమంటే**- ప్రతిపక్షం ప్రబలమైన ఉన్నా తృణీకరించడం (లెక్క పెట్టకుండా ఉండడం). **శౌర్యమంటే**- శత్రువుల గొప్ప సమూహంలోకి ఒంటరిగా ఏ జంకు లేకుండా ప్రవేశించడం. **పరాక్రమమంటే**- ఆ విధంగా యుద్ధభూమిలో ఒంటరిగా ప్రవేశించినా అవలీలగా శత్రువులను భంగపరచగల్గిన నేర్పు.

"సత్యకామ, సత్యసంకల్ప" అనే రెండు భావప్రధాననిర్దేశాలు కనుక, సత్యకామత్వం, సత్యసంకల్పత్వమనే అర్థాన్ని గ్రహించాలి. **సత్యకామత్వమంటే**- కోరినవానిని అన్నిటినీ ఏకొఱత లేకుండా సిద్ధించడం, **సత్యసంకల్పత్వం అంటే**- దేనిని చేయాలని అనుకున్నా, ఏఆటంకం లేకుండా దానిని పూర్తి చేయగల్గిన శక్తి. **కృతిత్వమంటే**- భక్తుల కార్యాలను నిర్వహిస్తూ ఉండడం, **కృతజ్ఞత మంటే**- భక్తులు కొంచెం మంచిని చేసినా, దానిని ఏనాటికీ మఱువకుండా ఉండడం. ఈవిధంగా ఉండే,

అసంఖ్యేయకల్యాణగుణ గుణ+ఓఘమహార్ణవ = ఇన్ని అని లెక్కించి పూర్తి చేయలేని కల్యాణగుణాలనే ప్రవాహాలకు సముద్రంవంటివాడా!

స్వోచితవివిధ విచిత్రానన్తాశ్చర్య నిత్యనిరవద్య నిరతిశయసుగన్ధ నిరతిశయ సుఖస్పర్శ నిరతిశయౌజ్జ్వల్య కిరీటమకుటచూడావతంస మకరకుణ్డల గ్రైవేయక హార కేయూరకటక శ్రీవత్సకౌస్తుభ ముక్తాదామోదరబన్ధన పీతామ్బర కాఞ్చీగుణ నూపురాద్యపరిమిత దివ్యభూషణ!

ఇంతవరకు భగవానుని కల్యాణగుణాలనుగూర్చి పల్కి, ఇకపై భగవానుని దివ్యాభరణాలనుగూర్చి పల్కుతున్నారు.

ఆత్మస్వరూపానికి అలంకారాలైన జ్ఞానం మొదలైన కల్యాణగుణాలను పూర్వమే ప్రస్తావించారు. దివ్యమంగళవిగ్రహానికి అలంకారాలైన భూషణాలను కొన్నిటిని ఇక్కడ ప్రస్తావిస్తున్నారు.

స్వ+ఉచిత = తనకు తగినవి, వివిధ విచిత్ర = పలు విధాలైన వైచిత్రిని కల్గినవి, అనంత = అపరిమితాలైవి, ఆశ్చర్య = ఆశ్చర్యాన్ని కల్గించేవి, నిత్య= శాశ్వతాలై, నిరవద్య = ఏవిధ దోషసంబంధాన్ని లేనివి, (లేక, "నిత్యనిరవద్య" అనే పదాలను పూర్వంవలె ఒకే సమస్తపదంగా గ్రహించి, ఎల్లప్పుడు దోషరహితాలై ఉన్నవి - అనే అర్థాన్ని చెప్పవచ్చు), **నిరతిశయ సుగంధ** = సాటి మేటి లేని పరిమళాన్ని కల్గినవి. **నిరతిశయ సుఖస్పర్శ** = ఏనాటికీ తొలగించనక్కరలేనట్లుగా సాటి లేని సౌకుమార్యాన్ని కల్గినవి, **నిరతిశయ+ఔజ్జ్వల్య** = సాటి లేని గొప్ప కాంతిని కల్గినవి అయిన, **కిరీట** = కిరీటం, **మకుట** = మకుటం, **చూడా + అవతంస** = కేశపాశంలోని ఆభరణం, కర్ణాభరణాలు, **మకరకుండల** = మకరాకారంలోని కుండలాలు, **గ్రైవేయక** = కంఠాభరణాలు, **హార** = వక్షస్సులో అలంకరించే ముత్యాల మాలలు, **కేయూర** = బాహువులు, **కటక** = ముంజేతి కంకణాలు, **శ్రీవత్స** = ఇది పూర్వం పల్కిన ఆభరణాలవంటివి కాకుండా తిరుమేనిలో ఒక శ్వేతరోమావర్తమైనా, ఇది కూడా ఒక భూషణంవలె ప్రకాశిస్తున్నందువల్ల ఆభరణాలతో చేర్చి ఇది ప్రస్తావింపబడింది. శ్రీవత్స మంటే- భగవానుని పుట్టుమచ్చ. **కౌస్తుభ** = వక్షస్సులో అల్లల్లాడుతూ ప్రకాశించే గొప్పమణి, **ముక్తాదామ** = ఏకావళి, త్రిసరం, పంచసరం - అనబడే ముక్తాహారాలు. **ఉదరబంధన** = నడుముకు అలంకరింపబడే పట్టం, **పీతాంబర**= పురుషోత్తమత్వ లక్షణమైన పసుపుపచ్చని పట్టువస్త్రం, **కాంచీగుణ**= ఆ పీతాంబరం పై అలంకరింపబడే మొలనూలు, **నూపుర** = కాలి అందెలు. ఆది శబ్దంచేత యజ్ఞోపవీతం, సుదర్శనలాంఛితమైన అంగుళీయకం మొదలైనవి తెలుపబడతాయి. **దివ్యభూషణ** = ఇటువంటి అపరిమితాలైన దివ్యభూషణాలను కలవాడా! పెరియాళ్వార్‌తిరుమొళిలోని **"శెఙ్గమలక్కుళలిల్ శిత్తిదళ్పోల్ విరవిల్ శేర్ తికళ్ అళికళుమ్ కిఙ్కిణియుమ్ అరైయిల్ తఙ్గియ పొన్‌వడముమ్ తాళనన్మాదుకళైయిన్‌పూవొడు పొన్‌మణియుమ్ మోదిరముమ్ కిటియుమ్ మఙ్గల ఐమ్బడైయుమ్ తోళ్‌వళైయుమ్ కుళైయుమ్ మకరముమ్ వాళికళుమ్ శుట్టియుమ్"** అను సూక్తి భావం ఇక్కడ అనుసంధేయం.

స్వానురూపాచిన్త్యశక్తి శఙ్ఖచక్రగదాశార్ఙ్గాద్యసఙ్ఖ్యేయ నిత్యనిరవద్య నిరతిశయకల్యాణదివ్యాయుధ!

ఇకపై భగవానుని దివ్యాయుధాలు ప్రస్తావింపబడుతున్నాయి.

స్వ+అనురూప = తనకు తగినవి, **అచింత్యశక్తి** = మనస్సుతో కూడ భావించరాని శక్తిని కల్గినవి, **శంఖచక్ర గదాశార్ఙ్గాది** = శంఖం, చక్రం, గద, విల్లు మొదలైన, **అసంఖ్యేయ** = లెక్కపెట్టలేనివి, **నిత్య నిరవద్య** = కాలం గడిచేకొలది ప్రకాశం తఱుగిపోకుండా, ఎల్లప్పుడు ఒకే విధంగా ప్రకాశిస్తున్నవి, **నిరతిశయకల్యాణ** = సాటి మేటి లేని శోభను కల్గించేవిగా ఉండే, **దివ్య+ ఆయుధ** = దివ్యాయుధాలను కలవాడా!

ఈ వాక్యంలో **"గదా"** అనే పదానికి పిమ్మట **"అసి"** అనే పదాన్ని కలిపి పఠించే వేఱొక పాఠం ఉన్నది. అది లేని పాఠమే నంబిళ్ళై ఆదరించిన పాఠం.

స్వాభిమత నిత్యనిరవద్యానురూప స్వరూపరూపగుణవిభవైశ్వర్య శీలాద్య నవధికాతిశయాసంఖ్యేయ కల్యాణగుణగణశ్రీవల్లభ !

స్వాభిమత = తనకు ఇష్టంగా ఉన్నవై, **నిత్యనిరవద్య** = నిత్యాలై, నిర్దోషాలై (నిత్యం నిర్దోషాలై), **అనురూప** = భగవానునకు తగినవై, **స్వానుగుణ** = తనకు తగినవై ఉండే, **రూపగుణ విభవ+ఐశ్వర్య** = రూపం, గుణాలు, విభవం, ఐశ్వర్యం, **శీల+ఆది** = శీలం మొదలైన **అనవధిక+అతిశయ** = అంతు లేని గొప్పతనాన్ని కల్గిన, **అసంఖ్యేయ** = లెక్కలేనన్ని, **కల్యాణగుణ** = కల్యాణగుణాల, **గణ** = సమూహాలను కల్గినది అయిన, **శ్రీవల్లభ** = లక్ష్మికి నాథుడైనవాడా!

ఇక, దివ్యమహిషీవర్గంతో కలసి ఉండే సన్నివేశాన్నిగూర్చి ప్రస్తావిస్తున్నారు.

లక్ష్మీదేవికి చెందిన మొదటి చూర్ణికలో ప్రయోగింపబడిన విశేషణమే ఇక్కడ కూడా ప్రయోగింపబడుతున్నది. భగవదనుభవరసికులైన శ్రీరామానుజులకు ఉండే ఆదరాతిశయం వారిని ప్రేరేపించగా పలికే మాటలు కనుక ఇక్కడ పునరుక్తి దోషాన్ని సంభావించే అవకాశం లేదు.

పెరియవాచ్చాన్‌పిళ్ళై తమ వ్యాఖ్యలో "మొదటి చూర్ణికలోకూడా ఈ గుణాలు చెప్పబడినా, మళ్ళీ ఇక్కడ ప్రస్తావింపబడడం పునరుక్తి కదా! అని అంటే, వీరు ఈ కృతిద్వారా ఇతరులకు ఉపదేశించడం లేదు; అనుభవిస్తున్నారు. అందుచేత, ఆ అనుభవంలో కల్గిన ఆదరాతిశయం ఈ విధంగా వీరిచేత పల్కిస్తున్నది. కనుక పునరుక్తి శంక లేదు. లేక, అక్కడ శరణ్యతకు తగిన గుణాలు చెప్పబడ్డాయి. ఇక్కడ వాల్లభ్యానికి తగినవి చెప్పబడుతున్నాయి''- అని రస్యంగా వివరించారు.

స్వాభిమత = స్వాభిమతాలై, **నిత్యనిరవద్య** = నిత్యాలై, నిర్దోషాలై (నిత్యం నిర్దోషాలై), **అనురూప** = భగవానునకు తగినవై, **స్వానుగుణ** = తనకు తగినవై ఉండే, **రూపగుణ విభవ+ఐశ్వర్య** = రూపం, గుణాలు, విభవం, ఐశ్వర్యం, **శీల+ఆది** = శీలం మొదలైన **అనవధిక+ అతిశయ** = అంతు లేని గొప్పతనాన్ని కల్గిన, **అసంఖ్యేయ** = లెక్కలేనన్ని, **కల్యాణగుణ** = కల్యాణగుణాల, **గణ** = సమూహాలను కల, **శ్రీవల్లభ** = లక్ష్మికి నాథుడైనవాడా !

"శ్రీవల్లభ" అనేటపుడు - లక్ష్మికి వల్లభుడా ! అని, లక్ష్మిని వల్లభగా కలవాడా!- అని రెండు రీతులలో అర్థాన్ని గ్రహించవచ్చు. మొదటి అర్థంలో **"తిరువుక్కుమ్ తిరువాకియ శెల్వన్"** (లక్ష్మికి కూడా శోభాకరుడు) అని, రెండవ అర్థంలో ఆమె పల్కిన మాటను దాట లేని రీతిలో ఆమెకు విధేయుడై ఉంటాడని తెలుపబడింది.

ఏవంభూత భూమినీళానాయక!

ఏవంభూత భూమినీళా నాయక = ఇటువంటి రీతిలోనే ఉండే భూదేవికి, నీళాదేవికి నాయకుడైనవాడా!

పూర్వం **"స్వాభిమత"** అని ప్రారంభించి లక్ష్మీదేవికి చెప్పబడిన కల్యాణ గుణగణాలు **"ఏవంభూత"** అని ఇక్కడ అతిదేశింపబడ్డాయి. లక్ష్మీదేవికి చెప్పబడిన గొప్పతనాలు అన్నీ భూదేవికి, నీళాదేవికి సమానం- అని భావం. **"కుళ్ళక్కోవలర్ మడప్పా వైయుమ్ మణ్‌మకళుమ్ తిరువుమ్‌నిళల్ పోల్‌వనర్"** (పిల్లనగ్రోవిని ఊదే గోపాలుర కులంలో పుట్టిన అందమైన కన్య అయిన నీళాదేవి, భూదేవి - లక్ష్మీదేవికి నీడవంటివారు) అనే నమ్మాళ్వార్ల తిరువిరుత్త శ్రీసూక్తి అనుసంధేయం.

స్వచ్ఛన్దానువర్తి స్వరూప స్థితిప్రవృత్తి భేదాశేషశేషతైకరతిరూప నిత్యనిరవద్య నిరతిశయ జ్ఞానక్రియైశ్వర్యాద్యనన్తకల్యాణగుణగణ శేషశేషాశన గరుడప్రముఖనానా విధానన్తపరిజన పరిచారికా పరిచరిత చరణయుగళ!

ఇకపై, పూర్వం చెప్పబడ్డ గొప్పతనాలు అన్నీ అడవిలో కాచిన వెన్నెల కాకుండా నిత్యభోక్తలను కల్గి ఉండడం తెలుపబడుతున్నది.

ఆదిశేషుడు, సేనాపతియాళ్వాన్, గరుడుడు మొదలైన అపరిమిత పరిజనాలు, పరిచారికలు శ్రీచరణ సన్నిధిలో నిత్యకైంకర్యాన్ని చేసేటట్లు వేంచేసి ఉన్నవాడా! అని ఇందులో అంటున్నారు. ఆ దివ్యసూరులు ఎటువంటివారు? అని అంటే -

స్వచ్ఛంద + అనువర్తి స్వరూప స్థితి ప్రవృత్తి భేద = తన మనస్సును అనుసరించి ఉండే స్వరూపస్థితి ప్రవృత్తులను కలవారై, **అశేషశేషతైకరతిరూప**= సకలవిధాలైన కైంకర్యాలను చేయాలని ఆశపడడమే రూపంగా కల్గినవారై, **నిత్య నిరవద్య నిరతిశయ జ్ఞానక్రియా ఐశ్వర్యాది అనంత (కల్యాణ) గుణగణ** = ఏనాటికీ (నిత్యంగా) ఏదోషం లేనివి, సాటి మేటి లేనివి అయిన జ్ఞానం, వ్యాపారం, నియమనం మొదలైన ఆ యా కల్యాణగుణసమూహాలను కలవారై ఉండేవారు, **"నిత్యనిరవద్య"** అనే దానిని నేరుగా శేష-శేషాశనాదులకే విశేషణం చేసి అర్థం చెప్పే తీరు కూడా ఉన్నది. అపుడు శేష-శేషాశనాదులకు నాల్గు విశేషణాలు ప్రయోగించినట్లవుతుంది. స్వాధీన స్వార్థ (యథేష్ట) కైంకర్యాలను చేయడమనే దోషాన్ని లేని వారు - అని దీని తాత్పర్యం. నిత్యనిరవద్యత్వాన్ని జ్ఞానాదులకు విశేషణంగా చేసినా, ఈ భావం వస్తుంది. జ్ఞాన దాస్యానికి అనుగుణమైన అసంకు చితజ్ఞానం, **క్రియా** = ఆ జ్ఞానానికి తగిన క్రియలు, **ఐశ్వర్య** = ఇతరులను నియమించే అధికారం, **అది అనంతగుణగణ** ఇత్యాది అనంతగుణాల గణాలను కలవాడా.

శేషాశనపదం విష్వక్సేనుని నామం. **"త్వదీయ భుక్తోజ్ఝిత శేషభోజినా... ప్రియేణ సేనాపతినా"** అనే ఆళవందార్ శ్రీసూక్తి స్మరణీయం. **అనుగ్రహా, విమలా, కాంతి, వారుణీ, సుకీర్తి, రుద్రా, సూత్రవతీ** - మొదలైనవారు పరిచారికలు. శ్రీరంగరాజస్తవంలోని **"లీలాలతాకృపాణీ", "ముకుళితనళినాః"** అనే శ్లోకాలలోను ఈ విషయాన్ని గమనించవచ్చు. **"మదిముక మడన్తైయర్"** (చంద్రునివంటి ముఖాన్ని కల వనితలు) అని నమ్మాళ్వార్లు కూడా అన్నారు.

పరమయోగివాఙ్మనసాపరిచ్ఛేద్య స్వరూపస్వభావ స్వాభిమత వివిధ విచిత్రా నన్త భోగ్యభోగోపకరణ భోగస్థాన సమృద్ధానన్తాశ్చర్యానన్త మహావిభవానన్త పరిమాణ నిత్య నిరవద్య నిరతిశయ శ్రీవైకుణ్ఠనాథ!

ఇకపై ఇటువంటి భగవానుని దివ్యపదాన్నిగూర్చి పల్కుతున్నారు. **"పరమయోగి"** - అని ప్రారంభించి, **"వైకుంఠనాథ"** అనే పర్యంతం ఒకే వాక్యంగా గ్రహించడమే సర్వాచార్యసమ్మతం. **"పరమయోగివాఙ్మనసాపరిచ్ఛేద్య స్వరూప స్వభావ"** అనే పర్యంతం ప్రత్యేక వాక్యంగా చేసి, దీనిని ప్రత్యేకంగా ఒక సంబోధనగా గ్రహించి, వ్యాఖ్యానించేవారుకూడా ఉన్నారు- అని శ్రీదేశిక భాష్యంలో తెలుపబడింది. **శ్రుతప్రకాశికాచార్యులవారు** ఆవిధంగా భావించినట్లు వారి వ్యాఖ్యానాన్నిబట్టి తెలుస్తున్నది. ఆ విధంగా పల్కిన ఆ ఆచార్యులవారు కూడా వెంటనే, **"పరమయోగీత్యాదికమ్ దేశవిశేషణమ్ వా; తథా శ్రీవైకుంఠగద్యోక్తేః"** (పరమయోగి- అనే పదం దేశవిశేషంకూడా కావచ్చు. ఆ విధంగా శ్రీవైకుంఠ గద్యంలో చెప్పబడినందువల్ల) అని అన్నారు కనుక మొత్తం ఒకే వాక్యంగా గ్రహించడమే సరసం.

పరమయోగి = సనకసనందనాది గొప్ప యోగులయొక్క, **వాక్+మనస** = వాక్కులచే, మనస్సుచే, **అపరిచ్ఛేద్య** = ఇంత అని పరిచ్ఛేదించలేని, **స్వరూప స్వభావ** = స్వరూపాన్ని, స్వభావాన్ని కల్గినది, **స్వాభిమత** = తనకు అభిమతమైన, **వివిధ** = అనేక విధాలైన, **విచిత్ర** = ఆశ్చర్యాన్ని కల్గించే, **అనంత** = అంతు లేని, **భోగ్య భోగోపకరణ** = భోగ్యవస్తువులు, వాటిని అనుభవించడానికి తగిన ఉపకరణాలు, **భోగస్థాన** = భోగాన్ని పొందడానికి అనువైన భోగస్థానాలు- అనే

వీటిచే, **సమృద్ధ**= నిండినది, **అనంత** = అంతు లేనిది, **ఆశ్చర్య** = విచిత్రమైనది, **అనంత** = అంతు లేని, **పరిమాణ** = పరిమాణాన్ని కల్గినది, **నిత్యనిరవద్య** = నిత్యం నిర్దోషమైనది (నిత్యమైనది, నిర్దోషమైనది), **నిరతిశయ** = ఇంతకంటే గొప్పదైన అతిశయాన్ని కల్గినది ఇంకొకటి లేనిది అయిన, **వైకుంఠనాథ** = వైకుంఠానికి నాథా!

స్వసఙ్కల్పానువిధాయి స్వరూపస్థితిప్రవృత్తి స్వశేషతైకస్వభావ ప్రకృతిపురుష కాలాత్మక వివిధవిచిత్రానన్త భోగ్యభోక్తృవర్గ భోగోపకరణ భోగస్థానరూప నిఖిల జగదుదయ విభవలయలీల!

సకల జగత్తుల సృష్టి స్థితి సంహారాలను లీలగా కలవాడా! అని ఈ సంబోధనలోని భావం.

స్వసంకల్ప+అనువిధాయి = తనయొక్క సంకల్పాన్ని అనుసరించిన, **స్వరూపస్థితిప్రవృత్తి** = స్వరూపాన్ని, స్థితిని, ప్రవృత్తిని కల్గినవి, (ఈ విశేషణం ప్రకృతి, పురుష, కాలాలలో అన్వయిస్తుంది), **స్వశేషతైక స్వభావ** = తనకు శేషమై ఉండడమే స్వభావంగా కల్గినవి అయిన, (ఇదికూడా ప్రకృతి- పురుష- కాలాలకు విశేషణం), **ప్రకృతి పురుష కాలాత్మక** = ప్రకృతి, పురుషుడు, కాలం- అనే వీటి రూపంలోని (**ప్రకృతి, పురుషుడు,** కాలం - అనే మూడు జగత్తుగా పరిణమిస్తు న్నందున, **"ప్రకృతి పురుష కాలాత్మక"** అని నిర్దేశింపబడింది. ఈమూడిటియొక్క స్వరూపస్థితి ప్రవృత్తులు భగవానునకే అధీనాలై, ఇవి ఆ స్వామికే శేషమై ఉన్నందువల్ల ముందుగా ఈ రెండు విశేషణాలు ప్రయోగింపబడ్డాయి) ప్రకృతిపురుషకాలాలు అనే ఈ మూడింటిలోను, పురుషుడనబడే చేతనుడు భోక్త, ప్రకృతి- ((ప్రకృతిశబ్దం చేత ప్రాకృత వస్తువులన్నీ గ్రాహ్యాలు) భోగ్యభోగోపకరణ భోగస్థానాలుగా ఉంటుంది. ఈ జగత్తు కాలకాల్యం (కాలానుగుణంగా పరిణామాన్ని పొందుతుంది) అనే విషయాన్ని తెలుపడంకోసం ఇక్కడ కాలంకూడా కలిపి చెప్పబడింది. లేక, కాలాన్ని భోగోపకరణంలో కూడా చేర్చవచ్చు. ఈ విధంగా ప్రకృతి- పురుష- కాలాత్మకాలైన) **వివిధ** = అనేక విధాలైన, **విచిత్ర** = ఆశ్చర్యకరాలైన, **అనంత**

= అపరిమితాలైన, **భోగ్య** = భోగ్యపదార్థాలు, **భోక్తృవర్గ** = భోక్తల సమూహాలు, **భోగోపకరణ** = భోగసాధనాలు, **భోగస్థానరూప** = భోగానికి అనువైన స్థానాలు- అనే వీటి రూపంలోని, **నిఖిల జగత్** = సకలలోకాలయొక్క, **ఉదయ** = పుట్టుక, **విభవ** = స్థితి, **లయ**= ప్రళయం -అనే వీటిని, **లీల** = లీలగా కల్గినవాడా!

సత్యకామ ! సత్యసఙ్కల్ప ! పరబ్రహ్మభూత ! పురుషోత్తమ ! మహావిభూతే! శ్రీమన్! నారాయణ ! శ్రీవైకుణ్ఠనాథ !

సత్యకామ = తలచిన దానిని అంతటిని నెఱవేర్చగలిగినవాడా ! **సత్య సంకల్ప** = సంకల్పించిన రీతిలో అంతటిని చేసి పూర్తిచేయగల్గినవాడా!, **పరబ్రహ్మభూత** = పరబ్రహ్మమనే పేరును కలవాడా!, **పురుషోత్తమ** = పురు షోత్తమా!, **మహావిభూతే** = అంతు లేని నియామ్యవస్తువులను (విభూతిని) కలవాడా!, **శ్రీమన్** = లక్ష్మీపతీ! **నారాయణ** = నారాయణుడనే పేరును కలవాడా!, **శ్రీవైకుంఠనాథ** = నిత్యవిభూతినాథా!

ఈ ఎనిమిది సంబోధనలు, ఇకపై చేయబోయే సంబోధనలు అన్నీ ఇంచు మించుగా పూర్వం చేయబడిన సంబోధనలద్వారా గతార్థాలే. అయినా, మిక్కిలిగా ఆర్తిని పొందినవాడు నీటి లోపలకు దిగి, నీటిని తాగడం, ముఖంపై ఒంటిపై జల్లుకోవడంవంటి పలు రీతులలో నీటిని ఉపయోగించుకొనే రీతిలో, శ్రీరామా నుజుల ఆర్తి విలక్షణమైనది కావడంచేత, వారిచే చేయబడిన ఈ సంబోధనలలో పునరుక్తి శంకను చేయడం, దానికి పరిహారాన్ని పల్కడం - అనే ఆవశ్యకత లేనే లేదు.

అపారకారుణ్యసౌశీల్య వాత్సల్యౌదార్యైశ్వర్య సౌన్దర్యమహోదధే!

అపారకారుణ్యసౌశీల్యవాత్సల్య + ఔదార్య+ ఐశ్వర్య సౌందర్య మహోదధే = అంతు లేని కరుణ, శీలగుణం, వాత్సల్యం, ఔదార్యం, ఐశ్వర్యం, సౌందర్యం - అనే ఈ గుణాలకు గొప్ప సముద్రంవంటివాడా!

ఇక్కడ ఐశ్వర్యశబ్దాన్ని కలిపి పల్కడం విశేషించి గమనించదగినది. **"సంసారిణాం స్వరక్షణవిఘాతకత్వేఽపి తాన్ స్వాతంత్ర్యేణ నియమ్య రక్షితుం శక్త**

ఇత్యభిప్రేత్య ఐశ్వర్యమిత్యుక్తమ్" (సంసారులు వారిని రక్షించే తన ప్రయత్నానికి విఘాతం కల్గించేవారైనా, వారిని తన స్వాతంత్ర్యంతో నియమించి రక్షించడంలో సమర్థుడు - అని భావించి ఐశ్వర్యశబ్దాన్ని ప్రయోగించారు) అని శ్రుతప్రకాశికా చార్యులవారి వ్యాఖ్యానశ్రీసూక్తి. శ్రీదేశికులు దీనిని బలపరుస్తూ పల్కిన ఈ శ్రీసూక్తి గమనించదగినది- **"ఐశ్వర్యస్య కథనమ్ ఇహ- అనాదికాలం స్వరక్షణవిపరీతవృత్తాన్ కేనచిత్ వ్యాజేన స్వయమేవ నియమ్య అభిముఖీకరోతీతి జ్ఞాపయితుమ్"** (ఇక్కడ ఐశ్వర్యాన్నిగూర్చి పల్కడం- అనాదికాలంగా తమ రక్షణకు విరుద్ధాలైన జీవుల ప్రయత్నాలను ఏదో ఒక నెపంతో స్వయంగా అడ్డగించి, అభిముఖులుగా చేస్తాడు- అని తెలుపడంకోసం) అని అన్నారు. **"ఇశైవిత్తు ఎన్నై ఉన్ తాళిణైక్కీళ్ ఇరుత్తుమమ్మానే !"** (నన్ను అంగీకరింపజేసి నీ శ్రీచరణాల నిలిపే స్వామీ!) అని ఆళ్వార్ల శ్రీసూక్తిని వివరించిన తీరు ఇది.

అనాలోచిత విశేషాశేషలోకశరణ్య! ప్రణతార్తిహర!

అనాలోచిత విశేష + అశేష లోక శరణ్య = తను ఆశ్రయించినవారి జన్మ-వృత్త- జ్ఞానాలలోని తారతమ్యాన్ని చూడకుండా, ఎటువంటి వారైనా తనను సమీపించి ఆశ్రయించేటట్లుగా అందఱికి రక్షకుడైనవాడా!,

ప్రణతార్తిహర = ఆశ్రయించినవారి ఆర్తిని తీర్చేవాడా!

ఆశ్రితవాత్సల్యైకజలధే ! అనవరతవిదితనిఖిల భూతజాతయాథాత్మ్య!

ఆశ్రితవాత్సల్య +ఏకజలధే = ఆశ్రితుల దోషాలను అన్నిటిని గుణా లుగా గ్రహించడమనే వాత్సల్యగుణానికి అద్వితీయ సముద్రంవంటివాడా !

అనవరత విదితనిఖిలభూత జాతయాథాత్మ్య = సకలవస్తువులయొక్క వాస్తవతత్వాన్ని ఎల్లప్పుడు తెలిసికొనేవాడా !

దీనిద్వారా సర్వజ్ఞత్వం చెప్పబడింది. ఆకించన్యం, అనన్యగతిత్వం మొదలైన నా స్థితులనుగూర్చి నేను విన్నపించనక్కరలేనట్లు నీవే వాటినిగూర్చి తెలిసి కొనగల్గినవాడవు కదా - అని భావం.

అశేషచరాచరభూత నిఖిలనియమననిరత! అశేషచిదచిద్వస్తుశేషిభూత!

అశేషచరాచరభూత నిఖిలనియమననిరత = జంగమస్థావరాత్మకమైన సకల పదార్థాలను నియమించడంలో ఎల్లప్పుడు ఆసక్తుడవై ఉండేవాడా !

ఈవిధంగా నన్ను నీ శ్రీచరణాల మోల నిలిచేటట్లు చేసినవాడవుకూడా నీవే - అని భావం.

అశేషచిదచిద్వస్తుశేషిభూత = సకలచేతనాచేతనాలకు శేషి అయినవాడా! (నానుండి కైంకర్యం గ్రహించడం నీ బాధ్యతసుమా! - అని హార్ద భావం)

నిఖిలజగదాధార ! అఖిలజగత్స్వామిన్ ! అస్మత్స్వామిన్! సత్యకామ! సత్యసఙ్కల్ప ! సకలేతరవిలక్షణ ! అర్థికల్పక ! ఆపత్సఖ ! శ్రీమన్నారాయణ ! అశరణ్యశరణ్య ! అనన్యశరణః త్వత్పాదారవిన్దయుగళం శరణమహం ప్రపద్యే॥

నిఖిలజగదాధార = సకలజగత్తుకు ఆధారమైనవాడా !,

అఖిలజగత్స్వామిన్ = సకలజగత్తుకు స్వామీ !,

అస్మత్ స్వామిన్ = విశేషించి నాకు స్వామి అయినవాడా!,

సత్యకామ = అవాప్తసమస్తకాముడవైనవాడా !,

సత్యసంకల్ప = ఎవరు అడ్డగించడానికి వీలు కాని రీతిలో ఋజువుగా నెరవేఱగల్గిన సంకల్పాలను కలవాడా!

సకల + ఇతరవిలక్షణ = తనకంటే వేఱయిన అన్నిటికంటే అన్ని రీతులలో గొప్పతనాన్ని (వైలక్షణ్యాన్ని) కలవాడా!,

ఆర్థికల్పక = దీనికి మూడు రీతులలో అర్థం తెలుపబడింది. (1) యాచకులకు కల్పవృక్షంవలె ఉన్నవాడా!, (2) యాచకులను కల్పవృక్షంగా కలవాడా, (3) యాచకుడుగాను, కల్పవృక్షంగాను ఉన్నవాడా! - అని, **"అర్థినః కల్పయతీతి అర్థికల్పకః"** అనే సమాసాన్ని చేయవచ్చు కనుక, అర్థులను కల్పించేవాడు - జనింపచేసేవాడు - అనే నాల్గవ అర్థం కూడా పొసగుతుంది.

ఆపత్సఖ = ఆపత్కాలాలలో మిత్రమై ఉన్నవాడా !, (వెంట ఉండేవాడా !),

శ్రీమన్నారాయణ = లక్ష్మీనాథుడవైన నారాయణా !

అశరణ్యశరణ్య = ఏగతి లేనివారికి గొప్ప గతి అయినవాడా !

అనన్యశరణః అహం త్వత్పాదారవిందయుగళం శరణం ప్రపద్యే = ఏగతి లేని నేను శ్రీచరణపద్మాల వద్ద వేఱు ఏ గతి లేనివాడనై శరణాగతి చేస్తున్నాను.

అత్ర ద్వయమ్ ॥

(ఇక్కడ ద్వయమంత్రానుసంధానాన్ని చేయాలి. ఈ మంత్రం ఆచార్యోపదేశంవల్ల పొందదగినది కనుక ఇక్కడ ప్రస్తావించబడలేదు.)

6. **పితరం మాతరం దారాన్ పుత్రాన్ బన్ధూన్ సఖీన్ గురూన్ ।**
రత్నాని ధనధాన్యాని క్షేత్రాణి చ గృహాణి చ ॥

7. **సర్వధర్మాంశ్చ సన్త్యజ్య సర్వకామాంశ్చ సాక్షరాన్ ।**
లోకవిక్రాన్తచరణౌ శరణం తేఽ వ్రజం విభో! ॥

ఈ రెండు శ్లోకాలు పౌరాణికాలు. ఇవి ఇక్కడ ఎందుకు ప్రస్తావింపబడ్డాయి? అని అంటే - పూర్వులు పల్కిన అర్థాలే కాక, వారు పల్కిన సూక్తులను శబ్దతః ఈ ప్రకరణంలో విన్నపించడంవల్ల భగవానుని మనస్సులో అనుగ్రహాతిశయాన్ని కల్గిస్తుంది- అనే భావంతోనే. ఈ శ్లోకాలద్వారా శ్రీరామానుజులు మళ్ళీ శరణాగతిని చేస్తున్నారు- అని భావించరాదు. **"సకృదేవ హి శాస్త్రార్థః"** అని చెప్పబడినందువల్ల శరణాగతిని ఆవృత్తి చేసే అవకాశం లేదు.

విభో = ప్రభూ, **పితరం మాతరం దారాన్ బంధూన్ పుత్రాన్ సుఖీన్ గురూన్**= తండ్రిని, తల్లిని, భార్యను, బంధువులను, పుత్రులను, మిత్రులను, గురువులను, **రత్నాని** = రత్నాలను, **ధనధాన్యాని** = ధనాన్ని, ధాన్యాన్ని, **క్షేత్రాణి చ** = క్షేత్రాలను, **గృహాణి చ** = గృహాలను, **సర్వధర్మాన్ చ** = అన్ని ధర్మాలను, **సాక్షరాన్ సర్వకామాన్ చ** = కైవల్యంతో పాటుగా అన్ని కోరికలను, (స్వర్గలోకాధిపత్యం, బ్రహ్మలోకాధిపత్యం మొదలైనవానిలోని ఆశను- అని

భావం) **సంత్యజ్య** = వాసనతోపాటుగా వదలిపెట్టి, **తే లోకవిక్రాంతచరణౌ** = లోకాలను కొలిచిన నీ శ్రీచరణ యుగ్మాన్ని, **శరణం ప్రపద్యే** = శరణు పొందుతున్నాను.

ఇక్కడ **"దారాన్ పుత్రాన్ బంధూన్ సఖీన్ రత్నాని"** ఇత్యాదులను విడచిపెట్టినట్లు పల్కడంలో విప్రతిపత్తి ఏమీ లేదు. **"పితరం మాతరం గురూన్"**- అని అంటూ తండ్రిని తల్లిని, ఆచార్యులను విడచినట్లు పల్కడం తగునా? **"మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ"** అని వేదం విధిస్తూ ఉండగా, దానిని ఉల్లంఘించడం తగునా? తల్లిదండ్రులను విడువచ్చునా? తల్లిదండ్రులను విడువవచ్చునని ఏదో ఒక విధంగా ఉపపాదించినా, ఆచార్య త్యాగం ఏరీతిలోను సమర్థించే అవకాశం లేదే! **"పంచాచార్యపదాశ్రితః"** అని పొగడబడే భగవద్రామా నుజులు తాము ఏ ఆచార్యులను విడచిపెట్టినవారు కారుకదా! అందువల్ల, వాస్తవానికి త్యాజ్యాలైన ధనధన్యాదులతో పాటుగా త్యజించరాని వాటినికూడా త్యజించినట్లు పల్కడంలో ఏమి సామంజస్యం ఉన్నది? అని కొందఱు ప్రశ్నించవచ్చు. దీనికి సమాధానం ఏమంటే - వీరిని విడువడం అంటే - వారితో విరోధించి పక్కకు గెంటి వేయడమని అర్థం కాదు. కామ్యధర్మోపయోగిగానో, అర్థకామోపయోగిగానో వీరిని గ్రహించ కూడదని తాత్పర్యం. **"గృహాణి"** అని గృహాలను విడచినట్లు తెలుపబడింది. గృహం అంటే - వాసస్థానం. సన్యాసులైనా సరే, ఏవాసస్థానం లేకుండా ఆకాశంలో నిలవడం వీలు కాదు కదా! ఏదో ఒక చోటు ఆవశ్యకం కావలసి ఉన్నందున అవర్జనీయం. కనుక దీనినికూడా విడచి నట్లుగా పల్కడంలోని భావం గమనించాలి. ఈలోకంలో జీవించి ఉన్నంత వరకు ధనధాన్యాదులను విడచిపెట్టడం సాధ్యమా! పరమైకాంతులై, నేరుగా తామే ధనధాన్యాదులను దాచి పెట్టుకోకున్నా, తమకు ప్రతినిధులుగా కొందఱు అంతరంగశిష్యులను అయినా ఏర్పాటు చేసికోవాలికదా! లేకపోతే దేహయాత్రను నిర్వహించే అవకాశం లేనేలేదు. కనుక ఇక్కడ చెప్పబడే త్యాగం సర్వాత్మనా త్యాగం కాదని గ్రహించాలి. **"ధర్మాన్ బంధూన్ సఖీన్"** అనే రీతిలోని కొన్ని విషయాలను

సర్వాత్మనా త్యజిస్తే ఏమి లోపం? - అని అంటే, పూర్వం వివరించిన రీతిలో త్యజించరానివాటిని త్యజించినట్లు చెప్పడంలోని ఆంతర్యం గ్రహించదగినదే. **"కొణ్డపెణ్డిర్ తామ్ముతలా క్కూఱుమున్నార్** కన్మత్తాల్ అణ్డినవరెన్ఱే అవరై విట్టు త్తొణ్డరుడన్ శేర్క్కుమ్ తిరుమాలై చ్చేరుమెన్దాన్ ఆర్క్కు మితమ్ పార్క్కుమ్ **పుకల్** మాఱన్ పణ్డు" (తిరువాయ్మొళి నూన్ఱన్దాది-81) (ఎంత తెలివి లేనివారి విషయంలో అయినా హితాన్ని చేయాలని చూచే కీర్తిని కల నమ్మాళ్వార్లు 'పూర్వం స్వీకరించిన భార్య మొదలుగా చెప్పబడే బంధువర్గం అంతా కర్మకారణంగా చేరినవారని తలచి, కర్మనిబంధనంగా ఏర్పడిన ఆ బంధువులను విడచి తనను ఆశ్రయించినవారిని తన భక్తులతో చేర్చే శ్రియఃపతిని ఆశ్రయించండి'' అని పలికారు.) అని మణవాళ మహామునులు అనుగ్రహించిన రీతిలో ఆళ్వార్లు **"కొణ్డపెణ్డిర్ మక్కళున్నార్"** అనే దశకంలో భార్యలను, పుత్రులను విడచిపెట్టినట్లు పల్కడం వాస్తవమే. ఆ ఆళ్వార్లే తరువాతి ఫలశ్రుతి పాశురంలో **"ఆయిరత్తుళ్ ఇవై పత్తుమ్ వల్లార్కళ్ నల్లపదత్తాల్ మనైవాళ్వర్ కొణ్డపెణ్డిర్ మక్కళే"** (ఈ దశకంలోని పాశురాలను అభ్యసించగల్గినవారు చక్కని స్థితిలో మంచి భార్యా పుత్రులతో కుటుంబ జీవనాన్ని సాగించగలరు) అని పల్కడం గ్రహించాలి. ఒకచోట హేయంగా పల్కిన కుటుంబజీవనాన్ని ఇంకొక చోట ఉపాదేయంగా పలికారు అంటే, త్యాజ్యమని పల్కడంలో కారణం వేఱు; ఉపాదేయం కావడంలో నిబంధనం వేఱు- అని తెలిసికోవడం తగినది కదా! **"గురోరప్యవలిప్తస్య కార్యాంతరమ జానతః, ఉత్పథం ప్రతిపన్నస్య సద్యస్త్యాగో విధీయతే"** (గురువైనా, అతడు మదించినవాడై, వేఱు కార్యాన్ని తెలియక అక్రమంలో ప్రవర్తిస్తే, అతనిని కూడా విడచిపెట్టవలసినదేనని విధింపబడినది) ఇత్యాది శాస్త్రాలను పురస్కరించు కొని అర్థనిష్కర్షను చేయాలి. **"తన్కురువిన్ తాళిణైకళ్తన్నిల్ అన్బొట్టిల్లాతార్, అన్బుతన్బాల్ శెయ్దాలుమ్ అమ్బుయకోన్, ఇన్బమికు విణ్ణాడు తానళిక్క వేణ్డియిరాన్ ఆదలాల్ నణ్ణార్ అవర్కళ్ తిరునాడు"** (తన ఆచార్యుని శ్రీచరణాలలో భక్తిలేనివారు, తన పట్ల భక్తిని కలవారైనా, వారికి శ్రియఃపతి మోక్షాన్ని ప్రసాదించాలని అనుకోడు. అందువల్ల వారు పరమపదాన్ని

పొందలేరు.) అని, **"ఞానమునుట్టాన మివై నన్నాకవే యుడైయనాన కురువై యడైన్దక్కాల్ మానిలత్తిర్! తేనార్‌కమల త్తిరుమామకళ్ కొళునన్ తానే వైకున్దమ్ తరుమ్"** (జ్ఞానం, అనుష్ఠానం- అనే ఈ రెండిటిని చక్కగా కల్గిన గురువును ఆశ్రయిస్తే, ఓలోకులారా! తేనె నిండుగా ఉండే కమలంలో నివసించే లక్ష్మీదేవికి నాథుడైన భగవానుడు తానే స్వయంగా వైకుంఠాన్ని ప్రసాదిస్తాడు) అని అనుగ్రహించిన రీతిలో ఆచార్యసంబంధమే ముక్తికి మూలకారణమై ఉండగా, అటువంటి ఆచార్య సంబంధాన్ని విడచి పెట్టవలసినదని పల్కుతున్నట్లుగా అర్థాన్ని గ్రహించే అవకాశమే లేదు. మాతాపితరులను, ఆచార్యులను, పుత్రమిత్రాదులను భగవద్విభూతులుగా భావిస్తున్నాను - అనేదే ఇక్కడ పరమతాత్పర్యం. వీరే భగవద్భాగవతానుభవ విరోధులైతే వీరిని సర్వాత్మనా త్యజించడంకూడా తగినదే. ఇంకా ఈ విషయంలో మఱింత వివరాన్ని పెద్దలద్వారా విని గ్రహించాలి.

8. త్వ మేవ మాతా చ పితా త్వమేవ త్వమేవ బన్ధుశ్చ గురు స్త్వమేవ ।
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవదేవ ! ॥

దేవదేవ = ఓ దేవదేవా!, **మాతా చ త్వ మేవ పితా చ త్వమేవ** = తల్లివి నీవే, తండ్రివి నీవే, **బంధుశ్చ త్వమేవ గురుశ్చ త్వమేవ** = బంధువు నీవే, గురువు నీవే, **విద్యా త్వమేవ ద్రవిణం త్వమేవ** = జ్ఞానం నీవే, అర్థం నీవే, **మమ సర్వం త్వమేవ** = నాకు సర్వం నీవే.

"పెన్‌ఱ్ఱ తాయ్ నీయే పిఱప్పిత్త తన్నై నీ, మన్‌ఱ్ఱై యారావారుమ్ నీ పేశిల్" (కన్నతల్లిని నీవే, జన్మింపజేసిన తండ్రివి నీవే, ఇంకా మిగిలినవారంతా నీవే) అని, **"శేలేయ్ కణ్ణియరుమ్ పెరుమ్ శెల్వముమ్ నన్మక్కళుమ్ మేలా త్తాయ్ తన్తైయుమ్ అవరే యిని యావారే"** (చేపలవంటి కన్నులు కల స్త్రీలు, గొప్ప సంపద, మంచి సంతానం, ఇంకా, తల్లి, తండ్రి ఆ భగవానుడే, మిగిలిన బంధువులంతా అతడే) అని గల ఆళ్వార్ల సూక్తులను ఇక్కడ అనుసంధించాలి. పూర్వం **"పితరం మాతరం దారాన్"** అనే శ్లోకంలో విడిచినట్లుగా చెప్పబడ్డవి అన్నీ భగవానుడే అని ఈ శ్లోకంలో చెప్పబడింది. భగవానుడు ప్రియప్రవర్తకుడు

కనుక తల్లిగా, హిత ప్రవర్తకుడు కనుక తండ్రిగా- ఇంకా సకలవిధబంధువులు చేయగల్గిన ఉపకారాలను అన్నిటినీ చేయడంవల్ల బంధువుగా, **"కలైయుమ్ వేదముమ్ నీతినూలుమ్ కల్పముమ్ శొల్పొరుళ్ తానుమ్ మన్‌ఱ్ఱై కలైకళుమెల్లామ్ నీర్మైయినాల్"** (కళలను, వేదాలను, నీతిశాస్త్రాన్ని, కల్పాన్ని, పదార్థాలను తెలిపే శాస్త్రాలను అన్నిటినీ దయతో) అనుగ్రహించినందువల్ల ఆచార్యునిగా- ఈ విధంగా అన్ని విధాలుగా చెప్పడంలో లోటు లేదు. తిరుమంగైమన్నన్- **"పేయిరుక్కు నెడువెళ్ళమ్ పెరువిశుమ్బిన్ మీతోడి పెరుకు కాలమ్ తాయిరుక్కుమ్ వణ్ణమే ఉమ్మై త్తన్ వయిన్‌ఱ్ఱిరుత్తి ఉయ్యక్కొణ్డాన్"** (మానవులెవరూ లేని రీతిలో పిశాచాలు మాత్రమే ఉండదగినట్లుగా ఉండే మహాప్రళయంలో ఆకాశంలోకి ప్రళయజలం పైకి ప్రవహించిన కాలంలో, కన్నతల్లి వలె ప్రేమతో మిమ్ములను తన ఉదరంలో పెట్టుకొని కాపాడినవాడు) అని పల్కిన సూక్తినిబట్టి ఇక్కడ ఈ సందర్భంలో పెరియవాచ్చాన్ పిళ్ళై చూపిన అర్థస్వారస్యాన్ని శ్రీదేశికులు- **"మాతా ప్రళయ దశాయామ్ ఉదరే స్థాపయిత్వా ప్రసవనాత్"** (**మాతా**-ప్రళయదశలో ఉదరంలో పెట్టుకొని రక్షించి సృష్టికాలంలో ప్రసవించినందువల్ల తల్లి) అని వ్యాఖ్యానించడం గమనించదగినది.

(త్వమేవ విద్యా) - **"నావినుళ్ నిన్ఱ మలరుమ్ ఞానక్కలైకళైక్కెల్లామ్ ఆవియు మాక్కెయుమ్ తానే"** (జిహ్వనుండి వికసించే శాస్త్రాలకు అన్నిటికీ శబ్దార్థాలు రెండూ తానే) అనే తిరువాయ్‌మొళి శ్రీసూక్తి ఇక్కడ స్మరణీయం. **"నోన్‌ఱ్ఱ నోన్బిలేన్ నుణ్ణఱివిలేన్"** (నోచిన నోము లేదు, సూక్ష్మమైన ఆత్మకు సంబంధించిన జ్ఞానం లేదు - కర్మయోగం చేయలేదు, జ్ఞానయోగాన్ని చేయలేదు) అని ఉండే అకించనులు ఉపాసనారూప విద్యాస్థానంలో భగవానునే నిలుపుకొంటారని - భావం.

(ద్రవిణం త్వమేవ)- "ఉపాయోపేయాలు రెండు నీవే" అని చెప్పిన తీరు ఇది. లోకంలో ద్రవ్యాన్ని కార్యాంతరాలకు సాధనంగా చేసికోవడం, స్వయం భోగ్యంగా గ్రహించడం ప్రత్యక్షసిద్ధం. అది భగవద్విషయంలోకూడా పొసగుతుంది.

9. పితాఽసి లోకస్య చరాచరస్య త్వమస్య పూజ్యశ్చ గురు ర్గరీయాన్ ।
న త్వత్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యో లోకత్రయేఽ ప్యప్రతిమప్రభావ!॥

(గడచిన శ్లోకంలో భగవానుని తమకు ఒక్కరికే తల్లిగా, తండ్రిగా పలికారు. ఆ సంబంధం సర్వలోకసాధారణం కనుక, దానిని తెలిపే శ్లోకాన్ని ఇపుడు అనుసంధిస్తున్నారు. భగవద్గీతలోని 11వ అధ్యాయంలో 43వ శ్లోకం ఇది. దీని తరువాత శ్లోకంకూడా దీనితో చేర్చి అను సంధింపబడుతున్నది)

అప్రతిమప్రభావ = సాటి లేని మేటి వైభవాన్ని కలవాడా!, **త్వమ్ అస్య చరాచరస్య లోకస్య పితా అసి** = స్థావర జంగమాత్మకమైన ఈ లోకానికి అంతటికి తండ్రివై ఉన్నావు, **అస్య లోకస్య పూజ్యః గురుశ్చ అసి** = ఈ లోకానికి పూజింప దగిన ఆచార్యుడవై ఉన్నావు; కనుక, ఈ లోకానికి అంతటికి పూజ్యతముడవు నీవే, **లోకత్రయే అపి త్వత్ సమః అన్యః నాస్తి** = కారుణ్యం మొదలైన గుణాలలో నీతో సమానుడు ముల్లోకాలలోను వేఱొకడు లేడు, **అభ్యధికః కుతః** = సమానుడే లేడు అనినపుడు గొప్పవాడు లేడు అనే విషయం చెప్పాలా! **"ఉపమానోపమే యత్వం యదేకస్యైవ వస్తునః, ఇందురిందురివ శ్రీమానిత్యాదౌ తదనన్వయః"** అని అలంకారిక వచనం. **"గగనం గగనాకారం సాగరః సాగరోపమః, రామ లావణయోర్యుద్ధం రామరావణయోరివ"** ఇత్యాదులు ఉదాహరణలుగా గ్రాహ్యాలు. **"ఒత్తార్ మిక్కారై యిలై యాయ మామాయన్"** కదా! (తనకు సాటి అయినవారిని, మించిన వారిని లేని గొప్ప ఆశ్చర్యభూతుడు)

ఇక్కడ **"త్వత్ సమః నాస్తి"** అని అనకుండా **"త్వత్ సమః అన్యః నాస్తి"** అని అన్నందువల్ల నీకు సమానుడవు నీవే- అని భావం. **"తన్నొప్పాన్ తానాయ్ ఉళన్ కాణ్"** (తనకు సాటి అయినవాడు తానై ఉన్నాడు సుమా) అని తిరుమళిశై ప్పిరాన్‌కూడా అన్నారు.

10. తస్మాత్ప్రణమ్య ప్రణిధాయ కాయం ప్రసాదయే త్వా మహ మీశ మీడ్యమ్ ।
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః ప్రియః ప్రియాయార్హసి దేవ! సోఢుమ్ ॥

తస్మాత్ = పూర్వశ్లోకంలో చెప్పిన రీతిలో నీవు సర్వస్మాత్‌పరుడవై ఉన్నందు వల్ల, **అహం** = లోటు పాట్లు మూర్తీభవించినవాడనై ఉండే నేను, **ఈశమ్ ఈడ్యమ్ త్వాం** = సర్వనియంతవుగాను, స్తోత్రార్హుడవుగాను ఉండే నిన్ను, **కాయం ప్రణిధాయ ప్రణమ్య** = (వేఱు తెగిన చెట్టువలె), శరీరాన్ని నేలపై మోపి, సాష్టాంగంగా నమస్కరించి, **ప్రసాదయే** = క్షమను అభ్యర్థిస్తున్నాను, **దేవ** = దేవా!, **పుత్రస్య (దోషం) పితా ఇవ** = పుత్రుని దోషాన్ని తండ్రి క్షమించినట్లు, **సఖ్యుః దోషమ్ సఖా ఇవ** = మిత్రుని అపరాధాన్ని మిత్రుడు సహించినట్లు, **ప్రియాయ (మహ్యమ్)** = ప్రియుడనైన నాపట్ల, **ప్రియః (త్వమ్) సోఢుమ్ అర్హసి** = ప్రియుడవైన నీవు (నా అపరాధాలను) క్షమించు.

"ప్రియః ప్రియాయార్హసి" అనేచోట **"ప్రియః ప్రియాయాః అర్హసి"** అనే పదవిభజన చేయవచ్చు. అపుడు జరిగిన సంధిని ఆర్షంగా భావించాలి. ప్రియురాలి యొక్క దోషాన్ని ప్రియుడు సహించినట్లు - అని దీని భావం.

11. మనోవాక్కాయైర నాదికాలప్రవృత్తానన్తాకృత్యకరణకృత్యాకరణ భగవద పచార భాగవతాపచారాసహ్యాపచారరూప నానావిధానన్తాపచారాన్ ఆరబ్ధకార్యాన్ అనారబ్ధకార్యాన్ కృతాన్ క్రియమాణాన్ కరిష్యమాణాంశ్చ సర్వానశేషతః క్షమస్వ॥

మనోవాక్కాయైః = మనస్సు, వాక్కు, **శరీరం** = అనే మూడు కరణాలతో, **అనాదికాలప్రవృత్త** = మొదలు తెలియని నాటినుండి ప్రవృత్తమైన, అనవరత= నిలుపులేని, **అకృత్యకరణ** = చేయకూడని కార్యాలను చేయడం, **కృత్య + అకరణ**= చేయవలసిన కార్యాలను చేయకపోవడం, **భగవత్+అపచార** = భగవానునిపట్ల అపచారపడడం, **భాగవత+అపచార** = భగవద్భక్తుల విషయంలో అపచారపడడం, **అసహ్య+అపచార** = సహించడానికి సాధ్యం కాని రీతిలో అపచారపడడం- అనే రీతిలోని, నానావిధ+అనంత+అపచారాన్ = పలు రీతులలోని, అపరిమితాలైన అపచారాలను (దీనికి **"అశేషతః క్షమస్వ"** అనే దానితో అన్వయం) **అశేషతః** = అణువు అంతకూడా శేషించకుండా పూర్తిగా, **క్షమస్వ** = క్షమించు,

ఈ అపచారాలు ఎటువంటివి? అంటే,

ఆరబ్ధకార్యాన్ = ఫలాన్ని ఇవ్వడం ఆరంభించిన అపచారాలను, **అనారబ్ధ కార్యాన్** = ఇంక ఫలాన్ని ఇవ్వడం ఆరంభించని పాపాలను, **కృతాన్** = గడచిన కాలంలో చేయబడిన పాపాలను, **క్రియమాణాన్** = వర్తమానకాలంలో చేయబడు తున్న పాపాలను, **కరిష్యమాణాన్ చ** = భవిష్యత్కాలంలో చేయబడే పాపాలను, (**క్షమస్వ** = క్షమించు).

(సర్వాన్) = లోకంలో వారు వారు చేసే అపచారాలు మానసికాలుగా, వాచికాలుగా, కాయికాలుగా ఉండడం ప్రసిద్ధమై ఉండగా, **"మనోవాక్కాయైః ప్రవృత్త"** అని చెప్పవలసి ఉన్నదా? అని అంటే, భగవానుని చింతించడంకోసం ఉండే మనస్సును, అతనిని స్తుతించడంకోసం ఉండే వాక్కును, అతనికి సేవ చేయడంకోసం ఉండే శరీరాన్ని ఉపయోగించి అయ్యో! దుర్వినియోగ పరుస్తున్నారే! - అనే నిర్వేదం ఈ ప్రయోగం ద్వారా వ్యక్తమవుతున్నది.

ఈ పాపాలు ఎన్నాళ్ళనుండి చేయబడుతున్నవి? - అని అంటే - **"అనాది కాలప్రవృత్తాన్"** అని అంటున్నారు. సంసారం అనాది, **"బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున!"** (అర్జునా! నాకు నీకు కూడా జన్మలు అనేకం గడిచాయి) అని గీతలో పల్కిన రీతిలో పూర్వం గడచిన జన్మలకు ఒక లెక్క లేదు. ఈ విధంగా ఆది తెలియని కాలంనుండి ప్రవృత్తమైనవి. అందువల్లనే అవి అనంతాలు. వాటిని **"అకృత్యకరణ"** ఇత్యాదిగా విభజించి పల్కుతున్నారు.

అకృత్యకరణ - మంటే చేయకూడనివిగా శాస్త్రాలలో చెప్పబడిన దుష్కర్మ లను చేయడం. **"న హింస్యాత్ సర్వా భూతాని"** (ఏ ప్రాణిని హింసించకూడదు) అనే వేదవిధిని అతిక్రమించి జీవులకు బాధను కల్గించడం, ప్రాప్త విషయాలను స్తుతించవలసిన వాక్కుతో తగని విషయాలను స్తుతించడం, ఇతరుల సొత్తు, భార్యలు మొదలైన వానిని అపహరించడం, అబద్ధాలు పల్కడం, తినకూడదని వస్తువులను ఇష్టం వచ్చినట్లుగా తినడం - మొదలైన రీతిలో అనేక విధాలుగా అకృత్య కరణాలు ఉంటాయి.

కృత్యాకరణ మంటే - శాస్త్రాలలో విధింపబడిన వర్ణాశ్రమధర్మాలను సోమరి తనంవల్ల, విసుగువల్ల, నాస్తిక్యంవల్ల అనుష్ఠించకుండా విడిచివేడయం.

భగవదపచారమంటే - భగవానుడైన శ్రీమన్నారాయణుని ఇతర దేవతలతో సమానంగా భావించడం, రామకృష్ణాది భగవదవతారాలను మానవ సజాతీయాలుగా భావించడం, అర్చామూర్తుల ఉపాదానంలో - అంటే - అది నిర్మింపబడ్డ ద్రవ్యాన్ని గూర్చి పరిశీలించడం మొదలైనది. భాగవతాపచార మంటే - అహంకారంతోను, అర్థకామాలను దృష్టిలో పెట్టుకొని భగవద్భక్తులను ద్వేషించడం, అసహ్యాపచార మంటే - పూర్వం తెల్పిన రీతిలో అర్థకామాదులైన హేతువులు లేకుండానే, హిరణ్య కశిపునివలె భగవానుని, భాగవతులను చూచినా, వినినా సహించలేకపోవడం

ఆచార్యుల పట్ల చేసే అపచారం అసహ్యాపచార మనబడుతుంది. అంటే - ఆచార్యుడు ఉపదేశించిన అర్థాలను అల్పప్రయోజనాలకోసం అధికారం యోగ్యత లేనివారికి ఉపదేశించడం ఇత్యాదులు. ఆచార్య భక్తులైన సబ్రహ్మచారులతో కలసి వర్తించవలసి ఉండగా, ఆ విధంగా ఉండకుండా, వారి సామర్థ్యాన్ని చూచి అసూయ పడడం, వారిని అవమానించడం మొదలైనవి. అసహ్యాపచారాలు **"భాగవతభక్త విషయాపచారః అసహ్యాపచారః"** (భాగవత భక్తుల విషయంలో చేసే అపచారం అసహ్యాపచారం) అని శ్రీశ్రుతప్రకాశికా చార్యులవారి వివరణం. వారు తమ వ్యాఖ్యలో భగవదపచారాన్ని వివరించిన తీరు చాలా అందమైనది. **"భగవదపచారో భాగవతాపచారః, భాగవతాపచారో భగవదపచారః"** (భగవదపచారమే భాగవతాపచారం, భాగావతాపచారమే భగవదపచారం) అని వారి సూక్తి. భాగవతుల పట్ల చేసిన అపచారం భగవదపచారంగా పర్యవసిస్తుంది. **"పాండవాన్ ద్విషసే రాజన్! మమ ప్రాణా హి పాండవాః"** (రాజా! నీవు పాండవులను ద్వేషిస్తున్నావు. పాండవులు నాకు ప్రాణాలు కదా!) అనే భగవానుని సూక్తిని, **"యదపరాధ సహస్రమజస్రజం త్వయి శరణ్య! హిరణ్య ఉపావహత్, వరద! తేన చిరం త్వమవిక్రియో వికృతి మృచ్ఛకనిర్భజనాదగాః"** (వరదరాజస్వామి నిరంతరం ఈ విషయంలో ఎన్నో అపచారాలను హిరణ్యకశిపుడు చేసినా నీవు అతని పట్ల కోపించలేదు. కాని నీ భక్తుడైన ప్రహ్లాదుని విషయంలో అపచారం చేసిన వెంటనే కోపాన్ని పొందావు) అనే కూరేశుల సూక్తి స్మరణీయాలు.

భగవానుని ఉద్దేశించి పలికే ఈ చూర్ణికలో **"త్వదపచార"** అని ప్రత్యక్షంగా మధ్యపురుషలో చెప్పవలసి ఉండగా, **"భగవదపచార"** అని పరోక్షంగా పల్కడం తగునా? అని సందేహించవచ్చు. ఈ విధంగా పల్కినా లోటు లేదు. భగవదపచారమనే ప్రసిద్ధి ప్రాచుర్యాన్ని పొందినందువల్ల ఈ విధంగా ప్రయోగింపబడింది. **"త్వదపచారేతి వక్తవ్యేపి అత్ర భగవదపచారశబ్దః తత్తప్రమాణోపాత్తప్రకార సూచనార్థః"** అని వేదాంతదేశికసూక్తి. ఈ చూర్ణికలో **"అనంత"** అనే పదం రెండు మార్లు ప్రయోగింపబడింది. మొదట గల అనంత శబ్దం అకృత్యకరణ - కృత్యాకరణ రూప సామాన్యాపచారాలలో అన్వయిస్తుంది. రెండవ పదం భగవదపచారాలలో అన్వయిస్తుంది.

(ఆరబ్ధకార్యాన్ అనారబ్ధకార్యాన్) - ప్రారబ్ధకర్మలని, సంచితకర్మలని కర్మలు రెండు విధాలు. మనం చేసే కర్మలు అప్పటికప్పుడే ఫలించవు. పరిణామ క్రమంలోనే ఫలాన్ని ఇస్తాయి. ఆ రీతిలో ఫలాన్ని ఇవ్వడం ఆరంభించిన కర్మలు ప్రారబ్ధకర్మలు. అవి ప్రకృతంలో **"ఆరబ్ధకార్యాన్"** అని తెలుపబడ్డాయి. అటువంటి ప్రారబ్ధకర్మలచేత అడ్డగింపబడినవై, ఇంకా ఫలాన్ని ఇవ్వడం ఆరంభం కాని కర్మలు సంచితకర్మలు. అవి ఇక్కడ **"అనారబ్ధకార్యాన్"** అని నిర్దేశించబడ్డాయి.

12. అనాదికాలప్రవృత్తం విపరీతజ్ఞాన మాత్మవిషయం, కృత్స్నజగద్విషయం చ విపరీతవృత్తం చాశేషవిషయమద్యాపి వర్తమానం వర్తిష్యమాణం చ సర్వం క్షమస్వ॥

ఇక, మోక్షవిరోధులైన పుణ్యపాపరూపాలైన ప్రతిబంధకాలను క్షమించాలని వేడుతున్నారు.

అనాదికాలప్రవృత్తం = ఆది తెలియని కాలంనుండి ఆరంభమైనది, **ఆత్మ విషయం కృత్స్నజగద్విషయం చ విపరీతజ్ఞానం** = ఆత్మకు చెందినది, సమస్త జగత్తును గూర్చినది అయిన విపరీతజ్ఞానాన్ని (క్షమించాలి), **అశేషవిషయం** = అన్నిటిని విషయంగా కల్గినది, **అద్యాపి వర్తమానం** = ఇంకా ఈనాటికీ అనువర్తించి ఉన్నది, **వర్తిష్యమాణం చ** = ఇకపైకూడా వాసనాబలంవల్ల

సంభవించబోయేది, **సర్వం చ విపరీతవృత్తం క్షమస్వ** = సర్వమైన నిషిద్ధానుష్ఠానాన్ని క్షమించు.

ఆత్మవిషయంలోని విపరీతజ్ఞానం అంటే - దేహాత్మాభిమానం, స్వతంత్రాత్మభ్రమ, అన్యశేషత్వభ్రాంతి ఇత్యాదులు. కృత్స్నజగద్విషయమైన విపరీతజ్ఞానం అంటే- **"సర్వభూతాత్మికే తాత! జగన్నాథే జగన్మయే, పరమాత్మని గోవిందే మిత్రామిత్రకథా కుతః"** (తండ్రీ! సర్వభూతాత్మకుడు, జగన్నాథుడు, జగద్రూపుడు, పరమాత్మ అయిన గోవిందుడుండగా, ఇక మిత్రులనే - శత్రువులనే ప్రసక్తి ఎక్కడ ఉన్నది?) అనే ప్రహ్లాదుని క్రమంలో కాకుండా దేవతిర్యక్ మనుష్యాది పదార్థాలను తావన్మాత్రంగా తెలిసికోవడం. **"ఆత్మవిషయం, కృత్స్న జగద్విషయమ్"** అనే విశేషణాలు **"విపరీతవృత్తమ్"** అనే విశేష్యంలో కూడా అన్వయిస్తాయి. ఆత్మవిషయమైన విపరీతవృత్తం అంటే - స్వరక్షణే స్వాన్వయం మొదలైనవి. జగద్విషయమైన విపరీతవృత్తం అంటే - తనపట్ల ఒకడు హానినిచేస్తే దానిని తన కర్మఫలంగానో, భగవానుని కృపాఫలంగానో భావించకుండా, దానిని నిమిత్తమాత్రుడైన చేతనుని స్వతంత్రునిగా భావించి, "అతడు నాకు హాని చేశాడు" అని తలచి, అతనిపట్ల ఒకటికి పదిరెట్లు అపకారా లను చేయడం. **"విశేషవిషయమ్"** -ఐశ్వర్యం మొదలైన పురుషార్థాలనుకోరడం- ఇత్యాది కామ్యాలు వివక్షితాలు. పూర్వం చేసినవానిని, ఇపుడు చేసేవానిని, ఇకపై చేయబోయేవానిని అన్నిటినీ జ్ఞానహీనుడనైన నేను తెలియకపోయినా, సర్వజ్ఞుడవైన నీవే వాటిని తెలిసి క్షమించాలి-అని ప్రార్థిస్తున్నారు.

13. మదీయానాది కర్మప్రవాహప్రవృత్తాం, భగవత్స్వరూప తిరోధానకరీం, విపరీత జ్ఞానజననీం, స్వవిషయాయాశ్చ భోగ్యబుద్ధేర్జననీం, దేహేంద్రియత్వేన భోగ్యత్వేన సూక్ష్మరూపేణ చావస్థితాం, దైవీం గుణమయీం మాయాం, దాసభూతం "శరణా గతోఽస్మి తవాస్మి దాసః" ఇతి వక్తారం మాం తారయ॥

పూర్వం తెల్పిన అజ్ఞానానికి మూలకారణమైన దేహసంబంధాన్ని పోగొట్టాలి- అని ఈ చూర్ణికలో ప్రార్థిస్తున్నారు. భగవానుడు గీతలో **"దైవీ**

హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా, మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే" (త్రిగుణాత్మకమైన, నాకు క్రీడాపరికరమైన, మాయాశబ్దవాచ్య అయిన ఈ ప్రకృతి ఎవరికీ దాటరానిది. నన్ను ఎవరు ఆశ్రయిస్తారో, వారే ఈ మాయను దాటుతున్నారు) అని పలికాడుకదా. దానిని ఉద్దేశించి ఇక్కడ **"మామ్ తారయ"** అని పలికారు. మాయ అంటే- ప్రకృతి. దానిని దాటినవాడను (పోగొట్టు కొన్నవాడను) అయినట్లుగా నన్ను అనుగ్రహించాలి - అని అంటున్నారు.

మదీయ+అనాది కర్మ ప్రవాహప్రవృత్తాం = చిరకాలంగా నేను చేస్తూ వచ్చిన కర్మపరంపరలచే ఏర్పడినది, **భగవత్స్వరూప తిరోధానకరీం** = భగవానుని స్వరూపాన్ని తెలిసికోనీయకుండా మఱుగుపరచేది, **విపరీతజ్ఞాన జననీం** = దేహాత్మ భ్రమ మొదలైన విపరీతజ్ఞానాలను కల్గించేది, **స్వవిషయాయాః భోగ్యబుద్ధేః చ జననీం** = స్వకార్యరూపమైన శబ్దాదివిషయాలలో భోగ్యబుద్ధిని కల్గించేది, **దేహేంద్రియత్వేన భోగ్యత్వేన సూక్ష్మరూపేణ చ అవస్థితామ్** = భోగస్థానమైన దేహరూపంతోను, భోగోపకరణమైన ఇంద్రియరూపంతోను, భోగ్యమైన శబ్దాది రూపంతోను - వీటికి అన్నిటికి మూలకారణమైన సూక్ష్మ ప్రకృతిరూపంతోను (ఈ విధంగా నాల్గు విధాలైన పరిణామాలను కల్గినదై ఉండే), **దైవీం** = **"ఇన్బుఱుమివ్వినైయాట్టుడైయాన్"** (ఆనందం కల్గించే ఈ లీలలను కలవాడు) కనుక దేవుడనే పేరును కల నీచే క్రీడాపరికరంగా గ్రహింపబడినదైన, **గుణమయీం**= సత్త్వరజస్తమోగుణ రూపమైన, **మాయామ్**= విచిత్రకార్యకరం కనుక మాయ అనే పేరును పొందిన ప్రకృతిని, (దీనికి **"మామ్ తారయ"** అనే దానితో అన్వయం)

"దాసభూతమ్" అని, **"శరణాగతోఽస్మి దాస ఇతి వక్తారమ్"** అని అంటూ, **"మామ్"** అనే విశేష్యానికి రెండు విశేషణాలు ప్రయోగిస్తున్నారు.

దాసభూతం = దాసునిగాను, **శరణాగతః+అస్మి ఇతి వక్తారం** = ద్వయం పూర్వఖండంలోని క్రమంలో శరణాగతుడను అని, ఉత్తరఖండంలో చెప్పబడ్డ

రీతిలో కైంకర్యనిష్ఠుడను - అని నోఱు తెఱచి చెబుతున్న, **మామ్**= నన్ను, **తారయ** = (ప్రకృతిని) దాటినవాడనుగా చేయాలి.

"మాయాం మాం తారయ" అనేది ద్వికర్మకప్రయోగం.**"తవాస్మి దాసః"** అనేచోట గల **"అస్మి"** అనేది ప్రార్థనాభిప్రాయంతో ప్రయోగింపబడినదని గ్రహించాలి. దాసవృత్తినిరతుడనై ఉంటాను- అని భావం. ఈ విధంగా అర్థం చెప్పకపోతే పూర్వం **"దాసభూతమ్"** అనేదానినే తిరిగి చెప్పినట్లు అవుతుంది, అంతే- అని శ్రీదేశికుల అభిప్రాయం.

ఇకపై ద్వయం ఉత్తరవాక్యంలోని **"నారాయణాయ"** చతుర్థీవిభక్తియొక్క అర్థమైన ఇష్టప్రాప్తినిగూర్చి ప్రార్థిస్తున్నారు.

14. **తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే ।**
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః ॥
ఉదారా స్సర్వ ఏవైతే జ్ఞానీత్వాత్మైవ మే మతమ్ ।
అస్థిత స్స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ ॥
బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే ।
వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥

ఇతి శ్లోకత్రయోదిత జ్ఞానినం మాం కురుష్వ ।

తేషాం = ఆ ముగ్గురిలో, **జ్ఞానీ విశిష్యతే** = జ్ఞాని విశేషింపబడుతున్నాడు. అతని వైలక్షణ్యానికి ఏమి కారణం? అంటే, **నిత్యయుక్తః ఏకభక్తిః** = నిత్య యుక్తుడై, ఏకభక్తిగా అతడు ఉండడంవల్ల. **"జ్ఞానినః అత్యర్థం ప్రియః అహమ్"** = జ్ఞానికి నాపట్ల గల ప్రీతి వాచామ గోచరం, **స చ మమ ప్రియః** = ఆ రీతిలోనే ఆ జ్ఞానిపట్ల నాకు గల ప్రీతికూడా వాచామగోచరమే.

ఏతే సర్వే ఏవ ఉదారాః = పూర్వం తెల్పిన అధికారులు అందఱు నన్నే ఉపాసిస్తున్నందువల్ల వారు ఔదార్యాన్ని కలవారు. **"జ్ఞానీ తు ఆత్మైవ మే మతమ్"** = జ్ఞాని అయితే నా ఆత్మయే అని నామతం, (ఎందుకు? అంటే), **స హి యుక్తాత్మా మామ్ ఏవ అనుత్తమాం గతిమ్ ఆస్థితః** = నాతో కలిసి సదా ఉండాలి - అని భావించే ఆ అధికారి నన్నే గొప్ప ప్రాప్యంగా భావించడంవల్ల.

(**బహూనాం జన్మనామ్ అంతే** -అనే రాబోయే శ్లోకంలోకూడా జ్ఞానియొక్క గొప్పతనమే చెప్పబడుతున్నది) **బహూనాం జన్మనామ్ అంతే** = పలు పలు జన్మలు గడచిన పిదప, **జ్ఞానవాన్ సన్** = నాకు శేషమై ఉండడమే ఆత్మస్వరూప మని తెలిసినవాడై, **మామ్ ప్రపద్యతే** = జ్ఞాని అయినవాడు నన్ను సేవిస్తున్నాడు. (ఏవిధంగా సేవిస్తున్నాడు? అని అంటే), **వాసుదేవః సర్వమ్ ఇతి** = భుజించే అన్నం, తాగే నీరు, అనుభవించే తాంబూలం అంతా- ధారక, పోషక, భోగ్యాలు అన్నీ- శ్రీకృష్ణుడే - అనే భావనతో సేవిస్తున్నాడు. **సః మహాత్మా సుదుర్లభః=** అటువంటి మహాత్ముడు నాకు దొరకడం అరుదు.

ఇతి శ్లోకత్రయోదిత జ్ఞానినం మాం కురుష్వ = అని ఈ విధంగా ఈమూడు శ్లోకాలలోను గొప్పగా తెలుపబడ్డ జ్ఞానిని అయేటట్లుగా నన్ను చేయాలి- (అని ప్రార్థించినట్లయినది.)

నమశ్శబ్దార్థమైన విరోధినిరసనాన్నిగూర్చి పూర్వం ప్రార్థించారు. తావన్మాత్రంలో నిలవడం సాధ్యమా! పరమపురుషార్థమైన కైంకర్యసిద్ధికూడా కావాలికదా ! కనుక ఆ కైంకర్యాన్ని ప్రార్థించాలని తలచి, దానికి ఆవశ్యకమైనవి, కైంకర్యంవలెనే ప్రియవిషయాలై, పరమపదంలోకూడా అనువర్తించేవి అయిన పరభక్తి-పరజ్ఞాన- పరమభక్తులను అపేక్షించాలని తలచి, భక్తిరూపాపన్నమైన జ్ఞానాన్ని కల్గినవారికే ఇవి సిద్ధిస్తాయి కనుక, ఆ జ్ఞానం కలగాలని, గీతాచార్యుడు అనుగ్రహించిన మూడు శ్లోకాలను పురస్కరించుకొని, ఆ జ్ఞానాన్ని కల్గించాలని ప్రార్థిస్తున్నారు. భగవద్గీతలోని ఏడవ అధ్యాయంలో 17వ, 18వ, 19వ శ్లోకాలను క్రమంగా అనుసంధించి, ఈ మూడు శ్లోకాలవల్ల తెలుపబడిన జ్ఞానాన్ని కలవాడను అయినట్లుగా నన్ను అనుగ్రహించాలని ప్రార్థిస్తున్నారు.

ఈ మూడు శ్లోకాలకు క్రమంగా అర్థం వివరింపబడుతున్నది.

గడచిన (గీతా) శ్లోకంలో **"చతుర్విధా భజంతే మామ్"** అని ప్రారంభించి తనను పూజించేవారు నాల్గు విధాలుగా ఉంటారు- అని శ్రీకృష్ణుడు పలికాడు. భ్రష్టైశ్వర్యకాముడు, అపూర్వైశ్వర్యకాముడు, ఆత్మానుభవమనబడే కైవల్యాన్ని కోరేవాడు, భగవదనుభవమనే పరమపురుషార్థాన్ని కోరేవాడు - అని నల్గురుగా

చెప్పబడినా, ఐశ్వర్యకాములు ఇద్దఱు ఒకే వర్గానికి చెందినవారు కనుక, పురుషార్థకాములు మూడు విధాలుగా చెప్పబడ్డారు. మూడు విధాలైన భక్తులలో జ్ఞాని చాలా గొప్పవాడని చెప్పబడింది. **"తేషాం జ్ఞానీ నిత్యయుక్తః ఏకభక్తిః విశిష్యతే"** అని.

తేషాం = ఆ ముగ్గురిలో, **జ్ఞానీ విశిష్యతే** = జ్ఞాని విశేషింపబడుతున్నాడు. అతని వైలక్షణ్యానికి ఏమి కారణం? అంటే, **నిత్యయుక్తః ఏకభక్తిః** = నిత్య యుక్తుడై, ఏకభక్తిగా అతడు ఉండడంవల్ల.

"జ్ఞానినః అత్యర్థం ప్రియః అహమ్" - జ్ఞానికి నాపట్ల గల ప్రీతి వాచామ గోచరం - అని భావం. **స చ మమ ప్రియః** ఆ రీతిలోనే ఆ జ్ఞానిపట్ల నాకు గల ప్రీతికూడా వాచామగోచరమే. **ఏతే సర్వే ఏవ ఉదారాః** = పూర్వం తెల్పిన అధికారులు అందఱు నిన్నే ఉపాసిస్తున్నందువల్ల వారు ఔదార్యాన్ని కలవారు. నావద్దనుండి ఏదో ఒక పురుషార్థాన్ని అయినా ప్రార్థించి గ్రహించేవారిని నేను సర్వస్వదాతలుగా భావిస్తాను- అని భావం. **"జ్ఞానీ తు ఆత్మైవ మే మతమ్"** (జ్ఞాని అయితే నా ఆత్మయే అని నామతం) అయినా వారిలో జ్ఞానినే నాప్రాణంగా నేను తలుస్తాను - అని భావం. ఎందుకు? అంటే, **స హి యుక్తాత్మా మామ్ ఏవ అనుత్తమాం గతిమ్ ఆస్థితః** = నాతో కలిసి సదా ఉండాలి - అని భావించే ఆ అధికారి నన్నే గొప్ప ప్రాప్యంగా భావించడంవల్ల - అని భావం. **బహూనాం జన్మనామ్ అంతే** -అనే రాబోయే శ్లోకంలోకూడా జ్ఞానియొక్క గొప్పతనమే చెప్పబడుతున్నది) **బహూనాం జన్మనామ్ అంతే** = పలు పలు జన్మలు గడచిన పిదప, **జ్ఞానవాన్ సన్** = నాకు శేషమై ఉండడమే ఆత్మస్వరూప మని తెలిసినవాడై, **మామ్ ప్రపద్యతే** = జ్ఞాని అయినవాడు నన్ను సేవిస్తున్నాడు. ఏవిధంగా సేవిస్తున్నాడు? అని అంటే, **వాసుదేవః సర్వమ్ ఇతి** = **"ఉణ్ణుమ్ శోఱు పరుకు నీర్ తిణ్ణుమ్ వెఱ్ఱిలైయుమ్ ఎల్లామ్ కణ్ణన్"** (భుజించే అన్నం, తాగేనీరు, అనుభవించే తాంబూలం అంతా- ధారక, పోషక, భోగ్యాలు అన్నీ- శ్రీకృష్ణుడే) అనే భావనతో సేవిస్తున్నాడు. **సః మహాత్మా సుదుర్లభః=** అటువంటి మహాత్ముడు నాకు దొరకడం అరుదు.

ఈ విధంగా ఈ మూడు శ్లోకాలలోను గొప్పగా తెలుపబడ్డ జ్ఞానిని అయేటట్లుగా నన్ను చేయాలి- అని ప్రార్థించినట్లయినది.

15. **పురుష స్స పరః పార్థ ! భక్త్యా లభ్యస్త్వనన్యయా ।**
భక్త్యా త్వనన్యయా శక్యః ।
మద్భక్తిం లభతే పరామ్ ।
ఇతి స్థానత్రయోదిత పరభక్తియుక్తం మాం కురుష్వ ।

పార్థ = అర్జునా !, **సః**= ఆ, **పరః**= గొప్పవాడైన, **పురుషః**= భగవానుడు, **అనన్యయా**= వేఱొకరిపట్ల కల్గి ఉండని, **భక్త్యా** = భక్తిచేత, **లభ్యః**= పొందదగిన వాడు,

అనన్యయా= వేఱు ప్రయోజనాన్ని కోరని, **భక్త్యా తు**= భక్తిచేతనే, **శక్యః**= పొందసాధ్యమైనవాడు,

పరాం = గొప్పదైన, **మద్భక్తిం** = నా విషయంలో గల భక్తిని, **లభతే**= పొందుతున్నాడు.

ఇతి = అనే, **స్థాన త్రయోదిత**= మూడు చోట్లచెప్పబడ్డ, **పరభక్తి యుక్తం**= పరభక్తిని కల్గినవానినిగా, **మాం**= నన్ను, **కురుష్వ**= చేయాలి.

"పురుషః స పరః పార్థ" అనే గీతలోని ఎనిమిదవ అధ్యాయంలో 22వ శ్లోకం. **"భక్త్యా త్వనన్యయా శక్యః"** అనే 16వ అధ్యాయంలో 54వ శ్లోకం. **"మద్భక్తిం లభతే పరామ్"** అనే 18వ అధ్యాయంలో 54వ శ్లోకం - ఈ విధంగా ఈ మూడు శ్లోకాలలోను చెప్పబడిన పరభక్తిని దాసుడనైన నాకు కలిగే టట్లుగా అనుగ్రహించాలి- అని ప్రార్థిస్తున్నారు.

16. **పరభక్తి పరజ్ఞాన పరమభక్త్యైకస్వభావం మాం కురుష్వ ॥**

పరభక్తి పరజ్ఞాన పరమభక్త్యైకస్వభావం మాం కురుష్వ = పరభక్తి-పరజ్ఞానం- పరమభక్తి - అనే ఈ మూడు మూర్తీభవించిన వానినిగా నన్ను చేయాలి.

పరభక్తి కలుగగానే పర్యాప్తి (తృప్తి) కలుగదు కదా. పరభక్తి-పరజ్ఞానం-పరమభక్తి- అనే ఈ మూడు మూర్తీభవించినవానినిగా నన్ను చేయాలని భావం.

17. **పరభక్తి పరజ్ఞాన పరమభక్తికృత పరిపూర్ణానవరత నిత్యవిశదతమానన్య ప్రయోజనానవధికాతిశయప్రియ భగవదనుభవోఽహం, తథావిధ భగవదనుభవ జనితానవధికాతిశయ ప్రీతికారితాశేషావస్థోచితాశేషశేషతైక రతిరూప నిత్యకింకరో భవాని ॥**

పరభక్తి = పరభక్తి, **పరజ్ఞాన**= పరజ్ఞానం, **పరమభక్తి**= పరమభక్తి- అనే వీటిచే, **కృత**= కల్గింపబడిన, **పరిపూర్ణ**= స్వరూపరూప గుణాదులతో పూర్ణమైన, **అనవరత**= నిరంతరమైన, **నిత్య**= నిత్యమైన, **విశదతమ**= చాలా విశదమైన, **అనన్య ప్రయోజన**= ఈ అనుభవం తప్ప వేఱొక ఆనందాన్ని ప్రయోజనంగా కల్గి ఉండని, **అనవధిక+అతిశయ** = అంతులేని గొప్పతనాన్ని కల్గినదైన, **భగవత్+అనుభవః**= భగవానుని అనుభవాన్ని పొందినవాడనైన, **అహం**= నేను, **తథావిధ**= అటువంటి, **భగవదనుభవ**= అనుభవంచేత, **జనిత**= కల్గిన, **అనవధిక+అతిశయ**= అంతులేని గొప్పతనాన్ని కల్గిన, **ప్రీతి**= ఆనందంచేత, **కారిత**= చేయించబడిన, **అశేష+ అవస్థోచిత**= అన్ని సన్నివేశాలకు తగిన, **అశేష**= సమస్తమైన, **శేషతైకరతిరూప**= కైంకర్యాలలో మాత్రమే ఉండే ఆశయే, మూర్తీభవించినవాడనై, **నిత్యకింకరః**= నిత్యం కైకర్యాన్ని చేసేవాడనై, **భవాని**= కావాలి.

ఈ చూర్ణికలో నిత్యానుభవాన్ని, నిత్యకైంకర్యాన్ని పొందాలని ప్రార్థింప బడు తున్నది. ఈ చూర్ణికలోని పదాలే తరువాతి చూర్ణికలో ఉన్నందువల్ల, వీటి అర్థాన్ని అక్కడ వివరణలో చూడవచ్చు.

18. **ఏవమ్భూత మత్కైఙ్కర్యప్రాప్త్యుపాయతయాఽవక్లృప్త సమస్తవస్తువిహీనోఽపి, అనన్తతద్విరోధి పాపాక్రాన్తోఽపి, అనన్తమదపచార యుక్తోఽపి, అనన్తమదీయాపచారయుక్తోఽపి, అనన్తాసహ్యాపచార యుక్తోఽపి, ఏతత్కార్యకారణ భూతానాది విపరీతాహంకార విమూఢాత్మస్వభావోఽపి, ఏతదుభయకార్య కారణభూతానాది విపరీతవాసనాసమ్బద్ధోఽపి, ఏతదనుగుణ ప్రకృతి**

విశేససమ్బద్ధోఽపి, ఏతన్మూలాధ్యాత్మికాధిభౌతికాధిదైవిక సుఖదుఃఖతద్ధేతు తదితరోపేక్షణీయ విషయానుభవజ్ఞాన సఙ్కోచరూప మచ్చరణారవిన్ద యుగళైకాన్తిక పరభక్తి పరజ్ఞాన పరమభక్తి విఘ్నప్రతిహతోఽపి, యేన కేనాపి ప్రకారేణ ద్వయవక్తా త్వం కేవలం మదీయయైవ దయయా నిశ్శేషవినష్ట సహేతుకమచ్చరణారవిన్ద యుగళైకాన్తికాత్యన్తిక పరభక్తి పరజ్ఞాన పరమభక్తిః, మత్ప్రసాదలబ్ధ మచ్చరణారవిన్ద-యుగళైకాత్యన్తిక పరభక్తిపరజ్ఞానపరమభక్తిః, మత్ప్రసాదాదేవ సాక్షాత్కృత యథా వస్థిత మత్స్వరూపరూప గుణవిభూతిలీలోప కరణవిస్తారః అపరోక్షసిద్ధమన్ని యామ్యతా మద్దాస్యైకస్వభావాత్మస్వరూపః, మదేకానుభవః, మద్దాస్యైకప్రియః, పరిపూర్ణానవరత నిత్యవిశదతమానన్య ప్రయోజనానవధి కాతిశయప్రియ మదను భవస్యమ్ తథావిధ మదనుభవజనితా నవధికాతిశయ ప్రీతికారితాశేషావస్థో చితాశేష శేషతైకరతిరూపనిత్యకిఙ్కరో భవ ॥

ఏవం భూత = ఇటువంటి, మత్కైంకర్యప్రాప్తి= నా కైంకర్యాన్ని పొందడానికి, ఉపాయతయా = ఉపాయంగా, అవక్లుప్త = ఏర్పాటు చేయబడిన, సమస్త వస్తువిహీనః + అపి = ఏ వస్తువును లేనివారైనా, అనంత = అంతులేని, తద్విరోధి = ఆ (నా) కైంకర్యాన్నిచేయడంలో విరోధులైన, పాప = పాపాలచే, ఆక్రాంతః+అపి = ఆక్రమింపబడినవారైనా, అనంత= అవధిలేని, మదపచారయుక్తః+అపి = నాపట్ల అపచారాలను చేసినవారైనా, అనంత = అంతులేని, మదీయ+ అపచారయుక్తః + అపి = నాభక్తులపట్ల అపచారాలనుచేసినవారైనా, అనంత= అంతు లేని, అసహ్య+అపచారయుక్తః+అపి = సహించడానికి సాధ్యంకాని అపచారాలను చేసినవారైనా, ఏతత్ = దీనికి, కార్యకారణ భూత= కార్యాలుగాను, కారణాలుగాను ఉండే, అనాది= అనాదియైన, విపరీత= విరుద్ధమైన, అహంకార = అహంకారంచేత, విమూఢ = మఱుగుపరచబడ్డ, ఆత్మస్వభావః+ అపి = ఆత్మస్వభావాన్ని (ఆత్మకు సంబంధించిన జ్ఞానాన్ని) కల్గినవారైనా, ఏతదుభయ= ఈ రెండింటికి, కార్యకారణభూత= కార్యాలుగాను, కారణాలుగాను ఉండే, అనాది = అనాదియైన, విపరీతవాసనా= విరుద్ధాలైన సంస్కారాలతో, సంబద్ధః+ అపి = దృఢంగా కూడుకొన్నవారైనా, ఏతత్+అనుగుణ = వీటికి అనుగుణమైన, ప్రకృతివిశేష సంబద్ధ+ అపి = రజస్తమస్సులతో కలసిన ప్రకృతివిశేషంతో దృఢంగా

కూడుకొన్నవారైనా, ఏతన్మూల = వీటికి కారణమైన, ఆధ్యాత్మిక = శరీరంవల్ల కలిగేవి, ఆధిభౌతిక = ప్రాణులవల్ల కలిగేవి, ఆధిదైవిక = గాలి, వర్షం మొదలైన దైవాలవల్ల కలిగేవి అయిన, సుఖదుఃఖ = సుఖాలు, దుఃఖాలు, తద్ధేతు= వాటికి కారణాలు, తదితర = ఆసుఖదుఃఖాలకంటే వేఱయిన, ఉపేక్షణీయ విషయ= ఉపేక్షించదగిన వస్తువులు- అనే వీటి విషయంలోని, అనుభవ = అనుభవం, జ్ఞానసంకోచ= జ్ఞానం యొక్క సంకోచం, రూప = అనే వీటిరూపంలోని, మచ్చరణారవిందయుగళ = నారెండు పాద పద్మాలలోని, ఐకాంతిక = ఒకే నిశ్చయాన్ని కల్గినవి, ఆత్యంతిక = అంతంలేనివి అయిన, పరభక్తి పరజ్ఞాన పరమభక్తి = పరభక్తి, పరజ్ఞానం, పరమభక్తి - అనే వీటియొక్క, విఘ్న = అంతరాయాలచేత, ప్రతిహతః+అపి = అడ్డగింపబడినవారైనా, యేనకేన+ అపిప్రకారేణ = ఏదోఒకరీతిలో, ద్వయవక్తా = ద్వయాన్ని ఉచ్చరించే వారైన, త్వం= మీరు, కేవలం = వేఱొకటి ఏదీలేని, మదీయయైవ దయయా = నా దయచేతనే, నిశ్శేష = ఏదీ శేషించకుండా, వినష్ట = పూర్తిగా నశించిన, సహేతుక = కారణాలతో కూడిన, మచ్చరణారవిందయుగళ = నా తామర పూలవంటి రెండు పాదాలలో, ఐకాంతిక = ఒకే నిశ్చయాన్ని కల్గిన, ఆత్యంతిక = అంతులేని, పరభక్తి పరజ్ఞాన పరమభక్తి విఘ్నః = పరభక్తి, పరజ్ఞానం, పరమభక్తుల విఘ్నాలను కలవారై, మత్ ప్రసాద = నా అనుగ్రహించే, లబ్ధ = పొందబడిన, మచ్చరణార విందయుగళ = నా తామరపూలవంటి శ్రీచరణాలు రెండిటిలో, ఐకాంతిక = ఒకే నిశ్చయాన్ని కల్గిన, ఆత్యంతిక = అంతులేని, పరభక్తి, పరజ్ఞాన పరమభక్తిః = పరభక్తి,పరజ్ఞానం, పరమభక్తి- అనే వీటిని కలవారై, మత్ + ప్రసాదాదేవ = నా అనుగ్రహంవల్లనే, సాక్షాత్కృత = సాక్షాత్కరించుకొన్న, యథావస్థిత= యథాతథమైన, మత్స్వరూప = నా దివ్యాత్మస్వరూపం, రూప = దివ్యమంగళవిగ్రహం, గుణ = కల్యాణగుణాలు, విభూతి = నిత్య విభూతి, లీలోపకరణ = లీలావిభూతి- అనే వీటియొక్క, విస్తారః = విస్తృతిని కలవారై, అపరోక్షసిద్ధ = ప్రత్యక్షంగా అనుభవింపబడిన, మన్నియామ్యతా = నాచే తనే నియమింపబడేవారై ఉండడం, మద్దాస్య = నాకు దాసులై ఉండడం, ఏక స్వభావ = అనే వీటిని మాత్రమే స్వభావంగా కల్గిన, ఆత్మస్వరూపః = జీవాత్మ స్వరూపాన్ని కలవారై, మదేక+

అనుభవః = నా అనుభవాన్ని మాత్రమే కలవారై, **మద్దాస్యైక ప్రియః** = నాకు కైంకర్యాన్ని చేయడంలోనే ప్రీతిని కలవారై, **పరిపూర్ణ** = కల్యాణగుణాదులతో పూర్ణమైన, **అనవరత** = నిరంతరమైన, **నిత్య** = నిత్యమైన, **విశదతమ** = చాలా మిక్కిలి విశదమైన, **అనన్య ప్రయోజన** = వేఱొక ప్రయోజనాన్ని లేని, **అనవధిక=** ఇంతకంటే మించిన అవధి ఇంకొకటిలేని, **అతిశయ** = గొప్పదైనరీతిలో, **ప్రియ=** ప్రియంగా ఉండే, **మదనుభవః** = నా అనుభవాన్ని కలవారైన, **త్వం** = మీరు, **తథావిధ** = అటువంటి, **మదనుభవజనిత=** నా అనుభవం వల్ల కల్గిన అధికమైనది ఇంకొకటిలేని రీతిలోని గొప్పతనాన్ని కల్గిన, **ప్రీతి** = ప్రీతిచేత, **కారిత** = చేయింపబడిన, **అశేష+ అవస్థోచిత** = అన్ని విధాలైన సన్నివేశాలకు తగిన, **అశేషతా+ ఏకరతిరూప** = అన్నివిధాలైన కైంకర్యాలలో మాత్రమే ఆశను కల్గి ఉండడాన్ని స్వరూపంగా కల, **నిత్యకింకరః** = నిత్యసేవకులుగా, **భవ** = కాగలరు.

ఇకపై ఈ గద్యం పూర్తివరకు భగవానుని ప్రతివచన (సమాధాన) ప్రకారం తెలుపబడుతున్నది.

ఏవంభూత మత్కైంకర్యప్రాప్త్యుపాయతయా అవక్లుప్త సమస్తవస్తు విహీనః అపి = (ఈచూర్ణికలో నడుమ **"త్వం కేవలం మదీయయైవ దయయా"** అనే చోట గల **"త్వమ్"** అనే పదాన్ని మొదట అన్వయించుకోవాలి) శ్రీరామానుజులను ఉద్దేశించి శ్రీరంగనాథుడు పల్కిన సమాధానం ఇది. పూర్వచూర్ణికలో **"నిత్యకింకరో భవాని"** అని ప్రార్థించినదానికి అనుగుణంగా "ఆ విధంగానే నిత్యకింకరులు కాగలరు'' అని అనుగ్రహింపబడుతున్నది. ఈ చూర్ణికలో. **"ఏవంభూత"** అనేది కైంకర్యానికి విశేషణం. గడచిన చూర్ణికలో ఎటువంటి కైంకర్యం ప్రార్థింపబడిందో అది ఈ పదంచేత అనువదింపబడుతున్నది. నీవు కోరిన రీతిలోనే కైంకర్యాన్ని పొందడానికి శాస్త్రాలలో ఏ అనుష్ఠాలు చెప్పబడ్డాయో, ఆ అనుష్ఠానాలు ఏవీ నీకు లేకపోయినా- అని భావం.

అనంతతద్విరోధిపాప+ఆక్రాంతః+అపి = అటువంటి ఉపాయానుష్ఠానాలను ఇకపై సంపాదించుకోలేని రీతిలో వాటికి విరోధాలైన, అపరిమితాలైన పాపాలను మెండుగా నిండుగా కలవారైనా,

అనంతమదపచారయుక్తః + అపి = నాపట్ల చేసిన అపచారాలు అపరిమితంగా కల్గినవారై ఉన్నా,

అనంతమదీయ + అపచారయుక్తః+ అపి = అపరిమితాలైన భాగవతాపచారాలు మెండుగా కలవారైనా, **("మదీయ"** - అంటే నాకు చెందినవారు- భాగవతులు అని అర్థం)

అనంత+అసహ్య+అపచారయుక్తః+అపి = అపరిమితాలైన అసహ్యాపచారాలను నిండుగా కలవారైనా,

ఏతత్ కార్యకరణభూత + అనాది విపరీత + అహంకార విమూఢ + ఆత్మస్వభావః + అపి = ఇటువంటి అపచారాలవల్ల కలిగేది, వీటిని ఇంకా ఇంకా కల్గించేది, అనాది అయిన విపరీతాహంకారంచేత ఆవరింపబడిన (కప్పబడిన) ఆత్మస్వరూపాన్ని తెలిసికోలేనివారైనా,

ఏతత్+మూల.....ప్రతిహతః+అపి = పూర్వం పల్కిన ప్రకృతిమూలంగా ఏర్పడే, తాపత్రయమనబడే సుఖదుఃఖాలు, వాటికి హేతువులు, ఆ సుఖదుఃఖాలకంటే వేఱయిన, ఉపేక్షించదగిన విషయాలు, వీటి అనుభవం, జ్ఞానసంకోచం- అనే రూపంలోని నా శ్రీచరణయుగ్మాన్ని గూర్చిన పరిపూర్ణమైన పరభక్తి, పరజ్ఞాన పరమభక్తులకు ప్రతిబంధకాలైనవానిచేత హానిని పొందినవారైనా,

యేన కేనాపి ప్రకారేణ ద్వయవక్తా త్వం = ఏదో ఒక రీతిలో ద్వయ మంత్రాన్ని అనుసంధించిన మీరు,

కేవలం మదీయయా+ఏవ దయయా = నా నిర్హేతుక కృపచేతనే,

నిశ్శేషవినష్ట....విష్ణుః = నా శ్రీచరణపద్మయుగ్మాన్నిగూర్చిన పరభక్తి - పరజ్ఞాన - పరమభక్తుల విషయంలోని ప్రతిబంధకాలు అన్నీ నిర్మూలంగా, సకారణంగా, పూర్తిగా తీరినవారై,

మత్....పరమభక్తిః = నా శ్రీచరణపద్మయుగ్మాన్నిగూర్చిన పరభక్తి- పరజ్ఞాన- పరమభక్తులను నా అనుగ్రహం మూలంగా యథాతథంగా సాక్షాత్కరించుకొన్నవారై,

మత్ప్రసాదాదేవ =నా అనుగ్రహంవల్లనే,

సాక్షాత్కృత... విస్తరః = నా స్వరూపం, రూపం, కల్యాణగుణాలు, నిత్యవిభూతి, లీలావిభూతి- అనే వీటి విస్తృతిని యథాతథంగా సాక్షాత్కరించు కొన్నవారై)

అపరోక్షసిద్ధ.... స్వరూపః - నాకు మాత్రమే నియమించడానికి సాధ్యమై, నాకే శేషమై ఉండే సహజమైన ఆత్మస్వరూపాన్ని యథాతథంగా తెలిసినవారై,

మదేకానుభవః = నన్ను ఒక్కనిమాత్రమే అనుభవించాలని కోరేవారై,

మద్దాస్యైకప్రియః = నాకు కైంకర్యం చేయడంలోమాత్రమే ఆసక్తిని కలవారై,

పరిపూర్ణానవరత... అనుభవః త్వమ్ = పరిపూర్ణమై, నిరంతరమై, ఎల్లప్పుడు మిక్కిలి విశదమై, ప్రయోజనాంతరంయొక్క సంబంధం ఏమాత్రం లేనిదై, పరమప్రియమై ఉండే నా అనుభవాన్ని కలవారైన మీరు,

తథావిద.... కింకరో భవ = అటువంటి నా అనుభవంచేత కల్గించబడిన, మిక్కిలి గొప్పదైన ఆనందంచేత చేయబడే, సర్వావస్థలకు తగిన సకల కైంకర్యాల లోను ఆశను కల్గి ఉండే దాసులుగా మీరు కాగలరు- అని భావం.

ఈ చూర్ణికలోని తాత్పర్యం ఏమంటే - నాకు నిత్యకైంకర్యాన్ని చేసి ఆనందించాలనే ఆశను కల్గిన మీరు దానికి తగిన ఏ ఉపాయంలోను అన్వయం లేనివారైనా, ఆ ఉపాయం ఇకపై నిష్పన్నం కాలేని రీతిలో విరోధులైన పాపాలు నిండుగా ఉన్నవారైనా, భగవదపచార- భాగవతాపచార- అసహ్యాపచారాలు నిండుగా కలవారైనా, పరభక్తి-పరజ్ఞాన- పరభక్తులు కల్గడానికి తగిన విరోధులు మీకు పలు మెండుగా ఉన్నా, మీరు ఆర్తప్రపన్నులుగానో, దృప్తప్రపన్నులుగానో ద్వయమంత్రాన్ని అనుసంధించారు కనుక, నా నిర్హేతుక కృపవల్లనే ఆటంకాలు అన్నీ తొలగి, పరభక్తి-పరజ్ఞాన- పరమభక్తులను పుష్కలంగా పొంది, నా స్వరూప-రూప-గుణవిభూతు లను సాక్షాత్కరించుకొని, మీ స్వరూపాన్ని చక్కగా

గ్రహించి, నన్నే అనువర్తించేవారై, నాకే కైంకర్యాన్ని చేసేవారై ఉజ్జీవించగలరు- అని భగవానుడు అనుగ్రహించిన రీతిని గూర్చి అనుగ్రహించారు.

19. ఏవమ్భూతోఽసి ॥

ఏవం భూతఃఅసి = ఇది కూడా భగవానుని శ్రీసూక్తియే. పూర్వం నేను అనుగ్రహించిన రీతిలోనే మీరు కావడం ఆరంభించారు- అని భావం. **"ఏవం భవితుం ఉపక్రాంతోఽసి ఇత్యర్థః"** అనేది ఇక్కడ దేశికుల భాష్యసూక్తి.

20. ఆధ్యాత్మికాధిభౌతికాధిదైవిక దుఃఖవిఘ్నగన్ధరహితస్త్వం ద్వయమర్థానుసన్ధానేన సహ సదైవం వక్తా యావచ్ఛరీరపాతమ్ అత్రైవ శ్రీరఙ్గే సుఖమాస్వ ॥

ఆధ్యాత్మికాధిభౌతికాధిదైవిక దుఃఖవిఘ్నగన్ధరహితః = ఆధ్యాత్మికమైన, ఆధి భౌతికమైన, ఆధి దైవికమైన దుఃఖాలవల్ల కలిగే అంతరాయాలు ఏమాత్రం లేనివారైన, **త్వం** = మీరు, **ద్వయం** = ద్వయమంత్రాన్ని, **అర్థానుసంధానేన సహ** = అర్థాన్ని అనుసంధించడంతో పాటుగా, **సదా ఏవం** = ఎల్లప్పుడూ ఈ విధంగానే, **వక్తా** = పలికేవారై, **యావచ్ఛరీరపాతమ్** = శరీరం పతనం చెందే వరకు, **అత్రైవ శ్రీరంగే** = ఇక్కడే శ్రీరంగ నగరంలో, **సుఖమాస్వ** = సుఖంగా ఉండండి.

"ఆన్ఱ్ఱమ్కరై వాళ్ మరమ్ పోల్ అఞ్జుకిన్ఱేన్" (ప్రవాహతీరంలో ఉండే కూలిపోయే వృక్షంవలె భయపడుతున్నాను) అని, **"ఇరుపాడెరికొళ్ళియినుళ్ ఎఱుమ్బేపోల్ ఉరుకా నిఱ్కుమ్ ఎన్నుళ్ళమ్"** (రెండు వైపుల మండే కొఱివికట్టె మధ్యలోని చీమలవలె నా మనస్సు ద్రవిస్తున్నది. తపిస్తున్నది) అని, **"వెళ్ళత్తిడై ప్పట్ట నరియినమ్పోలే ఉళ్ళమ్ తుళఙ్గానిఱ్పన్"** (ప్రవాహవేగంలో చిక్కుకొన్న నక్కల గుంపువలె నేను మనస్సులో తల్లడిల్లుతున్నాను) అని భయపడనక్కరలేని రీతిలోని ఈ అజ్ఞానతమోమయమైన లోకంలో నిరపాయంగా కాలక్షేపాన్ని చేసే దారి ఏది? అనే సందేహానికి పరిహారంగా ఈ చూర్ణిక భగవానుని శ్రీసూక్తి రూపంలో అవతరించింది.

తాపత్రయంవల్ల కల్గిన దుఃఖమనే ఆటంకం కొంచెంకూడా లేనివారై అర్థానుసంధానపూర్వకంగా ఎల్లప్పుడు ఈ విధంగానే అనుసంధిస్తున్నవారై,

ఈ శరీరం పతనం చెందేవరకు ఈ శ్రీరంగదివ్యాలయంలో ఆనందమయ జీవితాన్ని గడపగలరు- అని భగవానుడు నోఱు తెఱచి పలికాడు. ఇచట శ్రీరంగాన్ని పల్కడం భగవానుడు ఆదరంతో వేంచేసి ఉండే దివ్యదేశాలన్నిటికీ ఉపలక్షణం- అని శ్రీదేశికుల అభిప్రాయం.

ప్రపన్నునకు పూర్వకృత్యమని, ఉత్తరకృత్యమని రెండు ఉన్నాయి. పూర్వ కృత్యాన్నిగూర్చి పూర్వం విస్తృతంగా చెప్పబడింది. ఉత్తరకృత్యం ఇకపై తెలుప బడుతున్నది. ఇదికూడా శ్రీరంగనాథుని సూక్తికి అనువాదం.

21. శరీరపాతసమయే తు కేవలం మదీయయైవ దయయాఽతిప్రబుద్ధో మామేవావలోకయన్ అప్రచ్యుతపూర్వసంస్కారమనోరథః, జీర్ణమివ వస్త్రం సుఖేనేమాం ప్రకృతిం స్థూలసూక్ష్మరూపాం విసృజ్య, తదానీమేవ మత్ప్రసాదలబ్ధ మచ్చరణారవిన్దయుగళైకాన్తికాత్యన్తిక పరభక్తిపరజ్ఞాన పరమభక్తికృత పరిపూర్ణాన వరత నిత్యవిశదతమాననన్యప్రయోజనానవధికాతిశయ ప్రియమదనుభవస్తం తథావిధమదనుభవ జనితావధికాతిశయ ప్రీతికారితాశేషావస్థోచితాశేషశేషతైక రతిరూప నిత్యకిఙ్కరో భవిష్యసి॥

శరీరపతనసమయే తు = శరీరం పతనం చెందేటపుడు, **కేవలం మదీయయైవ దయయా అతిప్రబుద్ధః** = నా సహజమైన కృపతో చాలా గొప్ప జ్ఞానాన్ని కలవారై, **మామ్ ఏవ అవలోకయన్** = దీనికి ముందు చింతించిన నన్నే భావించే వారై, **అప్రచ్యుత పూర్వసంస్కారమనోరథః** = "భగవానుడే నాకు పరమభోగ్య భూతుడు" అనే సంస్కారంలో, ప్రాప్తిలో కలిగే అభినివేశం తగ్గనివారై (లోపించని వారై), **స్థూలసూక్ష్మరూపామ్ ఇమాం ప్రకృతిం జీర్ణం వస్త్రమివ సుఖేన విసృజ్య**= స్థూలం, సూక్ష్మం అయిన ఈ ప్రకృతిని, జీర్ణమైన వస్త్రాన్ని విడచినట్లు, సులభంగా విడచి, **తదానీమ్ ఏవ** = అపుడే, (ఏ ఆలస్యం లేకుండా), మత్ప్రసాదలబ్ధ=నా అనుగ్రహం వల్ల లభించిన, మచ్చరణారవింద యుగళ= నాపాద పద్మాల జంటలో, ఐకాంతిక = అనన్యమైన, ఆత్యంతిక = మిక్కిలి గొప్పదైన, పరభక్తి పరజ్ఞాన పరమభక్తికృత = పరభక్తిపరజ్ఞానం, పరభక్తి- అనే వీటిచేత చేయింప బడిన, పరిపూర్ణ = మిక్కిలి పూర్ణమైన, అనవరత = ఏ విచ్ఛేదం లేని, నిత్య = నిత్యమైన, విశదతమ = చాలా మిక్కిలి స్పష్టమైన, అనన్య ప్రయోజన

= కైంకర్యాన్ని తప్ప వేఱొక ప్రయోజనాన్ని ఆశించని, అనవధిక = అంతులేని, అతిశయ = మహిమను కల, ప్రియ = ఇష్టమైన, మదనుభవః = నా అనుభవాన్ని కల్గినవారైన, త్వం = మీరు, తథావిధ = అటువంటి, మదనుభవ జనిత=నా అనుభవం వల్ల ఏర్పడిన, అనవధిక + అతిశయ = అంతులేని గొప్ప తనాన్నికల, ప్రీతికారిత = ప్రీతితో చేయింపబడిన, అశేష+అవస్థా+ఉచిత = అన్ని సన్నివేశాలకు తగిన, శేషతైకరతిరూప = శేషత్వంలోని అభినివేశం మూర్తీభవించిన, నిత్యకింకరః = నిత్యసేవకులు, భవిష్యసి = కాగలరు.

22. మా తే భూదత్ర సంశయః ॥

మా తే భూదత్ర సంశయః = **"నిత్యకింకరో భవిష్యసి"** అని అనుగ్రహించిన ఈ విషయంలో మీకు సంశయం కలుగనక్కర లేదు - అని భావం.

"ప్రసక్తస్య హి ప్రతిషేధః" అనికదా న్యాయం. ఇక్కడ సందేహానికి అవకాశం ఉన్నదా?- అని అంటే, లోకంలో క్షుద్రఫలాలను పొందడానికి చాలా ఘనమైన ఉపాయానుష్ఠానాన్ని చేయడం గమనిస్తున్నాము. చాలా గొప్ప ఫలం అయిన మోక్షపురుషార్థాన్ని పొందడానికి - దుష్కరత్వంలో- ఇంతకు మించినది లేదు- అనే రీతిలో పరమదుష్కరమైన ఉపాయం అనుష్ఠించవద్దా ! చాలా సుకరమైన ఈ న్యాసమాత్రంతో ఆ గొప్ప ప్రాప్యం లభిస్తుందా? తప్పక లభిస్తుంది - అని అంటే, అది కేవలం కంటితుడుపుమాట కాదా!- అనే సందేహం కొందఱికి కలుగవచ్చు. కనుక, వారికి తేటపడేటట్లు చేయగోరి, భగవద్రామానుజులను నెపంగా చేసికొని, **"మా తేభూదత్ర సంశయః"** (ఈవిషయంలో నీకు సందేహం వద్దు) అని భగవానుడు పలికాడు.

23. అనృతం నోక్తపూర్వం మే న చ వక్ష్యే కదాచన ॥
రామో ద్విర్నాభిభాషతే ।
సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ ॥
సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశు చః ॥

ఇతి మయైవ హ్యుక్తమ్ ॥

మే అనృతం న ఉక్తపూర్వం = నాచే అసత్యం ఇంతకు ముందు పలుక బడలేదు, న చ కదాచన వక్ష్యే = ఇకపై కూడా ఎపుడు పలుకను.

రామః = శ్రీరాముడు, ద్విః నాభిభాషతే = రెండుసార్లు (రెండుమాటలు) పలుకడు.

సకృదేవ = ఒక్కసారే, ప్రపన్నాయ = శరణాగతి చేసినవానికి, తవ అస్మి= నీవాడనై యున్నాను, ఇతి = అని, అభయం యాచతే చ = అభయాన్ని ప్రార్థించేవానికి, సర్వభూతేభ్యః = అన్ని ప్రాణులవల్ల, (అభయం) దదామి = అభయాన్ని ఇస్తున్నాను, ఏతత్ = ఇది, మమ వ్రతం = నా వ్రతం.

సర్వధర్మాన్ = అన్ని ధర్మాలను, పరిత్యజ్య = సవాసనగా విడచిపెట్టి, మామ్ ఏకం = నన్ను ఒక్కని మాత్రం, శరణం వ్రజ = శరణు పొందు, అహం= నేను, త్వా = నిన్ను, సర్వపాపేభ్యః = అన్ని పాపాల నుండి, మోక్షయిష్యామి = విడిపించ గలను, మా శుచః = శోకించకు

ఇతి = అని, మయా ఏవ హి = నాచేతనే కదా, ఉక్తం = పలుకబడినది.

"మా తే భూదత్ర సంశయః" అని పూర్వం పల్కిన విషయాన్నే తిరిగి స్థిరీక రించడంకోసం ఈ చూర్ణిక, దీని తరువాత చూర్ణిక అవతరించాయి.

నా నిత్యకైంకర్య ప్రాప్తిలో మీకు సందేహం ఉన్నట్లయితే, నేను ఇతః పూర్వమే పల్కిన మాటకు విరోధిస్తుంది కదా ! అవి అసత్యాలు కాగలవు కదా! **"తేశుడైయ తేవర్ తిరువరఙ్గచ్చెల్వనార్ పేశి యిరుప్పనకళ్ పేర్క్కవుమ్ పేరావే"** (తేజస్సును కల దేవుడు, శ్రీరంగనాథుడు పల్కిన సూక్తులు అసత్యాలు కానే కావు) అని మీసోదరి (గోదాదేవి) పల్కినది కదా! కనుక, నా మాటను మీరు ఉపచ్ఛందన మాత్రంగా గ్రహించ కూడదు - అని శ్రీరంగనాథుడు పల్కిన తీరు ఇది. ఇంతవరకు ఏనాడూ నేను అసత్యాన్ని పలుకలేదు. ఇకపై పలుకబోను- అని శ్రీకృష్ణావతారంలో అన్నాను. శ్రీరాముని నోటిలో రెండు మాటలు రావు- అని శ్రీరామావతారంలో అన్నాను. అంతేకాక, శ్రీరామావతారంలో సముద్ర తీరంలో విభీషణాళ్వాన్‌ను వ్యాజంగా చేసికొని **"సకృదేవ ప్రపన్నాయ"** అనే చరమశ్లోకాన్ని పలికాను. శ్రీకృష్ణావ తారంలో అర్జునరథంలో అర్జునుని నెపంగా

చేసికొని **"సర్వధర్మాన్ పరిత్యజ్య"** అనే చరమశ్లోకాన్ని పలికాను. **"సకృదేవ"** అనే సూక్తిలో **"ఏతత్ వ్రతం మమ"** అనేది ప్రాణస్థానీయమైన సూక్తి. **"సర్వధర్మాన్"** అనే శ్లోకంలో **"మా శుచః"** అనేది ప్రాణస్థానీయమైన వచనం. అందువల్ల ఈవిధంగా పల్కిన నేను దీనికి విరుద్ధంగా ఉండేవాడనుకాను సుమా! అని దృఢంగా పలికాడు; భగవానుడైన శ్రీరంగనాథుడు.

24. అత స్త్వం తవ తత్త్వతో మద్జ్ఞానదర్శనప్రాప్తిషు నిస్సంశయ స్సుఖమాస్వ ॥

పూర్వం పల్కిన దానినే దృఢపరుస్తూ పలికే ఈ సూక్తి సంతోషాతిశయం కోసమే. ఇదికూడా భగవద్వాక్యమే.

అతః = సత్యవాదిని, సత్యవ్రతుడను అయిన నేను పల్కిన వార్త చాలా విశ్వసించదగినది కనుక, **త్వం** = ప్రామాణికులైన మీరు, **తవ** = నాచే పొందింప బడిన సకలగుణాలను కల్గినవారైన మీయొక్క, **తత్త్వతః మత్ జ్ఞాన దర్శనప్రాప్తిషు**= యథాతథంగా నన్ను తెలిసికోవడం, దర్శించడం, నిత్యకైంకర్యం చేయడం - అనే వీటిలో, **నిస్సంశయః** = ఏ సందేహాన్ని లేనివారై, **సుఖమ్ ఆస్వ**= ఆనందంగా ఉండగలరు.

భగవానుడు శ్రీరామానుజులను ఉద్దేశించి పల్కినసూక్తి ఇది.

అన్త్యకాలే స్మృతి ర్యాతు తవ కైఙ్కర్యకారితా ।
తామేనాం భగవన్! అద్య క్రియమాణాం కురుష్వ మే ॥

(నీ కైంకర్యాన్ని చేయాలని అంతిమకాలంలో కలిగే స్మృతి ఏది ఉన్నదో, దానిని ఈనాడే నేను చేసేటట్లు అనుగ్రహించు)

"అంత్యకాలే... కురుష్వ మే" అనే ఒక శ్లోకం అనుసంధింపబడుతున్నది. పెరియవాచ్చాన్‌పిళ్ళైకాని, శ్రుతప్రకాశికా చార్యుల వారుకాని, నిగమాంత దేశికులు కాని దీనిని వ్యాఖ్యానించలేదు. (కొన్ని ముద్రణలలో ఈ శ్లోకం కన్పించడం లేదు.)

శ్రీభగవద్రామానుజవిరచితమైన శరణాగద్యానికి ఆంధ్రటీక సంపూర్ణం.

శ్రీమతే రామానుజాయ నమః

భగవద్రామానుజులు అనుగ్రహించిన

శ్రీరఙ్గగద్యమ్

చిదచిత్పరతత్త్వానాం తత్త్వయాథార్థ్యవేదినే ।
రామానుజాయ మునయే నమో మమ గరీయసే ॥

1. స్వాధీనత్రివిధ చేతనాచేతన స్వరూపస్థితి ప్రవృత్తిభేదం, క్లేశకర్మాద్యశేష దోషా సంస్పృష్టం, స్వాభావికానవధికాతిశయ జ్ఞానబలైశ్వర్యవీర్యశక్తి తేజస్సౌశీల్య వాత్సల్య మార్దవార్జవ సౌహార్ద సామ్యకారుణ్య మాధుర్యగామ్భీర్యౌదార్య చాతుర్య స్థైర్య ధైర్యశౌర్య పరాక్రమసత్యకామ సత్యసఙ్కల్ప కృతిత్వకృతజ్ఞతాద్యసఙ్ఖ్యేయ కల్యాణగుణగణౌఘ మహార్ణవం, పరబ్రహ్మభూతం, పురుషోత్తమం, శ్రీరఙ్గ శాయినమ్, అస్మత్స్వామినం ప్రబుద్ధ-నిత్యనియామ్య నిత్యదాస్యైకరసాత్మ స్వభావోఽహం తదేకానుభవ స్తదేకప్రియః పరిపూర్ణం భగవన్తం విశదతమానుభవేన నిరన్తర మనుభూయ, తదనుభవ జనితానవధికాతిశయ ప్రీతికారితాశేషావ స్థోచితాశేషశేషతైక రతిరూప నిత్యకిఙ్కరో భవాని ॥

2. స్వాత్మనిత్యనియామ్య నిత్యదాస్యైకరసాత్మస్వభావానుసన్ధానపూర్వక భగవదనవధికాతిశయ స్వామ్యాద్యఖిల గుణగణానుభవజనితానవధికాతిశయ ప్రీతికారితాశేషావస్థోచితాశేషశేషతైకరతిరూప నిత్యకైఙ్కర్యప్రాప్త్యుపాయభూత భక్తి తదుపాయ సమ్యఙ్జ్ఞాన తదుపాయ సమీచీనక్రియా తదనుగుణ సాత్త్వికతాస్తిక్యాది సమస్తాత్మగుణవిహీనః, దురుత్తరానన్తతద్విపర్యయ జ్ఞానక్రియానుగుణానాది పాపవాసనా మహార్ణవాన్తర్నిమగ్నః, తిలతైలవద్దారు వహ్నివ ద్దుర్విభేచత్రిగుణక్షణక్షరణ స్వభావాచేతన ప్రకృతివ్యాప్తిరూప దురత్యయ భగవన్మాయాతిరోహిత స్వప్రకాశః, అనాద్యవిద్యాసఞ్చితానన్తాశక్య విప్రంసన కర్మపాశప్రగ్రథితః అనాగతానన్తకాల సమీక్ష యాప్యదృష్టసంతారోపాయః,

నిఖిలజన్తుజాతశరణ్య! శ్రీమన్ నారాయణ! తవ చరణారవిన్దయుగళం శరణ మహం ప్రపద్యే ॥

3. ఏవమవస్థితస్యాప్యర్థిత్వమాత్రేణ పరమకారుణికో భగవాన్ స్వానుభవ ప్రీత్యోపనీతైకాన్తికాత్యన్తిక నిత్యకైఙ్కర్యైకరతిరూప నిత్యదాస్యం దాస్యతీతి విశ్వాస పూర్వకం భగవన్తం నిత్యకిఙ్కరతాం ప్రార్థయే ॥

4. తవానుభూతిసమ్భూత ప్రీతికారితదాసతామ్ ।
దేహి మే కృపయా నాథ ! న జానే గతిమన్యథా ॥

5. సర్వావస్థోచితాశేషశేషతైకరతిస్తవ ।
భవేయం పుణ్డరీకాక్ష ! త్వమేవైవం కురుష్వ మామ్ ॥

6. ఏవంభూత తత్త్వయాథాత్మ్యావబోధ తదిచ్ఛారహితస్యాపి, ఏతదుచ్చారణ మాత్రావలమ్బనేన ఉచ్యమానార్థపరమార్థనిష్ఠం మే మనస్తమేవాద్యైవ కారయ ॥

7. అపారకరుణాంబుధే ! అనాలోచితవిశేషాశేషలోకశరణ్య ! ప్రణతార్తిహర! ఆశ్రితవాత్సల్యైకమహోదధే ! అనవరత విదితనిఖిలభూతజాత యాథాత్మ్య! సత్యకామ! సత్యసఙ్కల్ప ! అపత్సఖ ! కాకుత్స్థ ! శ్రీమన్నారాయణ ! పురుషోత్తమ ! శ్రీరఙ్గనాథ! మమ నాథ ! నమోఽస్తు తే ॥

ఇతి శ్రీభగవద్రామానుజవిరచితం శ్రీరఙ్గగద్యం సమ్పూర్ణమ్

భగవద్రామానుజులు అనుగ్రహించిన

శ్రీరంగ గద్యం

(ఆంధ్ర టీకతో)

చిదచిత్పరతత్త్వానాం తత్త్వయాథార్థ్యవేదినే ।
రామానుజాయ మునయే నమో మమ గరీయసే ॥

చిదచిత్పరతత్త్వానామ్ = చేతన - అచేతన-ఈశ్వరులనే మూడు తత్త్వాల యొక్క, **తత్త్వయథాత్మ్యవేదినే** = స్వరూపాలను యథాతథంగా తెలిసినవారైన, **మమ గరీయసే** =నాకు ఉత్తమాచార్యులైన, **రామానుజాయ మునయే** = భగవద్రామానుజ మునులకు, **నమః** = నమస్కారం.

అవతారిక

ఈ గద్యకు శ్రీరంగగద్య అనే వ్యవహారం, మితగద్య అనే పేరు ఉన్నాయి. ఇందులోని మొదటి చూర్ణికలో- **"శ్రీరంగశాయినమ్"** అని ప్రయోగించినందు వల్ల, చివరలో **"శ్రీరంగనాథ ! మమ నాథ ! నమోఽస్తు తే"** అని పల్కినందున శ్రీరంగగద్య అనే పేరు వచ్చినది భావించాలి. పూర్వగద్య (శరణాగతిగద్య) పెద్దదిగా ఉన్నందువల్ల దానిని **"పృథుగద్య"** అని, ఇది చిన్నదిగా ఉన్నందువల్ల దీనిని **"మిత గద్య"** అని పెద్దలు వ్యవహరించారు.

పూర్వగద్యలో వివరంగా తెలుపబడిన విషయమే ఇందులో కూడా సంగ్రహంగా తెలుపబడింది. పూర్వగద్య వలెనే ఈ గద్యకూడా ద్వయమంత్ర వివరణాత్మకంగా ఉన్నది. అది విస్తరరూపం, ఇది సంక్షేమరూపమనే భేదాన్ని. ఈరెండిటిమధ్య గ్రహించాలి. ఇందులోని మొదటి చూర్ణిక కైంకర్యప్రార్థనా పరమైన ద్వయోత్తరఖండార్థంయొక్క వివరణంగాను, రెండవ చూర్ణిక శరణవరణ ప్రదర్శనపరమైన పూర్వఖండార్థంయొక్క వివరణరూపంగాను ఉన్నాయి.

ముందుగా ఈ శ్రీరంగగద్యంలో చెప్పబడిన విషయాల వివరం తెలుపబడు తున్నది.

1. శ్రీరామానుజులు, చేతనుడు పొందవలసిన కైంకర్యాన్ని మొదటి చూర్ణికలో ప్రార్థించారు.

2. రెండవ చూర్ణికలో ఆ కైంకర్యం సిద్ధించడంకోసం తమవద్ద ఏ ఉపాయానుష్ఠానం లేదని చూపుతూ, తమకు గల కొఱతలనుగూర్చి విన్నపించి, భగవానుని శ్రీచరణాలనే ఉపాయంగా ఆశ్రయించారు. మూడవ, నాల్గవ, అయిదవ చూర్ణికలలో- "దాసుని ప్రార్థనను మాత్రమే ఆలంబనంగా చేసికొని పూర్వం తెల్పిన చాలా గొప్పదైన కైంకర్యాన్ని అనుగ్రహించాలి" అని మహావిశ్వాసపూర్వకంగా కైంకర్యంకోసం మళ్ళీ ప్రార్థించారు. ఆఱవ, ఏడవ చూర్ణికలలో "ఈ మహావిశ్వాసాన్ని, కరుణ మొదలైన కల్యాణగుణాలతో పూర్ణుడవైన నీవే అనుగ్రహించాలి" అని వేడి, "వేఱెవ్వరికీ కాకుండా నీకే శేషభూతమైన ఈ ఆత్మవస్తువును స్వరూపానికి తగిన కైంకర్యంవరకు పొందే రీతిలో నీవే చేసి, అనుగ్రహించాలి" అని శ్రీరంగనాథుని సన్నిధిలో విన్నపించి, ఈ గద్యను పూర్తిచేశారు.

ఈ విధంగా జీవునకు యోగ్యతను తెలిపే అధికారి విశేషణమైన ఈ ప్రపత్తిని మోక్షాన్ని కోరి ఆశ్రయించిన చేతనులు వారి శరీరం పతనం చెందేంతవరకు కాలక్షేపం చేసే రీతులు అనేక విధాలుగా ఉంటాయి.

1. **"వణఙ్గి వழிపట్టుమ్ పూశిత్తుమ్ పోక్కినేన్ పోతు"** (నాన్ముకన్ తిరు-63) (నమస్కరించి, కైంకర్యం చేసి, పూజించి కాలాన్ని గడిపాను) అనే రీతిలో భగవానుడు అభిమానించి వేంచేసి ఉండే దివ్యదేశాలలో కైంకర్యాన్ని చేసి కాలాన్ని గడపడం.

2. **"వేఱొక ఏత్తి యిరుప్పారై వెల్లుమే మన్నిన్రవరై చ్చాత్తియిరుప్పార్ తవమ్"** (నాన్ముకన్ తిరు-18) (హిరణ్యకశ్యపుని సంహరించిన నృసింహస్వామిని విలక్షణునిగా ఆరాధించేవారి గొప్పతనాన్ని, వారిని ఆరాధించేవారి గొప్పతనం జయిస్తుంది.) అని, **"ఆరాధనానాం సర్వేషాం విష్ణోరారాధనం పరమ్, తస్మాత్ పరతరం ప్రోక్తం తదీయారాధనం పరమ్"** (ఆరాధనలు అన్నిటిలోను విష్ణువును ఆరాధించడం గొప్పది. దానికంటే అతని భక్తులను ఆరాధించడం మిక్కిలి గొప్పది- అని చెప్పబడింది) అని చెప్పబడిన రీతిలో ముందు తెల్పిన దివ్యదేశాలలో అభినివేశాన్ని కల్గిన మనస్సును కల భగవద్భక్తులను ఆరాధించి కైంకర్యాన్ని చేసి కాలక్షేపం చేయడం.

3. ముందు తెల్పిన రెండిటిని చేయలేనివారు, **"పామ్బణైయాన్ శీర్ కలన్ద శొల్ నినైన్దు పోక్కారేల్ శూళ్వినైయిన్ ఆళ్తుయరై ఎన్ నినైన్దు పోక్కువరిప్పోదు?"** (పెరియ తిరు-86) (నాగపర్యంకశాయి అయిన భగవానుని కల్యాణగుణాలతో కూడిన సూక్తులను తలచి కాలాన్ని గడపకపోతే, ఎల్లప్పుడు అనువర్తించే ప్రాప్తకర్మలవల్ల కలిగే దుఃఖాన్ని ఇక దేనిని స్మరించి పోగొట్టుకోవడం?) అనే రీతిలో భగవానుని గుణాలను అనుభవిస్తూ కాలాన్ని గడపడం.

4. భగవానునిపట్ల అంతగా అభినివేశాన్ని లేనివారు **"ద్వయమర్థానుసంధానేన సహ"** (ద్వయాన్ని అర్థానుసంధానంతో పాటుగా) అని శరణాగతిగద్యలో పల్కిన రీతిలో ద్వయంయొక్క అర్థాన్ని అనుసంధానం చేస్తూ కాలాన్ని గడపడం- అనే నాల్గు రీతులను గమనించవచ్చు.

ఈ నాల్గు రీతులలో, చివరిగా చెప్పబడిన రీతిలో అర్థానుసంధానంతో ద్వయాన్ని అనుసంధించి కాలక్షేపం చేయాలని తలచి, శ్రీరామానుజులు పృథుగద్య అనబడే శరణాగతిగద్యలో విరివిగా అనుసంధించిన అర్థాన్ని వినేవారికి సులభం తెలిసేటట్లు, భగవానునకు ఆలకించడానికి అనువుగా ఉండేటట్లు ఆ ద్వయంయొక్క అర్థాన్ని మిక్కిలి విస్తృతంగా కాకుండా, సమక్షంలో విన్నపించేటట్లుగా సంగ్రహంగా అనుగ్రహిస్తున్నారు- ఈ శ్రీరంగగద్యలో.

1. స్వాధీనత్రివిధ చేతనాచేతన స్వరూపస్థితి ప్రవృత్తిభేదం, క్లేశకర్మాద్యశేష దోషా సంస్పృష్టం, స్వాభావికానవధికాతిశయ జ్ఞానబలైశ్వర్యవీర్యశక్తి తేజస్సౌశీల్య వాత్సల్య మార్దవార్జవ సౌహార్ద సామ్యకారుణ్య మాధుర్యగామ్భీర్యౌదార్య చాతుర్య స్థైర్య ధైర్యశౌర్య పరాక్రమసత్యకామ సత్యసఙ్కల్ప కృతిత్వకృతజ్ఞతాద్యసఙ్ఖ్యేయ కల్యాణగుణగణౌఘ మహార్ణవం, పరబ్రహ్మభూతం, పురుషోత్తమం, శ్రీరఙ్గ శాయినమ్, అస్మత్స్వామినం ప్రబుద్ధ-నిత్యనియామ్య నిత్యదాస్యైకరసాత్మ స్వభావోఽహం తదేకానుభవ స్తదేకప్రియఃపరిపూర్ణం భగవన్తం విశదతమానుభవేన నిరన్తర మనుభూయ, తదనుభవ జనితానవధికాతిశయ ప్రీతికారితాశేషావస్థో చితాశేషశేషతైక రతిరూప నిత్యకిఙ్కరో భవాని ॥

స్వాధీన = తన అధీనంలో ఉండే, **త్రివిధ** = మూడు విధాలైన, **చేతన+అచేతన**-చేనాల, అచేతనాలయొక్క, **స్వరూప** = స్వరూపం, **స్థితి** = స్థితి, **ప్రవృత్తి**

=వ్యాపారాలు - అనే వీటియొక్క, **భేదం** = ప్రకారాలను కలవాడు, **క్లేశ** = అవిద్య మొదలైన క్లేశాలు, **కర్మ** = పుణ్యపాపరూపకర్మలు, **ఆది** = మొదలైన, **అశేష** = సమస్త, **దోష+అసంస్పృష్టం** = దోషాల స్పర్శను లేనివాడు, **స్వాభావిక** = సహజమైన, **అనవధిక+అతిశయ** =తనతో సాటి, మించినది లేని గొప్పతనాన్ని కల్గినవి అయిన, **జ్ఞాన** = అన్నిటినీ ఒకేసారి యథాతథంగా తెలియగల్గడం అనే జ్ఞానం, **బలం** = సంకల్పమాత్రంతో అన్నిటిని ధరించగల్గడం అనే బలం, **ఐశ్వర్య** = అన్ని వస్తువులను నియమించడం అనే ఐశ్వర్యం, **వీర్య** = జగత్తుకు ఉపాదానమై ఉన్నా, స్వరూపవికారాన్ని కల్గి ఉండకపోవడం- అనే వీర్యం, **శక్తి** = అఘటిత ఘటనా సామర్థ్యం, **తేజః** = దేనికీ ఏ సహాయాన్ని అపేక్షించకపోవడం- అనే తేజస్సు, **సౌశీల్య** = తనకంటే తక్కువవారితో ఏ భేదం లేకుండా వర్తించడమనే సౌశీల్యం, **వాత్సల్య** = దోషభోగ్యత్వం అనే వాత్సల్యం, **మార్దవ**= ఆశ్రితుల విశ్లేషాన్ని సహించలేకపోవడం అనే మార్దవం, **ఆర్జవ** = మనస్సు, వాక్కు, శరీరం -అనే మూడు కరణాలలోను సారూప్యాన్ని కల్గి ఉండడం అనే ఆర్జవం, **సౌహార్ద** = ఎల్లప్పుడు మంచిని భావించే హృదయాన్ని కల్గి ఉండడం అనే సౌహార్దం, **సామ్య**= జాతిగుణ వృత్తాలలోని తారతమ్యాలను గమనించకుండా, అందఱిపట్ల సమానంగా ప్రవర్తించడం అనే సామ్యం, **కారుణ్య** = దయ, **మాధుర్య** = తనను చంపాలని వచ్చిన శత్రువుకు కూడా భోగ్యమై ఉండడం అనే మాధుర్యం, **గాంభీర్య**= లోతైన మనస్సును కల్గి ఉండడం అనే గాంభీర్యం, **ఔదార్య** = ప్రతిఫలాన్ని ఆశించకుండా, కోరిన వానిని అన్నిటిని సమృద్ధిగా ఇవ్వడం అనే ఔదార్యం, **చాతుర్య** = ప్రతికూలురను కూడా వశీకరించుకోగల్గిన సామర్థ్యం అనే చాతుర్యం, **స్థైర్య** = భక్తులను ఏ దశలోను విడువక పోవడం అనే స్థైర్యం, **ధైర్య** = ప్రతిపక్షం బలమైనది అయినా లెక్కించకపోవడం ధైర్యం, **శౌర్య** = శత్రువులలో ఏజంకు లేకుండా ప్రవేశించడం అనే శౌర్యం, **పరాక్రమ** = ఒంటరిగా అవలీలగా శత్రువులను సంహరించడం అనే పరాక్రమం, **సత్యకామ** = కోరినవానిని అన్నిటిని ఏ కొఱత లేకుండా పొందడం అనే సత్యకామత్వం, **సత్యసంకల్ప** = దేనిని చేయాలని తలచినా, వానిని ఏ ఆటంకం లేకుండా పూర్తి చేయగల్గడం అనే సత్యసంకల్పత్వం, **కృతిత్వ** = భక్తుల రక్షణ కార్యాలను చేస్తూ

ఉండడం అనే కృతిత్వం, **కృతజ్ఞతా** = భక్తులు చేసిన కొద్దిపాటి మంచినికూడా మఱువకపోవడం అనే కృతజ్ఞత, **ఆది+అసంఖ్యేయ** = మొదలైన, లెక్క లేనన్ని, **కల్యాణగుణగణ+ఓఘ** = కల్యాణగుణాల సమూహాలకు, **మహా+ఆర్ణవం** = గొప్ప సముద్రం వంటివాడు, **పరబ్రహ్మ భూతం** = పరబ్రహ్మ అయినవాడు, **పురుషోత్తమం** = పురుషోత్తముడు, **శ్రీరంగశాయినం** = శ్రీరంగంలో శయనించి ఉండేవాడు, **అస్మత్ స్వామినం** = మనకు స్వామి, **పరిపూర్ణం** = ఏ కొఱత లేని, అన్ని విధాలుగా పూర్ణమైనవాడు అయిన, **భగవంతం** = భగవానుని, **ప్రబుద్ధ** = చక్కగా తెలియబడిన, **నిత్య నియామ్య** = భగవానునిచే నిత్యంగా నియమింపబడదగినది, **నిత్యదాస్య** = నిత్యమైన దాస్యాన్ని కల్గినది అయిన, **ఆత్మ** = ఆత్మయొక్క, **స్వభావః +అహం** = స్వభావాన్ని కల్గిన నేను, **తత్+ఏక+అనుభవః**= ఆ భగవానుని మాత్రమే నా జ్ఞానభక్తులకు విషయంగా కలవాడనై, **విశదతమ+అనుభవేన** = మిక్కిలి స్పష్టమైన అనుభవంతో, **నిరంతరం** = నిరాటంకంగా, **అనుభూయ** = అనుభవించి, **తత్+అనుభ జనిత** = ఆ భగవదనుభవం వల్ల కల్గిన, **అనవధిక +అతిశయ**= నిస్సమాభ్యధికమైన, సాటి మేటి లేని గొప్పతనాన్ని కల్గిన, **ప్రీతి** = ఆనందంచేత, **కారిత** = చేయించబడిన, **అశేష అవస్థా+ఉచిత్** = అన్ని సన్నివేశాలకు తగిన, **అశేషశేషతా +ఏకరతిరూప**= సమస్తకైంకర్యాలను చేయడంలోనే ఆనందాన్ని కల్గి ఉండే రీతిలోని, **నిత్యకింకరః**= నిత్యకింకరుడను, **భవాని** = కావాలి.

(స్వాధీనత్రివిధ చేతనాచేతన స్వరూపస్థితి ప్రవృత్తిభేదమ్) మూడువిధాలైన చేతనాచేతనాల స్వరూపం, రక్షణం, ప్రవృత్తి నివృత్తులు- అనే వీటిని తన అధీనంలో కల్గినవాడు (ఈ విశేషణం మొదలు ద్వితీయాంత విశేషణాలను అన్నిటినీ **"భగవంతమ్"** అనే విశేష్యానికి అన్వయించి, **"విశదతమానుభవేన నిరంతర మనుభూయ"** అనే ప్రయోగంతో చేర్చాలి)

చేతనులు బద్ధ-ముక్త-నిత్య భేదంతో మూడు విధాలుగా ఉంటారు. అచేతనం-త్రిగుణ కాల-శుద్ధసత్వాల రూపంలో మూడు విధాలు. **"త్రివిధ"** అనే విశేషణాన్ని చేతనశబ్దంతోమాత్రం అన్వయించి, అచేతనంలో

అన్వయించకుండా కూడా ఉండవచ్చునని దేశికుల అభిప్రాయం. చూర్ణికలో చివర గల **'భేద'** అనే పదాన్ని స్వరూపం, స్థితి, ప్రవృత్తులు మూడింటిలో అన్వయించాలి. స్వరూపభేదం, స్థితిభేదం, ప్రకృతి భేదం- అని అర్థాన్ని గ్రహించవచ్చు. ఈ మూడు ప్రత్యేకంగా పలువిధాలుగా ఉండడం గమనించదగినది.

(క్లేశకర్మాది+ఆశేషదోష+అసంస్పృష్టమ్) అవిద్య మొదలైన అయిదు క్లేశాలు, పుణ్యపాపరూపమైన కర్మలు మొదలైన ఏవిధమైన దోషాలయొక్క సంబంధాన్ని కొంచెంకూడా లేనివాడు- అని భావం.

చేతనాచేతనాలు శరీరంగా, భగవానుడు శరీరిగా ఉన్నట్లయితే, శరీర సంబంధంవల్లకలిగే దోషం శరీరి అయిన భగవానునకు రాదా? అని అంటే, రాదు- అని ఈవిశేషణాన్ని ప్రయోగించడం ద్వారా తెలుపుతున్నారు. క్లేశాలు ఏవి? అంటే- అవిద్య, అస్మితా, అభినివేశం, రాగం, ద్వేషం - అని అయిదు. వాటి కార్యాలైన పుణ్యపాపాల రూపంలోని కర్మలు. ఆదిపదంద్వారా విపాకం మొదలైనవానిని గ్రహించాలి.

(స్వాభావికానవధికాతిశయ జ్ఞానబలైశ్వర్య వీర్యశక్తి తేజస్సౌశీల్యవాత్సల్య మార్దవార్జవ సౌహార్దసామ్యకారుణ్య మాధుర్యగామ్భీర్యౌదార్య చాతుర్యస్థైర్య ధైర్యశౌర్యపరాక్రమ సత్యకామ సత్యసఙ్కల్ప కృతిత్వ కృతజ్ఞతాదయసఙ్ఖ్యేయ కల్యాణ గుణగణౌఘమహార్ణవమ్)

"స్వాభావిక, అనవధికాతిశయ" అనే రెండు విశేషణాలు తరువాత చెప్పబడే గుణాలు అన్నిటిలోను అన్వయిస్తాయి. స్వాభావికాలు, నిస్సమాభ్యధికాలు (సాటి అయినవి, మించినవి లేనివి) అయిన షాడ్గుణ్యం మొదలైన కల్యాణగుణాలకు సముద్రంవంటివాడా! అని భావం. ఈ గుణాలు స్వాభావికాలై ఉండడం అంటే - నీటికి చల్లదనంవలె, నిప్పుకు వేడిమివలె, నిరుపాధికంగా ధర్మి ఉన్నప్పుడు అంతా ఉండడం. ఒకనాడు ఉన్నవిగాను, వేఱొకనాడు లేనివిగాను కాకుండా, యావదాత్మ భావిగా ఉండడం. ఇందువల్ల నిత్యముక్తుల గుణాలకంటే వీటికి గల వైలక్షణ్యం తెలుపబడింది. వారి

గుణాలు భగవానుని ఇచ్ఛను అనుసరించి ఉంటాయి కనుక, అనన్యాధీనత్వ మనబడే స్వాభావికత్వం వాటికి లేదు. అనవధికాతిశయత్వమంటే - ప్రతిగుణం అంతు లేని మహిమను కల్గి ఉండడం. పైన పేర్కొనబడే గుణాలలో కొన్ని ఇతరవ్యక్తులలో ఉన్నా, అవి పరిమిత మహిమను కల్గి ఉంటాయి. ఆవిధంగా కాకుండా ఇవి భగవానునిలో ఇంతకుమించి గొప్పతనం ఇంకొకటి లేదు -అనే రీతిలోని గొప్పతనాన్ని కల్గి ఉంటాయి. శ్రీభాష్యంలోని **"స్వభావతో నిరస్తనిఖిల దోషానవధికాతిశయాసంఖ్యేయకల్యాణగుణగణః పురుషోత్తమోఽభీధీయతే"** అనే సూక్తిని వ్యాఖ్యానిస్తూ శ్రీశ్రుతప్రకాశికాచార్యులవారు **"అనవధికాతిశయ"** అనే పదం నిత్యసిద్ధులనుండి వేఱు చేస్తున్నదనే ఒక నిర్వాహాన్ని చూపి, **"అనుపక్తేన స్వభావత ఇతి పదేన వా నిత్యసిద్ధవ్యావృత్తిः. తేషాం తాదృశగుణకత్వం హి భగవన్నిత్యే చ్ఛాధీనమ్"** అని తరువాత యోజనను పేర్కొనడం అనుసంధేయం.

ఇక, ఈ చూర్ణికలో ప్రస్తావింపబడ్డ దివ్యగుణాలు వివరింపబడు తున్నాయి. జ్ఞానశక్తిబలైశ్వర్య- వీర్యశక్తి తేజస్సులు ఆఱు కలిపి షాడ్గుణ్యమన బడతాయి. ఇవియే మిగిలిన అన్ని గుణాలకు ఆకరాలు. వీటిలో, **జ్ఞానం అంటే** - అన్నిటినీ ఒకేసారి ఎల్లప్పుడు యథాతథంగా తెలియగల్గడం. బలం అంటే- సంకల్పమాత్రంతో సకలపదార్థాలను ఏశ్రమ లేకుండా ధరించే శక్తి. **ఐశ్వర్యం అంటే** - సమస్తవస్తువులను నియమించే సామర్థ్యం. వీర్యమంటే -జగత్తుక్కు ఉపాదానకారణమై ఉన్నా స్వరూపవికారాన్ని ఏమాత్రం కల్గి ఉండకపోవడం. **శక్తి అంటే**- అఘటిత ఘటనాసామర్థ్యం. **తేజస్సు అంటే**- దేనికీ ఏ సహకారిని అపేక్షించకుండా ఉండడం. ఈ విధంగా ఇటువంటి షాడ్గుణ్యాన్ని ప్రస్తావించిన తరువాత, వీటినుండి ఉద్భవించే కల్యాణగుణాలను కొన్నిటిని ఇకపై ప్రస్తావిస్తున్నారు; **"సౌశీల్య"** అనే పదంనుండి ప్రారంభించి

సౌశీల్యమంటే - గొప్పవాడు తనకంటే తక్కువవారితో ఏభేదం లేకుండా కలసి వర్తించే స్వభావం. దీనికే శీలగుణమని పేరు. **వాత్సల్యమంటే**- అపుడే ఈనిన దూడ ఒంటిలో ఉండే మలినాన్ని ఆదరించే తల్లి ఆవువలె, ఆశ్రితుల దోషాలను భోగ్యంగా గ్రహించే గుణం. **మార్దవమంటే**- ఆశ్రితుల విశ్లేషాన్ని సహించలేకపోవడం, **ఆర్జవమంటే** - కరణత్రయంలో ఋజువుగా ఉండడం.

దీనికి సాక్షాత్తు వ్యతిరేకమైన దుర్గుణం కౌటిల్యం. **సౌహార్దమంటే** - ఎల్లప్పుడు మంచిని గూర్చి చింతించే గుణం. **సామ్యమంటే**- జాతిగుణవృత్తాలలో హెచ్చు తగ్గులను గణించకుండా అందఱికి సమానంగా ఆశ్రయించదగినవాడై ఉండడం. **కారుణ్య మంటే**- దుఃఖించినవారిని చూచి అయ్యో! అని భావించడం. **మాధుర్యమంటే**- చంపాలని తలచే శత్రువులకుసైతం భోగ్యమై ఉండడం. **గాంభీర్యమంటే** - ఆశ్రితు లకు తాను చేయదలచినవానిని ఏనాటికీ ఎవరూ తెలిసికోవడానికి వీలు కాని రీతిలో లోతైన హృదయాన్ని కల్గి ఉండడం. **ఔదార్యమంటే**- ప్రతిఫలం ఆశించ కుండా చాలా సమృద్ధిగా కోరినవానిని అన్నిటిని కోరినవారికి ఇవ్వడం. **చాతుర్య మంటే**- ప్రతికూలురనుకూడ అనుకూలురుగా చేసికోగల్గిన చతురత, **స్థైర్యమంటే**- ఆశ్రితులను ఏనాడూ విడువని గుణం, **ధైర్యమంటే**- ప్రతిపక్షం ప్రబలమైన ఉన్నా తృణీకరించడం (లెక్క పెట్టకుండా ఉండడం). **శౌర్యమంటే**- శత్రువుల గొప్ప సమూహంలోకి ఒంటరిగా ఏ జంకు లేకుండా ప్రవేశించడం. **పరాక్రమమంటే**- ఆ విధంగా యుద్ధభూమిలో ఒంటరిగా ప్రవేశించినా అవలీలగా శత్రువులను భంగపరచ గల్గిన నేర్పు.

"సత్యకామ, సత్యసంకల్ప" అనే రెండు భావప్రధాననిర్దేశాలు కనుక, సత్యకామత్వం, సత్యసంకల్పత్వమనే అర్థాన్ని గ్రహించాలి. **సత్యకామత్వమంటే**- కోరినవానిని అన్నిటినీ ఏకొఱత లేకుండా సిద్ధించడం, **సత్యసంకల్పత్వం అంటే**- దేనిని చేయాలని అనుకున్నా, ఏఆటంకం లేకుండా దానిని పూర్తి చేయగల్గిన శక్తి. **కృతిత్వమంటే**- భక్తుల కార్యాలను చేస్తూ ఉండడం, **కృతజ్ఞత మంటే**- భక్తులు కొంచెం మంచిని చేసినా, దానిని ఏనాటికీ మఱువకుండా ఉండడం. ఈవిధంగా ఉండే,

అసంఖ్యేయకల్యాణగుణ గుణ+ఓఘమహార్ణవమ్ = లెక్కించి పూర్తి చేయలేని కల్యాణగుణాలనే ప్రవాహాలకు సముద్రంవంటివాడు.

(పరబ్రహ్మభూతం పురుషోత్తమ్) పరబ్రహ్మశబ్దంతో, పురుషోత్తమ శబ్దంతో వేదంలో ప్రసిద్ధుడైనవాడు,

(శ్రీరంగశాయినమ్) శ్రీరంగదివ్యాలయంలో అస్మదాదులుసైతం కళ్ళార దర్శించి ఆనందించేటట్లు శయనించి ఉండేవాడు.

(అస్మత్ స్వామినం పరిపూర్ణం భగవంతమ్) మాకు స్వామి, దేనిలోను ఏకొఱత లేని భగవానుని (ఈ ప్రయోగాన్ని "అనుభూయ" అనే ల్యబంతక్రియతో అన్వయించాలి)

(ప్రబుద్ధనిత్యనియామ్య నిత్యదాస్యైకరసాత్మస్వభావోఽహమ్) నిత్య నియామ్యమై, నిత్యదాస్యైకరసమైన ఆత్మ స్వభావాన్ని చక్కగా తెలిసికొన్న నేను- అని అర్థం. జీవాత్మ నిత్యనియామ్యమై ఉంటుంది, నిత్యదాస్యైకరసంగా ఉంటుంది- అనే స్వభావాలను చక్కగా తెలిసికొన్నట్లు చెప్పబడింది. స్వాధీనస్వార్థకర్తృత్వ భోక్తృత్వభ్రమం లేనిరీతిలో తెలియబడడమే చక్కగా తెలియబడడం. ఈ ఆత్మ భగవానునకు ఒక్కనికే నియామ్యుడుగా, దాసుడుగా ఉన్నాడు- అని బాగా తెలిసికొన్న నేను- అని సారం.

(తదేకానుభవః తదేకప్రియః) - భగవానుని మాత్రమే జ్ఞానానికి, భక్తికి విషయంగా కలవాడనై,

(విశదతమానుభవేన నిరంతరమనుభూయ) - చాలా విశదంగా, విచ్ఛేదం లేకుండా అనుభవించి,

(తదనుభవ జనితానవధికాతిశయ ప్రీతికారితాశేషావస్థోచితాశేషశేషతైకరతి రూప నిత్యకిఙ్కరో భవాని) - ఆ అనుభవంచేత పుట్టిన చాలా గొప్ప ఆనందంచేత చేయించబడే సర్వావస్థోచిత - సర్వవిధ కైంకర్యాలలో చాలా ఆదరాన్ని, ఆసక్తిని కల్గి ఉండడం- అనే నిత్యకైంకర్యంలో నిరతుడనై ఉంటాను.

"శేషతైకరతిః" అనే దానిని బహువ్రీహి సమాసంగా గ్రహించి **"నిత్యకింకర"** శబ్దానికి విశేషణంగా చేయాలి. అశేషమైన కైంకర్యాలలో చక్కగా అభినివేశాన్ని కల్గిన నిత్య కింకరుడను కాగలను - అని దీని భావం. ఈ విధంగా ఇంతవరకు ద్వయంలోని ఉపేయంలో దృష్టిని కల్గిన ఉత్తరఖండం యొక్క అర్థం వివరింపబడింది.

2. స్వాత్మనిత్యనియామ్య నిత్యదాస్యైకరసాత్మస్వభావానుసన్ధానపూర్వక భగవదనవధికాతిశయ స్వామ్యాద్యఖిల గుణగణానుభవజనితానవధికాతిశయ ప్రీతికారితాశేషావస్థోచితాశేషశేషతైకరతిరూప నిత్యకైఙ్కర్యప్రాప్త్యుపాయభూత భక్తి తదుపాయ సమ్యఙ్జ్ఞాన తదుపాయ సమీచీనక్రియా తదనుగుణ సాత్త్వికతాస్తిక్యాది సమస్తాత్మగుణవిహీనః, దురుత్తరానన్తతద్విపర్యయ జ్ఞానక్రియానుగుణానాది పాపవాసనా మహార్ణవాన్తర్నిమగ్నః, తిలతైలవద్దారు వహ్నివ ద్దుర్వివేచత్రిగుణక్షణక్షరణ స్వభావచేతన ప్రకృతివ్యాప్తిరూప దురత్యయ భగవన్మాయాతిరోహిత స్వప్రకాశః, అనాద్యవిద్యాసఞ్ఛితానన్తాశక్య విస్రంసన కర్మపాశప్రగ్రథితః అనాగతానన్తకాల సమీక్ష యాప్యదృష్టసంతారోపాయః, నిఖిలజన్తుజాతశరణ్య! శ్రీమన్! నారాయణ! తవ చరణారవిన్దయుగళం శరణ మహం ప్రపద్యే ॥

ఇక, ఉపాయంలో దృష్టిని కల ద్వయంలోని పూర్వఖండార్థం వివరింప బడుతున్నది. అందులో **"ప్రపద్యే"** అని ఉత్తమ పురుషలో వివక్షిత మైన ఆకించన్యమనే ప్రపత్తిని చేసేవాని అధికారవిశేషాన్ని, కార్పణ్యమనే అంగాన్ని **"స్వాత్మనిత్య...."** ఇత్యాదిగా వివరిస్తున్నారు- ఈ రెండవ చూర్ణికలో.

(స్వాత్మనిత్యనియామ్య) = దాసుడనైన నేను ఎల్లప్పుడు నియమింప బడతగినవాడై ఉండడం, **(నిత్యదాస్య)** = నిత్యం కైంకర్యం చేస్తూ ఉండదగినవాడై ఉండడం, **(ఏకరస)** = అనే వీటినే సారంగా కల, **(ఆత్మస్వభావ+అనుసంధాన పూర్వక)** = స్వస్వభావాన్ని అనుసంధించి, దానివల్ల కలిగే, **(భగవదనవధికాతిశయ స్వామ్యాది+అఖిలగుణానుభవ జనిత)** = ఎల్లప్పుడు తనకే నియమించదగినవాడై ఉండడం, నిత్యకైంకర్యంలోనే అభినివేశాన్ని కల్గిఉండడం మొదలైన స్వస్వభావాన్ని అనుసంధిస్తూ, భగవానునియొక్క గొప్పదైన స్వామిత్వం మొదలైన సకల గుణాలను అనుభవించడంవల్ల కలిగే, **(ప్రీతికారిత)** = గొప్ప ప్రీతితో చేయబడిన, **(అశేష+అవస్థా+ఉచిత+అశేషశేషతైకరతిరూపనిత్య కైంకర్య ప్రాప్త్యుపాయభక్తి)** = అన్ని అవస్థలకు తగిన సర్వవిధకైంకర్యాలలోను ప్రావణ్యాన్ని కల్గి ఉండడమనే నిత్యకైంకర్యానికి ఉపాయమైన భక్తి, **(తదుపాయ సమ్యక్‌జ్ఞాన)** = దానికి ఉపాయ మైన పరిపక్వజ్ఞానం, **(తదుపాయసమీచీన**

క్రియా) = దానికి ఉపాయమైన చక్కని కర్మయోగం, **(తదనుగుణసాత్త్వికతా+ ఆస్తిక్యాది సమస్త + ఆత్మగుణవిహీనః)** = దానికి తగిన సాత్త్వికత్వం, ఆస్తికత్వం మొదలైన ఆత్మగుణాలు- అనే వీనిని కొంచెంకూడా లేనివాడనై,

(దురుత్తరానన్తతద్విపర్యయ జ్ఞానక్రియానుగుణానాది పాపవాసనా మహార్ణవాన్తర్నిమగ్నః) = పూర్వం పల్కిన సమ్యక్ జ్ఞానానికి, సమీచీన క్రియలకు విరుద్ధమైన విపరీతజ్ఞాన - విపరీతక్రియలకు తగిన అనాది పాపవాసన అనే దాట లేని గొప్ప సముద్రంలో మునిగి ఉన్నవాడనై,

(తిలతైలవద్దారువహ్నివద్దుర్విభేచ త్రిగుణక్షణక్షరణ స్వభావాచేతన ప్రకృతి వ్యాప్తిరూప దురత్యయ భగవన్మాయాతిరోహిత స్వప్రకాశః) = నూగుగింజలో నూనెవలె, కట్టెలో నిప్పువలె, సాధారణంగా వేఱు చేయలేని సత్త్వరజస్త మనస్సులను, సతతం పరిణమించే స్వభావాన్ని సహజంగా కల్గినది, జడరూపమైన ప్రకృతిలో అవర్జనీయంగా ఉండే సంబంధాన్ని కల్గినది, దాటడానికి సాధ్యంకానిదైన భగవన్మాయతో మఱుగు పఱుచబడిన స్వప్రకాశాన్ని కలవాడనై,

(అనాద్యవిద్యాసఞ్చితానన్తాశక్య విస్రంసన కర్మపాశప్రగ్రథితః) = అనాది అయిన అజ్ఞానంచేత సంచితమై (పేరుకున్నదై), అంతు లేనిదై, ఎవరివల్ల విడిపించడానికి వీలు కాని రీతిలో ఉండే పుణ్యపాపరూపకర్మలనే దారాలతో బంధింపబడినవాడనై,

(అనాగతానన్తకాల సమీక్షయాప్యదృష్టసంతారోపాయః అహమ్) = ఎంత కాలం చూచినా సంసారాన్ని దాటే ఉపాయం ఇది- అని తెలియలేనివాడనై ఉండే నేను,

(నిఖిలజంతుజాతశరణ్య) = సమస్తప్రాణుల సమూహానికి శరణ్యుడవైన వాడా!

(శ్రీమన్ నారాయణ) = లక్ష్మీదేవితో నిత్యం కూడి ఉండే నారాయణా!

(తవ చరణారవింద యుగళం శరణమహం ప్రపద్యే) = నీ శ్రీచరణ పద్మాల జంటను నేను శరణు పొందుతున్నాను.

3. ఏవమవస్థితస్యాప్యర్థిత్వమాత్రేణ పరమకారుణికో భగవాన్ స్వానుభవ ప్రీత్యోపనీతైకాన్తికాత్యన్తిక నిత్యకైఙ్కర్యైకరతిరూప నిత్యదాస్యం దాస్యతీతి విశ్వాస పూర్వకం భగవన్తం నిత్యకిఙ్కరతాం ప్రార్థయే ॥

ఏవమ్ అవస్థితస్యాపి = పూర్వం తెల్పిన రీతిలో ఆకించన్యాదులను కల్గినవాడను అయినా, **పరమకారుణికః భగవాన్** = గొప్ప కరుణను సహజంగా కల్గిన భగవానుడు, **అర్థిత్వమాత్రేణ** =నేను ప్రార్థిస్తున్నాను- అనే కారణంచేతనే, **స్వానుభవప్రీత్యా** = తన అనుభవం వల్ల కల్గిన ప్రీతిచేత, **ఉపనీత** = కల్గించబడినది, **ఐకాంతిక** = ఏకాంతమైనది, **ఆత్యంతిక** = అంతు లేనిది, **నిత్య** = నిత్యమైనది అయిన, **కైంకర్య+ఏకరతిరూప** = కైంకర్యంలో మాత్రమే ఆనందాన్ని కల్గి ఉండడమనే రూపంలోని, **నిత్య దాస్యం** = (తనయొక్క) నిత్యకైంకర్యాన్ని, **దాస్యతి ఇతి** = అనుగ్రహిస్తాడు - అనే, **విశ్వాసపూర్వకం** = విశ్వాసంతో, **భగవంతం** = భగవానుడైన శ్రీమన్నారాయణుని, **నిత్యకింకరతాం** = నిత్యకైంకర్యాన్ని (అనుగ్రహించవలసినదిగా) ప్రార్థయే = ప్రార్థిస్తున్నాను.

(ఏవమవస్థితస్యాపి) = పూర్వం తెల్పిన రీతిలో ఆకించన్యాదులను మూర్తీభవించినవాడనై నేను ఉన్నా,

(పరమకారుణికః భగవాన్) = గొప్ప కరుణను సహజంగా కల భగవానుడు,

(అర్థిత్వమాత్రేణ) = నాపట్ల గల అర్థిత్వాన్నిబట్టి (నేను ప్రార్థిస్తున్నాను అనే ఒక కారణాన్నిబట్టి),

(స్వానుభవ ప్రీత్యోపనీతైకాన్తికాత్యన్తిక నిత్యకైఙ్కర్యైకరతిరూప నిత్య దాస్యం దాస్యతీతి విశ్వాస పూర్వకమ్) = తనఅనుభవంవల్ల కల్గిన ప్రీతిచే ఏర్పడినది, ఏకరూపమైనది, అంతు లేనిది అయిన కైంకర్యంలో అభినివేశం కల్గి ఉండడమనే నిత్యకైంకర్యాన్ని అనుగ్రహిస్తాడు- అనే నమ్మికతో,

(భగవంతం నిత్యకింకరతాం ప్రార్థయే) = భగవానునివద్ద నిత్యకైంకర్యాన్ని ప్రార్థిస్తున్నాను.

పూర్వం తమయొక్క సూక్తిద్వారా ప్రాప్యాన్ని ప్రార్థించారు. ఇపుడు ఇతిహాసశ్లోకాలు రెండిటిద్వారా ప్రార్థిస్తున్నారు. ఈ రెండు శ్లోకాలకు ఇతిహాస పురాణాలలో ఆకరం అన్వేషణీయం.

4. తవానుభూతిసమ్భూత ప్రీతికారితదాసతామ్ ।
దేహి మే కృపయా నాథ ! న జానే గతిమన్యథా ॥

నాథ =నాథా !, **తవ** = నీయొక్క, **అనుభూతిసంభూత** = అనుభవం వల్ల కల్గిన, **ప్రీతికారిత** =ప్రీతిచే చేయించబడిన, **దాసతాం** =కైంకర్యాన్ని, **మే**= నాకు, **కృపయా** = కృపతో, **దేహి** = అనుగ్రహించు, **అన్యథా**= వేఱొక రీతిలో, **గతిం** = గతిని, **న జానే** = నేను తెలియను.

నాథా! నిన్ను అనుభవించి, దానివల్ల కలిగే ప్రీతిచేత కైంకర్యాన్ని పరమకృపతో నాకు అనుగ్రహించాలి. నీవు తప్ప వేఱు గతి లేనివాడనై ఉన్నాను.

5. సర్వావస్థోచితాశేషశేషతైకరతిస్తవ ।
భవేయం పుణ్డరీకాక్ష ! త్వమేవైవం కురుష్వ మామ్ ॥

పుండరీకాక్ష = ఓ పుండరీకాక్ష!, **తవ** =నీకు, **సర్వ+అవస్థా+ఉచిత** = అన్ని సన్నివేశాలకు తగిన, **అశేషశేషతా+ఏకరతిః** = సమస్తకైంకర్యాలను చేయడంలో మాత్రమే ఆనందాన్ని కలవాడను, **భవేయం** = కాగలను, **త్వమ్+ఏవ**= నీవే, **మామ్**= నన్ను, **ఏవం** = ఈవిధంగా, **కురుష్వ** = చేయాలి.

పుండరీకాక్షా ! అన్ని అవస్థలలోను నీకు చేయదగిన సకలవిధకైంకర్యాలలో నాకు రుచి కలిగేటట్లు నీవే అనుగ్రహించాలి.

6. ఏవంభూత తత్త్వయాథాత్మ్యావబోధ తదిచ్ఛారహితస్యాపి, ఏత దుచ్చారణ మాత్రావలమ్బనేన ఉచ్యమానార్థపరమార్థనిష్ఠం మే మనస్తమేవాద్యైవ కారయ ॥

ఏవం భూత = పూర్వం తెల్పిన రీతిలోని, **తత్త్వయాథాత్మ్య** = ఆత్మతత్త్వం యొక్క యథాతథమైన, **అవబోధ** = జ్ఞానాన్ని, **తదిచ్ఛా** = ఆ జ్ఞానాన్ని పొందాలనే ఆశను, **రహితస్య+ అపి** =లేనివాడను అయినా, **ఏతత్+ ఉచ్చారణ మాత్ర+**

అవలంబనేన = "నేను నిన్ను శరణు వేడుతున్నాను" అని ఉచ్చరించిన మాటనే ఆలంబనంగా చేసికొని, **మే మనః** = నామనస్సును, **ఉచ్యమానార్థ పరమార్థనిష్ఠం**= చెప్పబడుతున్న ఉపాయ ఉపేయాలలోని యథార్థజ్ఞానంలో నిష్ఠను కలవానినిగా, **త్వమేవ** =నీవే, **అద్య ఏవ** = ఈనాడే, **కారయ** = చేయాలి.

శ్రీరంగనాథా! నీ అనుగ్రహంతో నేను అధికార పూర్తిని పొందినవాడనుగా భావిస్తున్నాను. ఒకవేళ ఆ విధమైన అధికార పూర్తి నాకు లేకపోయినా దాసుడనైన నేను పలికే ఈ మాటను నెపంగా చేసికొని నీవే శేషపూరణాన్ని చేయాలి - అని ఈ చూర్ణికలోని తాత్పర్యం.

(ఏవంభూత తత్త్వయాథాత్మ్యావబోధ తదిచ్ఛారహితస్యాపి) = ఈ విధంగా చాలా గొప్పదైన పురుషార్థం యొక్క యథార్థస్థితిని తెలిసికోవడాన్ని, తెలిసికోవాలనే ఆశను లేనివాడనైనా,

(ఏతదుచ్చారణ మాత్రావలమ్బనేన) = నా నోటిమాటనే నెపంగా చేసికొని,

(మే మనః) = నా మనస్సును,

(ఉచ్యమానార్థ పరమార్థనిష్ఠామ్) = ఉపాయోపేయాలలోని యథార్థ జ్ఞానాన్ని పొందిన దానినిగా,

(త్వమేవ అద్య ఏవ కారయ) = నీవే ఇపుడే చేయాలి.

"కురు" అని అనకుండా **"కారయ"** అని అనడం **"అతువుమ్ అవనతు ఇన్నరుళే"** (అదికూడా ఆ పరమాత్మయొక్క గొప్ప కరుణయే) అనే పరమార్థాన్ని చూపడంకోసం.

7. అపారకరుణామ్బుధే ! అనాలోచితవిశేషాశేషలోకశరణ్య ! ప్రణతార్తిహర! ఆశ్రితవాత్సల్యైకమహోదధే ! అనవరత విదితనిఖిలభూతజాత యాథాత్మ్య! సత్యకామ! సత్యసఙ్కల్ప ! అపత్సఖ ! కాకుత్స్థ ! శ్రీమన్! నారాయణ! పురుషోత్తమ! శ్రీరఙ్గనాథ! మమ నాథ ! నమోఽస్తు తే ॥

అపారకరుణా+అంబుధే = అంతులేని కరుణకు సముద్రం వంటివాడా!, **అనాలోచిత విశేష** = ఆలోచింపబడని (లెక్కింపబడని) గుణదోషాల రూపంలోని

విశేషాలను కల, **అశేషలోక** = సమస్తలోకానికి, **శరణ్య** = గొప్ప శరణమైనవాడా!, **ప్రణత+ఆర్తిహర** = భక్తుల ఆర్తిని తీర్చేవాడా!, **ఆశ్రిత వాత్సల్య+ఏకజలధే** = భక్తుల పట్ల వాత్సల్యానికి అద్వితీయమైన సముద్రంవంటివాడా!, **అనవరతవిదిత**= నిత్యం తెలియబడిన, **నిఖిల భూతజాతయాథాత్మ్య** =సమస్త ప్రాణి సమూహాల యథార్థస్వరూపాన్ని కలవాడా!, **సత్యకామ** =కోరికలను అన్నిటినీ పొందినవాడా!, **సత్యసంకల్ప** = సత్యమైన సంకల్పాన్ని కలవాడా!, **ఆపత్సఖ** =ఆపదలలో మిత్రమా!, **కాకుత్స్థ** = కకుస్థుని వంశంలో పుట్టినవాడా!, **శ్రీమన్! నారాయణ!** = శ్రీమన్నారాయణా!, **పురుషోత్తమా!** = పరమపురుషా !, **శ్రీరంగనాథ** = శ్రీరంగనాథా!, **మమ నాథ** = నాస్వామీ !, **తే నమః అస్తు** = నీకే నా ఆత్మ భోగ్యమై ఉండాలి.

(అపారకరుణాంబుధే!)=అంతులేని (తీరం దాటిన) కరుణాసముద్రమా!

(అనాలోచితవిశేష+అశేషలోకశరణ్య!) = గుణదోషాల నిరూపణాన్ని చేయ కుండా సకలజగత్తుకు శరణ్యుడవైనవాడా!,

(ప్రణత+ఆర్తిహర!) = ఆశ్రయించిన వారి ఆర్తిని తీర్చేవాడా!

(ఆశ్రితవాత్సల్య+ఏకమహోదధే!) = దాసులపట్ల గల వాత్సల్యానికి అద్వితీయమైన మహాసముద్రమా!

(అనవరతవిదిత నిఖిలభూతజాతయాథాత్మ్య!) = సకలప్రాణిసమూహాల యొక్క యథార్థస్వరూపాన్ని ఎల్లప్పుడు తెలిసికొనేవాడా!

(సత్యకామ!) = అన్ని కోరికలను పొందినవాడా! (అవాప్తసమస్తకాముడు)

(సత్యసంకల్ప!) = తలచినదానిని చేసి పూర్తి చేయగలిగినవాడా!

(ఆపత్సఖ!) = ఆపదలలో స్నేహితుడైనవాడా!,

(కాకుత్స్థ!) = కకుత్స్థవంశంలో జన్మించినవాడా!,

(శ్రీమన్నారాయణ!) = శ్రీమన్నారాయణ!,

(పురుషోత్తమ!) = పరమపురుషా!,

(శ్రీరంగనాథ!) = శ్రీరంగనాథా!,

(మమ నాథ!) = నా స్వామీ!,

(తే నమః అస్తు) = నీకే శేషమైన ఈ ఆత్మవస్తువు నీకే భోగ్యమై ఉండాలి.

శ్రీరంగగద్యం టీక సంపూర్ణం.

ఎమ్బెరుమానార్ తిరువడిగళే శరణమ్

భగవద్రామానుజులు అనుగ్రహించిన

శ్రీవైకుణ్ఠగద్యమ్

1. యామునార్యసుధాంభోధి మవగాహ్య యథామతి ।
ఆదాయ భక్తియోగాఖ్యం రత్నం సన్దర్శయామ్యహమ్ ॥

2. స్వాధీన త్రివిధచేతనాచేతన స్వరూపస్థితిప్రవృత్తి భేదమ్, క్లేశకర్మాద్యశేష దోషా సంస్పృష్టం, స్వాభావికానవధికాతిశయ జ్ఞానబలైశ్వర్య వీర్యశక్తి తేజఃప్రభృత్య సఙ్ఖ్యేయ కల్యాణగుణగణౌఘ మహార్ణవం, పరమపురుషం, భగవన్తం, నారాయణం, స్వామిత్వేన సుహృత్వేన గురుత్వేన చ పరిగృహ్య, ఐకాన్తికాత్యన్తిక తత్పాదాంబుజ ద్వయ పరిచర్యైకమనోరథః, తత్ప్రాప్తయే చ తత్పాదాంబుజ ద్వయప్రపత్తే రన్యత్ న మే కల్ప కోటిసహస్రేణాపి సాధన మస్తీతి మన్వానః, తస్యైవ భగవతో నారాయణస్య, అఖిల సత్త్వదయైకసాగరస్య, అనాలోచిత గుణాగుణాఖణ్డజనాను కూలామర్యాదశీలవతః, స్వాభావికానవధికాతిశయగుణ వత్తయా, దేవతిర్య ఙ్మనుష్యాద్యఖిలజనహృదయా నన్దనస్య, ఆశ్రిత్సలైకజలధేః, భక్తజనసంశ్లేషైకభోగస్య, నిత్యజ్ఞానక్రియైశ్వర్య భోగసామగ్రీసమృద్ధస్య, మహావిభూతేః, శ్రీమతశ్చరణారవిన్ద యుగళమ్ అనన్యాత్మ సంజీవనేన తద్గతసర్వభావేన శరణ మనువ్రజేత్ ॥

3. తతశ్చ ప్రత్యహ మాత్మోజ్జీవనాయ ఏవ మనుస్మరేత్ ॥

4. చతుర్దశ భువనాత్మకమణ్డం, దశగుణితోత్తరం చావరణసప్తకం, సమస్తం కార్యకారణజాత మతీత్య వర్తమానే, పరమవ్యోమశబ్దాభిధేయే, బ్రహ్మాదీనాం వాఙ్మనసాగోచరే, శ్రీమతి వైకుణ్ఠే దివ్యలోకే, సనకవిధిశివాదిభిరప్యచిన్త్య స్వభావైశ్వర్యైర్ని త్యసిద్ధై రనన్తైర్భగవదానుకూల్యైకభోగై ర్దివ్యపురుషర్మహాత్మభిరా పూరితే, తేషామపి ఇయత్పరిమాణ మియదైశ్వర్య మీదృశస్వభావ మితి పరిచ్ఛేత్తు మయోగ్యే, దివ్యావరణ శతసహస్రావృతే, దివ్యకల్పక తరూపశోభితే, దివ్యోద్యాన శతసహస్రకోటిభిరావృతే, అతిప్రమాణే, దివ్యాయతనే, కస్మింశ్చిద్వి చిత్రదివ్య రత్నమయే, దివ్యాస్థానమణ్టపే, దివ్యరత్న స్తమ్భశతసహస్రకోటి భిరుపశోభితే,

దివ్యనానారత్నకృత స్థలవిచిత్రితే, దివ్యాలఙ్కారాలఙ్కృతే, పరితః పతితైః పతమానైః పాదపస్థైశ్చ నానాగన్ధవర్ణై ర్దివ్యపుష్పైః శోభమానై ర్దివ్యపుష్పోపవనై రుపశోభితే, సఙ్కీర్ణ పారిజాతాది కల్పద్రుమోపశోభితైః అసఙ్కీర్ణైశ్చ కైశ్చిదనస్థపుష్ప రత్నాదినిర్మిత దివ్యలీలామణ్టప శతసహస్రోపశోభితైః సర్వదాఽనుభూయమానై రప్యపూర్వవదాశ్చర్యమావహద్భిః క్రీడాశైల శతసహస్రైర లఙ్కృతైః కైశ్చిన్నారాయణ దివ్యలీలాఽసాధారణైః కైశ్చిత్పద్మవలనాలయా దివ్యలీలాఽసాధారణైః సాధారణైశ్చ కైశ్చిచ్ఛుకశారికామయూర కోకిలాదిభిః కోమళకూజితైరాకులైర్దివ్యోద్యాన శతసహస్రైరావృతే, మణిముక్తాప్రవాళ కృతసోపానైః దివ్యామలామృత రసోదకైఃదివ్యాణ్డజవరైః, అతిరమణీయ దర్శనైః అతిమనోహర మధురస్వరై రాకులైరనన్త ముక్తామయ దివ్యక్రీడాస్థానోపశోభితైః దివ్యసౌగన్ధిక వాపీశతసహస్రైః దివ్యరాజ హంసావలీ విరాజితై రావృతే, నిరస్తాతిశయానన్దైకరసతయాచ ఆనన్త్యాచ్చ ప్రవిష్టానున్మాదయద్భిః క్రీడోద్దేశైర్వి రాజితే, తత్ర తత్ర కృతదివ్యపుష్పపర్యఙ్కోప శోభితే, నానాపుష్పాసవాస్వాదమత్త భృఙ్గావలీ భిరుద్గీయమాన దివ్యగాన్ధర్వేణాపూరితే, చన్దనాగరుకర్పూర దివ్యపుష్పావగాహి మన్దానిలాసేవ్యమానే, మధ్యే పుష్పసఞ్చయ విచిత్రితే, మహతి దివ్యయోగపర్యఙ్కే అనంతభోగిని శ్రీమద్వైకుణ్ఠేశ్వర్యాదిదివ్యలోక మాత్మకాన్యా విశ్వ మాప్యాయయన్యా, శేషశేషాశనాది సర్వపరిజనం భగవత స్తత్తదవస్థోచిత పరిచర్యాయా మాజ్ఞాపయన్యా, శీలరూపగుణవిలాసాదిభి రాత్మానురూపయా, శ్రియా సహాసీనం ప్రత్యగ్రోన్మీలిత సరసిజ సదృశనయన యుగళం, స్వచ్ఛనీలజీ మూత సఙ్కాశం, అత్యుజ్జ్వలపీతవాససం; స్వయా ప్రభయా అతినిర్మలయా అతిశీతలయా అతికోమలయా స్వచ్ఛయా మాణిక్యాభయా కృత్స్నం జగద్భాసయన్తమ్, అచిన్త్యదివ్యాద్భుత నిత్యయౌవనస్వభావ లావణ్యమయామృత సాగరమ్, అతిసౌకుమార్యాదీషత్ప్రస్విన్నవదాలక్ష్యమాణ లలాటఫలక దివ్యాలకావలీ విరాజితమ్, ప్రబుద్ధ ముగ్ధాంబుజ చారులోచనం, సవిభ్రమ భ్రూలతమ్, ఉజ్జ్వలాధరం, శుచిస్మితం, కోమలగణ్డమ్, ఉన్నసమ్, ఉదగ్రపీనాంస విలమ్బికుణ్డ లాలకావలీ బన్ధుర కమ్బుకన్ధరమ్, ప్రియావతం సోత్పల కర్ణభూషణశ్లథాలకాబన్ధ విమర్దశంసిభి రాజానువిలమ్బిభి శ్చతుర్భిర్భుజై

ర్విరాజితమ్, అతికోమళ దివ్యరేఖాలంకృత కృతాతామ్ర కరతలమ్, అతికోమల నఖావళీ విరాజితాతి రక్తాంగుళీభిరలంకృతమ్, తత్క్షణోన్మీలితపుణ్డరీకసదృశ చరణయుగళమ్, అతిమనోహర కిరీటమకుట చూడావతంస మకరకుణ్డల గ్రైవేయక హారకేయూర కటక శ్రీవత్సకౌస్తుభ ముక్తాదామోదరబన్ధన పీతామ్బరకాఞ్చీగుణ నూపురాదిభి రత్యన్తసుఖస్పర్శై ర్దివ్యగన్ధైర్భూషణై ర్భూషితం, శ్రీమత్యా వైజయన్త్యా వనమాలయా విరాజితం, శఙ్ఖచక్రగదాసి శార్ఙ్గాదిది వ్యాయుధై స్సేవ్యమానం, స్వసఙ్కల్ప మాత్రావక్లప్త జగజ్జన్మస్థితి ధ్వంసాదికే శ్రీమతి విష్వక్సేనే న్యస్తసమస్తాత్మైశ్వర్యం, వైనతేయాదిభి స్స్వభావతో నిరస్తసమస్తసాంసారికస్వభావైః భగవత్పరిచర్యాకరణ యోగ్యై ర్భగవత్పరిచర్యైక భోగై ర్నిత్యసిద్ధైరనన్తై ర్యథాయోగం సేవ్యమానమ్, ఆత్మభోగేనా నుసంహిత పరాదికాలం దివ్యామలకోమళావలోకనేన విశ్వమాహ్లాద యన్తమ్, ఈషదున్మీలిత ముఖామ్బుజోదర వినిర్గతేన దివ్యాననారవిన్ద శోభాజనకేన దివ్యగామ్భీర్యౌదార్య సౌన్దర్య మాధుర్యాద్యనవధిక గుణగణవిభూషి తేన అతిమనోహర దివ్యభావ గర్భేణ, దివ్యలీలాలాపామృతేన అఖిలజనహృదయాన్త రాణ్యాపూరయన్తం భగవన్తం నారాయణం ధ్యానయోగేన దృష్ట్వా, (తతో) భగవతో నిత్యస్వామ్య మాత్మనో నిత్యదాస్యం చ యథావస్థిత మనుసన్ధాయ, "కదాహం భగవన్తం నారాయణం మమ కులనాథం మమ కులదైవతం మమ కులధనం మమ భోగ్యం మమ మాతరం మమ పితరం మమ సర్వం సాక్షాత్కరవాణి చక్షుషా, కదాహం భగవత్పాదామ్బుజద్వయం శిరసా ధారయిష్యామి, కదాహం భగవత్పాదామ్బుజద్వయపరిచర్యాకరణయోగ్యః తదేకభోగ స్తత్పాదౌ ప్రవేక్ష్యామి, కదాహం భగవత్పాదామ్బుజద్వయ పరిచర్యాశయా నిరస్తమస్తేతరభోగాశః అపగతసమస్తసాంసారికస్వభావః, తత్పాదామ్బుజద్వయం పరిచరిష్యామి, కదా మాం భగవాన్ స్వకీయయాఽతిశీతళయా దృశాఽవలోక్య స్నిగ్ధగమ్భీర మధురయా గిరా పరిచర్యాయా మాజ్ఞాపయిష్యతి" ఇతి భగవత్పరిచర్యాయా మాశాం వర్ధయిత్వా, తయైవాశయా తత్ప్రసాదోపబృంహితయా భగవన్త ముపేత్య దూరాదేవ భగవన్తం శేషభోగే శ్రియా సహాసీనం వైనతేయాదిభి స్సేవ్యమానం "సమస్తపరివారాయ శ్రీమతే నారాయణాయ నమః" ఇతి

ప్రణమ్యోత్థాయోత్థాయ పునః పునః ప్రణమ్య అత్యన్తసాధ్వస వినయావనతో భూత్వా, భగవత్పారిషదగణనాయకై ర్ద్వారపాలైః, కృపయా స్నేహగర్భయా దృశాఽవలోకిత స్సమ్యగభివన్దితైః తైస్తైరేవానుమతో భూత్వా భగవన్త ముపేత్య శ్రీమతా మూలమన్త్రేణ (భగవన్) మామైకాన్తికాత్యన్తిక పరిచర్యాకరణాయ పరిగృహ్ణీష్వేతి యాచమానః ప్రణమ్యాత్మానం భగవతే నివేదయేత్॥

5. తతో భగవతా స్వయమేవ ఆత్మసంజీవనేనామర్యాదశీలవతాఽతిప్రేమాన్వితేనావలోకనేనావలోక్య సర్వదేశ సర్వకాల సర్వావస్థోచితాత్యన్త శేషభావాయ స్వీకృతోఽనుజ్ఞాత శ్చాత్యన్తసాధ్వస వినయావనతః కిఙ్కుర్వాణః కృతాఞ్జలిపుటో భగవన్త ముపాసీత ॥

6. తతశ్చానుభూయమాన భావవిశేషః, నిరతిశయప్రీత్యా అన్యత్కిఞ్చి త్కర్తుం ద్రష్టుం స్మర్తుమశక్తః, పునరపి శేషభావమేవ యాచమానో భగవన్తమేవా విచ్ఛిన్న స్రోతోరూపేణావలోకనేనావలోకయన్నాసీత ॥

7. తతో భగవతా స్వయమేవాత్మసంజీవనేనావలోకనేన అవలోక్య సస్మిత మాహూయ సమస్తక్లేశాపహం నిరతిశయసుఖావహ మాత్మీయం శ్రీమత్పాదార విన్ద యుగళం శిరసి కృతం ధ్యాత్వా, అమృతసాగరాన్తర్నిమగ్న సర్వావయవ స్సుఖమాసీత॥

లక్ష్మీపతేర్యతిపతేశ్చ దయైకధామ్నోః
యోఽసౌ పురా సమజనిష్ట జగద్ధితార్థమ్ ।
ప్రాచ్యం ప్రకాశయతు నః పరమం రహస్యం
సంవాద ఏష శరణాగతిమన్త్రసారః ॥

ఇతి శ్రీభగవద్రామానుజ విరచితం శ్రీవైకుణ్ఠగద్యం సమ్పూర్ణమ్

భగద్రామానుజులు అనుగ్రహించిన

వైకుంఠగద్యమ్

(ఆంధ్రటీకతో)

అవతారిక

భగవద్రామానుజులు తమ మనస్సులో నిశ్చయించుకొన్న అర్థం తాటిచెట్టు నీడవలె తమకు ఒక్కరికి మాత్రమే ఉపయోగపడడం కాకుండా, కల్పవృక్షం నీడవలె లోకానికి అంతటికి ఉపయోగపడాలని భావించి, అనుగ్రహించినందువల్ల **"ఊరుమ్ నాడుమ్ ఉలకముమ్ తన్నైపోల్"** సంస్కరింపబడే రీతిలో ఉపాయోపేయాలను నిష్కర్షించి పల్కి, పరోపదేశం చేయడంకోసం ఈ వైకుంఠస్తవాన్ని ఆరంభిస్తున్నారు. **"పృథుగద్య"** అయిన శరణాగతిగద్యలో సాధారణంగా భగవానుని ఉద్దేశించి స్వప్రార్థనారూపంలో పలికారు. **"మితగద్యం"** అయిన శ్రీరంగగద్యలో ఆ ప్రార్థనను సౌలభ్యానికి పర్యంతసీమ అయిన శ్రీరంగనాథుని విషయంగా అనుగ్రహించారు. దీనిలో పరత్వానికి పరమావధి అయిన శ్రీవైకుంఠనాథుని విషయంగా ఇతరులను ఉద్దేశించి కర్తవ్యోపదేశాన్ని చేస్తున్నారు. ఇందులో ఉపాయమైన అంశను సంగ్రహంగా పల్కి, ఉపేయాంశను చాలా వివరంగా అనుగ్రహిస్తున్నారు. ఈ గద్యలో ఆఱు చూర్ణికలున్నాయి. వాటి తాత్పర్యం ఈక్రింద తెలుపబడుతున్నది.

1. భగవానుని స్వరూపరూపగుణవిభూతి వైలక్షణ్యాన్ని, తన స్థితిని అనుసంధించి ఆ స్వామియొక్క సౌశీల్యం మొదలైన కల్యాణగుణాలనే ఆలంబనంగా చేసుకొని అతని శ్రీచరణాలలో శరణు పొందాలి.

2. ఉపేయంకోసం ద్వయాన్ని ఒకమాఱు అనుసంధించడమే చాలినప్పటికీ, మనస్సు ఇంకొక విషయంలో పోకుండా ఉండడంకోసం, కాలక్షేపంకోసం నిత్యాను సంధానం చేయాలి.

3. ఈ అధికారి అర్చిరాదిమార్గంలో పయనించి, ప్రకృతిమండలాన్ని దాటిపోయే క్రమం, ప్రకృతి మండలాన్ని దాటిన తర్వాత ప్రవేశించే నిత్యవిభూతి యొక్క వైభవం, ఆ దేశవిశేషంయొక్క స్వభావం, అక్కడ ఉండే అలంకారాలు, అటువంటి చోట ఉండే దివ్యదేవేరులు, సర్వేశ్వరుడు వేంచేసి ఉండే సన్నివేశం, ఆ దేవేరులకు అనుభావ్యమైన స్వామి రూపసౌందర్యం, దివ్యాభరణాల చేరిక, దివ్యాయుధవర్గం, అవిచ్ఛిన్న కైంకర్యాన్ని చేసే నిత్యసూరిపరిషత్తు, వారి నిత్యకైంకర్యానికి లక్ష్యమై వేంచేసి ఉండే పరమపదనాథుని సన్నివేశం- అనే వీటిని అనుసంధించి, ఈ ఉపేయాన్ని తాము ఎపుడు పొందగలము? అని ఆశపడి ప్రతీక్షించి, ఆ ఆశకు తగినట్లు పోయి, సమీపించి, "స్వామీ! నా నుండి నిత్యకైంకర్యాన్ని నీవు స్వీకరించాలి" అని ప్రార్థించి ఆత్మసమర్పణాన్ని చేయాలి.

4. తన అపేక్షకు అనుగుణంగా భగవానునిచేత స్వీకరింపబడినవాడై, నిత్యం తదనుకూలవృత్తిని చేస్తూ ఉండాలి.

5. ఈ పురుషార్థాన్ని ఇంతకాలంగా కోల్పోయిన నష్టం తీరేటట్లు అన్యపరతను విడచి, ఔప్పపాటు వేయని కళ్ళతో సదాదర్శనాన్ని చేస్తూ ఉండాలి.

6. ఈవిధంగా వచ్చి చేరిన ముక్తుని భగవానుడు పరామర్శించి, చల్లగా కటాక్షించి, తన శ్రీచరణాలను అతని శిరస్సుపై ఉంచగా, కైంకర్య సామ్రాజ్యాభిషిక్తుడై, నిత్యానందశాలియై ఉండాలి.

శ్రీరామానుజులు ఇతఃపూర్వమే శరణాగతిగద్యం, శ్రీరంగగద్యం- అని రెండు గద్యలను అనుగ్రహించారు. మళ్ళీ ఈ మూడవ గద్యను అనుగ్రహించడంలో ఏమి ఉద్దేశ్యం? అని అంటే, మొదటి రెండు గద్యలు శ్రీరామానుజులు తమకు తామే అనుసంధించుకొనే రీతిలో రచింపబడ్డాయి. "ఈవిధంగా తమ మనస్సులో నిశ్చయించుకొన్న ఈ శరణాగతి అనే అర్థం, తాటిచెట్టునీడ దానికి మాత్రమే ఉపయోగపడే రీతిలో, తమకు ఒక్కరికి మాత్రమే ఉపయోగపడేటట్లు పర్యవసించ కుండా, కల్పకవృక్షచ్ఛాయవలె అందఱికి ఉపయోగపడాలి; అందఱు ఉపాయో పేయాలనుగూర్చిన అనుష్ఠానాన్ని పొందాలి" అని భావించి, ఈ గద్యలో పరోపదేశం చేయడానకి ప్రయత్నిస్తున్నారు.

"పృథుగద్య" (పెరియగద్య) అనే శరణాగతిగద్యలో, సామాన్యంగా భగవానుని గూర్చి తమ ప్రార్థనారూపంలో అనుగ్రహించారు. శ్రీరంగగద్యలో, సౌలభ్యానికి పరమావధి అయిన శ్రీరంగనాథుని గూర్చి, ఆ స్వామిని సంబోధిస్తూ తాము ప్రార్థిస్తున్నట్లుగా అనుగ్రహించారు. ఈ వైకుంఠగద్యలో, పరత్వానికి పరమావధి అయిన శ్రీవైకుంఠనాథుని విషయంలో తమ శిష్యులను ఉద్దేశించి చేయవలసిన ఉపదేశాన్ని చేస్తున్నారు.

శ్రీభాష్యంలో భక్తిని మోక్షోపాయంగా నిర్ణయించి, ఈ గద్యప్రబంధాలలో ప్రపత్తిని మోక్షోపాయంగా పల్కడం పరస్పరవిరుద్ధంగా ఉన్నదే! - అనే ప్రశ్న ఇక్కడ కల్గుతున్నది. శ్రీభాష్యంలో భక్తిని ఉపాయంగా నిర్ణయించడం ఎందుకు? అంటే, లోకంలో ఉండే వేదబాహ్యమతాలకు చెందినవారు, వేదాలకు అపార్థాలను పలికే మతాలకు చెందినవారు, మోక్షోపాయాలనుగూర్చి పలు విధాలుగా పల్కడంవల్ల, బ్రహ్మసూత్రాలను అనుసరించి "వేదాంత సిద్ధమైన ఉపాయం ఏది?" అనే విషయాన్ని స్పష్టంగా చూపడంకోసమే. ఆయా మతాలకు చెందినవారు కొందఱు (శాస్త్రవిరుద్ధమైన) స్త్రీ పురుషసంయోగం, నిర్వాణస్త్రీపూజ మొదలైనవానిని మోక్షోపాయాలని అంటున్నారు. ఇంకా కొందఱు, "శివుడు మొదలైన దేవతలను ఉపాసించడమే మోక్షానికి ఉపాయం" అని అంటున్నారు. పూర్వమీమాంసకులు "దేవతల ఆవశ్యకత లేనే లేదు. కర్మమే మోక్షోపాయం" అని అంటున్నారు. మాయావాదులు "నిర్విశేషచిన్మాత్రరూపమైన బ్రహ్మనుగూర్చిన జ్ఞానమే మోక్షోపాయం" అని అంటున్నారు. ఈ రీతిలో పలు విధాలుగా పలికే వేదవిరోధు లను, వేదాలకు అపార్థాలను పలికేవారిని నిరసించడంకోసం, "మీరు పలికే శాస్త్రవాక్యాలకు అర్థం మీరు చెప్పే రీతిలో కాదు. యుక్తులనుబట్టి, స్మృతులు మొదలైన మిగిలిన ప్రమాణాలనుబట్టి చూచినపుడు, "కర్మయోగం, జ్ఞానయోగం- అనే అంగాలచేత ఉపకృతమైన భక్తియే మోక్షానికి ఉపాయం" అని పల్కడమే ఉపనిషత్తులలో కన్పించే ప్రబలంగా కన్పించే నిర్ణయం" అని తెలుపవలసి ఉన్నందున భక్తియోగాన్ని శ్రీభాష్యంలో ఉపాయంగా ప్రదర్శించారు. తమ మనస్సులోని అభిప్రాయమైన ప్రపత్తినికూడా శ్రీభాష్యంలో అక్కడక్కడ తెలిపినా,

ప్రచురంగా చెప్పబడే బ్రహ్మవిద్యలను ప్రధానంగా చేసికొని ఈ రీతిలో అనుగ్రహించారు.

దీనిని చూచిన అల్పజ్ఞులు, అనుష్ఠించడానికి అరుదైన, ఉపాసనరూపమైన భక్తి ఒక్కటే మోక్షోపాయమని భ్రమించి, భయపడి విడువకుండా ఉండడంకోసం, ఈమూడు గద్యలలోను వారికికూడా ఉపాయమైనది ప్రపత్తియే- అని తెల్పుతున్నారు. ఈ మూడు గద్యలలో మొదటిది అయిన శరణాగతిగద్యలో- ఉపనిషత్తులలో ప్రచురంగా చెప్పబడ్డ భక్తి కల్గడంకోసం, బ్రహ్మప్రాప్తి రూపమైన పురుషార్థం కల్గడం కోసం అంతిమోపాయం ప్రపత్తియే- అనే విషయాన్ని వివరించారు. భక్తి నెఱవేరడంకోసం కూడా ప్రపత్తియే కావాలి- అని ప్రపత్తియొక్క గొప్పతనాన్ని ఆ గద్యలో తెలిపిన దానినిబట్టి కొందఱు "ప్రపత్తి భక్తికి అంగమై, భక్తియే ప్రధానోపాయమవుతున్నదా?" అని సందేహించడానికి అవకాశం ఉన్నది. ఈవిధంగా సందేహపడకుండా ఉండడంకోసం రెండవ గద్య అయిన శ్రీరంగగద్యలో, "అనుష్ఠించడానికి మిక్కిలి సులభమై, జీవాత్మయొక్క అత్యంతపారతంత్ర్య స్వరూపానికి తగినదై, వేఱు దేనినీ అంశంగా అపేక్షించనిదై, స్వతంత్రమైన ప్రపత్తియే ఉపాయం" అనే విషయాన్ని వ్యక్తం చేశారు. ఇక, ఈ విధంగా ఉపాయాన్నిగూర్చిన నిర్ణయం చేయబడిన తరువాత, ఈ వైకుంఠగద్యలో, ఈ ఉపాయంద్వారా పొందబడే దేశమైన పరమపదంయొక్క మహిమను, ఆ దేశానికి నాథుడై, అనుభవింప దగినవాడైన శ్రీవైకుంఠనాథుని మహిమను, అతనిని అనుభవించడంవల్ల కలిగే కైంకర్యాన్ని గూర్చి వినేవారికి అభినివేశం కల్గడంకోసం తెల్పి, "ఈ విషయంలో ఆసక్తిని పొందే భాగ్యాన్ని కలవారు ఈ అరుదైన ప్రయోజనాన్ని పొంది ఉజ్జీవించాలి" అని ముందు రెండు గద్యలలో వివరంగా చెప్పబడిన ఉపాయాన్ని సంగ్రహంగా పల్కి, పొందవలసిన ఉపేయాన్ని వివరంగా అనుగ్రహించి, వైకుంఠగద్యను పరిసమాప్తి చేస్తున్నారు.

వైకుంఠగద్యమ్

యామునార్యసుధామ్భోధి మవగాహ్య యథామతి ।
ఆదాయ భక్తియోగాఖ్యం రత్నం సన్దర్శయామ్యహమ్ ॥

శ్రీయామునాచార్యులవారనే అమృతసముద్రంలో మునిగి భక్తియోగమనే రత్నాన్ని యథామతి ఉద్ధరించి, భక్తులకు అనుభవించేటట్లు సందర్శింపజేస్తాను.

ఇక్కడ భక్తియోగమంటే - సాధ్యభక్తి అయిన ప్రపత్తియే. అపుడే ఇందులో తర్వాత **"తత్ పాదాంబుజద్వయప్రపత్తేరన్యత్ న మే కల్పకోటిసహస్రేణాపి సాధనమస్తీతి మన్వానః"** అని పల్కిన సూక్తితో పొసగుతుంది.

శ్రీయామునుల కృపామూలంగా లభించిన అర్థాలను భక్తులను నిత్యానుసంధేయంగా వ్యక్తం చేస్తున్నాను.

1. స్వాధీన త్రివిధచేతనాచేతన స్వరూపస్థితిప్రవృత్తి భేదమ్, క్లేశకర్మాద్యశేషదోషా సంస్పృష్టం, స్వాభావికానవధికాతిశయ జ్ఞానబలైశ్వర్య వీర్యశక్తి తేజః ప్రభృత్య సఙ్ఖ్యేయ కల్యాణగుణగణౌఘ మహార్ణవం, పరమపురుషం, భగవన్తం, నారాయణం, స్వామిత్వేన సుహృత్వేన గురుత్వేన చ పరిగృహ్య, ఐకాన్తికాత్యన్తిక తత్పాదామ్బుజ ద్వయ పరిచర్యైకమనోరథః, తత్ప్రాప్తయే చ తత్పాదామ్బుజ ద్వయప్రపత్తే రన్యత్ న మే కల్ప కోటిసహస్రేణాపి సాధన మస్తీతి మన్వానః, తస్యైవ భగవతో నారాయణస్య, అఖిల సత్త్వదయైకసాగరస్య, అనాలోచితగుణా గుణాఖణ్డజనాను కూలామర్యాదశీలవతః, స్వాభావికానవధికాతిశయగుణ వత్తయా, దేవతిర్య జ్మనుష్యాద్యఖిలజనహృదయా నన్దనస్య, ఆశ్రిత్సలైకజలధేః, భక్తజనసంశ్లేషైకభోగస్య, నిత్యజ్ఞానక్రియైశ్వర్య భోగసామగ్రీసమృద్ధస్య, మహా విభూతేః, శ్రీమతశ్చరణారవిన్ద యుగళమ్ అనన్యాత్మ సంజీవనేన తద్గతసర్వ భావేన శరణ మనువ్రజేత్ ॥

స్వాధీన = తన అధీనంలో ఉండే, **త్రివిధ** = మూడు విధాలైన, **చేతన+అచేతన**= చేతనా చేతనాలయొక్క, **స్వరూప** = స్వరూపం, **స్థితి** = స్థితి, **ప్రవృత్తి** =వ్యాపారాలు - అనే వీటియొక్క, **భేదం** = ప్రకారాలను కలవాడు, **క్లేశ**=

అవిద్య మొదలైన క్లేశాలు, **కర్మ** = పుణ్యపాపరూపకర్మలు, **ఆది** = మొదలైన, **అశేష** = సమస్త, **దోష+అసంస్పృష్టం** = దోషాల స్పర్శను లేనివాడు, **స్వాభావిక** = సహజమైన, **అనవధిక+అతిశయ** =తనతో సాటి, మించినది లేని గొప్పతనాన్ని కల్గినవి అయిన, **జ్ఞాన** = అన్నిటినీ ఒకేసారి యథాతథంగా తెలియగల్గడం అనే జ్ఞానం, **బలం** = సంకల్పమాత్రంతో అన్నిటిని ధరించగల్గడం అనే బలం, **ఐశ్వర్య**= అన్ని వస్తువులను నియమించడం అనే ఐశ్వర్యం, **వీర్య** = జగత్తుకు ఉపాదానమై ఉన్నా, స్వరూప వికారాన్ని కల్గి ఉండకపోవడం - అనే వీర్యం, **శక్తి** = అఘటిత ఘటనా సామర్థ్యం, **తేజః** = దేనికీ ఏ సహాయాన్ని అపేక్షించకపోవడం- అనే తేజస్సు, **ప్రభృతి** = మొదలైన, **అసంఖ్యేయ** = లెక్కలేనన్ని, **గుణ గణ+ఓఘ**= కల్యాణగుణాల సమూహానికి, **అర్ణవం** = సముద్రం వంటివాడు, **పరమపురుషం**= పురుషోత్తముడైన, **భగవంతం నారాయణమ్** = భగవానుడైన శ్రీమన్నారాయణుని, **స్వామిత్వేన** = స్వామిగా, **సుహృత్వేన** = సుహృత్తుగా (స్నేహితునిగా), **గురుత్వేన చ** = గురువుగాను, **పరిగృహ్య** = స్వీకరించి, **ఐకాంతిక=అనన్యమైన, ఆత్యంతిక**= అవధి లేని, **తత్పాదాంబుజ ద్వయ ప్రపత్తేః**= ఆ స్వామి పాదారవిందాల జంటలో చేసే ప్రపత్తికంటే, **అన్యత్** = వేఱొకటి **సాధనం**= ఉపాయం, **కల్పకోటి సహస్రేణ+అపి** = వేలాది కోట్ల కల్పాల కాలానికి కూడా, **న అస్తి ఇతి మన్వానః**= లేదు అని తలచేవాడై **అఖిలసత్త్వ** = సమస్త ప్రాణుల పట్ల, **దయైక సాగరస్య** = దయను కల్గి ఉండడంలో అద్వితీయమైన సముద్రంవంటి వాడు, **అనాలోచిత గుణాగుణ** = (ఆశ్రితుల విషయంలో) గమనించని గుణదోషాలను కల్గినవాడు, **అఖండ జన + అనుకూల** = సమస్త జనులకు అనుకూలమైన, **అమర్యాద**= అవధి లేని, **శీలవతః** = శీలగుణాన్ని కలవాడు, **స్వాభావిక** = సహజమైన, **అనవధిక+అతిశయ గుణవత్తయా** = అంతులేని వైభవాన్ని కల్గిన కల్యాణ గుణాలను కల్గి ఉండడం చేత, **దేవ + తిర్యక్ + మనుష్య+ ఆది** = దేవతలు, తిర్యక్కులు (పశుపక్ష్యాదులు), మానవులు మొదలైన, **అఖిలజన హృదయ+ ఆనందనస్య** = సమస్త ప్రాణుల హృదయాలకు ఆనందాన్ని కల్గించేవాడు, **ఆశ్రితవాత్సల్య + ఏకజలధేః** = ఆశ్రయించిన వారిపట్ల వాత్సల్యానికి అద్వితీయమైన సముద్రంవంటి వాడు, **భక్తజన సంశ్లేష + ఏకభోగస్య** = భక్తులతో

కలసి ఉండడమే గొప్ప సుఖంగా కలవాడు, నిత్యజ్ఞానక్రియా + ఐశ్వర్య = నిత్యమైన, సకలవిషయాలకు చెందిన జ్ఞానం, (తన) లీలారూపాలైన వ్యాపారాలు, ఐశ్వర్యం, భోగసామగ్రీ సమృద్ధస్య = ఆనందానికి తగిన సాధనాలు- అనే వీటిని నిండుగా కలవాడు, మహావిభూతేః = మిక్కిలి గొప్ప విభూతిని కలవాడైన, తస్య+ఏవ భగవతః నారాయణస్య = ఆ భగవానుడైన శ్రీమన్నారాయణుని యొక్క, శ్రీమత్ చరణారవింద యుగళం = శ్రీచరణారవిందాల జంటను, అనన్యాత్మ సంజీవనేన = ఇది తప్ప ఇంకొకటి ఆత్మను ఉజ్జీవింపజేసేది లేదు - అనే, తద్గతసర్వభావేన = దానిపట్ల అనన్యభావనతో, శరణం = శరణంగా, అనుప్రజేత్ = పొందాలి.

(స్వాధీనత్రివిధ చేతనాచేతన స్వరూపస్థితి ప్రవృత్తిభేదమ్) మూడువిధాలైన చేతనాచేతనాల స్వరూపం, రక్షణం, ప్రవృత్తి నివృత్తులు- అనే వీటిని తన అధీనంలో కల్గినవాడు (ఈ విశేషణం మొదలు ద్వితీయాంత విశేషణాలను అన్నిటినీ **"భగవంతమ్"** అనే విశేష్యానికి అన్వయించి, **"విశదతమానుభవేన నిరంతర మనుభూయ"** అనే ప్రయోగంతో చేర్చాలి)

చేతనులు బద్ధ-ముక్త-నిత్య భేదంతో మూడు విధాలుగా ఉంటారు. అచేతనం-త్రిగుణ కాల-శుద్ధసత్త్వాల రూపంలో మూడు విధాలు. **"త్రివిధ"** అనే విశేషణాన్ని చేతనశబ్దంతోమాత్రం అన్వయించి, అచేతనంలో అన్వయించకుండా కూడా ఉండవచ్చునని దేశికుల అభిప్రాయం. చూర్ణికలో చివర గల **'భేద'** అనే పదాన్ని స్వరూపం, స్థితి, ప్రవృత్తులు మూడింటిలో అన్వయించాలి. స్వరూపభేదం, స్థితిభేదం, ప్రకృతి భేదం- అని అర్థాన్ని గ్రహించవచ్చు. ఈ మూడు ప్రత్యేకంగా పలు విధాలుగా ఉండడం గమనించ దగినది.

(క్లేశకర్మాది+ఆశేషదోష+అసంస్పృష్టమ్) అవిద్య మొదలైన అయిదు క్లేశాలు, పుణ్యపాపరూపమైన కర్మలు మొదలైన ఏవిధమైన దోషాలయొక్క సంబంధాన్ని కొంచెంకూడా లేనివాడు- అని భావం.

చేతనాచేతనాలు శరీరంగా, భగవానుడు శరీరిగా ఉన్నట్లయితే, శరీర సంబంధంవల్లకలిగే దోషం శరీరి అయిన భగవానునకు రాదా? అని అంటే,

రాదు- అని ఈవిశేషణాన్ని ప్రయోగించడం ద్వారా తెలుపుతున్నారు. క్లేశాలు ఏవి? అంటే- అవిద్య, అస్మితా, అభినివేశం, రాగం, ద్వేషం - అని అయిదు. వాటి కార్యాలైన పుణ్యపాపాల రూపంలోని కర్మలు. ఆదిపదంద్వారా విపాకం మొదలైనవానిని గ్రహించాలి.

(స్వాభావికానవధికాతిశయ జ్ఞానబలైశ్వర్య వీర్యశక్తి తేజః ప్రభృత్య సఙ్ఖ్యేయ కల్యాణగుణగణౌఘ మహార్ణవమ్) స్వాభావికాలై, నిస్సామాభ్యధికాలై ఉండే షాడ్గుణ్యం మొదలైన కల్యాణగుణాల సమూహానికి సముద్రంవంటివాడు,

(పరమపురుషం భగవంతం నారాయణమ్) పురుషోత్తముడు, షాడ్గుణ్య పూర్ణుడైన శ్రీమన్నారాయణుని,

(స్వామిత్వేన పరిగృహ్య) = శేషిగా, స్నేహితునిగా, ఆచార్యునిగా పరిగ్రహించి,

(ఐకాన్తికాత్యన్తిక తత్పాదామ్బుజ ద్వయ పరిచర్యైకమనోరథః) ఎల్లప్పుడు ఆ భగవానుని శ్రీచరణ పద్మాల జంటను గూర్చిన కైంకర్యం ఒక్కటే చేయాలనే అభిలాషను కలవాడై,

(తత్ప్రాప్తయే చ తత్పాదామ్బుజద్వయప్రపత్తే రన్యత్ న మే కల్ప కోటి సహస్రేణాపి సాధన మస్తీతి మన్వానః) ఆ కైంకర్యాన్ని పొందడం కోసం కల్పకోటి సహస్రమైనా ఆ భగవానుని శ్రీచరణాల జంటనే నమ్మి ఉండడంకంటే వేఱు ఉపాయం ఏమీ నాకు లేదని భావించేవాడై,

(అఖిలసత్త్వదయైకసాగరస్య) అన్ని ప్రాణులపట్ల కరుణాసముద్రుడై,

(అనాలోచితగుణాగుణ+అఖండ జనానుకూల+అమర్యాదశీలవతః) = గుణదోషాల విచారణ ఏమీ లేకుండా సకలజనులకు అనుకూలంగా ఉండే అవధి లేని శీలగుణాన్ని కలవాడు,

(స్వాభావికానవధికాతిశయగుణవత్తయా దేవతిర్య ఙ్మనుష్యాద్యఖిలజన హృదయా నన్దనస్య) సహజంగానే నిస్సామాభ్యధికమైన ఆనందాన్ని కలవాడు,

కనుక, దేవతలు, తిర్యక్కులు, మానవులు మొదలైన సకల ప్రాణులయొక్క మనస్సును ఆనందింపజేసేవాడు,

(ఆశ్రితవాత్సల్యైకజలధేః) ఆశ్రితులపట్ల వాత్సల్యసముద్రుడు,

(భక్తజనసంశ్లేష+ఏకభోగస్య) భక్తజనులతో కలసి వర్తించడంలోనే ఆనందాన్ని పొందేవాడు,

(నిత్యజ్ఞానక్రియైశ్వర్య భోగసామగ్రీసమృద్ధస్య) నిత్యమైన, అన్నిటికి సంబంధించిన జ్ఞానం, తనకు లీలా రూపాలైన క్రియలు, ఐశ్వర్యం, ఇత్యాది భోగసామాగ్రిని సమృద్ధిగా కలవాడు,

(మహావిభూతేః) గొప్ప విభూతిని కలవాడై ఉండే,

(తస్య+ఏవ భగవతః నారాయణస్య) ఆ శ్రీమన్నారాయణునియొక్క,

(శ్రీమతః + చరణారవిందయుగళమ్) శ్రీచరణయుగ్మాన్ని,

(అనన్యాత్మసంజీవనేన తద్గతస్వభావేన) ఆత్మోజ్జీవనం తప్ప వేఱొకటి లేదు - అనే ఐకాంతికమైన భావనతో,

(శరణం అనువ్రజేత్) పురుషార్థానికి సాధనం ఇతడే - అనే నమ్మకం కల్గినవాడు కావాలి.

ఈ విధంగా ఒక పర్యాయం శరణు పొంది విడిచిపెట్టడమేనా? అని అంటే, ప్రాప్యంకోసం ఒకసారి శరణు పొందితే సరిపోయినా, కాలక్షేపం కోసం, భోగ్యతవల్ల విడువడానికి సాధ్యం కానందువల్ల ఈ అధ్యవసాయం ప్రతిక్షణం, నిరంతరం అనువర్తించాలి- అని ఇకపై తెలుపబడుతున్నది.

2. **తతశ్చ ప్రత్యహమ్ ఆత్మోజీవనాయ ఏవమ్ అనుస్మరేత్.**

(తతశ్చ ప్రత్యహమ్ ఆత్మోజీవనాయ ఏవమ్ అనుస్మరేత్) = తరువాత కూడా ప్రతిదినం తన ఆత్మయొక్క ఉజ్జీవనంకోసం ఈ విధంగా అనుస్యూతంగా అనుదినం స్మరించాలి. (ఆ క్రమం ఈక్రింది తెలుపబడు తున్నది)

3. **(చతుర్దశ భువనాత్మకమణ్డం, దశగుణితోత్తర చావరణసప్తకం, సమస్తం కార్యకారణజాత మతీత్య వర్తమానే)** పదునాల్గు లోకాలతో నిండిన బ్రహ్మాండాన్ని, ఆపైన ఒకదానికి ఇంకొకటి పదిరెట్లు అధికంగా ఉండే సప్తావరణాలను, ఇంకా సమస్తకార్యకారణ వర్గాలను దాటి, ఆవలివైపు ప్రకాశించే,

(పరమవ్యోమశబ్దాభిధేయే) పరమాకాశమనే పేరుతో చెప్పబడుతున్న,

(బ్రహ్మాదీనాం వాఙ్మనస+అగోచరే) బ్రహ్మమొదలైనవారి వాక్కుకు, మనస్సుకు అందని,

(శ్రీమతి వైకుంఠే దివ్యలోకే) శ్రీవైకుంఠ దివ్యలోకంలో,

(సనకవిధిశివాదిభిరప్యచిన్త్యస్వభావైశ్వర్యైః నిత్యసిద్ధై రనన్యైర్భగవదానుకూల్యైక భోగై ర్దివ్యపురుషర్మహాత్మభిరా పూరితే) (బ్రహ్మభావనలో గొప్పవారైన) సనకాదులకు, (కర్మభావనలో గొప్పవారైన) బ్రహ్మరుద్రాదులకు భావించడానికి కూడా సాధ్యం కాని రీతిలోని ప్రకారవైభవాలను కలవారై, ఎల్లప్పుడు భగవదనుభవ నిరతులై, లెక్కకు మించినవారై, భగవానునిపట్ల అభినవేశమే మూర్తీభవించినవారై, భూమిలో కాలు మోపనివారైన మహాత్ములచే నిండినదై,

(తేషామపి ఇయత్పరిమాణ మియదైశ్వర్య మీదృశస్వభావ మితి పరిచ్ఛేత్తు మయోగ్యే) ఆ మహాత్ములకుసైతం పరిచ్ఛేదించడానికి సాధ్యం కాని పరిమాణాన్ని, ఐశ్వర్యాన్ని, వైభవాన్ని కల్గినదై,

(దివ్యావరణశత సహస్రావృతే) లోకవిలక్షణాలైన వేయి ప్రాకారాలను కల్గినదై,

(దివ్యకల్పతరు+ఉపశోభితే) అప్రాకృతమైన కల్పకోద్యానాలతో భోగ్యమై,

(దివ్య+ఉద్యాన శతసహస్రకోటిభిః ఆవృతే) అనేకవేల దివ్యాలైన ఉద్యాన వనాలచేత పరివేష్ఠింపబడినవదై,

(అతి ప్రమాణే దివ్యాయతనే) చాలా పొడుగు, వెడల్పు, వైశాల్యాలను కల్గిన దివ్యాలయంలో,

(కస్మింశ్చిద్వి చిత్రదివ్యరత్నమయే దివ్యాస్థానమణ్టపే) పలు రీతులలోని దివ్యరత్నాలతో ప్రచురమై ఉండే ఒక ఆస్థానమండపంలో,

(దివ్యరత్నస్తంభశతసహస్రకోటిభిః ఉపశోభితే) అనేక వేల మాణిక్యస్తంభాలతో ప్రకాశించేది,

(దివ్యనానారత్నకృతస్థల విచిత్రితే) అప్రాకృతాలైన, పలు రీతులలోని మాణిక్యాలతో పొదగబడిన భూప్రదేశాలతో కూడినది,

(దివ్య+అలంకార+అలంకృతే) (మేల్‌కట్టు, తెరలు మొదలైన) దివ్యాలంకారా లతో అందమైనది,

(పరితః పతితైః పతమానైః పాదపస్థైశ్చ నానాగన్ధవర్ణై ర్దివ్యపుష్పైః శోభమానై ర్దివ్యపుష్పోపవనై రుపశోభితే) చుట్టూ రాలినవి, రాలుతున్నవి, చెట్లపై ఉన్నవి- ఈవిధంగా పలు రీతులలోని పరిమళాలను, వర్ణాలను కల్గినవి అయిన దివ్య పుష్పాలతో ప్రకాశిస్తున్న పుష్పవనాలతో శోభిస్తున్నది,

(సఙ్కీర్ణ పారిజాతాది కల్పద్రుమోపశోభితైః) ఒకదానితో ఇంకొకటి కలసి ఉండే పారిజాతం మొదలైన కల్పవృక్షాలతో ప్రకాశిస్తున్నవి (ఇకపై, గల తృతీయాంతవిశేషణాలకు **"దివ్యోద్యానశతసహస్రైః"** అనేది విశేష్యం).

(అసంకీర్ణైశ్చ కైశ్చిత్) ఒకదానితో ఇంకొకటి కలసి ఉండనివి కొన్ని,

(అంతఃస్థపుష్పరత్నాది నిర్మితదివ్యలీలామండపశతసహస్ర+ఉపశోభితైః) లోపల ఉన్న పుష్పాలు, రత్నాలు, మొదలైనవాటిచే నిర్మింపబడ్డ అనేకవేల దివ్యలీలా మండపాలతో ప్రకాశిస్తున్నవి,

(సర్వదా అనుభూయమానైః అపి అపూర్వవత్ ఆశ్చర్యమ్ ఆవహద్భిః) ఎల్లప్పుడు అనుభవింపబడుతున్నవి అయినా, అపూర్వవస్తువువలె ఆశ్చర్యాన్ని కల్గించేవి,

(క్రీడాశైలశతసహస్రైః అలంకృతైః) అనేక వేల క్రీడాపర్వతాలతో అలంకరింప బడినవి,

(కైశ్చిత్పద్మవలనాలయా దివ్యలీలాఽ సాధారణైః సాధారణైశ్చ కైశ్చిచ్చుక శారి కామయూర కోకిలాదిభిః కోమళకూజితైరాకులైర్దివ్యోద్యాన శతసహస్రైరా వృతే) భగవానుని లీలకోసమే ఉన్నవి కొన్ని, లక్ష్మీదేవి లీలలకే చెందినవి కొన్ని, ఇరువురియొక్క లీలలకు చెందినవి కొన్ని అయిన అందమైన కంఠధ్వనులను కల చిలుకలు, గోరువంకలు, నెమళ్ళు, కోయిలలు మొదలైన పక్షుల కోలాహలాలతో నిండిన దివ్యమైన నూఱు వేల పూపొదరిళ్ళతో నిండినది,

(మణిముక్తాప్రవాళకృతసోపానైః) రత్నాలు, ముత్యాలు, మొదలైనవానితో చేయబడిన సోపానాలను కల్గినవి, (ఇకపై గల తృతీయాంతవిశేషణాలకు - **"దివ్యసౌగంధిక వాపీశతసహస్రైః"** అనేది విశేష్యం).

(దివ్య+అమల+అమృతరసోదకైః) అప్రాకృతమైన, నిర్మలమైన అమృతం వంటి తీయని నీటి పొష్కల్యాన్ని కల్గినవి,

(దివ్యాణ్డజవరైః, అతిరమణీయ దర్శనైః) కంటికి అందమైనవి, పలుకులో మాధుర్యాన్ని కల్గినవి అయిన అప్రాకృతాలైన పక్షులతో నిండినవి,

(అంతఃస్థముక్తామయం దివ్యక్రీడా+ఆస్థాన+ఉపశోభితైః) లోపల ఉండే ముత్యాలతో చేయబడిన (పొదగబడిన) క్రీడాస్థానాలతో ప్రకాశించేవి,

(దివ్యరాజహంసావళీవిరాజితైః) శుద్ధసత్త్వమైన రాజహంసలచే ప్రకాశిస్తున్నవి,

(దివ్యసౌగంధికవాపీశతసహస్రైః+ఆవృతే) అప్రాకృతమైన వేలాది ఎఱ్ఱతామర లను కల్గినవైన బావులతో నిండినది,

(నిరస్తాతిశయానన్దైకరసతయాచ ఆనన్ద్యాచ్చ ప్రవిష్టానున్మాదయద్భిః క్రీడోద్దేశైర్విరాజితే) నిస్సమాభ్యధికమైన ఆనందమే రూపొందినందువల్ల, అపరిచ్ఛిన్నమై ఉన్నందువల్ల లోపల ప్రవేశించినవారిని మోహింప జేయగల క్రీడాస్థానాలతో ప్రకాశించేది,

(తత్ర తత్ర కృతదివ్యపుష్పపర్యఙ్కోప శోభితే) ఆయా చోట్ల నిర్మింప బడిన పూల పల్లకీలతో ప్రకాశిస్తున్నది,

(నానాపుష్పాసవాస్వాదమత్తభృఙ్గావలీ భిరుద్గీయమాన దివ్యగాన్ధర్వేణా పూరితే) పలు రీతులలోని పుష్పాలవల్ల ఏర్పడిన మధువును తాగి మత్తెక్కిన తుమ్మెదలగుంపులు పాడే దివ్యసంగీతంతో నిండినది,

(చన్దనాగరుకర్పూర దివ్యపుష్పావగాహి మన్దానిలాసేవ్యమానే) చందనం, అగరు, పచ్చకర్పూరం, దివ్యపుష్పాలు - అనే వీటి లోపల ప్రవేశించి, వీటిలో ఉండే పరిమళాలను గ్రహించి వస్తున్న మందమారుతంచేత వీచబడినది,

(మధ్యే దివ్యపుష్పసంచయవిచిత్రితే) = నడుమ దివ్యాలైన పూలసమూహాలతో చిత్రింపబడినది అయిన,

(మహతి దివ్యయోగపర్యంకే) గొప్ప (పెద్ద) దివ్యమైన శయ్యపై,

(అనంతభోగిని) అనంతుని శరీరంపై,

(శ్రీమద్వైకుంఠైశ్వర్యాది దివ్యలోకం విశ్వమ్ ఆత్మకాంత్యా ఆప్యాయయంత్యా) శ్రీవైకుంఠంలోని ఐశ్వర్యం మొదలైన దివ్యలోకం అంతటినీ తన ప్రకాశంతో ప్రకాశింపజేసి, ఆనందింపజేస్తున్నది,

(శేషశేషాశనాది సర్వపరిజనం భగవత స్తత్తదవస్థోచిత పరిచర్యాయా మాజ్ఞాప యన్త్యా, శీలరూపగుణవిలాసాదిభి రాత్మానురూపయా) ఆదిశేషుడు, విష్వక్సేనుడు, మొదలైన సకల పరిజనాన్ని భగవానుని ఆ యా సన్నివేశాలకు తగిన కైంకర్యాలలో నియమిస్తున్నది, శీలం, రూపం, గుణాలు, శృంగార విలాసాలు మొదలైన వాటిలో తనకు (స్వామికి) సాటి వచ్చేది అయిన,

(శ్రియా సహ ఆసీనమ్) లక్ష్మీదేవితో కలసి వేంచేసి ఉన్నవాడు,

(ప్రత్యగ్రోన్మీలిత సరసిజ సదృశనయన యుగళమ్) అపుడే వికసించిన ఎఱ్ఱ తామరపూవువంటి రెండు నేత్రాలను కలవాడు,

(స్వచ్ఛనీలజీమూతసంకాశమ్) స్వచ్ఛమైన నీలమేఘంవంటివాడు,

(అత్యుజ్జ్వల పీతవాససమ్) మిక్కిలిగా ప్రకాశించే పచ్చని పట్టువస్త్రాన్ని కలవాడు,

(స్వయా ప్రభయా అతినిర్మలయా అతిశీతలయా అతికోమలయా స్వచ్ఛయా మాణిక్యాభయా కృత్స్నం జగద్భాసయన్తమ్) చాలా నిర్మలమైన, మిక్కిలి చల్లనైన, (సుకుమారమైన), స్వచ్ఛమైన, మాణిక్యంవంటి తన దివ్యకాంతితో లోకం అంతటిని ప్రకాశింపజేస్తున్నవాడు,

(అచిన్త్యదివ్యాద్భుత నిత్యయౌవనస్వభావ లావణ్యమయామృత సాగరమ్) చింతించడానికి సాధ్యం కాని, దివ్యమైన, ఆశ్చర్యకరమైన, నిత్యమైన యౌవనాన్ని స్వభావంగా కల, లావణ్యం నిండిన అమృతసముద్రం వంటివాడు,

(అతిసౌకుమార్యాదీషత్స్విన్నవదాలక్ష్యమాణ లలాటఫలక దివ్యాలకావలీ విరాజితమ్) చాలా సుకుమారం అయినందువల్ల కొంచెం స్వేదం మొలకెత్తి నట్లుగా కన్పించే ఫాలభాగంలో వాలిన ముంగురులతో ప్రకాశించేవాడు,

(ప్రబుద్ధముగ్ధాంబుజ చారులోచనమ్) అపుడే వికసించిన తామరపూవు వంటి అందమైన నేత్రాలను కలవాడు,

(సవిభ్రమభ్రూలతమ్) విలాసంతో కూడిన, లతవంటి కనుబొమలను కల్గినవాడు,

(ఉజ్జ్వల+అధరమ్) ప్రకాశించే అధరాన్ని కలవాడు,

(శుచిస్మితమ్) కపటం లేని చిఱునవ్వును కలవాడు,

(కోమలగండమ్) అందమైన కపోలాలను కలవాడు,

(ఉన్నసమ్) గొప్ప ఎత్తైన నాసికను కలవాడు,

(ఉదగ్రపీనాంసవిలమ్బికుణ్డలాలకావలీ బన్ధుర కమ్బుకన్ధరమ్) ఉన్నతమై, బలిష్ఠమై ఉండే బాహువులవరకు వేలాడే కుండలాలతోను, కేశపాశంతోను సుందరమై, శంఖంవలె ప్రకాశిస్తున్న కంఠప్రదేశాన్ని కలవాడు,

(ప్రియావతంసోత్పల కర్ణభూషణశ్లథాలకాబన్ధ విమర్దశంసిభి రాజానువిలమ్బిభి శ్చతుర్భిర్భుజై ర్విరాజితమ్) దివ్యదేవేరులకు కర్ణాలంకారాలైన నల్ల కలువపూలు, కర్ణభూషణాలు, అల్లల్లాడే కేశపాశం - అనే వీటి విమర్దాన్ని సూచిస్తున్నవై, మోకాళ్ళవరకు వేలాడే నాల్గు భుజాలతో ప్రకాశిస్తున్నవాడు,

(అతికోమళ దివ్యరేఖాలంకృత కృతాతామ్ర కరతలమ్) చాలా అందమైన (పద్మం, శంఖం, చక్రం) మొదలైన రేఖలతో అలంకరింపబడి, కొంచెం ఎఱ్ఱగాఉండే శ్రీహస్తాలను కలవాడు,

(దివ్య+అంగుళీయకవిరాజితమ్) అప్రాకృతమైన అంగుళీయకాలతో శోభిల్లేవాడు,

(అతికోమల నఖావళీ విరాజితాతిరక్తాంగుళీభిరలంకృతమ్) చాలా సుకుమారమైన గోళ్ళతో ప్రకాశిస్తున్న మిక్కిలి ఎఱ్ఱని వేళ్ళతో అలంకరింప బడినవాడు,

(తత్క్షణోన్మీలితపుణ్డరీకసదృశ చరణయుగళమ్) అపుడే వికసించిన పుండరీకంతో సమానమైన శ్రీచరణయుగళాన్ని కలవాడు,

(అతిమనోహర కిరీటమకుట చూడావతంస మకరకుణ్డల గ్రైవేయక హారకేయూర కటక శ్రీవత్సకౌస్తుభ ముక్తాదామోదరబన్ధన పీతామ్బరకాఞ్చీగుణ నూపురాదిభి రత్యన్తసుఖస్పర్శై ర్దివ్యగన్ధైరభూషణై ర్భూషితమ్) చాలా సుఖమైన స్పర్శను కల్గినవి, దివ్య పరిమళాన్ని కల్గినవి, మిక్కిలి అందమైనవి అయిన కిరీటం, మకుటం చూడావ తంసం, మకరకుండలాలు గ్రైవేయకహార కేయూర కటకాలు శ్రీవత్సం, కౌస్తుభం, ముక్తాహారాలు, ఉదరబంధం, పీతాంబరం, మొలనూలు, నూపురాలు- మొదలైన భూషణాలతో భూషితుడు,

(శ్రీమత్యా వైజయంత్యా వనమాలయా విరాజితమ్) అందమైన వైజయంతి అనే వనమాలికచే ప్రకాశించేవాడు,

(శంఖచక్రగదా + అసి శార్ఙ్గ + ఆది దివ్యాయుధైః సేవ్యమానమ్) పాంచజన్య - సుదర్శన - కౌమోదకి - నందక - శార్ఙ్గాలనే పంచాయుధాలు మొదలైన దివ్యాయుధా లచే సేవింపబడేవాడు,

(స్వసఙ్కల్పమాత్రావక్లప్త జగజ్జన్మస్థితి ధ్వంసాదికే శ్రీమతి విష్వక్సేనే న్యస్తసమస్తాత్మైశ్వర్యమ్) తలచినంతలోనే సమస్తజగత్తుయొక్క సృష్టిస్థితి

సంహారాలను నిర్వహించగలవాడైన సేనాధిపతివద్ద తన సమస్తమైన ఐశ్వర్యాన్ని అప్పగించినవాడు,

(వైనతేయాదిభి స్స్వభావతో నిరస్తసమస్తసాంసారికస్వభావైః భగవత్పరిచర్యా కరణయోగ్యై ర్భగవత్పరిచర్యైకభోగై ర్నిత్యసిద్ధైరనన్తై ర్యథాయోగం సేవ్యమానమ్) సహజంగానే ఏ సాంసారిక స్వభావాలను లేనివారు, భగవానునకు పరిచర్యను చేయడంలో యోగ్యులు, ఆ కైంకర్యాన్నే నిత్యభోగంగా కలవారు అయిన గరుడుడు మొదలైన లెక్కలేనంతమంది నిత్యసూరులచే యథాయోగం (యథాక్రమం) సేవింపబడేవాడు,

(ఆత్మభోగేన + అననుసంహితపరాదికాలమ్) తన అనుభవంతో అంతు లేని కాలం గడపడం కూడా గమనించనివాడు;

(దివ్య+అమలకోమల+అవలోకనేన విశ్వమ్ ఆహ్లాదయంతమ్) దివ్యమై, నిర్మలమై, సుందరమైన కటాక్షవీక్షణంతో సమస్తవస్తువులను ఆనందింప జేసేవాడు,

(ఈషదున్మీలిత ముఖామ్బుజోదర వినిర్గతేన దివ్యానన్దారవిన్ద శోభాజనకేన దివ్యగామ్భీర్యౌదార్య సౌన్దర్య మాధుర్యాద్యనవధిక గుణగణవిభూషి తేన అతి మనోహర దివ్యభావగర్భేణ, దివ్యలీలాలాపామృతేన అఖిలజనహృదయాన్త రాణ్యాపూరయన్తం భగవన్తం నారాయణమ్) కొంచెం వికసించిన ముఖపద్మం నుండి బయలువెడలినది, పెదవికి అపూర్వమైన ఆభరణం అలంకరించినట్లుగా అందాన్ని కల్గించగల్గినది, దివ్యమైన గాంభీర్యం, ఔదార్యం, మాధుర్యం మొదలైన లెక్కలేనన్ని కల్యాణగుణసమూహాలతో అలంకృతమై, అతి మనోహరమైన అభిప్రాయవిశేషాన్ని లోపల కల్గిన, దివ్యమైన రసోక్తి అనే అమృతంతో అందఱి హృదయావకాశాలను నిండించగల్గినవాడైన నారాయణుని,

(ధ్యానయోగేన దృష్ట్వా) ఆంతరనేత్రంతో సాక్షాత్కరించుకొని,

(తతః భగవతః నిత్యస్వామ్యమ్ ఆత్మనః నిత్యదాస్యం చ యథావస్థితమ్ + అనుసంధాయ) = (తరువాత) ఆభగవానునకు సహజంగా ఉండే శేషిత్వాన్ని, తనకు సహజంగానే ఉండే శేషత్వాన్ని యథాతథంగా అనుసంధించి,

(కదాహం భగవన్తం నారాయణం మమ కులనాథం మమ కులదైవతం మమ కులధనం మమ భోగ్యం మమ మాతరం మమ పితరం మమ సర్వం సాక్షాత్కరవాణి చక్షుషా) నా కులనాథుడై, నా కులదైవమై, నా కులధనమై, నాకు పరమభోగ్యుడై, నాకు తల్లియై, తండ్రియై, నాకు అన్నీ అయిన భగవన్నారాయణుని నేనెప్పుడు కళ్ళార దర్శించగలను? (అని),

(కదాహం భగవత్పాదామ్బుజద్వయం శిరసా ధారయిష్యామి) భగవానుని శ్రీచరణయుగళాన్ని ఎపుడు నేను శిరస్సుతో ధరించగలను? (అని),

(కదాహం భగవత్పాదామ్బుజద్వయపరిచర్యాకరణయోగ్యః తదేకభోగస్తత్పాదౌ ప్రవేక్ష్యామి) భగవానుని శ్రీచరణ యుగ్మంలో కైంకర్యరుచివల్ల విషయాంతరాలు అన్నిటిలోని అభినివేశాన్ని తీరినవాడనై (రాగద్వేషరహితుడనై), సమస్తసాంసారికస్వభావాలు తీరినవాడనై, నేనెపుడు శ్రీచరణయుగాన్ని చేరగలను? (అని),

(కదాహం భగవత్పాదామ్బుజద్వయ పరిచర్యాశయా నిరస్తమస్తేతర భోగాశః అపగతసమస్తసాంసారికస్వభావః, తత్పాదామ్బుజద్వయం పరిచరిష్యామి) ఎపుడు నేను ఆ శ్రీచరణయుగానికి కైంకర్యాన్ని చేయడంలో యోగ్యతను కలవాడనై, ఆ శ్రీచరణయుగ్మాన్ని అలంకరించుకోగలను? (అని),

(కదా మాం భగవాన్ స్వకీయయాఽ తిశీతళయా దృశాఽ వలోక్య స్నిగ్ధ గమ్భీర మధురయా గిరా పరిచర్యాయా మాజ్ఞాపయిష్యతి - ఇతి) ఆ భగవానుడు తన చాలా చల్లని తిరునేత్రాలతో కటాక్షించి, అభిషేకించి, మధురమైన వాక్కుతో **"ముకప్పే కూవి ప్పణి కొళ్ళాయ్"** (సమక్షానికి పిలచి నానుండి కైంకర్యాన్ని గ్రహించు) అనే రీతిలో కైంకర్యంతో నన్ను నియోగించడం ఎపుడో? అని (ఈ విధంగా మనోరథాన్ని పొంది),

(భగవత్ పరిచర్యాయామ్ ఆశాం వర్ధయిత్వా) భగవానుని కైంకర్యంలో ఆశను వృద్ధి చేసికొని,

(తత్ప్రసాద+ఉపబృంహితయా తయైవ ఆశయా) = భగవానుని అనుగ్రహం తో వృద్ధి చెందే ఆ ఆశతో,

(భగవంతమ్ ఉపేత్య) భగవానుని సమీపించి,

(భగవన్త ముపేత్య దూరాదేవ భగవన్తం శేషభోగే శ్రియా సహాసీనం వైనతేయాదిభి స్సేవ్యమానం "సమస్తపరివారాయ శ్రీమతే నారాయణాయ నమః " ఇతి ప్రణమ్య) ఆదిశేషుని ఒడిలో లక్ష్మీదేవితో కూడి వేంచేసి ఉండేవాడై, గరుడుడు మొదలైన నిత్యసూరులతో సేవింపబడేవాడై ఉండే ఆ స్వామిని "సమస్తపరివార సమేతుడైన శ్రీమన్నారాయణునకు నమస్కారం" అని పల్కి చాలా దూరంనుండే నమస్కరించి,

(ఉత్థాయ+ఉత్థాయ పునః పునః ప్రణమ్య) (కాలం గడచిన తర్వాత కాకుండా వెంటవెంటనే) ప్రణామపరంపరలను చేసి,

(అత్యంతసాధ్వస వినయ+అవనతః భూత్వా) చాలా ఎక్కువ భయంతో సంకోచంతో, వినయంతోను నమస్కరించినవాడై,

(భగవత్ పరిషత్గణనాయకైః ద్వారపాలైః కృపయా స్నేహగర్భయా దృశా అవలోకితః) భగవానుని సభలో ఉన్నవారు, గణనాయకులు, ద్వారపాలకులు- అనే వీరిచే కృపతో ప్రేమతో పూర్వకంగా కటాక్షింపబడినవాడై,

(సమ్యక్ అభివందితైః తైస్తైరేవ అనుమతః) చక్కగా నమస్కరింపబడిన ఆయా దివ్యసూరులచే అనుమతింపబడినవాడై,

(భగవంతమ్ ఉపేత్య) భగవానుని సమీపించి,

(శ్రీమతా మూలమంత్రేణ) అష్టాక్షరీమహామంత్రంతో,

("మామ్ ఐకాంతిక+ఆత్యంతికపరిచర్యాకరణాయ పరిగృహ్ణీష్వ" ఇతి యాచమానః ప్రణమ్య) "నన్ను అనన్యమైన నిత్యకైంకర్యానికి స్వీకరించాలి"- అని యాచించేవాడై, నమస్కరించి,

(ఆత్మానం భగవతే నివేదయేత్) తనను భగవానునకు సమర్పించు కోవాలి.

4. తతో భగవతా స్వయమేవ ఆత్మసంజీవనేనామర్యాదశీలవతాఽ తిప్రేమా న్వితేనావలోకనేనావలోక్య సర్వదేశ సర్వకాల సర్వావస్థోచితాత్యన్త శేషభావాయ స్వీకృతోఽ నుజ్ఞాత శ్చాత్యన్తసాధ్వస వినయావనతః కిఙ్కుర్వాణః కృతాఞ్జలిపుటో భగవన్త ముపాసీత ॥

(తతః) ఆత్మసమర్పణానంతరం,

(భగవతా స్వయమేవ) భగవానునిచే స్వయంగానే,

(ఆత్మసంజీవనేనామర్యాదశీలవతాఽ తిప్రేమా న్వితేనావలోకనేనావలోక్య) ఆత్మసముజ్జీవనహేతువు, అంతు లేని శీలగుణాన్ని ప్రదర్శించేది, చాలా ప్రేమతో కూడినదైన కటాక్షంతో చూచి,

(సర్వదేశ సర్వకాల సర్వావస్థోచితాత్యన్త శేషభావాయ స్వీకృతః) విచ్ఛేదం లేని కాలం అంతా సిద్ధంగా ఉన్నవాడై, అవిచ్ఛిన్నమైన కైంకర్యాన్ని చేసేటట్లు స్వీకరించగా, ఆ ప్రాప్యాన్ని పొందినవాడై,

(అనుజ్ఞాతః చ) **"ఏవ మన్నిత్యమరర్ ఆట్చెయ్వార్"** (దివ్యపత్నులు ఆజ్ఞాపించగా మిగిలిన నిత్యులు, ముక్తులు భగవానుని కైంకర్యాన్ని చేస్తారు) అనే రీతిలో అనుమతింపబడినవాడై,

(అత్యన్తసాధ్వస వినయావనతః కిఙ్కుర్వాణః కృతాఞ్జలిపుటో భగవన్త ముపాసీత) చాలా భయంతోను, వినయంతోను శిరస్సు వంచి, కింకరుడై, చేతులను జోడించినవాడై భగవానుని ఉపాసించాలి.

5. తతశ్చానుభూయమాన భావవిశేషః, నిరతిశయప్రీత్యా అన్యత్కిఞ్చిత్కర్తుం ద్రష్టుం స్మర్తుమశక్తః, పునరపి శేషభావమేవ యాచమానో భగవన్తమేవావిచ్ఛిన్న స్రోతోరూపేణావలోకనేనావలోకయన్నాసీత ॥

తరువాత భగవానుని స్వరూపస్వభావాదులను అనుభవిస్తూ అంతు లేని ప్రేమవల్ల వేఱు దేనిని చేయడంగాని, చూడడంగాని, భావించడం గాని

చేయనివాడై (శేషత్వాన్ని పొందినవాడైనా, దాని భోగ్యతవల్ల ఇది నిలకడగా నిలచి ఉంటుందా! - అనే అతిశంకను పొంది), తరువాత ఇటువంటి శేషవృత్తిలోపించకుండా నిలచి ఉండాలి - అని వేడుతూ, శ్రీవైకుంఠనాథునే నిరంతరం ధారారూపమైన విలోకనంలో దర్శిస్తూ ఉండాలి.

6. తతో భగవతా స్వయమేవాత్మసంజీవనేనావలోకనేన అవలోక్య సస్మిత మాహూయ సమస్తక్లేశాపహం నిరతిశయసుఖావహ మాత్మీయం శ్రీమత్పాదార విన్ద యుగళం శిరసి కృతం ధ్యాత్వా, అమృతసాగరాన్తర్ని మగ్నసర్వావయవ స్సుఖమాసీత॥

"అమ్మాన్ ఆళ్గిప్పిరాన్ అవన్ ఎవ్విడత్తాన్! యాన్ ఆర్!" (సుదర్శన ధారియైన స్వామి ఎక్కడ? నేనెక్కడ?) అని స్వరూపాన్ని తలచి తొలగి ఉండగా, ఆభగవానుడే అందమైన అవలోకనంతో (చూపుతో) చల్లగా కటాక్షించి, మందహాసం చేసి, **"ఇక్కడకు రా"** అని నోరు తెఱచి దగ్గరకు రమ్మని పిలచి, సకలక్లేశాలను తీర్చేది, దీనికంటే గొప్పది ఇంకొకటి లేదు- అనే రీతిలోని ఆనందాన్ని కల్గించగల్గినది అయిన తన శ్రీచరణయుగళాన్ని తన శిరస్సుపై ఉంచినట్లుగా ధ్యానం చేసి, జ్ఞానమనే అమృతసాగరంలోపల మునిగిన అన్ని అవయవాలను కలవాడై, సుఖంగా ఉండాలి.

ఉపసంహారం

స్వరూపానురూపమైన ప్రపత్తినే సాధనంగా చేసికొని, ప్రాకృతమండలాన్ని విడచి పోయి, అప్రాకృతదేశవిశేషాన్ని చేరి, సర్వాంగసుందరుడై, సర్వాభరణ భూషితుడై, దివ్యాయుధశోభితుడై, నిత్యసూరిపరిషత్తుచే సేవింపబడే వాడైన శ్రీవైకుంఠనాథుని సమీపించి, కైంకర్యప్రార్థనను పురస్కరించుకొని, విచ్ఛేదం లేకుండా కాలం అంతా స్థిరంగా నిరవచ్ఛిన్నమైన కైంకర్యాన్ని పొంది, ఆనందామృత సాగరంలో మునిగి ఉండే రీతిని ఇక్కడ ఈ విభూతిలో ఉండే సమయంలో పరమైకాంతి ప్రతిదినం చింతిస్తూ, కాలం గడపాలి- అనే విషయాన్ని తెలిపి ఈ గద్యను శ్రీరామానుజులు ముగించారు.

ఈ గద్యం అంతటిలో సారంగా చెప్పబడ్డ విషయం ఏమంటే- భగవానుని ఉపాయంగా నిశ్చయించుకొనే భావన అనే ప్రపత్తిని రక్షకంగా చేసికొని, త్రిగుణాత్మక మైన ప్రకృతిమండలాన్ని దాటి, అప్రాకృతమై, శుద్ధసత్త్వమయమైన పరమపదాన్ని చేరి, నిత్యసూరిసమూహంచే సేవింపబడే శ్రీవైకుంఠనాథుని సమీపించి పొంది, అతనిని ప్రార్థించి కైంకర్యాన్ని పొంది, యావదాత్మభావిగా- అంటే- నిత్యంగా- బ్రహ్మానందంగా కలవాడై ముక్తిని పొందిన జీవుడు ఆనందిస్తాడు - అని,

లక్ష్మీపతేర్యతిపతేశ్చ దయైకధామ్నో
యోఽసౌ పురా సమజనిష్ట జగద్ధితార్థమ్ ।
ప్రాప్యం ప్రకాశయతు నః పరమం రహస్యం
సంవాద ఏష శరణాగతిమంత్రసారః ॥

(శ్రియఃపతికి, దయకు అద్వితీయ నిలయులైన శ్రీరామానుజులకు మధ్య పూర్వం లోకహితంకోసం ఏ సంవాదం సంభవించిందో, శరణాగతి మంత్రానికి సారమైన, ప్రాప్యమైన ఆ ఈ పరమరహస్యం మనకు ప్రకాశింపజేయాలి.)

ఇతి శ్రీభగవద్రామానుజ విరచితం
శ్రీవైకుణ్ఠగద్యం సమ్పూర్ణమ్